267

ఫా

రహ

ర్వవిద్యాల

కల్లూరి చంద్రమౌళి

రాక్షస - ఉగాది

C



భాగవత సుధ



రచయిత :

ఆర్షవిద్యాలంకార

కల్లూరి చంద్రమౌళి బి. యస్. సి. (ఎబర్డీన్)

రాక్షస - ఉగాది - ౧౯౭౫

ప్రథమ ముద్రణ :
ప్రతులు: 500

స్వామ్యములు రచయితవి

వెల : 10-00

ముద్రణ :
జూపిటర్ - గుంటూరు-2

అవధానిశేఖర, అభినవకేసరి, ప్రౌఢభారతి, గుంటూరు
కవితాసుధాకర, రాక్షస ఉగాది
సరస్వతీ కంఠాభరణ, ఇత్యాది బిరుదాంచిత
డాక్టర్ ప్రసాదరాయకులపతి M. A . Ph. D.

భూమిక

(శ్రీ కల్లూరి చంద్రమౌళిగారు నాకు చిరకాలమునుండి పరిచితులు. పదవులలోనున్నప్పుడు, పదవు లలోలేనప్పుడు వారిని కొంత జాగ్రత్తగానే పరిశీలించి వారి వ్యక్తిత్వముపై నొక గౌరవ భావము నేర్పరచుకొంటిని. అట్టి గౌరవాస్పదులైన వ్యక్తులు రచయితనైనచో నెవ్వనికైన అధికతర సంతోషము కలుగుననుటలో సందేహము లేదు. కాని ఒక విమర్శకునిగా వారి గ్రంథమును పరిశీలింపవలసిన అవసరమువచ్చినప్పుడు ఒక కష్టము కలుగును. లోకములో నొక ఆచార్యుడో, మాన్యుడో, పూజ్యుడో యైన ఒక అసాధారణవ్యక్తి యున్నాడనుకొనుడు. ఆయన కనేక భక్తులున్నారనుకొనుడు. ఆభక్తులకు తమ గురువరుని నోట వెలువడు ప్రతి వాక్యము నొక మహోపదేశముగానే అనిపించును. వారి రచన ప్రతిదియు నొక ఔపనిషద తత్వ ప్రబోధక భాష్యముగానే తోచును. అలవోకగా ఆయన పలికిన ప్రతిపదమును బహుళార్థ సమన్వితముగా స్ఫురించుచుండును. అట్టి వారిలో లోపములేవైన నున్నను అన్వీక్షణ భక్తి వానికి కనుపింప నీయదు.

శ్రీ చంద్రమౌళిగారి విషయమున నాకట్టి పక్షపాతము లేదు. వారియందు నాకు గౌరవము కలదుగాని నేను వారి ఆశ్రితుడను కాను. వారి యందు మాన్యత కలదు గాని వారికి భక్తుడనుగాను. కనుక వారి యందు నాకు గల విశిష్టబుద్ధి వారి గ్రంథములను విమర్శనదృష్టితో పరిశీలించుటకు అడ్డుపడదు.

ఇక చంద్రమౌళిగారును నేను భాగవతముపై పరిశోధన చేసి డాక్టరు పట్టమును పొందియుండుటచే వారి భాగవతసుధకు భూమిక నిర్మించుటకు నన్నెన్నుకొని యుందురు. నాపై గల ప్రేమ దానికి దోహదముచేసియుండును. సరి! దానికేమి! ఒక సాహిత్య సత్యవ్రతునిగా వారి యీ గ్రంథమును అధ్యయనము చేసితిని. అప్పుడు వారికిగల ఆర్ష విద్యాలంకార బిరుదములోని సార్థకత్వము సంభావింప గల్గితిని.

భిన్న దేశములలో, భిన్న కాలములలో రాజకీయ చిత్తలలో రచయితలు అప్పుడప్పుడు కానిపింతురు. చంద్రమౌళి గారు రాజకీయ ధురంధరులేగాక పురాణ విద్యాపురందరులు కూడ. ఇదివరకే వారు రచించిన రామాయణసుధాలహరి వెువద లగు గ్రంథము లా విషయమునకు నిదర్శనముగా నిలిచినవి.

ఈ భాగవతసుధ అటువంటి మరియొక ఉత్తమగ్రంథము. వైకుంఠ నాథుడైన నారాయణుని అవతార విశేషములను పలుకు పురాణమే భాగవతము. అందలి వివిధ స్కంధములలో ఆ మహావిష్ణువు వివిధ విధముల నెట్లవతరించి దుష్టశిక్షణ, శిష్ట

రక్షణ చేసెనో కన్పించును. దశమ స్కంధములో కృష్ణావతార గాథలు పలుకబడినవి. చందమూళిగారిచ్చట 'కృష్ణస్తు భగవాన్ స్వయం' అనియున్నది గనుక, 'భగవతః ఇదం భాగవతమ్' అనియు చెప్పబడినది గనుక కృష్ణచరిత్రయందలి విశేషాంశములే భాగవతము అని చమత్కార చారువుగా సంభావించినారు. భగవత్పదమునకు గల విశేషార్థముల నెన్నింటినో సవిమర్శముగా నుదాహరించుట ఈ సందర్భమున వారి పరిజ్ఞకు తార్కాణము.

ఈ గ్రంథ నిర్మాణమునకువారు వేసికొనిన ప్రణాళికయు పై దానికనుగుణముగా నేడున్నది. మొదట ప్రత్యేకముగా కొన్ని పుటలు భక్తి తత్వసిద్ధాంత పరిశీలనమునకు వినియోగింపబడి పీఠికా పర్యాయముగా నుండి ఔచిత్య మనోహరమైనవి. ఆంధ్ర భాగవతకర్త యగు బమ్మెరపోతన నీ సందర్భమున శ్రీ కల్లూరి వారు సహజ పాండిత్యుడని, సరళసాధు జీవనుడని, సజ్జనలోకానుసేవితుడని, శ్రీ రామానుగ్రహ పరిపూర్ణ పాత్రుడని, ప్రసిద్ధ పుణ్యపురుషుడని కీర్తించినారు. ప్రాచీనకవులపై వారికి గల భక్తి గౌరవములకిది చక్కని ఉదాహరణము.

రామావతార, కృష్ణావతారములలోని రహస్యములను వివరించుచు చందమూళిగారు దేవతలకు మానవులకుగల అనుబంధము యజ్ఞమను మహత్తర సత్యమును ప్రముఖస్థానమున నుంచి ఎత్తిచూపినారు. యజ్ఞములచే దేవతలను తృప్తులను జేసిన వారును మానవుల క్షేమము నభిలషింతురని ప్రజాపతి

పలికిన వాక్కులను గుర్తుచేసి అధునాతన కాలమున దాని లవ సరమును నొక్కి వక్కాణించినారు. యజ్ఞములలోని రీతులు, వాని వైవిధ్యము నిక్కడ పేర్కొనుటయు గమనార్హము. ప్రతివ్యక్తియు భావించు భావము- సలుపుచర్యలు విశ్వాక్షేమ ముతో ముడిపెట్టుకొని పెనవై చుకొని సమన్వయము కావలయు ననియు, సమీకరణము నందవలయుననియు, దానినే యజ్ఞ మందుమనియు, తద్భిన్నములన్నియు యజ్ఞనామావశిష్ట నిష్ఫల క్రియా కలాపము లేయనియు బలుకుట వారి హృదయ తత్వ మును మనకు తెలియజేయుచున్నది.

భాగవతమును దశమ స్కంధముతో ప్రారంభించి పరిపవళసి యుండునని ప్రాజ్ఞులు పలుకుటలోని పరమార్థము వారు చక్కగా విశదీకరించినారు. శ్రీకృష్ణదేవ జనన పన్ని వేశ సౌభాగ్యమును, బాల్య లీలల విశేషమును గమనించుచు శ్రీకృష్ణ దివ్యమోహన తేజోరేఖల యింపుసొంపుల నరయుచు, ముగ్ధుడగుచు పాఠకుడు, శోణిత క్రిమకీటముగ భాగవత మహా భవన ప్రవేశ మొనర్చి చిత్తశాంతిని నిర్మలానందమును పొందగల్గుదురని చందమామాళిగారు సంప్రదాయములోని సారస్యమును సంభావించినారు. ఇటువంటి సారస్యములు వివరించుపట్ల స్వయం ప్రకాశమైన ప్రతిభ నాశ్రయించిరేగాని తర్క కర్కశమైన పండిత ప్రకాండుల వాదచండిమ నాశ్రయింపలేదు. కనుకనే సహజ సరళ సుందరమైన వారిశైలి సర్వజన మనోరంజకమై అలరారినది.

భాగవతావతరణమును గూర్చి వారిలోని భావన యున్నది. ధర్మదేవతకు బాధయేర్పడిన సమయమున - అధర్మము వికృమించు తరుణమున పరమాత్మ తనను తానేలోకము నందవతరింప జేసికొనును. కరుణామయుడైన శ్రీమన్నారాయణుడు భూదేవత వేదన నపయించుటకు కాగల కార్యమును భుజస్కంధములపై నిడుకొని నడిపించవలసియున్నది. దానినెట్లు నడిపించునో, రంగభూమి యెక్కడనో, సహాచరులెవ్వరో, నిమిత్తమాత్రములై కలిసివచ్చిన కారణము లెవ్వియో, కథ సాగిన విధాన మేట్టిదో, ప్రతి భాగమున పరమాత్మని దివ్యాంశ యెట్లు ప్రతిఫలించుచు వచ్చినదో, ధర్మోద్ధరణ మెట్లుద్ధతితో కొనసాగింపబడినదో, భగవానుని విచిత్రితములైన లీలలెట్లభివర్ణితములైనవో, వర్ణనలలో వ్యక్తీకరింపబడుచు వచ్చిన మహిమల కన్నింటికి ముగ్ధులై భక్తు లెట్లభినందించిరో, సకలజనపఠనయోగ్యములు, సర్వకాల స్మరణీయములు, నయిన యిట్టి అంశములను సమగ్ర సుందరముగ వివరించుటకే మహాభాగవత ముదయించిన దనియు, అందలి దశమ స్కంధము ఈ యవతార సమావిష్కృతి నభివర్ణించు కథాభాగమునకు దానల మయ్యెడి మహాభాగ్యము నందుకొన్నదనియు రచయిత భావించిరి. భాగవతమునుగూర్చిన సత్య సందర్శనాత్మకమైన నిశిత పరిశీలనమున కిది యొక భావుకమగు తార్కాణము.

రచయిత మహర్షుల చర్యలలోని ఆంతర్యమును పసికట్టిన దిట్టలు. నారదుడువచ్చి కంసుని మందలించిన సందర్భమును

పురస్కరించుకొని వారు లోకమంగళ తత్పరులనియు దుష్టతత్వ నిరోధకులనియు, నారదుని సూచన ననుసరించి పలికినారు. దేవకీ కేశగ్రహణ మొనర్చిన కంసుని, జానకీ కేశగ్రహణ మొనర్చిన రావణుని, ద్రౌపదీ కేశగ్రహణ మొనర్చిన దుశ్శాసనుని చర్యలనుదాహరించినారు. కంసునికథకు ముందే రావణుని కథజరిగినది గాన ఉపమ సరియే. కాని తరువాత జరిగిన దుశ్శాసనుని చర్య నుదాహరించుట కొందరికి సంశయము కలిగింపవచ్చును. కాని యిది యేపాత్ర నోటను పలికింపబడినది కాదనియు, రచయితపాఠకులకు సులభముగా భావబోధకలుగుటకై యిచ్చిన పోలిక మాత్రమే యనియు అందరకు తెలిసిన పురాకథ ప్రసిద్ధ ఘట్టము స్మరించుటద్వారా ఆ చర్యలలోని అర్థము తెలియుననియు మాత్రమే పాఠకులు గమనింపవలెను.

ఇంద్రియాగ ఘట్టమున భగవదుక్త కర్మ ప్రభావమును మనకు గుర్తుచేసి భారతీయ జీవితవిధానములోని ఒక రహస్యమును శ్రీ చందమూళిగారు సంధానించినారు. పైన కష్టమువచ్చినప్పుడు ఒక్కభారత దేశములో మాత్రమే అది తమ కర్మఫలమను కొందురు. ఆ కర్మపురాకృతము. ఎప్పటిదో ఇప్పుడు ఫలించును. మానవుని పునర్జన్మ సిద్ధాంతము నొప్పుకొన్నగాని యీ కర్మసిద్ధాంత మర్థముకాదు. కృతమైన శుభాశుభకర్మ అవశ్యము ననుభోక్తవ్యమని శాస్త్రము చెప్పుచున్నది. అమధ్య నొకసారి ఒక ప్రసిద్ధ జగద్గురువులను కర్మను తప్పించుకొను మార్గము లేదాయని అడిగిరి. ఆయన అన్నారు

గదా ! "కర్మ నమఁడుచేసినది. తాను చేసిన కర్మ ఒక ఫలము నిచ్చును. ఆ ఫలమును మార్చగల మరియొకఁడు కర్మ చేసినచో దాని అనుభవ స్వరూపము మార్చవచ్చును. అదియుఁగాక చేసెడివాఁడు కర్త. కర్మకంటె కర్త యెప్పుడు నధికుడే. కాని లోకమున తనను తాను గుర్తింపని కర్త కర్మ తనకంటె బల వత్తరమైనదని భ్రాంతిజెందుచున్నాడు. పురుషకారయుతుఁడై కర్త కర్మ నధిగమింపవచ్చును" ఇదియొక పరమ రహస్యము. సుఖదుఃఖములకు, జన్మవృద్ధులకు కారణమై, జనులకు దేవత యైన కర్మను గూర్చిన పురాణ భావన భాగవతోక్తమైనది, ఏవం విధ బహు భావ బంధురమైనది రచయిత హృదయగతము చేసికొని మనకు వివరించినారు. కర్మ స్వరూపుడైన పరమాత్మఁడే సర్వాధికారి యనియు-యజ్ఞాధిపతి యనియు, సత్కర్మాచరణమే సర్వేశ్వర ప్రీతికర విధానమనియు, కర్మలను నవ్యముగ నాచరించుటే దైవమును పూజించుట యనియు - కర్మ మార్గములోని అంతరార్థ సమన్వితమైన ఆలోచనను మనకు గుర్తుచేసినారు.

కుచేలుని నిర్మలసఖ్యమును భావించుచు భగవానునిపట్ల అట్టి స్నేహమునుగాని, గోపికల విశుద్ధ ప్రేమనుగాని ప్రకటింప లేనిచో గజేంద్రునివలె సర్వార్పణ మొనర్చి శరణాగతి నయిన పొందుటకు మానవులు ప్రయత్నింపవలయునని భాగవతము హెచ్చరించుచున్నదని రచయిత పలుకుట ఔచిత్య బంధుర మును, అత్యంతావశ్యకమునునగు వాక్యము. గజేంద్రమో

క్షణ ఘట్టమున మూలములో లేని పోతనమహాకవీంద్రుని కల్పన సౌందర్యమునకు ముదిసిపోయిన చంద్రిమాళిగారు ఆంధ్రభాగవత ఘట్టమునే గ్రహించి భక్తి తత్వ స్వరూపమును వివరించినారు.

ప్రపంచములో నెక్కడను లేనిదియు, ఒక్క భారతీయులు మాత్రమే దర్శించినదియు - భక్తిమార్గములలో ప్రత్యేకస్థానముగల వైరభక్తి, భగవంతునిపైన శత్రుత్వము బూనియు ముక్తి నొందవచ్చునని గమనించిన మహత్తరపరిశీలన మనది. ప్రహ్లాద చరిత్రలోని ఆ రహస్యత్వమును రచయిత హృదయంగమముగా విశదీకరించినారు.

ఈ విధముగా ప్రతి ఘట్టమునను శ్రీ చంద్రిమాళిగారు ఆ ఘట్టములోని అంతరార్థములను విస్పష్టముగా వివరించుచు భాగవత తత్వమును పాఠకులకందించి ధన్యులైనారు. నిజముగా వారన్నట్లు - ఇది సాధక కోటి గళమున తళతళలు ప్రతిఫలింపజేయు చారుతర తారహారము. శారదాపాద పంకేరుహ సన్నిధిని సంస్తవనీయ సౌరభ పరంపరలు ప్రవ్వియోయు చంపక ప్రసూనము. భాగవతసుధ యిట్టిది. వారి భాగవత సుధా గ్రంథమును ఇట్టిదే యని నిస్సంకోచముగా చెప్పవచ్చునను.

శ్రీయైనమః శ్రీ శ్రీనివాసాయనమః

తర్కవేదాన్తమహావిద్వాన్ పణ్డిత, వేదాన్తం,

జ గ న్నా ధా చా ర్యు ల

తిరుమల, తిరుపతి దేవస్థానముల ఆస్థాన విద్వాన్, తిరుమల — 1975

ఆ శీ స్సు లు

(శ్రీ) రామాయణ సుధాలహరీ రచయితయగు శ్రీ చంద్ర మౌళిగారు భాగవతసుధా నిర్మాతలగుటలో నాశ్చర్యము లేదు. సుధామయవాగ్ఝరీ గుంభితులగు వారలకిది రాచబాటయే. విషయసుధా వాఙ్సుధా ద్వితయ సంమేళనముచే మధురాతిమధు రమై మధురానాథుని మధురవృత్తము అనవరతానుభవమునకు పామరలను కూడా పురికొల్పుచున్నది. ఈ భాగవతసుధయు సాగరమై తరంగములువైచినది. సుధామయ తరంగముల సక్త దనుభవము అనవరతానుభవ కాంక్షను కల్పించి ఫలవంతమై, ఐహికానందానుభవమును సమకూర్చుటయెకాక ఆముష్మికా నశ్వరానందానుభవమునకు దారిచూపుచున్నది. అభిన్నవస్తువు

విభిన్న విచిత్రఫల సంపాదనా సమర్థమగుట ఆశ్చర్యము. వీరి విచిత్ర వచన రచనాపాటవము జన్మాన్తరీయ సంస్కారాను మాపకమై ఫలసంపత్తిచే కారణ తర్కమునుద్ఘాటించు చున్నది. భారతీయ ప్రతిభయు భారతసుధాస్థానము నాకర్షించు మించినది. ఇటుల ఐతిహాసిక సుధాప్రదానము ఆశ్వాసాన్వయ కలంకారమనుటలో నాక్షేపములేదు. ఈ వచనము వైనుష్యముతో సహచరించుచున్నది. కనుకనే గుణగ్రామావి సంవాదమును చాటుచున్నది అభిజ్ఞ. ఇదియే మహాత్మతా ప్రయోజకమని తంత్రవేత్తల సమీక్షణము. మహోత్ప్రేలశీల మనక్షర జ్ఞులనైన అక్షరజ్ఞులజేయుటలో చరితార్థమగుచున్నది. కనుక గ్రంథకర్త ఇటుల సుధామయ ఫణితులచే సంసారవాసనా వాసితులగు మానవుల సమందానంద మందాకినీ తరంగములనోలలాడించి అక్షరజ్ఞులజేయ సప్తాచల నివాసరసికుడగు శ్రీ శ్రీనివాస వరదైవము ఆయురారోగ్య సౌభాగ్యములను సమకూర్చును గాక.

డాక్టర్ దివాకర్ల వేంకటావధాని
ఎం. ఏ. (అనర్స్) పిహెచ్. డి.
18/4 R. T. బరకత్పూర - హైదరాబాదు-27.

అభినందనము

ఆర్ష విద్యాలంకార సార్థక బిరుదాంచితులు శ్రీ కల్లూరి చందమూళిగారు రచించిన భాగవతసుధ నాద్యంతమై చదివి యానందించితిని. శ్రీ మద్భాగవతము భక్తిరస సింధువని చెప్పదగిన యుద్గ్రంథము. భక్తాగ్రేసరుండైన బమ్మెరపోతరాజు మూలమునందలి భక్తి భావములకు తన భక్తి భావనులను గూడ జతచేసి ధారాళము మధురాతి మధురమునైన శైలిలో దాని నాంధ్రీకరించి తానుదరించుటయేకాక తోడి యాంధ్రులకును దానొసంగుటను జూపియున్నాడు. శ్రద్ధాభక్తులతో పఠించువారి హృదయములపై నతని పద్యములు వేయు ముద్ర శాశ్వతము ఆముష్మికాభ్యుదయ కరమునై యలరారుచుండును.

శ్రీ చందమూళిగారు భాగవత భగవత్ భక్తి శబ్దములను నిర్వచించి భగవంతుని భక్తపరాధీనతను చక్కగా ప్రదర్శించియున్నారు. భాగవతమునందలి ప్రధానాశయములైన యుపాసనోపాస్యోపాసకులకు సంబంధించిన విషయములను వారు లెస్సగా వివరించియున్నారు. భాగవత కాల నిర్ణయమునకు

దశమ స్కంధము తరళమని చెప్పదగినట్టిది. శ్రీకృష్ణుని జనన లీలాదు లందు విపులముగా వర్ణింపఁబడుటయే యందుకు కారణము. పోతన గోపికల మధురభక్తి విశేషము నందు తన్మయుఁడై తతో వర్ణించి యున్నాఁడు. శ్రీ చంద్రమౌళిగారు దశమస్కంధమునందలి ముఖ్యాంశముల నన్నిటిని విశదీకరించి వాని ప్రాముఖ్యమును ప్రకటించి యున్నారు,

భాగవతము నందనేకోపాఖ్యానములున్నవి. పోతరాజు కవితా మాధుర్యముచే నవియన్నియు సర్వాంధజన సుపరిచితములైనవి. అవి వట్టి కథలవలె గోచరించినను గంభీర తత్త్వార్థ ప్రదర్శకములై యింపు నింపుచుండును. కుచేలుఁడు, గజేంద్రుఁడు, ప్రహ్లాదుఁడు, రుక్మిణి మున్నగువారి పవిత్ర చరిత్రలనందు చక్కగా వర్ణించి శ్రీ చంద్రమౌళిగారందలి పరమార్థమును విశదము కావించియున్నారు. భాగవతక్షీర వారాశిని వారు ప్రతిభా మందరముచే మథించి భక్తిభావ సుధను పరితలకందిచ్చి యున్నారు.

శ్రీ చంద్రమౌళిగారి శైలి ప్రసన్నమై ధారాళమై, భావగంభీరమై, నిర్దుష్టమై, సర్వానుబోధమై చదివిన కొలది చదువవలెనను నుత్కంఠ రేకెత్తించుచున్నది. వారందందొసగిన శ్లోకములును, పద్యములును వారి పాండితీ పరిశ్రమమును వ్యక్తముచేయుచున్నవి. భాగవతసుధయందలి విషయము సుఖావమధురమై గ్రంథనామమును సార్థక మొనరించుచున్నది.

Professor Of Telugu
Andhra University
ఆచార్య టి. దొణప్ప

17-B, Sea Sands
University Campus
WALTAIR

ఆ కాం క్ష

లోకములో విద్యాపరిపాకము గలవారు చాలతక్కువ. ఉన్నవారికి ప్రసన్నవివేకము అంతకంటె తక్కువ. ఈ రెండును గలవారిలో అధీతిబోధలకు ఆచరణప్రచారములకు సమన్వయ మంతగాఉండదు. అన్నియు అమరినవారీలోకమున చాల అరుదు. అట్టి అరుదైన వ్యక్తులలో 'ఆర్ష విద్యాలంకార' బిరుద విభూషితులు శ్రీ కల్లూరి చంద్రమౌళిగారు బిరుదైనవారు. సుసంస్కృతమైన చిత్తవృత్తి, సుశిక్షితమైన ప్రవృత్తి వీరి వ్యక్తిత్వము నందలి విశిష్ట గుణములు. వీరింతకుముందే ఆంధ్ర లోకమునకు 'రామాయణసుధ' చవిచూపినవారు; 'భారతీయ ప్రతిభ' ను ప్రదర్శించినవారు. ప్రకృత కృతి 'భాగవతసుధ' పరిణతమైన వీరి ప్రతిభావ్యుత్పత్తులకు నిదర్శనముగా వెలువడినది.

వీరు స్వీకరించిన యంశము గొప్పది. తీర్చిన తీరు గూడ పరిమాణోపపత్తి సంకలితము. రచనావిన్యాసము విలక్షణమైనది. భాగవతమును బహువారములు పారాయణముచేసి, పరివచనము గావించి, దాని తత్త్వమును లోనారసి, అందలి తీరు తీయములను తమయనుభూతిబలమువలన నిట్లావిష్కరించిరి. శ్రీకృష్ణ లీలావిలాస ప్రవణములగు ఆంధ్రభాగవత దశమస్కంధ కథాభాగములను, విష్ణుపారమ్యములగు గజేంద్ర మోక్షము ప్రహ్లాదోపాఖ్యానము మున్నగు ఘట్టములను తీపు వివర్ణనమున కాలంబనములుగా గ్రహించిరి. వీరు ఉత్తమ సాధకులగుటయే కాక, ఏతాదృశగ్రంథనిషేవణము కారణముగా ఉదాత్తబోధకులు నయిరి. ఇట్టి వీరి రచనము విచక్షణులకు ఉపాదేయమగు ననుట అత్యుక్తి కాదు. భాగవత రామాయణ కథాసుధలను చిందించిన శ్రీ చంద్రమౌళిగారు భారతకథాపయోధి సైతము మథించి తత్సుధాసార సేచనమున నాంధ్ర సారస్వతమును అభిషేకింపగలరని మా ఆకాంక్ష.

Dr. B.Rama Raju
Professor & Head
Department of Telugu

University College of Arts&Commerce
Osmania University
Hyderabad-500007

ప్రశంస

మీ గ్రంథంపూర్తిగా చదివితీను. భగవంతుడు, ఆతని దివ్యలీలలు, భాగవతావతరణం, దానివైశిష్ట్యం, శ్రీకృష్ణపరమాత్మ లీలలు, పోతనగారి ఆత్మ భాగవతంలో స్పందించినతీరు – అన్నీ చాలాచక్కగా వివరించినారు. పోతనగారు భాగవతకల్పతరువును తెలుగునాట నాటితే తత్ఫల రసాయనాన్ని మీరు తెలుగువారి కందరికీ ఈగ్రంథంద్వారా పంచుతున్నారు. భక్తిపారవశ్యంలో పోతనగారిశైలి అడ్డ మూకలెరుగనిది. మీరుకూడా పోతనగారి వలెనే తన్మయులై శ్రీకృష్ణ పరమాత్మని దివ్యలీలలు దుష్ట శిక్షణమూ శిష్టరక్షణమూ చాలా ఉత్సాహంతో ఉద్వేగంతో వ్యాసినారు. మీ వచనం ఒకచోట ఉత్తుంగ తరంగిత వారాశి వలెనూ మరొకచోట గలగలాపారే సెలయేరువలెనూ ఇంకొక చోట నిండు పున్నమినాడు విరిసిన పండువెన్నెలలవలెనూఉంది. ఆత్మానుభూతి ప్రగాఢమైనప్పుడే ఇటువంటి శక్తివంతమైన రచన చేయటం సాధ్యం. ఆయా సన్నివేశాలను వర్ణించినప్పటి భావపరంపరలో మీరు అట్లాగే చాలాకాలం ఉండవలెననీ ఆ ఉద్వేగంలో ఆ సమాధిలో ఆ దివ్యానుభూతిలో భారతీ యార్ష ధర్మ వ్యాఖ్యాసదృశాలూ విశ్వకల్యాణ కారకములూ ఐన మరికొన్ని రచనలు చేయవలెనని ఆకాంక్షిస్తున్నాను.

విద్వాన్ తుమ్మల వెంకటరత్నము

గోవాడ

ప్రమోదము

శ్రీ మన్మహా భాగవతపయోధి మథన సముదభ్భవ సుధ యీ 'భాగవత..సుధ'. భక్తితత్వ పరిబోధకమైన యీ మధురసుధ .సదాభాగవతుల రసనేంద్రియ శ్రవణేంద్రియ సంసేవ్యమై హృదయ సంతర్పణము గావింపజాలును. ఏతస్మా లకమైన కృతి భక్తాగ్రేసరుడైన పోతనామాత్యుని లేఖినినుండి జాలువారిన మహాభాగవత సుధాస్రవంతి ఆంధ్రులను పునీతులను ధన్యులను గావించుచున్నది. దానినెంద రెన్నివిధముల సంగ్రహించి - విస్తరించి - విశదీకరించినను, అది నిత్యనూతనమై మధుర మధురమై పదే పదే పఠన శ్రవణ కుతూహల మెసద వించును. అమ్మహా కావ్యము హైందవుల పవిత్ర కావ్యత్రయ మందు విశిష్టమైనది.

శ్రీ మద్రామాయణ భారత భాగవత మహాకావ్య ములు భారతీయ జీవన స్రవంతిలో అంతర్వాహినులైన స్రి వేణులు. హైందవ జీవన సంస్కృతి కవి చైతన్య స్రదములు; ఆర్ష ధర్మతత్త్వ సంపత్తి కి నిధానములు. రామాయణము మానవ జీవితాదర్శ మార్గ దర్శకము. మహీతల మందే దివ్య త్వమును నెలకొల్పి మానవుని మహోదాత్తునిగా మలచ గలిగిన మహాకావ్యమది. భారతము మానవధర్మ స్రతిష్టా స్రబోధ స్రధానము. లౌకికా లౌకిక ధర్మాధర్మముల నిరూపించి ద్వంద్వోపేతమైన ఐహిక రంగమున కర్తవ్యము నుపదేశించి మానవుని కర్మవీరునిగా దిద్ది తీర్చగలిగిన ధర్మేతిహాస మది. భాగవతము ఆత్మ జ్ఞానవిలసిత భక్తితత్త్వభూయిష్ఠమైన కైవల్య కల్పకము. మానవజీవితమును నిత్యసంపన్నము రసార్ద్రము గావించి భక్తి స్రవాహమునందేల్చి నిరుపాధిక సౌఖ్యాంబుధి నోలలాడించు సాధనమది.

పై మూడు మూలకావ్యములనుగాని వాని యనువాద ములనుగాని ఆర్ష ధర్మాభిరతులైన భారతీయులెల్లరు నిరంతర పఠన శ్రవణములచే నాదరించుచు, తదాదిష్టమార్గాను యాయులై తమ జీవనమును సఫలముగావించు కొనవలసి యున్నది.

ఆధ్యాత్మిక తత్త్వ జిజ్ఞాసువులు, భక్త స్రవణ చేత స్కులు, ఆర్ష విద్యాలంకార బిరుదాంచితులునైన మాన్యశ్రీ

కల్లూరి చంద్రమౌళిగారు అమ్మ మహాకావ్యత్రయ మా మూలా
గ్రము సవిర్శముగా పలుమారు పరిం చి పరిశోధించినవారు.
వాల్మీకిరామాయణమున ప్రతిపాత్రము ప్రతిఘట్టము పరిశీలించి,
ధర్మ సూక్ష్మములను వివరించి, జీవితాదర్శములను విస్తరించి,
విపులమైన 'రామాయణసుధాలహరి' ని రచించిన ప్రఖ్యాతరచ
యితలు. వారే పోతనామాత్యుని భాగవత కథా ఘట్టములను
పరిశోధించి, ఆత్మ జ్ఞాన మూలకమైన భక్తితత్వ పరమావధిని
సోదాహరణముగ నిరూపించి, రచించిన యుత్తమ రచన యిది.
భక్తి తత్వమును తేట తెల్లముగ మనోరంజకముగ వివరిం
చుచు మృదు మధుర వచన రచనముగావించిన యీ రచయిత
ప్రతిభావ్యుత్పత్తులు ప్రశంసనీయములు. అమాత్యాది పదవీ
బాధ్యతానిర్వహణ నిర్వీరామసమయములందును, పదవీవిరామ
ప్రశాంత జీవితయాత్రా చరణీయందును, భక్తి భావమున-
తాత్విక చింతనతో నిరంతర పఠన రచనావ్యాసంగములతో
ప్రౌద్దులువుచ్చు నీ రచయిత కృషి బహుధా ప్రశంస్యము;
శతధా అభినంద్యము.

తత్త్వపరామర్శకము భక్తిరసోల్బణమునగు నిట్టి
యసదృశగ్రంథరాజ మాంధ్ర వాఙ్మయము నకొక యపూర్వా
లంకారము. సరళము సరసము రమణీయమునైన యింటి పద
చిత్రణము అద్భుతావహమై పాఠక లోకము నలరించును.
ఫలందలి యుపాఖ్యానములందనేకాంశములు సందర్భాను

సారముగా వ్యాఖ్యాసదృశములై తత్త్వజ్ఞానము గలిగించును. మఱి యెన్నేని గుణములను నిరూపించుచు నిట విస్తరింప బూను టనావశ్యకము.

శ్రీ చంద్రమౌళిగారు భారతమునకుగూడ ధర్మ వివరణాత్మకమగు సంగ్రహకృతిని రచించి పాఠక లోకమున కందించి మహాకావ్యత్రయ వ్యాఖ్యాతలుగా ప్రసిద్ధులై ఆంధ్ర సాహిత్య జగత్తున యశశ్చంద్రికలు వెలయించి వర్ధిల్లుదురు గాక !

ఓం శ్రీ లలితాయై నమః

వైద్యరత్న
శ్రీమాన్ రత్నాకరం శ్రీనివాసాచార్యులు
సత్తెనపల్లి

ఆశాస్యము

శ్రీకైవల్య పదంబు జేరుటకునై శ్రీ పోతనామాత్యుఁడీ
లోకంబందున పద్య భాగవతము శ్లోకార్థము మించు న
ట్లా కౌసల్య తనూజు సత్కృపను వ్రాయన్ దాని గద్యంబుగా
మా కల్లూరి సుదర్శనాత్మజుఁడు తద్భావం బెటింగించెడిన్,

ఏమి తపంబుజేసి జనియించిరొ గోపికలెల్ల - వీనులం
దా మురళీరవంబు పడినంతనె సర్వము విస్మరించి యా
రామలు తన్మయత్వమున రాతిరియౌట నెఱుంగ కెప్పుడా
కామరసాఱు జూతుమను శాపముచే తరియించి రందఱున్.

ఒక్కొక గోపికామణికి నొక్కొక కృష్ణుని దోపజేసి తా
మొక్కరె కృష్ణప్రేమకు నియుక్తులమంచు దలంచి యెక్కుగా
నిక్కెడి వారికిన్ దుదకు నిర్మల తత్త్వముఁ జూపి ప్రేమతో
నక్కున జేర్చు కృష్ణ ప్రభు నాత్మదలంచుట మోక్షమౌ సదా.

బాల గోపాలు లీలల ప్రాభవమును
గాంచి, గ్రహించి, పాల్గొన గలిగినట్టి
గోపికల పాదధూళి సోకుటను ధన్య
మైనవట చేతనము లచేతనములెల్ల.

భాగవత మథన మొనరించి
భాగవతుఁడు చంద్రమౌళి భక్తుల కొఱకై
భాగవతసుధ వెలార్చెను
భాగవతోత్తములు పుణ్యఫలమో యనుఁగన్.

భారతదేశ మార్యుల నివాసము - పుట్టిన వ్యక్తులందఱున్
వీరులు - నీతికోవిదులు - విద్యల పండితులంచు గొప్పగా
యూరపునందు చాటెనట యోగ్య మమాత్యుడు చంద్రమౌళి.యీ
మారిన నేటి పద్ధతు లమానుష మౌటకు ఖేదమందెడున్.

భారతీయ ప్రతిభా గ్రంథరాజంబు
తెలుఁగు ప్రజాళికి దీప్తినిచ్చె
రామాయణములోని రమణీయ సుధఁ దేర్చి
మానవాదర్శ ధర్మముల గణుపె
యుగసమీక్షయు క్రమంబుగ ధర్మలుప్తి ప్ర
భావం బెటింగించె ప్రజలకెల్ల
వేద సుధాకరం బుదయించి ప్రాచీన
సంస్కృతి బోధించె నర్వ్యులకును

ఉజ్జ్వల తరంగిణిత్యాది యోగ్యమైన
గ్రంథములు వ్రాసి నేడు భాగవతసుధను
భక్తి విధముల, భక్తి భావముల, భక్త
చరితముల నేరి ప్రచురించె చంద్రిమౌళి.

భారతమందు గూడ ప్రతిభన్ సుధ దీయ గలారు మిరె యం
చీ రమణీయ గ్రంథముల నిచ్చ పఠించిన భక్తులెల్లరుఁ
కోరుట సాజమేగద యకుంఠిత దీక్ష వహించి వేగ నీ
భారతదేశ భాగ్యమన భారతమున్ రచియింపఁ బూనుడీ!

ఇట్లు మహనీయ మిత్రుని హితమునెంచి
దేవి లలితను ప్రార్థింతు దిన దినంబు
ఆయురారోగ్య భోగభాగ్యముల దివ్య
సాహితీవేత్తయగుగాక! చంద్రిమౌళి.

'మధురకవి'

పండిత బృందావనం రంగాచార్యులు

పరుచూరు

"మధురసుధ"

సువినయభావలీల - మధుసూదన పాదపద్మోజభక్తి - త్యా
గవిధులకాశ్రయమ్మయిన కార్య సమాచరణమ్ము - సుందర
ప్రవిమలదృష్టి - సూరిజనవాక్యముపట్ల విశేషరక్తి - భా
గవత సుధారస ప్రభల గాంచగ గల్గెదరెల్లవారలున్.

నిరుపమయోగదృష్టియు - వినిర్మల మానసిక ప్రవృత్తి నె
ల్లరకును బంచగోరి - మధురన్ జయగీతుల బాడినాడహో !
మురళిని బట్టి, విశ్వమును ముగ్ధ మొనర్చెడి కృష్ణదైవమా
చరితమె మానవాళికి ప్రశాన్తి ఘటించును సర్వవేళలన్.

నంద సతీమనోనయనమ్మునకు విందు
లందింపజాలిన యట్టి ఘనుడు;
కుబ్జావధూప్రేమ కోటరమ్మున నవ
రసవాణి వినిపించు రామచిలుక;
కంస గజేంద్ర భీకరశక్తుల నణంప
జాలి నిల్చిన సింహ శాబకంబు;
చెంగని చెలిమి కుచేలునిపైజూపి
సిరులను కొసరియిచ్చిన సఖుండు;

భాగవతమున దర్శనభాగ్య మొసగి
సుధలు వర్షించి భక్తుల వ్యధల ద్రుంచి
మించి శాంతిని జగతికందించినాడు
వత్సలుడు కృష్ణపరమాత్మ వరదుడగుచు!

మథన మొనర్చినకొలదిన్
ప్రథితానందమ్ముగూర్చి భక్తుల యెడదన్
సుధనింపు 'భాగవతసుధ'
మధురముగ రచించె చంద్రమౌళి బుధుడహో!

సారగభీర భావనుడు శారదకున్ ప్రియనందనుండు - వి
స్తార యశో విలాసమహిత ప్రతిభామయుడాంధ్రసీమకున్
గౌరవకారణుండు, గుణగణ్య డుదారుడు, చంద్రమౌళి 'క
ల్పూరి' మహాన్వయమ్మున నవోజ్జ్వల దీప్తులనింపెనాదృతిన్.

భావన శ్రీహరిపదరా
జీవమ్ములపై నటింప - సిద్ధపరచి నా
ది విధి నవవాఙ్మయమును
వివలముగ కృష్ణభక్తికిన్ వశుడగుచున్.

తన యధికార మత్తమ కార్యనిర్వహ
ణార్థమై వెచ్చించునట్టి మనుడు;
తన యార్జన మ్మార్ష ధర్మప్రచారమ్ము
కొరకని భావించుకోవిదుండు;
తనకృషి భవ్య హైందవపుణ్య దేవాల
యోద్ధరణమ్మను యోగ్యతముడు;
తన లక్ష్యము వినూత్నతన్ గుల్కుప్రాక్తన
భావబోధగనెంచు భావకుండు;

కరుణ - ఉపకారచింతన - నిరుపమాన
దీక్ష - నిశ్చలపావన ధీ బలమ్ము
గలిగి యీ 'భాగవతసుధ' వెలయజేసె
మాన్యుడైనట్టి మన చంద్రమౌళిబుధుడు.

రామకథారసోర్మికల రక్తి యు భక్తి యు జూపె నెప్పుడో!
ప్రేమగనెన్ని యో కృలతుఁ బెంపును సొంపు వెలార్చె-భక్త సం
క్షేమము గోరి భాగవత సింధువు నేడు మథించి యీ సుధన్
శ్రీ మధురాధి నాథుదయచే నృజియించె ఫలింపకోరికల్.

తీయ తీయని నుడులతో తెలియజెప్పె
భాగవత సారమెల్ల నీ భక్తవరుడు
ఆర్షభావాభిమానియై యలరునట్టి
ఈ మహాత్ముని కృషి ఫలియించుగాక !

వి. సంపత్కుమారాచార్య, M. A.,
హిందూకళాశాల - గుంటూరు.

ఆశంస

రామ భద్రుండు పలికింప రాణమీఱు
కృష్ణు దివ్యంపు గాథల కీర్తనంబు
తెనుఁగు భాగవత కృతిచేఁ దనకు గల్గె
నంచు మున్ను పోతనకవి హ్లాదమందె.

భాగవత కథల నిగూఢ భావగరిమ
మధుర మధురాతి ఫణితిమై మన్ననగన
చాటి చెప్పెను నీనాఁడు చంద్రమౌళి
బుధుడు - విబుధులు పామరుల్ మోదమంద,

అస్తవ్యస్త భావము లిల నతిళయించి
తారసిలఁగ మనమునందు తల్లడిల్లి
హృదయ ముప్పొంగ సుధఁదేర్చి యింపుగులుక
'భాగవతసుధ'ను వెలార్చె భవ్యసరణి.

భౌతికముగ యోజననల్పు 'భావసాగ
రులకు' శాప్త సరణితోడ రుచ్యముగనె
విషయ వివరణ గావించి విప్పిచెప్పె
భావముల - విదళించి దుర్భావనమితి.

శ్రీలుత జయదేవుఁ డాదిగా గల సుకవులు
మరల మరల నిదేలని మానరై రి
కృష్ణలీలాభి వర్ణన కీర్తనములు
నుడువుటను బట్టి యెదియైన నతినిగాంచు.

భారతీయ ప్రతిభయను పరీమళ
సౌగంధిక సుమంబు సొరునింప
నాణెమౌ రామాయణ సుధాలహరియన్‌స
హ్లాదళ కమల మమరికగన
యుగ సమీక్ష యనెడి యుజ్జ్వల సురభిళ
మందార కుసుమంబు మవ్వ మొలుక
వేదసుధాకర విమలఁపు దీప్తియన్
గొజ్జంగి సూనము కొమరునంద

ఉజ్జ్వల తరంగిణీత్యాది కోత్పల సుమ
రాజి కూర్చిన దామము రక్తిమీఱి
చంద్రమౌళి సుధీమణి సరసత మెయి
పలుకు వెలఁదికిఁ జేసె పరమ భక్తి.

ఆర్ష విద్యకు ప్రప - మీర లమృత మ్నాదులు
దుష్ట భావాల సరళిని తొలఁగఁజేసి
భారతకృతి పీయూషంబు పదిలపరచి
ఆంధ్ర భారతి కర్పింతు రంచు నెంతు.

దీవి దీక్షితులు

అమరావతి

మురళి

భగవానుని కథ భాగవతం
కావాలందటి భావగతం
చంద్రమౌళి హృదయాహ్లాదం
రాగ సుధారస పరిపూర్ణం.

మంజుల మోహన మురళీనాదం
అందించును హృది కానందం
బృందావనమున రాసవిహారం
భక్త సుమమ్ముల కాసారం.

కౌస్తుభమ్ములో కాంతి సముద్రం
కరుణామయుని దివ్యతత్వం
ఇంద్రధనుస్సుల శిఖిపించం
భిన్నత్వంలో ఏకత్వం.

మధురాధరమున దరహాసం
మదిలో భావన కాదర్శం
నీల వర్ణమున వైశాల్యం
లీలాకృష్ణని మూర్తిత్వం.

పలుకు పలుకులో మకరందం
ప్రీతికథ పరిమళ సంభరితం
పాంచజన్యమున గీతాసారం
ధర్మస్థాపన కాధారం.

పరిచయము

వేదమను కల్పవృక్షమునుండి రాలి, శుకుని నోటబడి అమృతమును స్రవింపజేయునట్టి - రసమునకు నిలయమైనట్టి - ఆరముగ్గిన భాగవత మధుర ఫలరసామృతమును రసికులైన భావుకులు నిరంతరము గ్రోలుచుందురుగాక !

"ఆధునిక కాలమున పుక్కిటి పురాణముల గొడవ యెందులకు ? భౌతికశాస్త్రములు, సాంకేతిక విజ్ఞానములు అభివృద్ధి వికాసముల నందించుచున్న ఈ రోజులలో బూజుపట్టిన- అక్కరకురాని యీ పురాతన గ్రంథములేల ? ఇవి మన మెదడులను పాడుచేయు మూఢ విశ్వాసములను నూరిపోయును. ఇట్టి అశాస్త్రీయ - అనర్థదాయక గ్రంథముల చేపట్ట కుందుముగాక ! మటియును పుట్టి మునిగిపోయినట్లు సదా 'భగవంతుడు - భగవంతుడు' అని పలపించుటేల ? భగవంతుడు లేనిచో ప్రపంచమునకు కొదువేమి గలదు ? ఒక్క అణువైన రాలిపోదే ? మన బుద్ధిబలముతో సాధింపజాలనిదెద్ది" ? అని నవనాగరికులమని విఱ్ఱి

వీగుచు - సర్వారంగముల పాశ్చాత్యుల ననుకరించుచు - వారి కూడిగ మొనర్చు అల్పబుద్ధులు వెకిలి వివర్శలను, విచార భావపరంపరలను బహిర్గత మొనర్చుచుండుట గర్హ్యము; నిరాధారములు, అవాంఛనీయములునగు ప్రకటనములను గావించుచుండుట విచారణీయము. సృష్టికర్త - అనంత దివ్యశక్తి సంభరితుడు - సర్వజ్ఞుడు - సర్వవ్యాపకుడు - సర్వ బలోపేతుడునగు ఏకైక భగవానుడే లేకపోతే, సర్వసృష్టియు శూన్యమై - అంధకార బంధురమై - ఉనికికే కోల్పోవ్రను గదా! కాబట్టి భౌతిక వాదులము - నాస్తికులము - లోకాయతులము- నవనాగరికులము - అని ప్రగల్భముల పలుకుచుండు వారైనను తమ అస్తిత్వమును నిలువబెట్టుకొనుటకైనను అఖండ సచ్చిదానంద మూర్తియగు - దివ్యశక్తి నిలయుడగు భగవంతుని విశ్వసింపక తప్పదు.

"ఒకటి యంకె మొదటనున్న దాని ప్రక్కనుండు పూర్ణాను స్వారముల విలువ పెరుగు చుండును." అను నగ్న సత్యమును శ్రీరామకృష్ణ పరమహంస సరళముగ ప్రబోధింప లేదా? భగవంతుడే లేకపోయిన సర్వము సమసిపోవును. మాన వుడు సంసారబంధమున తగులుకొని 'ఉన్నది - లేదు' అను పరస్పర విరుద్ధద్వంద్వములలో చిక్కుకొని, సందిగ్ధావస్థలో బడి కొట్టుమిట్టాడు చుండును. వీనిలో లీనమై వీని కతీతముగ పోయి గొందు భగవంతుని విశ్వసించి భక్తిశ్రద్ధలతో నారాధించి -

అనుభూతికి తెచ్చుకొన్నవారే నిజమగు సుఖానందముల ననుభవింతురు; తన్మయులై తరింతురు.

'ఏకం సద్విప్రాబహుధావదన్తి' - అన్న వేదవాక్కే నిత్యసత్యమై అఖండముగ వెలుగొందు చుండును. భిన్ననదులు తుదకు గమ్యమగు సముద్రమును జేరునట్లు - భిన్నజీవులు ఎప్పటికైనను - త్వరగనో - ఆలస్యముగనో - భగవంతుని చేరక తప్పదు. శంకరుని కేవలాద్వైతముగాని, శ్రీరామానుజుని విశిష్టాద్వైతముగాని మాధవునిద్వైతముగాని వల్లభుని శుద్ధాద్వైతముగాని, చైతన్యుని అచింత్య భేదాభేద వాదముగాని నీలకంఠుని శివాద్వైతముగాని, యన్నియు నేకైక పరమాత్మను చేరుటకనువగు భక్తియోగ మార్గములే.

"భక్తిఃపరేశానుభవః" (శుకమహర్షి) - భగవంతుని అనుభవించుటయే భక్తి. శ్రీకృష్ణపరమాత్మను కేంద్రముగ నిడుకొని - సగుణ నిర్గుణోపాసనములను సాకార నిరాకార భగవల్లక్షణములను భిన్నరీతుల ప్రకటించుచు 'కృష్ణస్తు స్వయం భగవాన్' అని ప్రబోధించు పవిత్రగ్రంథమే భాగవతము. ఆర్ష సంస్కృతి కాలవాలముగ ఆబాలగోపాలము నానందపరవశుల గావించు ఉత్తమగాథలు - పవిత్రఘట్టము లెన్నియో భాగవతమున కీర్తింపఁబడినవి. భగవదనుభూతికి - ఆదేవదేవుని ప్రత్యక్షముగ గాంచి తరించుటకు ప్రప్రధాన సాధనము భాగవతము. స్వచ్ఛపావన జలసంపూర్ణ గంగామాత తన్ను దర్శించినవారిని,

తనలో స్నానమాడినవారిని తన నిర్మల మధురజలముల పాన మొనర్చినవారిని పవిత్రులను గావించునట్లే - వాసుదేవ గాథ లను ప్రశ్నించువారిని (పృచ్ఛకం) వానికి సమాధానములు చెప్పువారిని (వక్తారం) పినువారిని (శ్రోతృన్) తరింప జేయు పావనగ్రంథము భాగవతము. మానవ జీవితాభివృద్ధి వికాసము లకు - పరమార్థసాధనమునకు స్వచ్ఛ దర్పణముగ విశ్వమున ప్రసిద్ధిగాంచిన ఉద్గ్రంథము భాగవతము. సమస్త శాస్త్రములకు- సకల పురాణములకు మూలమై విలసిల్లు భాగవత పరమర రసాస్వాదమును గావించిన శుకమహర్షి పరీక్షిన్మహారాజునకు ఆమహాపురాణమును ఏడురోజులలో హృదయంగమముగ విని పించెను.

"సర్వ వేదేతిహాసానాం సారం సారం సముద్ధృతమ్!
సతు సంశ్రావయామాస మహారాజం పరీక్షితమ్ ॥
"శ్రుణ్వతాం స్వకథాం కృష్ణః పుణ్యశ్రవణ కీర్తనమ్!
హృదిస్థః సోహ్యభద్రాణి విధునోతి సుహృత్సతామ్"

భాగ. ఒ. స్కంధ. ౩౬ అ. ౧౨ శ్లో.

పుణ్య శ్రవణ కీర్తనుడగు వాసుదేవ భగవానుని పుణ్య గాథలను వినుభక్తుల హృదయములలో కృష్ణుడు ప్రదీపించు మవారి యందలి సమస్త మైన అనుభవవాసనల నంతరింప జేయును.

'పురాణం పంచ లక్షణమ్.' - భాగవతము కేవలమిట్టి పురాణముగాదు. అది దశలక్షణ సహితమైన మహాపురాణము.

ఈ వైష్ణవ భాగవత మసలు పురాణమే గాదనియు, ఇదియొక ఉప పురాణమనియు-దేవీ భాగవతమే అసలు పురాణమనియు కొందఱు అల్పజ్ఞులు వలుకు చుండుట పరిపాటియైనది. కాని ఉన్నతస్థాయిని శాస్త్ర సమ్మతముగ సహేతుకముగ పరిశీలనా పరిశోధనములను - తమ దీర్ఘకాల పరిశ్రమలతో గావించిన ఉద్దండ పండితులగు 'హజ్రా' వంటి మహా మహులు భాగవతము దేవీ భాగవతముకన్న అతి ప్రాచీన మహాపురాణమని నిర్ణయించిరి. పురాణము లన్నింటికిని అతీతముగ వెలుగొందు పరమపురాణమని నొక్కివక్కాణించిరి. పెక్కురు శాస్త్రజ్ఞులు- ఎందరో పురాతన గ్రంథ పరిశీలనా పరిశోధక ప్రముఖ పండిత సత్తములు భక్తిశ్రద్ధలతో పరిపక్వ యోగ్యతలుగల ఉత్తమోత్తమ దివ్యగ్రంథమని నిర్ణయించిరి. (పండాయస్యాస్తిస పండితః) పండా - ఆత్మజ్ఞానము. అది గలవాడే పండితుడు. ఇట్టి పండితులు - శైవ వైష్ణవాది మత విభేదములు, శాఖా విభేదములు లేకుండ - విశాలదృష్టితో భాగవతమును పారాయణము చేయుచుండుటయు కద్దు.

మానవుడు-సాటి వానిని తనవంటి మానవునిగ భావించి, ఉపకారమును - సేవను గావించుట దయయందుము. సర్వ జీవులను దివ్యులుగ సంభావించి గావించు సేవను ప్రేమ యందుము. జీవునియెడ దయ దేవుని యెడ భక్తి మానవ సహజ ధర్మములు. మానవులు దయామయులుగనే గాక

పవిత్ర ప్రేమమయులుగా సేవలనందించుట వారి పరమ కర్తవ్యము; శుభంకరము. ఆపదలోనున్న వానిచెంత దయను జూపుట మానవత్వము కాగా - అట్టివానిబాధను నివారించి సుఖింపజేయుట దివ్యత్వము. ప్రేమ యిచ్చునేగాని పుచ్చుకొనదు. ఇందు వ్యాపారదృష్టి మృగ్యము.

సాధుత్వము నుట్టిపడజేయు భక్తిమార్గమున దివ్యత్వము నందించు - పరమోత్సాహముతో తన్మయునిగావించు భాగవతము దేవభాషలో రచింపబడుటచే నది మధురాతి మధురముగ - ఉత్తేజవంతముగ భక్తిభావములను ప్రబోధించు పవిత్ర గ్రంథముగ వాసికెక్కినది. ఇంతటి మహాపురాణము వేఱొండు లేదనుట యతిశయోక్తి గాదేమో! ఇంతేకాను! ఇది సాకార నిరాకార భగవత్తత్త్వమును నిర్మలముగ విశదీకరించు ఉత్తమ గ్రంథ రాజము. దుష్టశిక్షణ శిష్టరక్షణములతో పాటు, నైతికపు పునాదులపై కర్మశిక్షణతో కూడిన ఆధ్యాత్మిక జీవితమును నిర్వహింపజేయుట అవతార ప్రయోజనమని యీ పవిత్ర గ్రంథము ప్రబోధించుచున్నది.

పరమ భాగవతుడు ప్రహ్లాదుడు తన్ను తాను మరచి తన్మయుడైనపుడు సర్వమును విష్ణుమయముగనే దలంచి సర్వత్ర యీ భగవంతునే గాంచెను. కాని తాను ప్రహ్లాదుడనని యీనను కొనగనే ప్రకృతి - జీవులు - భగవంతుడు (విష్ణువు) వేరు వేరుగ గన్పట్టెనట. భగవంతుడు సకల కల్యాణగుణోపేతుడగ-

దివ్యుడుగ-సాకారుడుగ గన్పించెను.అట్లే కృష్ణ భక్తురాండ్రగు గోపికలు తమ్ముతాము మరచి తన్మయులై, సర్వత్ర సర్వదా బాల గోపాల కృష్ణునే భగవంతునిగ భావించిరి. కాని! సామాన్య స్థితిలో తాము కృష్ణుని నుండి భిన్నులమని భావింపగనే వారు గోపికలుగనే యుండిరి.

"తాసామావిర భూద్శౌరిః స్మయమానముఖాంబుజః
పీతాంబరధరః స్రగ్వీ సాక్షన్మన్మథమన్మథః"

ముఖపద్మమున చిఱునవ్వుల చిందించు దరహాసిత వదనుడు- పట్టు వస్త్రమును ధరించినవాడు - వన మాలాధరుడు - ప్రేమస్వరూపుడునగు శౌరి గోపికల కందఱికిను శ్రీకృష్ణ భగవానుడుగనే కన్పట్టెను. ఇట్టి పరాభక్తి సంభరిత పరమ పావన భావ సంపుటి భాగవతమున ముచ్చటగ పొందు పఱుప బడినది. చిద్విలాసముగను- చిత్రాతి చిత్రముగను చిత్రింప బడినది. జ్ఞానమును ధ్యాననిష్ఠతో తనలో లీనమొనర్చుకొని భక్తి పరాకాష్ఠ నందుకొను నను సత్యమును స్పష్టీకరించినది. ధ్రువోపాఖ్యానము, రామచరితము, బలిచక్రవర్తిగాథ మున్నగునవి యెన్నియో యింపులకు ప్రమాణములు. భక్తి నిర్హేతుక దయాసింధువు. వాంఛా రహిత పరమ ప్రేమజలధి. ఇట్టి భక్తియుతుడగు భక్తుడు విశ్వమును పునీత మొనర్చును. "మద్భక్తియుక్తోభువనంపునాతి" (భాగవతము 11-14-24శ్లో) భక్తుడు లోకములను దరింపజేయును. "సలోకాంస్తారయతి".

(నారద) భగవంతుడు భక్తపరాధీనుడు. తనను శరణుజొచ్చిన వానిని – తనకు సర్వము సమర్పించినవానిని భగవంతు డెన్నడును విడువడు.

రాసక్రీడ

బాలకృష్ణుడు గో గోప గోపికలతో లీలగ విహరించిన బృందావనము – దివ్యతేజో వికాసములకు, సుఖానందములకు సుస్థిర నిలయము, సౌందర్యమునకు తావలము, పరాభక్తికి పవిత్రాలయము. నిర్మలచిత్తులగు గోపికలతో – పవిత్రాత్మలగు గోపబాలికలతో బాల గోపాలుడు గావించిన రాసక్రీడ యొక విశిష్టతను వెలార్చు చుండును. ఇందు కవితా సంపద అత్యున్నత శిఖరము నందినది. ఇది ఆధ్యాత్మిక తత్త్వమర్మమును సదా ప్రదీపించుచుండు ధ్రువ తార. కవులు తమ ప్రతిభా వ్యుత్పత్తులతో వెలార్చిన ఉత్తమ కావ్య కన్యల మధుర రస సంభరిత దివ్య ప్రేమగాథ. పవిత్ర భావస్రవంతులకు నిర్మల సరోవరము.

కృష్ణభక్తులు–పరమపావన చరిత్రులు నగు నింబార్క–జయదేవ– గౌరాంగాది భాగవతోత్తములు బృందావన కృష్ణుని అద్భుతలీలా గాథల యందలి ఆవేశపూరిత సుఖస్వప్నములను బాగుగ ప్రబోధించిరి.

"ఆహా ! అత్యద్భుతము ! ఆశ్చర్యకరము ! బాలమురళీ కృష్ణుడు గోపికలతో గావించిన రాసక్రీడా ఘట్టమును గాహ్యా పఱిచుకొనుట సామాన్యులకు అసాధ్యము. తాము పావన చరితులు కానిదే శ్రీకృష్ణునియిట్టి జీవితగాథల నెఱుకకు దెచ్చుకొన పర్యాలోచించుట అసంభవము. అపవిత్రహృదయులు అపార్థ కల్పనములకు గడంగకుందురుగాక ! ఇది మహాద్భుత ప్రేమవిస్తరణ పవిత్రఘట్టము. పరాభక్తికి పావనాలయము. బృందావన గాథను వర్ణించిన దివ్యసంఘటనమిది. పవిత్రప్రేమోన్మాదులు – ప్రేమామృతమును పూర్తిగా నాస్వాదించిన పుణ్యచరితులు తప్ప మఱి యితరులు దీనిని గాహ్యా మొనర్చుకొనజాలరు. గోపికల యీ పవిత్ర ప్రేమావేశమును ఎవరు గ్రాహ్యపరచుకొనగలరు ! ఇది పరాకాష్ఠ నందిన దివ్యప్రేమాదర్శము. స్వర్గమును గూడ లక్ష్యపెట్టని నిష్కామ నిర్మలప్రేమ. నేటి పర్యంచమునగాని – రానున్న కాలమునగాని – దేనిని ఆకాంక్షింపని యతి పవిత్ర ప్రేమయిది. సర్వమత చరిత్రలలో నిది యొక విలక్షణమగు పవిత్రగాథ. చెరుగని దివ్యచిహ్నము. 'ప్రేమ ప్రేమకొఱకే; విధి విధికొఱకే' – అను ఉత్తమాదర్శము, సత్య సంధతను ఇందే గాంతుము. కిశోర కృష్ణభగవాను కంఠమునుండి వెలువడి ప్రకటనమైన ప్రపథమ పవిత్రవాణి యిద్దియే. మానవేతిహాసమున – ప్రపథముగ భారత భూభాగమున ఆవిష్కరింపబడిన దివ్యజ్యోతి యిద్దియే !"

—(వివేకానందస్వామి)

"వ్యక్తిత్వమును మటుమాయ మొనర్చి, జీవుని భగవంతునిలో లీన మొనర్చి, గౌరీశంకర శిఖరమువలె నుద్దీపించునది ఈ గోపికల రాసక్రీడయే. రాసక్రీడలో ప్రదర్శన మొనర్చిన విషయమునే "నాకొఱకు సర్వబంధములను విసర్జింపుడు" అని శ్రీకృష్ణుడు గీతలో ప్రబోధించెను. 'అనన్య వేదనానుభవమును పరిష్కరించెడి నిస్తుల కార్యకలాపములకు సంబంధించిన పరమ పావన క్రియావిధానమే సమగ్ర మహితాత్మక సల్లక్షణము. ఇది భక్త శిఖామణి యగు నారదమహర్షి యుపదేశము. గోపికలు నిర్మల పరిపూర్ణ భక్తిని ప్రదర్శించి ప్రదీపింపజేసిన పావనో దాహరణ మిద్దియే."

—వివేకానందస్వామి

మానవత్వ దివ్యత్వములను ప్రదర్శించెడి మహోన్నత విశుద్ధఘట్టమును, వికారముగ – మొఱటుగ అల్పబుద్ధులు వక్ర గతిని ప్రకటించు కామ భావము వంకకు దిగజార్చబూనుట అవివేకము, అపచారము.

శ్రీకృష్ణుడు యశోదానందుల యింట తన పదునొకండవ సంవత్సరము వఱకే యుండెనని భాగవతము ఉద్ఘాటించు చున్నది. ఇంతటి పసితనములోనే బృందావన లీలలం-ముఖ్యముగా రాసక్రీడలు జరుపబడినవి. బాలుడుగ ఎట్టి గోప వాంఛయు పొడజూపని పిన్నవయస్సునందే గోపాలుడు గోపికలతో క్రీడలు గావించుట గమనార్హమైన విషయము.గోపికలు

బాలకృష్ణుని ముద్దులాడుచు ఆటపాటలతో మురిపించుచున్న పసితనమునకు కామవాంఛా దోషమును అంటగట్టి బూనుట అర్థరహితమైన వ్యర్థప్రలాపము. ఇది కామునిని కామాంధకారమును - కామపీడితోన్మాదమును చూపెట్టును. ఇది సాధుత్వమును - సత్యప్రకటనమును కన్నులకు గంతగట్టినట్లు కప్పిపెట్టు వక్రవ్యాఖ్యానము.

గోపబాలికలు ముచ్చటగ ముద్దులాడుచు - కృష్ణుని చిలిపి చేష్టలకు మురిసిపోయిరేగాని కామినులై కాగిలింతల దేలియాడలేదు. ఇవి పట్టపగలు - ఎల్లరసమక్షమున గావింప బడిన మురిపెంపుముద్దుచేష్టలే గదా! "రేమేరమేశోవ్రజ సుందరీ భిర్యథార్భకః స్వ ప్రతిబింబ విభ్రమః ! " (రాసపంచాధ్యాయి) బాలుడు అద్దములో తన ప్రతిబింబమును గాంచుచు - దానితో భిన్నరీతుల నాటలాడుకొను పగిది బృందావనకృష్ణుడు వ్రజకాంతలతో రాసక్రీడను గావించెను. 'యదాభావం తదభవతి' -అనునట్లు కాముకులు దీనిని పశుకామచర్యగనే భావించుట గర్హ్యము.

"తన్మనస్కాస్తదా లాపాస్తద్వి చేష్టాస్తదాత్మికాః
తద్గుణానేవ గాయంత్యో నాత్మాగారాణి సంస్మరుః ! ! "

భాగ. xxxx 44 శ్లో.

"మనోవాక్కాయ కర్మల కృష్ణునిలో లీనమైన వారై ఆయన గుణగణముల గాన మొనర్చుచు- గోపికలు తమ దేహ

మలను విస్మరించిరి. గేహములను స్మృతి పథమునకు దెచ్చు కొన జాలకపోయిరి."

గోపికాకృష్ణుల లీలలు సహజ సుందరములు- సుకుమార ములు- కళావంతములు- ఆనందదాయకములు. అవి జీవాత్మ పరమాత్మ యెడ ప్రదర్శించు పవిత్ర ప్రేమ ఘట్టములేకాని - కాముక స్త్రీ తాను కామించిన పురుషునిపట్ల చూపు కలుషీకృత కామక్రీడలు మాత్రము కాజాలవు.

పరమాత్మ వరుడుగను - జీవాత్మలను వధువులుగను చిత్రించుట మతసాహిత్యమునందు సర్వసామాన్యపుగ కాంతుము. ఇట్టివర్ణనము మహాకవి సత్తములగు కృష్ణభక్తులకు మాత్రమే పరిమితముకాలేదు. జీవాత్మ తన పవిత్రాంతఃకరణ యుందలి ప్రకృష్టసాత్విక ప్రేమతో పరమాత్మునిఆలింగనము గావించును. ఇది దివ్యసంయోగముగనే యుద్దీపించును. ఇది గాఢాంధకార వియోగావస్థలో వెక్కి వెక్కి యేడ్చుచు కుంగి కృశించి దహించుకొని పోవుచున్న జీవాత్మ యొక్క దీనసూచకమైన యొకానొక చర్య

"నేను సీదానను; నీవు నావాడవు నన్ను నీ పవిత్ర ప్రేమరసములో ముంచివేయుము. నా అంతరాత్మ యను నాలుకతో నిన్ను రుచిచూచుట ఎంత మధురమో, నీ దివ్య జల ప్రవాహములో స్నానమాడుచు-ఓలలాడు చుండుట ఎంత ఆహ్లాదకరమో దానిని నేను అభివర్ణింపజాలను గాని హృదయము

పూర్వకముగ అనుభవించి, ఆనందింపగలను." అని యొక గోపిక భావన.

శ్రీకృష్ణుని అతిమానుష చేష్టలను గోపికలు పరమాత్మ లీలలుగనే తలంచిరి. ఆయన మానవ రూపమును దాల్చిన ప్రియుడుగ గాక జీవాత్మలకు పరమాత్మగ దీపించు. దేవ దేవుడుగనే కన్పట్టెను. శ్రీకృష్ణుడు గోపికలతో క్రీడించిన బాల్య చేష్టలు - వారిని దివ్యముగ ఆశీర్వదించు సఖుని చేష్టలుగనే మధురా వట్సావానులు - ఆబాల గోపాలము సంభావించి సంతసించిరి. వారి పలుకుల నాలింపుడు. "వ్రజకాంతలు పావనలు. వారు గోవుల పాలు పితుకువేళ - ధాన్యముల దంపు సమయమున - పెరుగు చిలుకువేళ - కసవ్రూడ్చి కలయంపి జల్లి ముచ్చటగ ముగ్గులుపెట్టు సమయమున- తమ్మును తమ వస్త్రములను నిర్మల జలముతో శుభ్రపఱచుకొనుచున్న సమయమున- ఏడ్చుచున్న బిడ్డలను ఉయ్యాలలో నూపుచు, జోలలు పాడుచున్న వేళల - శ్రద్ధా భక్తులతో కూడిన కృష్ణనామ సంకీర్తనములలో మునిగి తేలుచుందురు. తఱచు ఆనందముచే శుద్ధమైన వారి కంఠములు ఉక్కిరి బిక్కిరి యగుచుండును. వారి మనస్సులు కృష్ణభక్తిలో లీనమగు చుండును. గోపాలుని నిరంతర సంస్మరణమే వారు పయనించు మార్గము. అన్ని విధముల వారు ప్రశంసార్హులు; స్మృతిపాత్రులు.

—భాగవతము 10 స్కంధము 44 అ. 15 శ్లో.

జ్ఞానియు భక్త శిఖామణియునగు ఉద్ధవుడు కృష్ణుని గూర్చి పలికిన పలుకుల నాలింపుడు. "సంఘమున బంధుమిత్రుల యెడ గల సంబంధములను, సంసారమున భర్తలతో గల లౌకిక ప్రేమ సూత్రములను త్రెంచుకొని-అతి కష్టముతో వారినుండి విడివడివచ్చి ముకుందుని పాదపద్మముల నాశ్రయించినవారు గోపికలు. వారిపాదధూళి సోకిన తుప్పలు, లతలు, ఓషధులు ముగ్ధమగు వానిని గలిగియున్న ఈబృందావన నివాస మెంత రమ్యము! ఎంత పవిత్రము!! బాలగోపాలుని పాదపద్మముల గట్టిగ నాలింగన మొనర్చుకొన్న గోపికలు - రాసక్రీడలో తమ కోమల హృదయ కమలములను పూర్ణముగ వికసింపజేసి విహరించిన గోపికలు- తమ్ము శ్రీకృష్ణునిలో పూర్తిగ లీన మొర్చుకొన్న గోపికలు సంసార సంబంధ సర్వకార్య కలాపములను పూర్తిగ విస్మరించిరి. ఆ బంధముల నుండి విముక్తులైరి.

—భాగ. 10 స్కంధ. 47 అ. 61-62 శ్లో.

ఈ బృందావన మధుర లీలలలోనే శ్రీ కృష్ణుని పవిత్ర పరిబోధముల నెన్నింటినో గాంతుము.

శ్రీకృష్ణ చైతన్యులు పరమ పావన కృష్ణభక్తులు. ఆయన రాసలీలల పవిత్ర ఘట్టములను స్మరించుచు ఉత్సాహావేశము లతో పరవశుడై - సమాధి గ్రస్తుడై పరమానందము నను భవించు చుండెడివాడట.

శ్రీరామకృష్ణ పరమహంస కాళీమాత నారాధించిన భక్తుడు. ఆ మాతను ప్రత్యక్ష మొనర్చుకొని, సదా ఆ దేవితో సంభాషించుచు - ఆతల్లి ఆశీర్వాద ప్రసాదము నందు కొన్న పరమ భాగవతుడు. ఈ మహాభక్తుడు రాసక్రీడా ఘట్టమును - గోపికా కృష్ణుల లీలలను విన్నంతనే సమాధిగ్ర స్తు డగుచుండెడి వాడట. ఇదీ! రాసక్రీడాంతర్గతమైన వైశిష్ట్యము.

గోపికావస్త్రాపహరణము

జీవాత్మ సర్వమును త్యజించి తన సహజ పవిత్యమును పూర్తిగ వికసింపజేసి- దివ్యముగ దీపింపగనే భగవత్సాక్షా త్కారము కరతలామలక మగును. గోపికావస్త్రాపహరణమిట్టి యొక పవిత్రసంఘటనము. తన బంధములను అన్నింటిని బాహ్యావస్త్రధారణముతో సహా విసర్జించి - సహజ నగ్న స్థితిలో నున్నతరుణమునసే - పరమాత్మలో లీనమగు యోగ్య తను జీవుడు పొందును.

శ్రీరామ కృష్ణపరమహంస ధ్యాననిష్ఠకు గడంగు సమ యమున - దేహముపైగల యజ్ఞోపవీతమును- వస్త్రములనూ త్యజించి నగ్నముగనే యుండెడివాడట. ఈ స్థితిని గాంచిన యాయన మేనల్లుడు 'హృదయుడు' తన మేనమామకు పిచ్చి యెక్కినదని తలంచెనట! 'నీవు దిగంబరుడవై ధ్యానించుటకు కడంగుటేల?' అని రామకృష్ణుని ప్రశ్నింప, 'నీ కేమి తెలిసును'

జీవుడు సర్వబంధములనుండి విముక్తుడై ధ్యాన మొనర్చి వలచును. తన జన్మాది నుండియు మానవుడు ద్వేషము- భయము- సిగ్గు-అహంకారము-డాంబికము- కులీనత- శీలము- అను నీ బంధములలో జిక్కుకొని బాధింపబడుచుండును. 'నేను బ్రాహ్మణుడను - అగ్రజన్ముడను - అందరిలో ఉత్తముడను' - అను దురహంకారమును యజ్ఞోపవీతము తెలిపి చును. ఇట్టి బంధము లేవియును లేకయేగదా! పసిపాప తొడేక దీక్షతో తల్లియొడిని జేరి ఆనందించు చుండును' అని హృదయము నకు సమాధానమిచ్చెను. ఇట్టి చిత్తశుద్ధితో కూడిన భక్తి సర్వాటంకములను ఛేదించి భగవంతుని ముఖాముఖిని గాంచ జేయును.

"ఈ బృందావన పవిత్రాద్భుత ఘట్టమును కామ సంభరిత పశుచేష్టగగాంచు అపవిత్రులు - సక్రమముగ గ్రాహ్య పఱిచుకొనజాలని అల్పబుద్ధులు మనమధ్య లేకపోలేదు అట్టి వారికి నేనీమాత్రము నుడువుదును. మొట్టమొదటగ నిమ్మ్నా లను మీరు నిర్మల చిత్తుల గావించుకొనుడు. గోపికల చరిత్రా త్మక ఘట్టములను వినిపించిన మహాత్ముడగు వ్యాసమహర్షికి జన్మించినవాడు పవిత్రులలో పవిత్రుడగు శుకయోగియని మీరు గుర్తెఱుంగుడు.

హృదయమున స్వార్థమున్నంత దనుక భగవద్భక్తి లబ్ధ మగుటయసంభవము. ఆహా! కామినీ కాంచనములయెడ- పేరు

ప్రతిష్ఠల పట్ల - చంచలమైన యీ ప్రపంచము నెడ గల మమతను - ఆకాంక్షను విస్మరింపుము. సర్వమును త్యజింప కుండ జీవుడు పావనుడుగాకుండ-ఈ పవిత్ర ఘట్టములను గ్రాహ్యాపరచుకొనుట యసంభవము. లైంగిక కామ భావులు, పేరు ప్రతిష్ఠలకు -ధనసంపదలకు సదా ప్రాకులాడి, ఉప్పొంగి పోవుపామరులు గోపికల దివ్యప్రేమను వెకిలిగ విమర్శింప బూనుట అతి సాహసము. అట్టివారి ప్రయత్నము విఫలముకాక తప్పదు. కృష్ణావతార పరమార్థ మిద్దియే,"

—వివేకానందస్వామి

ఉన్నతోన్నతముగా ప్రదీపించు నిష్కల్మష ప్రేమయే పరాభక్తి. దీనిని కాముకులు- వికారభావులు ఎన్నటికిని గ్రాహ్యాపజచుకొనజాలరు. ఇట రాధ దీనాలాపనుల నాలింపుడు. "నేను తప్పక మరణింతును. అయ్యో! నా ముద్దుల బాల కృష్ణునెవరి కప్పగింతును? నా ప్రియ సఖీమణులగు గోపికలారా! నామరణవేళ కృష్ణనామముతో నన్ను కప్పి వేయుడు. నామృత దేహముపై పవిత్ర కృష్ణనామమును లిఖింపుడు. ఓ లలితా! నేను విను ప్రతి శబ్దము కృష్ణుని దివ్యనామమే యగునుగాక!" దివ్య దేహధారుడగు బాలగోపాలుని యెడ రాధా గోపికలకు గల గాఢానురాగము - నిష్కలంక ప్రేమ యిట్టిది.

సర్ జార్జి గ్రియర్సన్ యిట్లనెను. "తన ప్రియుడగు శ్రీకృష్ణ భగవానునకు నిండుహృదయముతో ఆత్మార్పణమును గావించిన రాధచేష్ట పరమాత్మ యెడల - జీవాత్మగావించు పవి

త్కారాధనముగా చిత్రింపబడెను. ప్రాచ్యుని ఉష్ణరక్త స్పర్శా వేదనములు, సచ్చిదానందమూర్తియగు భగవంతుని భక్తి మంతముగ స్తుతించి- ఆరాధించు నుడువులునిరంతరధారా పిని ర్మల జలపాతమును స్ఫురింపజేయును. భగవంతుడిట్టి ప్రియభక్తులనుఆతురతతో నాహ్వానించి హృదయమునకు హత్తుకొనుచున్నట్లు ఆలింగన మొనర్చుకొనును. అపార సంసార సాగరమున వారి తెన్నులు గానక తట్టు ముట్టాడు ఉనికిగల జీవితమునుండి తరింప జేసి నిత్య శాంతిని ప్రసాదించును. తీక్ష్ణమైన తపనతో తుకతుక లాడు నిట్టి పలుకులను రచించినవారి మనస్సులలో నెట్టి యపవిత్ర భావములను ప్రవేశింపలేదని నేను నిర్ధారించున్నాను."

ఇది యొక విదేశీయుని - విశాలభావ సంపన్నుని సహజసుందర సత్యవాక్కులు. కృష్ణుడు గోపికల వస్త్రాపహరణ మొనర్చుట యన వారి యందున్న లౌకిక వాసనాపూరిత విషయవిషుల నన్నింటిని హరించి తన సాన్నిధ్యమునకు చేర్చుకొనుటయే. గోపికలు తమ సర్వస్వమును నిండుభక్తితో సమర్పించినదే కృష్ణుని సన్నిధికి జేరి నిత్యానందము ననుభవింపజాలరను భావము నిది సూచించును.

విష్ణు పురాణము భాగవతమునకు పూర్వమే రచింపబడె ననుట వాస్తవమే. భాగవతము వ్యాసమహర్షికృతము. ఇటు నిష్కలంక పవిత్ర భక్తి భావము పరాకాష్ఠ నందుకొన్నది.

శ్రీ మదాత్మానుజులు విష్ణు భక్తులు. పరమపావన భాగవతోత్తములు. వీరు భాగవతమును గాక విష్ణుపురాణ

మునే తన భక్తిభావ ప్రకటనమునకు ప్రమాణముగ దీసి కొన్నట్లు తోచును. రామానుజులు నారాయణునే భగవంతు నిగ తలంచెను. కానిభాగవతము కీర్తించి-ఆరాధించు కృష్ణభగ వానుని గూర్చి ముచ్చటింపలేదు. ఆళ్వారుల అడుగుజాడలలో నడచినను - కృష్ణ భగవానుని గూర్చి రచించినట్లు గన్పించదు. ఈయన విష్ణుపురాణము ప్రబోధించు పాంచరాత్రాగమమును ప్రమాణముగ దీసికొనెను. ఇక ! భాగవతమో! వైఖానసము వంకకే మొగ్గును. భాగవతము కృష్ణుని భగవంతుడుగ ప్రబో ధింప - విష్ణుపురాణము నారాయణునే భగవంతునిగ బేర్కొ నెను. ఇందువల్లనే రామానుజులు'ఓమ్ నమో నారాయణాయ' అను తిరుమంత్రము నెల్లరకును - ఎట్టి దాపరికములేక యెలు గెత్తి చాటెను. ఇదీ! ఈ మహనీయుని దివ్య జీవిత గాథా సారము. ఈ పరమ భాగవతుడు ఎల్లరకు పంచిపెట్టిన భగవ త్పవిత్ర ప్రసాదము.

శ్రీ కృష్ణుని గీతోపదేశము, ఇతర ప్రబోధములు ఆత్మానుభూతినందించు ఉత్తమ సాధనములు గావచ్చును. కాని, బాలగోపాలుని బాల్యచేష్టలు -రాసక్రీడలు - వస్త్రాప హరణ ఘట్టము లెన్నో రెట్లు మిన్నగ నుద్దీపితములు - నిత్యా నందదాయకములు అనుట అతిశయోక్తిగాదేమో!

శ్రీరుద్రామాయణ భారతేతిహాసములు- భాగవతాది పురాణములు నైతిక జీవిత నిర్వహణమునకు - అధ్యాత్మికాను

భూతి సాధనకు- ఇంతయేల! స్త్రీ పురుషులెల్లరు తమ జీవితము లను పవిత్రీకరించుకొని తరించుటకు నిత్యపారాయణ యోగ్యము లగు పవిత్ర గ్రంథములు.

నేటి మన విద్యావిధానము పాశ్చాత్యాను కరణము- లోపభూయిష్ఠము- అనర్థదాయకము. మన పాఠశాలలలో- కళాశాలలలో - విశ్వవిద్యాలయములలో నేటికిని మన బాల బాలికలకు నూరిపోయుచున్న - మింగుడుపడక- జీర్ణముగాక ఉక్కిరిబిక్కిరి గావించుచున్న -అసహ్యకరమగు విద్యావిధానము గర్హణీయము. మన ప్రాచీన మహర్షులుదిద్ది తీర్చినజీవితమ లకు ఇహపరసుఖముల నందించి తరింపజేయు విద్యాప్రబోధమును గావించుకొనుట శ్రేయోదాయకము.

ఈ భాగవత సుధను నేను ఏ కొందలు పండితుల కొఱకో రచింపలేదు. అవినీతిని-ఇంద్రియలోలతను-భోగలాలస జీవితములను- స్వైర విహారములను ప్రబలజేయుచున్న యిక్కాలమున - మన బాల బాలికలు - సామాన్య పాఠకులు భాగవతాది పవిత్రగ్రంథముల నభ్యసించియో, శ్రావ్యముగ గాన మొనర్చు వారినుండి వినియో- తమ జీవితములను చక్కదిద్దుకొందురుగాక! మధుర భావగర్భితమగు మహాభాగవతమును చిత్తశుద్ధితో పఠించి తమతమ జీవితములను ధన్యమొనర్చుకొందురుగాక!

ఇట్టి సత్సంకల్పముతో నేనీ గ్రంథరచనమునకు నుపక్రమించితినని పాఠకలోకమునకు విన్నవించుచున్నాను. తెలుగున

గద్యపద్య రూపముల భాగవతము లెన్నియోగలవు. అందునను పోతనామాత్యుని భాగవతము ఆంధ్రలోకమున గల పండిత పామరుల నందర నాకర్షించి ఆనందింప జేయు నుత్తమ పవిత్రగ్రంథము. అగుచో మరల నీ భాగవతసుధను రచించుటేల? యని యన వచ్చును. కాని భాగవతము పవిత్ర గ్రంథము. దీని నెందరో యెన్నియోరీతుల రచించిరి. మనుగడ సఫలముగావలయునని కాంక్షించు వారి కెల్లరకును భాగవతమొట్లు పఠన యోగ్యమో! సుకృతము కతన లబ్ధమైన రచనాచాతుర్యమును చరితార్థము గావించుకొనునెంచు వారికెల్లరకు నట్లే భాగవతము శిరోధార్యము.

కావుననే! భాగవత కథా రచన నాకు పరమ కర్తవ్యముగ దోచినది. భాగవత హృదయమును ప్రతిబింబించెడి కొన్ని పావన సన్నివేశములపట్ల సలువుగలోగల అపోహలను దొలగించుచు నా యూహలను వివరించుచు భాగవతసుధను రచించితిని. నామనస్సును బాగుగ లోగొన్న మధుర ఘట్టములను భావజగత్తున దర్శింపగల్గిన రీతి చిత్రించితిని. ఇది నా రచనా కలాపమునకు ధన్యతను ఘటించు సంఘటనమని యెంచితిని.

సముచితము, సరళము, భావోద్దీపకమునగు భాషనే యిందు పొందుపరచి సామాన్యపాఠకునకు గూడ భాగవతము నందలి సుధా మధురిమను రుచిజూపవలయునని నా సంకల్పము.

భాగవతకథ ఈ రూపమున సర్వాంధ్రమున బహు ముఖవ్యాప్తి గాంచుటకు నా రచన యుపకరించవలదనునని యాకాంక్ష.

అట్టి యాశాభావముతో నేనీ గ్రంథమును సహృదయ పాఠకలోక కరకమలములకు సమర్పించుకొను చున్నాను.

కృతజ్ఞతాంజలి

అస్మచ్ఛ్రేయోభిలాషులు : వైద్యరత్న-పండిత శ్రీమాన్ రత్నాకరం శ్రీనివాసాచార్యులు గారును, ప్రముఖ పండితులు - మిత్రరత్నమునగు శ్రీమాన్ బృందావనం రంగాచార్యులు గారును నేను వ్రాసి యుంచుకొన్న 'భాగవతసుధ' చిత్తు ప్రతిని శ్రద్ధగా చదివి - ఉత్సాహము చెంది - దానిని పుస్తక రూపమున వెలువఱచుటకు నన్ను బహుధా ప్రోత్సహించిరి. అది మిక్కిలి విస్తృతమైయున్నందున, కొన్ని ఘట్టములను సంగ్రహపఱచి చిన్న గ్రంథముగ నచ్చొత్తింపదలచితిని. కాని, నా భావమునకు భంగము గలుగకుండ సంగ్రహీకరణము కావించుట యొక ప్రయత్నమైనది. అంతట ఉదారస్వభావులు-ఆప్తమిత్రులునగు శ్రీమాన్ శ్రీనివాసాచార్యులంగారి స్వగృహమున (సత్తెనపల్లెలో) వారి యాతిథ్యమును స్వీకరించుచు మేము మువ్వుర మొకవారము సమావేశములు జరిపితిమి. శ్రీమాన్ రంగాచార్యులుగారు తమకు తీరికగలుగుటమర్ల భ

మయ్యును సొంత పనులను మానుకొని, నాయెడగల గౌరవాభి మానములతో - భాగవతము నెడగల భక్తిభావ ముతో - నా గ్రంథము నా మూలాగ్రము పరిశీలించి- సము చితములైన సూచనల నొసంగి - సమగ్రీతిని సంగ్రహీకరణ మును గావించుటకు నాకెంతయు తోడ్పడిరి. ఇట్లే ఆచార్యద్వ యము నా కంపించిన పూర్తి సహాకారమునకు హృదయ పూర్వక ధన్యవాదములు.

గ్రంథ ముద్రణ పారంభములోనే దురదృష్టవశముననాకు అస్వస్థత యేర్పడుటచేత మిత్రులు-పండితులుగు శ్రీ తుమ్మల వెంకటరత్నముగారీ గ్రంథముద్రణ భారమును వహించిరి. శ్రమ యనుకొనక, శ్రద్ధాపూర్వకముగ ప్రూఫులు దిద్దుచు - అట నట దొర్లిన పరిమాదములను సవరించుచు ముద్రణమును పూర్తిగావించిరి. అత్యంతాదరణముతో - ఓర్పుతో సంతో షముగ గావించిన యీ మిత్రుని అభిమానపూరిత పరిశ్రమ మునకు నా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు.

పరిశీలనా దృష్టితో గ్రంథము నాసాంతము ప్రశాంత ముగ, శ్రమకోర్చి, పఠించి, ఉన్నతస్థాయిలో సమీక్షించి, భూమికను వ్రాసియిచ్చిన సహృదయ విమర్శకా గ్రేసరులగు డాక్టర్ శ్రీ పరిసాదరాయకులపతిగారికి నా పేమపూర్వక నమోవాకములు.

కోరినంతనే ఈ గ్రంథమును సమీక్షించి గద్య పద్యాత్మకములుగా తమ అమూల్యాభిప్రాయములు నందించిన సహృదయులు, ప్రముఖ పండిత మహాశయులు—

1. పండిత శ్రీమాన్ వేదాన్తమ్ జగన్నాథాచార్యులు గారు.
2. ఆచార్య శ్రీ దివాకర్ల వేంకటావధానిగారు.
3. ఆచార్య శ్రీ తూమాటి దొణప్ప గారు.
4. ఆచార్య శ్రీ బిరుదురాజు రామరాజు గారు.
5. పండిత శ్రీ తుమ్మల వెంకటరత్నముగారు.
6. మధురకవి బృందావనం రంగాచార్యులు గారు.
7. వైద్యరత్న శ్రీమాన్ రత్నాకరం శ్రీనివాసాచార్యులు గారు.
8. శ్రీమాన్ వేదాంతం సంపత్కుమారాచార్యులు గారు.
9. పండిత శ్రీమాన్ దీవి దీక్షితులుగారు.

ఈ పెద్దలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలను తెలుపుచున్నాను.

ఈ గ్రంథము నింత చక్కగా సకాలములో ముద్రించి యిచ్చిన జూపిటర్ ప్రింటింగ్ ప్రెస్ యజమానులు శ్రీ ముదిగొండ చంద్రమౌళి శర్మగారికి కృతజ్ఞతలు,

శుభమ్ భూయాత్

—కల్లూరి చంద్రమౌళి

గమనిక:— ఇందలి 'ప్రహ్లాదోపాఖ్యానము' లో 'హిరణ్యకశ్యప' అనుచోట్ల 'హిరణ్యకశిపు' అని సవరించుకొనవలెను.

పుణ్యదంపతులు



స్వర్గీయ సుదర్శనార్యులు వెంకమాంబ

రచయిత తల్లిదండ్రులు

ఓమ్

శ్రీ ర్వి జ యతే

భా గవత సుధ

వంశీవిభూషిత కరాన్నవనీరదాభాత్
పీతాంబరాదరుణ బింబఫలాధరోష్ఠాత్
పూర్ణేందుసుందర ముఖాదరవిందనేత్రాత్
కృష్ణాత్పరం కిమపితత్త్వమహంనజానే.

వేణువుచే అలంకృతములైన హస్తములుగలవాడై నీల మేఘసమశ్యామలరోచిస్సులతో విరాజిల్లుచు, పచ్చని పసుపు రంగు పట్టువస్త్రమును ధరించి, పున్నమినాటి చందురుని అంద మును పొందుపఱచుకొనిన మోమున ప్రసన్నములైన పద్మ ములవంటి కన్నులజంట వెన్నెలజల్లులనువర్షించుచుండ - ముగ్ధ మోహనాకృతితో సకలలోకముల మురియించెడి శ్రీకృష్ణ దైవమునకన్న అన్యమైన మరియొక తత్త్వమునే నేనెఱుగను.

శ్రీకృష్ణపర భక్తిభావమగ్నమానసముతో పారవశ్యము ననుభవించు హృదయము ప్రతిధ్వనించిన పలుకులివి. శ్రీకృష్ణ పదపల్లవ కైంకర్యనిరతితో నిశ్చలానందమును జూరగొన జాలిన మనస్సు మాట్లాడిన వివరణయిది.

అసాధారణ మహామహిమోపేత సర్వాశ్చర్యకర చర్య లతో శ్రీకృష్ణపరమాద్భుత దివ్యతత్త్వ మట్లు ద్యోపకమున నిఖిల ప్రజాహృదయముల నాకర్షించి యలరించినది.

'కృష్ణ' శబ్దమే యాకర్షణార్థ సూచకము. మానవనాళి యంతరంగములందు గుప్తముగ దాగియున్న అఘుసంచయము నాకర్షించి హరించునా ! ప్రపత్తియుక్తచిత్తములన్నింటిని తన వంక కాకర్షించుకొనునా ! ఏదియైన జేయజాలును. కృష్ణపద మున కట్టిమహిమ యున్నది. కావునసే నాటినుండి - ఆధ్యాత్మి కచింతనాతత్పరులైన - కానున్న - అగుచున్న - నరనారులం దరి జిహ్వాగ్రసీమలపై కృష్ణపదము దివ్యలాస్య మొనర్చు చున్నది. ఇన్నెల్లకాలములం దెల్లర నెల్ల రీతుల సంతృప్తజీవుల జేయగలశక్తి సామర్థ్యము లీకృష్ణశబ్దము నందున్నవి.

కృష్ణశబ్దము సర్వసాధారణముగ - భగవద్వాచకము గనే వ్యవహరింపబడుచుండును. కృష్ణుడు వచించినది నిక్కమైన భగవానుని 'ఉవాచ'గనే లోకము శిరసావహించుచున్నది. కేవల మాభగవత్తత్త్వము నొక్కదానినే జగద్రక్షణ దక్షత

గల యేకైక మహోశక్తిగ నిరూపించుటకే శ్రీమద్భాగవతము వెలసినది.

శ్రీకృష్ణతత్త్వమునకంటె ననుసంధానమున నుంచుకొనదగిన దివ్యతత్త్వము మఱియొకటి లేదు. శ్రీకృష్ణనామమునకన్న చవ్వులూరించి సుధలు జాలువారించు నామమింకొకటి లేదు శ్రీకృష్ణలీలారహస్యముల నవగాహన మొనర్చుకొనుటకన్న ప్రపత్తిగల వారాచరింపదగిన-అన్వేషింపదగిన కార్యాంతరము లేదు. శ్రీకృష్ణగాథకన్న - మధురాతిమధురముగ - మనోహరముగ కవితావీథుల జిత్రించుటకు సర్వవిధానుకూల చరిత్ర లేదు. శ్రీకృష్ణునకన్న మిన్నయైన భగవంతుడు లేడు.

"కృష్ణస్తు భగవాన్ స్వయమ్" భగవంతుడే స్వయముగ కృష్ణుడు. "భగవతః ఇదం భాగవతమ్" ఆ భగవానునికి సంబంధించిన గ్రంథము గనుక భాగవతమున కాపేరు వచ్చినది. అనగేమి? కృష్ణచరిత్ర యందలి విశేషాంశములే భాగవతమని సువ్యక్తమగుటలేదా!

"భగవత్తత్త్వ నిరూపణపరః గ్రంథః భాగవతమ్"

భగవానుని దివ్యతత్త్వ నిరూపణ విశదీకరణలను సోదాహరణముగ గావించిన గ్రంథమగుటచే భాగవతమనుటయు జెల్లును.

రామాయణమున భగవాన్ పదము తపశ్శక్తియు నాధ్యాత్మికచింతనాతత్పరతయుగల మహర్షుల విషయమున

బ్రయోగింపబడినది. భాగవతము శ్రీకృష్ణునే భగవానునిగ నభివర్ణించుట విశేషము. విష్ణుపురాణమున వాసుదేవపదము భగవానునకు పర్యాయపదముగ నుపయోగింపబడియున్నది. భాగవతమున శ్రీకృష్ణపదము మహత్తరాధ్యాత్మికస్థితికి సూచకము. విశ్వామిత్రాది ఋషులవిషయమున - భగవన్ పదము కేవలము ఉపచారములతోడనే మర్యాదాసూచకముగ గౌరవార్థమున మాత్రమే ప్రయోగింపబడినది.

అక్షరమైన జ్ఞానతత్త్వము నొక్కదానినే భగవత్స్వరూపముగ భావింపవలయును. ప్రాజ్ఞులీతత్త్వమును మూడెఱుగులు విభజించి యుండిరి.

"వదన్తి తత్తత్త్వవిదస్తత్త్వం యద్ జ్ఞానమద్వయమ్"

నశించని యట్టిజ్ఞానమునే తత్త్వవేత్తలు తత్త్వమని వాకొనుచున్నారు.

1) వేదాన్తినః బ్రహ్మేతివదన్తి
వేదాన్తు లాతత్త్వమును బ్రహ్మమనిరి.

2) "యోగినః పరమాత్మేతి"
యోగులయిన వారాతత్త్వమునే పరమాత్మ యనుచున్నారు.

3) "భక్తాః భగవానితి"
భక్తులయిన వారెల్లరు సర్వజనాభినందన పాత్రమయిన యామహాతత్త్వమునే 'భగవాన్' అని వ్యవహరించిరి.

తత్త్వము మువ్విధములుగ బేర్కొనబడినప్పటికిని బహుళప్రచారము నందుకొన గల్గినది భగవాన్ పదము మాత్రమే.

"భజసేవాయాం" – అనెడి సూత్రము భక్తికి సేవయే పరమ లక్ష్యమని సూచించుచున్నది. సేవాభావము మానవుని వినమ్రుని గావించును. వినమ్రత యోగ్యతలన్నింట నగ్రగణ్యము. విషయసమగ్రత నార్జించుటకు వివేకమును వెల్లివిరియించుటకు విజ్ఞతయే రాచబాట. వివేకవంతమైన హృదయము సర్వేశ్వరుని చరణ సరోజముల వంకకువరుగెత్తును. పరమాసక్తియు ప్రసిద్ధానురక్తియుగల మానసభృంగరాజమునకు దైవపదపద్మ ధ్యానతత్పరతలో చిత్తశాంతి రూపక దివ్యానందరసాస్వాదనావకాశము సిద్ధించును. ప్రాణికోటి కాంక్షింపదగిన పరమార్థమదియే యగునుగదా !

తాదృశరససిద్ధికి వేదాంతులకన్న యోగులకన్న భక్తులే ప్రథమతఃహేతుభూతులగుచుందురేమో! అందువలననే వేదాంతుల కన్న యోగులకన్న భక్తులకు ప్రత్యేకత లభ్యపడియుండవచ్చును.

వేదాంతమునకన్న-ధ్యానయోగమునకన్న భక్తిభావన ప్రథమపరిగణనార్హతనందియుండును. కావునసే వేదాంతుల బ్రహ్మపదమునకన్న - యోగులపరమాత్మపదమునకన్న భక్తుల

భగవాన్ పదమునకు బ్రహ్మాండమైన ప్రచారము వ్యవహారమున లభ్యపడుట విచిత్రవిషయముకానేరదు.

భక్తులీ తెఱగున భగవానునారాధించి బ్రహ్మానందము ననుభవించుచుందురు. భక్తులపాలిటికి భగవానుడే - ఆనంద స్వరూపుడు.

"అమృతం పరమానందః-స ఏవరసః" పరమానందామృతమే రసము. "రసోవైసః" ఆ పరమానందామృతరస స్వరూపుడే భగవానుడు. "రసం హ్యేవాయం లబ్ధ్వానందీ భవతి" రసమును బడయగల్గినచో ఆనందము ననుభవింప వచ్చునని భావము. రసస్వరూపుడైన లోకానందకారకుని భక్తిభావముతో నుపాసించి తన్మహాగుణానుభావబలమున భక్తుడు దివ్యానందమగ్నుడుగా వచ్చునని యిందలి ధ్వని.

ఇట్టి భగవానుని తత్త్వమును సమగ్రముగ జిత్రించుటకే భాగవతము సమావిర్భవించినది.

ఐశ్వర్యస్యచవీర్యస్య ధర్మ స్యయశసశ్శ్రియః
జ్ఞానవైరాగ్య యోశ్చైవషణ్ణాం భగఇతీరణా !

సర్వవిధ సంపన్నత్వము-మూర్తిభవించిన ధర్మభావన-యశోవిలాసము-విశిష్టశోభాయుతరీతి-అనాసక్తధోరణి-మోక్ష ప్రదానాధికారము మొదలయినవి భగవానునిలక్షణములం.

బ్రహ్మపదార్థమనంతదివ్యశక్తి విలసితమైనట్టిది. వేదాంతుల దృష్టిలో బ్రహ్మపదమే భగవద్వాచకముగదా! సర్వి

కల్పము-నిష్క్రియమునయిన బ్రహ్మము సత్యమునకు ప్రతి బింబము. భగవానుడే సత్యమనియు, సత్యమే భగవానుడనియు, మనము వినుచుందుము.

సత్యము నిత్యమైనట్టిది. శుద్ధమైనట్టిది. అట్లే భగవానుడు నిత్యుడు. శుద్ధసత్త్వస్వరూపుడు.

భాగవత మీ నిత్యశుద్ధబుద్ధముక్త రూపుడైన భగవానుని భక్తజన నయనాగ్రములనిల్పి మనుగడలను చరితార్థ మొనర్చుటకే యుదయించినది.

అనంత కల్యాణగుణ సమలంకృత సకలజగ దాశ్చర్యకర చరిత్రగల భగవానుని భక్తుడు సమాధిగ్రస్తుడై ఉపాసించి-అర్చించి- బ్రహ్మానంద రసానుభూతి తత్పరుడై వెలుగొందును. పారవశ్యమున దేలజాలును.

కాని! ఆసమయమున భక్తుని చిత్తవృత్తియు విచిత్రతమమే యగుట లోకవిదితము. వర్ణించి - భాషణలద్వారా వ్యక్తీకరింపజాలని - యొకానొక యనిర్వచనీయ స్థితిలో భక్తుడపుడు నిమగ్నుడగును.

కాకున్న భగవానుని మహాశక్తి నెవరు గుర్తింపగలరు? వర్ణింపగలరు? వివరింపగలరు?

"యతోవాచో నివర్తన్తే అప్రాప్య మనసా సహ" మాటలు భగవానుని మహిమల నభివర్ణింప నశక్తములై మనస్సుతో బాటుగ వెనుకకు మరలినవట.

సర్వేశ్వరుని సర్వశక్తి మత్త్వమును నిరూపించినిడి అసామాన్య లీలలను వ్యాఖ్యానించుట మాటలా?

భక్తులలో సుదృఢమనఃప్రవృత్తియున్న యే కొలది మందియో మాత్రమే భగవాను నిత్తెఱుగున నారాధించి సత్ఫలముల నందజాలుదురు. కొలదిమంది యందుమాత్రమేకాక పలువురిలో నిట్టి యచంచల మనోబలమును - భక్తితత్పరతను సముత్పన్న మొనర్చి యుద్దిష్టార్థములను కల్పవృక్షము వగిది ఫలవంత మొనర్చుచే భాగవత మహాగ్రంథ మహోజ్జ్వల పర మాదర్శము. భాగవతమునకుగల యిట్టి యపూర్వ తాత్త్విక ప్రబోధ పాటవమే దానిని సర్వకాల ప్రజాహృదయపీఠములపై సుస్థిరముగ నిలుపగల్గినది.

భగవానునకు నామరూపములను గల్పించుకొని-నైష్ఠిక ప్రవృత్తిని పటిష్ఠ మొనరించుకొని వినోదించుట భక్తకోక సహజలక్షణము. "ఓమ్" అనెడి యేకాక్షరమే బ్రహ్మమును సుస్పష్టముగ స్ఫురింపజేయుగలదు. పలికినమాత్రముననే ప్రయోజనమును ప్రసాదింపగల ప్రభావము బ్రహ్మపదమునకు గలదు. కాని! ఈ యొక్క నామమునే యుచ్చరించి సంతృప్తి నందుటకు మానవాళి జిహ్వాలు సమ్మతించవు. ఆచార్య శంకరులవంటి మహాద్వైతియు విష్ణుసహస్రనామస్తోత్ర శ్లోకములకు ప్రశస్తభావ సూచకమైన - అనంతార్థ గంభీరతా సంపన్నతమైన విపులవ్యాఖ్యను వ్రాసి తరించినట్లు సంతసించినారు.

భగవానుని నామమహిమలను - స్మరణ ఫలమును - చరిత్ర పఠనమున సిద్ధించెడి బృహత్ప్రయోజనమును విస్తృతముగ విశదీకరించు నిమిత్తమే - భక్తిభావ సిద్ధాంత పతాకగ చేతనులకొరకు భాగవతము ప్రసాదింపబడినది. అగ్నియు నందణిగియున్న దహనశక్తియు నొక్కటి యైనరీతి - బ్రహ్మము, తచ్ఛక్తియు నొక్కటియే.

శ్రీరామకృష్ణ పరమహంస బ్రహ్మమునామోదించిన మహనీయుడు. తా నారాధించి యనుభూతికి దెచ్చుకొనజాలిన మహాతపస్వి. కాళికాదేవిని సాక్షాత్కరింపజేసికొని స్వయముగ సంభాషణ గావింపనేర్చిన సిద్ధపురుషుడు. సగుణ బ్రహ్మను సమారాధించుటవలననే, యెవరికేని యెట్టి యానందానుభూతి యేని కల్గును. మానవుడు మనోగత మానవుడుగ సంచరించు చున్నంతవరకు భగవంతు డనంతకళ్యాణగుణ సమన్వితుడుగనే దీపించుచుండును. నరుడు సమాధిగ్రస్తుడై భగవదనుభూతిని పొందినతత్క్షణమే బ్రహ్మము నిరాకారుడుగ నిర్గుణుడుగ నాతనికి దోచును. మానసికరంగమానవుడు భగవంతుని సాకారునిగనే యారాధించి యనుభూత్యావేశముల నందజాలును.

నిరాకారుడైన భగవంతుడు భక్తజన సంక్షేమము నాకాంక్షించుచు తన మాయచే శంఖచక్రగదాధారియై - సాకారుడుగ సాక్షాత్కరించును. శ్రీకృష్ణావతారమిట్టి సాకార సర్వేశ్వరార్చనలకు సాక్ష్యము.

నేనే భగవంతుడనని విస్పష్టముగ - ముక్తకంఠమున జెప్పుకొన్న శ్రీకృష్ణ పరమాత్మయొక్క సాకారమూర్తి నర్చించి - సేవించి యెల్లరు తరించిరి.

ఐశ్వర్యమును అష్టవిధములుగ పాఠ్యాంశములు వేర్కొని నారు. సమగ్రమైన యైశ్వర్యమే శ్రీకృష్ణదేవుని దివ్యగాథలలో మనకు స్పష్టముగ గోచరించుచుండును.

"పశ్య! మే యోగమైశ్వరం" అని వివరించుచు కృష్ణ పరమాత్మ సవ్యసాచికి దన యీశ్వరత్వము నెఱుకపఱచినాడు.

భక్తులెల్లరీవిధముగనే సాకార నిరాకార పూజలలో నెద్దానినేని నొకదాని నూతగగొని భగవంతుని నారాధించి పరియోజనమునందుటకు పరిబలాధారముగ నిల్చినట్టిది మహా భాగవతము.

భగవంతుని భక్తులు చేరుకొన్న ననుపైన దృక్పథమును తదనుగుణమైన సుశిక్షణను పరిసాదించుశక్తి మహాభాగవతము నకు గలదు.

ఇంద్రియములన్నియు భౌతికభోగలాలసతకు లొంగి పోవక సిద్ధిని లక్ష్యించి శ్రమింపవలసియున్నది.

ఒక్కమాటలో చెప్పవలెనన్న - భాగవతమునందలి పరితివిషయము పరితిగాథయు నరుని ఇంద్రియములకును - భౌతికాంశములకును-మనస్సునకును జిక్కనీయక అతీతునిగ వ్యవహరింపజేయును.

అధ్యాయాదౌ అధ్యాయమధ్యే అధ్యాయాంతేచ
ప్రాయః భగవత్ స్తుతిః యా భగవత్ప్రశంసా

ఇట్లుదోభధించుచువచ్చి నరులను విపదంబుధిపాల్గానీయుక కాపాడిన ఘనత భాగవతమునకే దక్కవలసియున్నది. పవిత్ర ధర్మనిర్వచనమొనర్చి - వివరణజేసి - పవిత్ర కర్మలను నరులచే నాచరింపజేయ ప్రోత్సహించునదియే భాగవతము. వాస్తవమైన పరమధర్మమదియే.

సవైపుంసాంపరో ధర్మోయతో భక్తిరధోక్షజే
అహైతుక్యా ప్రతిహతా-యయాత్మాసంప్రసీదతి.

భక్తి కారణరహితముగ ప్రకటింపబడవలయును. సకామ కర్మాచరణము స్వార్థభావమును రేకెత్తించి సమాజశ్రేయము నడ్డగించి నిష్ఫలదాయకమైపోవును. నిష్కామకర్మాచరణము గోపికలకువలె భక్తులకుగూడ సర్వార్పణదృష్టితో శ్రీకృష్ణ దివ్యానుగ్రహపాత్రతకు చక్కని మార్గమును జూపగల్గును.

సంఘమునందెట్టియ స్తవ్యస్త స్థితులు నేర్పడని తెఱగున 'ఏకాంతిక' భక్తిని, నిష్కామ కర్మాచరణ వైఖరిని, 'పరమధర్మ దృష్టిని మానవులకు ప్రసాదించు నిమిత్తమై శ్రీ మద్భాగవత గ్రంథరాజము రూపులు దిద్దుకొన్నది. భక్తి నిరంతరముగ నేకధారగ ప్రవహించుచుండ వలయును. కల్లి కపటములకు తలవంచక, యేకాగ్రతతో సాధనను జయప్రదము గావించు టకై సర్వవిధములయిన ప్రయత్నముల నాచరించి. ప్రయోజనమును గ్రహించుటకే భాగవతము ప్రజలకు సహకరించును.

బహిర్ముఖములయిన యిట్టి భావపరంపరలను భద్రముగ పెంపొందించుకొని చిత్తము నెట్టి వికారములకు గురిగాకీయక రక్షించు నిమిత్తమే శ్రీమద్భాగవతము నరులకు కరదీపిక కాగల్గుచున్నది. ఆత్మసంప్రదాన మొక్కటియే భక్తికి పరీక్ష. ఇట్టి పరీక్షలయందు నెగ్గి జీవితఫలముల నాస్వాదింపగల్గుచున్న మహనీయుల నెందరినో భాగవతము మన కెఱుకపఱచుచున్నది.

భక్తిని గురించియు దత్ప్రీతిని గురించియు సాంగోపాంగముగ వివరించుటే మహాభాగవత పరమలక్ష్యము.

"భక్తి రవ్యభిచారిణీ"

భక్తి భావన యెట్టి పరిస్థితులయందును చలనమునకు గురికాకూడదు. చలన భక్తితో నరుడు సాధింపగలుగునదేమియును లేదు. భగవదనుసిపట్ల పరిపూర్ణ విశ్వాసయుతమైనా భావనయు – తదితరాంశములపట్ల విస్తారమైన విరక్తభావనయు నున్నపుడే భక్తితత్వము జయమునందగల్గును. సంఘకళ్యాణమును సాధించును. విశ్వమంగళకర ప్రవృత్తిని లోకమున వెల్లివిరియించు పగవాశయముతో భక్తి సిద్ధాంతమెట్లు తన పాత్రనునిర్వహింపవలసియున్నదో భాగవతము రసాత్మకమైన సన్నివేశముల ద్వారమున వ్యక్తీకరించినది.

ఈ దృశ దివ్య తత్త్వదీప్తులను ముంగిట పొంగిపొరల జేయ్యసాయపడునదిభాగవతమే. భగవత్తత్త్వమును లోకమున బాగుగ వ్యాప్తమొనర్చుటకు – భగవంతుని నమ్ముకొని జీవ

యాత్ర కొనసాగించు భాగవతుల గాథలను 'విశదీకరించుటకు భక్తి భావమును జీవలోకమునకేకైక శరణ్యముగ నిరూపించుటకు మూలకారణమై దివ్యత్వము నుద్దీపింపజేసెడి శ్రీమద్భాగవతము మానవాళికి వరప్రసాదము.

"సర్వభూతేషుయః పశ్యేత్
భగవద్భావ మాత్మనః"

సర్వభూతములయందును – తనయందువలె భగవత్తత్త్వమును దిలకింపజాలిన సజ్జనుడు భాగవతోత్తముడు.

ఈశ్వరేతద ధీనేషు బాలిశేషుద్విషత్సుచ
ప్రేమమైత్రీకృపోపేక్ష యఃకరోతి స మధ్యమః

పరమాత్మునియందు ప్రేమను పరమాత్మాధీనమునందుండు వారియందు మైత్రిని–మూర్ఖులు వివేకహీనులునగు వారియందు కృపను విరోధులయందుపేక్షను జూపుచు వివక్షతతో వ్యవహరించువాడు మధ్యమ భాగవతుడు.

అర్చాయామేవ హరయే పూజాం యశ్రద్ధయేహతే
స తద్భక్తేషు చాన్యేషుస భక్తఃప్రాకృతఃస్మృతః

విగ్రహారాధనాదుల నాచరించుటతో సర్వము నిర్వహింపబడినట్లు భావించుచు చిత్తైకాగ్రతను గోల్పోయి, నిర్మలహృదయశూన్యుడై వ్యవహరించువాడు భాగవతాధముడు.

భాగవతుల శ్రేణియందలి నిమ్నోన్నత స్థితి యిట్లున్నది. భగవదనుగ్రహ ప్రాప్తికి నెల్లరవలంబింపవలసిన దివ్యపథమేదో

శిరసావహింపదగిన పరమపావన విధానమేదో! అడుగడుగున పరిబలు సాక్ష్యములతో ప్రత్యక్షీకరించుటకొరకే భాగవతము ప్రాదుర్భవించినది.

"భవేఽస్మిన్ క్లిశ్య మానానాం అవిద్యాకామ కర్మభిః
శ్రవణ స్మరణార్హాణి కరిష్యన్నితికేచన"

నిస్సారమైన యీ జీవితమున అవిద్యా ప్రభావముచే కామకర్మల మహిమచే నిష్ప్రయోజనకర క్రియాకలాపనుల నాచరించుచు తీవ్రవేదనల ననుభవించెడి జీవులను ముక్తుల నొనర్చుటకే పరమేశ్వరుడీ లోకమునం దవతారమూర్తియై వెలయుచున్నాడు.

మానవుడు సర్వసాధారణముగ భగవానుని విస్మరించు చుండును. నరుడు బిడ్డవంటివాడు. నారాయణుడు తండ్రి. తన సంతానము తనను విస్మరించినంతమాత్రమున లేక తీవ్రముగ దూషించినంతమాత్రమున జనకుడు ద్వేషించునా! అతని కర్మ కతనిని వదలివైచి మిన్నకుండునా! ఉండడు. అతడిన్ని విధముల తీర్చిదిద్ద ప్రయత్నించును. మానవునకు మాధవునకు మధ్యగల సంబంధమట్టిదియే!

"జంతూనాం నరజన్మ ముత్తమమ్"

సకల ప్రాణికోటిలో నరుడు శ్రేష్ఠతముడు. నిదాహారా దులు పశుపక్ష్యాదులకువలెనే నరునకు సర్వసాధారణములే. కాని! వానికి లభ్యముగానిది వీనికి మాత్రమే దక్కినది యెక్కే

యొక విశిష్టతయున్నది. ఆ ప్రత్యేకతయే సర్వజీవజాలమున నరుని నగ్రేసరుని గావింపగల్గుచున్నది. అదియే జ్ఞానము. జ్ఞానము మానవజాతికి భగవానుడు కరుణావరుడదృష్టతో ప్రసాదించిన మహావరము.

ఈ వరమును మానవుడు సద్వినియోగపరచుకొనవలసి యున్నది. మానవ దేహధారణ రూపక మహోత్తరావకాశ మును ప్రసాదించి సకల ప్రాకృతిక లోకసౌందర్య సందర్శ నానంద మకరందము నాస్వాదింప సమర్థమయిన నయనయుగ ళము నొసగి సర్వ పుణ్యతీర్థ క్షేత్రియాన దక్షములయిన చరణ ములనిచ్చి - అనంత ధర్మకార్యకరణోపయోగములయిన కర ముల ననుగ్రహించి ఎల్లవిధముల మనుగడను మాన్యమొన రించుకొనుట కనువగు యుక్తాయుక్త పరిశీలనాత్మక వివేకమును బ్రాప్తింపజేసి తా నెవరో! ఎట్లు తరింపవలయునో! ఏమొన ర్పవలయునో! ఎట్లెవరిని సేవింపవలయునో! ఏ పగిది మాట్లాడ వలయునో! ఎట్టి నియమబద్ధ ప్రవృత్తి నలవరచుకొనవలయునో! ఎట్లు జన్మను చరితార్థ మొనర్చుకొనవలయునో! ఎఱుకను దెచ్చుకొనుటకు సదా సాయపడెడి జ్ఞానమునందించిన జగత్పి తను విస్మరించెడి దురదృష్ట మేబిడ్డకును పట్టరాదు. కాని, లోక మున యుగధర్మానుసారముగ వర్తమానమున అదియే జరుగు చున్నది.

సకలలోక సృష్టయై - సర్వాశ్రయ సంరక్షణ భార వహుడై - సర్వదా కరుణామయుడై వేయికన్నులతో

తిలకించు దేవదేవుని విస్మృతిపథమున బడవైచినాడు మానవుడు. విరోధమువహించి, విద్వేషమునుపెంచి, వికసించి, విశృంఖలముగ విహరింపసాగినాడు.

భగవానుడీ వెట్టివానినిగాంచి పాప! మనుకొనియుండును వివేకహీనుడైన కొమరునిచర్యలకు విజ్ఞుడైనతండ్రి యేమనును?

లవలేశమేని సాయపడిన సామాన్యునకు పదిమారులు వంగివంగి ప్రణామములొనర్తురే! జీవలోకమున సర్వోన్నతునిగ తనను తీర్చిదిద్ది జ్ఞానతేజోవిరాజితుని గావించిన మాన్యుని విషయమునమనుష్యుడుమఱచిపోవు టెంతటి ఘోరాపచారము! భగవానునిపట్ల మానవుడెంత కృతఘ్నతాభావపరిపూర్ణుడై యుండవలయును! నతులతో - నుతులతో జీవితకాలమంతయు సర్వేశ్వరుని సంస్మరించి యర్చించినను మానవుడు తనబుణమును దీర్చుకొనగలడా?

కాని! అదియే జగత్తున గొదువయైనది. అయినను భగవానుడు తానొకమెట్టు క్రిందికి దిగివచ్చి తన వారిని సరిదిద్దుకొనుటకై యత్నింపబూనినాడు. మహర్షులకుసైతమందని మహోన్నతస్థాయి నుండి మధురదయార్ద్రభావరేఖలవెలుగు వెల్లువలమధ్య మానవలోకసముద్ధరణార్థము మనుష్యులమధ్య అవతరించుటయే అవతారపరమార్థము.

వాస్తవముగ నదియొక పరమాద్భుతచర్య. తగుపట్ల నవిధేయులై యున్న - తన యునికిమనుకులను గురించి వెట్టి

మొట్టి ప్రశ్నలను వేయుచున్న మానవాళిని మనుచుకొఅకై ఇట్టి యుద్యమమునుకోరి, తలకెత్తుకొనిన భగవానుని యపార వాత్సల్యము నేమనగలము ?

పలుమారు లిట్లవతరించి – ధరణిపై మునరిన చీకట్లనధఃకరించి – అఘుక్షాళన మాచరించి – ఔచిత్యమును పరిరక్షించి – అధర్మము నణచి – ఆధ్యాత్మిక తత్త్వమును బెనిచి – ఆశ్రితులనెల్లరమనిచి – అపూర్వ సందేశమును వినిచిన దేవాది దేవుని దివ్యగాథలకు ప్రతిరూపముగ భాగవతము సంసిద్ధ మొనర్పబడినది. భక్తజనుల యోగక్షేమములకు పరమేశ్వరుడు బాధ్యత వహించగల డనెడి పరమ సత్యమును పలుమారులు వీనుల విందుగ నుద్ఘోషించినది.

''శ్రుణ్వంతి గాయంతి స్తువంత్య భీక్ష్ణశః
స్మరంతి నందంతి తవేహితంజనాః
తఏవపశ్యన్త్యచిరేణతావకం
భవప్రివాహే పరమం పదాంబుజమ్''.

ఓ భగవానుడా ! నరులెల్లరు నీ గాథలను శ్రవణ మొనర్తురు. నీ యంశమును గాన మొనర్తురు. నీ చరిత్రను కీర్తింతురు. నిన్ను స్తుతింతురు. దివ్యానందము ననుభవింతురు. ప్రతిఫలముగ నీ దివ్యచరణ కమల దర్శన భాగ్యము వారికి దక్కును. దుర్భర సంసారసాగర ప్రవాహ వినాశమున కది హేతుభూతమగును.

యోగ్యతములైన వారిట్లువ్యవహరింపవలయునని శిక్షి
లాకాంక్షించుచున్నారు. మానవాళి యీ రీతి వ్యవహరింప
వలయునని వారి యభిమతము. లోకమంతయునట్లున్న గాపలసిన
దేమి? బంగారమెల్లెడల పండదా! భాగ్యదేవత సర్వత్రి
తాండవింపదా!

"విపదస్సంతు నశ్శశ్వత్ తత్రతత్రి జగద్గురో!
భవతో దర్శనం యత్ స్యాత్ అపునర్భవదర్శనమ్"

స్వామీ! విపత్తులను సర్వదా మావంకకే రానిమ్ము.
కష్టములు కల్గినపుడే నిన్ను మేము మరువక స్మరింపగల్గునుము.
మా సంస్మరణ ఫలముగ సర్వేశ్వరుడవై న నీ దర్శన ప్రాప్తియు,
దర్శనబలమున పునర్జన్మావరోధము మాకు సిద్ధించును.

సాధు పుంగవుల యభ్యర్థనము లిట్లున్నవి. కర్తవ్యమును
గుర్తించిన వారు భావింపవలసిన తీరదియే.

అవతారమూర్తియై అర్చామూర్తియై లోకమున
వెలయు పరమాత్మని ప్రాకృతులెల్లరు గుర్తింపజాలరని స్వయ
ముగ పరమాత్మయే తన్ను గుఱించి తా నిట్లు గ్రడించుకొ నెను.

"అహంసర్వేషు భూతేషు భూతాత్మావస్థితస్సదా
తమవజ్ఞాయ మాం మర్త్యః కురుతేఽర్చావిడంబనమ్."

సర్వభూతముల యందు నాత్మరూపమున వెలుగొందు
చున్నవాడను నేనే. మానవులీ పరమ రహస్యమును గుర్తింప

జాలక పూజావిధానాదులు జరుగుచోట మాత్రమే నేనుండు ననుకొని పరిహాసమునకు గురియగుచున్నారు.

"యోమాం సర్వేషు భూతేషు సంతమాత్మాన మీశ్వరమ్
హిత్వార్చాం భజతేమౌఢ్యాత్ భస్మన్యేవజుహోతిసః."

సర్వభూతాంతర్గర్భితుడనై యున్న నన్ను వదలివైచి అజ్ఞానముతో మానసిక స్థిరదీక్ష లేని పూజావిధానమును కొంద ఱాచరించుచున్నారు. వారి చర్యలు - వారు గావించెడి విగ్రహారాధనము - భస్మమున జేయబడిన హోమమువలె వ్యర్థ మైనట్టివే కాగలవు.

"ద్విషతః పరకాయేమాం మానినో భిన్నదర్శినః
భూతేషు బద్ధవైరస్యన మనశ్శాంతి మృచ్ఛతి"

శత్రువుల దేహమునందుగల నన్ను ద్వేషించెడివారు నిశ్చముగ పక్షపాతబుద్ధి గలవారే కాగలరు. జీవులయెడ పక్షపాతభావమును బ్రదర్శించు వారికి శాంతి యుండదు. సుఖము లభింపదు.

భగవానుని వాక్యముల యంతరార్థమేమి? భూతప్రేమ సర్వమానవులయందు ప్రవృద్ధము గావలయుననియేగదా! భగవానుని సర్వవ్యాపకత్వమునకీ పల్కులు మచ్చుతునకలు. భగవంతునిలో భక్తుడు విలీనుడై పోవునని యిము నిందువలన వ్యక్తమగును. భగవానుని యీ విశాల ప్రేమదృష్టినే భాగవతము వేనోళ్ళ గీర్తించుచుండును.

మానవులమనస్సులా వేశములకు నిలయములు. మానవులలో పెక్కుమంది హృదయముల నహంకారమే పరిపాలించుచుండును. యోగ్యులైనవారేకొందరో మాత్సర్యము ద్వేషాసూయలకతీతులుగ వ్యవహరించుచు ప్రేమతత్త్వమునకు ప్రతినిధులుగా ప్రకాశించుచుందురు. కాని! వారిని - వీరిని-ఎల్లరిని సమదృష్టితో చూచి యుద్ధరించి, తనసన్నిధికిజేర్చుకొనుటయే సర్వేశ్వరుని యత్నమని మనమరయగల్గుదుము.

భగవంతుని తీవ్రముగ విద్వేషించిన హిరణ్యాక్ష హిరణ్యకశ్యపులు-రావణకుంభకర్ణులు - శిశుపాలదంతవక్త్రులు మున్నగువారు తమ వ్యతిరేక కూరచర్యలద్వారా దైవసాన్నిధ్యమునకే చేరుకొనినట్లు వ్యక్తమగును. ఆకర్షణవికర్షణములు, ప్రేమద్వేషములు మనస్సునుండి సముద్భవించిన ద్వంద్వములే. ద్వంద్వాతీతులుగ మనజాలిన మహాత్ములు స్వల్పసంఖ్యాకులుగనుందురు. సంరంభమార్గాభినివిష్టులై భగవంతుని ద్వేషించువారు గూడ భగవత్సన్నిధికే జేరుదురు. వారిలో రూపమునుదాల్చి దాగియున్న యుగ్రత్వమే ఏకాగ్రతాబలమున పరివర్ధమానమై ఘనీభవించి పరమాత్ముని సన్నిధికి వారిని జేర్చుటలో సహకరించును. వీరందరు ద్వేషమార్గానుయాయులు.

ప్రేమమార్గాభినివిష్టచిత్తులయినవారు వైకుంఠవాసపదవినో భగవద్దర్శనాభిలాషనో కాంక్షించి, ప్రగాఢభక్తితో

సేవించి, భగవానుని యనుగ్రహమునకు పాత్రులగుచుందురు. కావున ద్వేషమార్గానుయాయులది నిష్కామవైరభక్తి కాగా-ప్రేమమార్గానుయాయులది సకామ సఖ్యభక్తియై విరాజిల్లుచున్నది. పగతో భగవంతుని సాధింపనుంకించినవారు తీవ్రావేశపరులగుటచే వారి యావేశము శీఘ్రముగనే యుజ్జ్వలస్థాయికిజేరి భగవానునిచే హతమార్చబడుచున్నారు. వారిని స్వామి వీలయినంత శీఘ్రముగనే తనలో విలీనమొనర్చుకొనుచున్నాడు. ప్రేమమార్గానుయాయు లింత సత్వరముగ భగవదనుగ్రహము నందజాలరు. ముందుగనో - వెనుకగనో, ఆవేశము తోడనో - అనురాగము తోడనో, ప్రేమమార్గముననో-ద్వేషమార్గముననో, మిత్రరూపముననో - శత్రురూపముననో, జీవులందరు దేవునిలో విలీనులు గానలసినదే.

వైరుద్ధ్య సంవిలసితములయ్యును కేంద్రమున గలిసికొనెడి యీ ద్వంద్వముల విచిత్రత్వమును విపులముగ విశదీకరించి విశాలప్రేమస్వరూపుడైన విశ్వమయుని మహామహిమల నభివ్యక్తీకరించెడి పరమపావన గ్రంథరాజము భాగవతము.

సర్వేశ్వర విజ్ఞానముగ సంభావింపబడెడి వేదములను విభాగమొనర్చిన మహర్షి చందుర్రు - జ్ఞాననిధి - అష్టాదశ పురాణనిర్మాత-పంచమవేద ప్రసిద్ధినంది, సకలధర్మసారముగా - నిఖిలశాస్త్రవాదనిలయముగా-అభినుతింపబడెడి "మహాభారత"

కర్త అయిన వేదవ్యాసమహర్షియే శ్రీమద్భాగవతమునకు గూడ రచయిత యగుట విశేషము.

వ్యాసముని యొనర్చిన మహత్తర కార్యములన్నిటి మకుటాయమానమైనట్టిది శ్రీమద్భాగవతసృష్టి. అజరామరమైన యశస్సు భాగవతకథాపయోరాశి మథనమునకే వ్యాసునకు దక్కినది.

వేదమంత్రములయర్థమునందుకొను స్థాయిలో ప్రజలు లేరనియు - సంకుచితస్వభావులు స్త్రీ శూద్రాదులయెడ దయనీయస్థితిని గల్పించి సమాజమున వారిని కించపఱచు చున్నారనియు - చిత్తపరివృత్తిలో స్వార్థపరత్వమునకు స్థానమిచ్చిన బ్రాహ్మణమ్మన్యుల యహంకారమును జక్కనిద్ది జ్ఞానమునందింపవలసియున్నదనియు గుర్తించియే వ్యాసభట్టారకులు మహాభారతరచనకు గడంగిరి. ధర్మోపదేశమే యీ మహనీయుని పరమాశయముగావచ్చును. సరళసాధుస్వభావ దూరులైన కూర్మగుల మందలించిమంచిమార్గమునకు దిప్పుటయే మహాభారత రచనయందాయనలక్ష్యమై యుండవచ్చును. సత్యన్యాయ సంరక్షణార్థమే యీ పూజ్యసంయమీందుడు గంటమునుకేల గీలించియుండవచ్చును. కాని! చిత్రమగ జరిగినదేమి? కర్మలకు సంబంధించిన పరిశంసయే యీడు ప్రాధాన్యమును వహించినది. ఈర్ష్యాద్వేషముల స్వేచ్ఛా సంచారమే ముఖ్యాంశమైనిలిచినది. దుష్టకాంక్షలవిజృంభణము

తద్వర్ణనయు ప్రముఖస్థానమునాక్రమించినపి. కన్నమి న్నెరుగని గర్వోన్మాదము - తీరని రాజ్యాధికారదాహము-పన్నాగముల ప్రాబల్యము - పశుప్రవృత్తి పరాంకోటినధిగమించినపద్ధతి - విషబీజములపెంపు - దారుణమారణకాండ - భయంకరాస్త్ర ప్రభంజన ప్రళయగర్జన - నిరంకుశుల పరిపాలనాదర్శోద్ధతి - ఇంకక బింకముతో పొంగులెత్తి క్రేళ్ళురికిన రక్తప్రవాహ వేగోద్వేగము - ధర్మవిధ్వంసనాత్మక ప్రళయ ప్రవృత్తికి సంబంధించిన పటాటోపము - నిరపరాధుల కరుణామయ హృన్మైన్య భగ్నభుగ్న బాధాయుతగాథాలీల - రోదనలకు, వేదనలకు, పరాభవములకు, వ్యధలకుపాత్రమై గుండెలుకరిగించి అయ్యో! అనిపించెడి అనేకానేక సన్నివేశములసృష్టి - కథా భాగమునందు కావలసినంతగ జోటుచేసికొని కట్టిపెత్తనమునే యొనర్చినవి.

విదుర నీతులుండవచ్చును. భీష్ముని సుందర సువర్ణ సూక్తి పరంపర శ్రవణముల బడవచ్చును. ధర్మజుని విశాలాశయ భవ నాగ్ర భాగమున మేలి పలుకుల మణిదీపముల వెలుగులు జిలుగులద్దవచ్చును. విశ్వరూపము నరయు మహాభాగ్యము ప్రసాదింపబడి - కురుక్షేత్ర రణరంగమున భగవానుని వాణి ప్రతిధ్వనింపవచ్చును. కర్తవ్యమును ప్రబోధించి కర్మప్రవృత్తునిగా మలచి - ఆత్మబల సంపన్ను నొనర్చి - ప్రచండభండన పండితునిగా నరుని నా వాణి మార్చియుండవచ్చును. పాండవ

చంద్రహాస పరిభయతాండవ పరంపరలమధ్య - ఉభయసైన్య పారావారము సన్నగిల్లిన యనంతరము - సర్వశూన్యమైన కురుక్షేత్రమున ధర్మదేవతకే పట్టాభిషేకము గట్టెడి మహా భాగ్యము దక్కియుండవచ్చును. కాని! నిక్కముగ నొక్క మాటలో చెప్పవలెననిన - సోదరులమధ్య సామ్రాజ్యలక్ష్మి కొరకై యేర్పడిన స్పర్ధ రాజి రాజి భగ్నమండిన మంట ఇది. చివర కేమియును మిగుల్చని చిచ్చు ఇది. భగ్గుమని ప్రజ్వలించిన భ్రాతలకల మాగ్నికణముల పోరివే భారతమైనది. ఇది భూతాను కంపను ప్రబోధింపలేదు. హృదయార్ద్రితాసమున్పన్న ప్రేమ రసస్రవంతి యిచట దర్శనమీయదు. విశాలభావపరిపూర్ణ మహోజ్జ్వల సందేశమునందుకొనుట కిటనెంతయో యన్వేషణ మొనర్పవలసియున్నది. ముఖ్యముగ తాత్విక చింతనకు పర మేశ్వర ప్రభావవైభవ ప్రత్యేక ప్రశస్తవివరణకు నిచట కోరు కొనదగినంత స్థానము లభ్యముకాలేదు.

మహాభారత రచనానన్తరము చిత్తశాంతిలేక మనస్సు క్షోభించుచుండ వ్యాకులుడై నదీతీరము లందేకాకిగ ప్రశాంతత కొరకై తిరుగాడ దొడగినాడట వ్యాసమహర్షి. పరితప్తమాన సమున ప్రసన్నరేఖ లుదయింపవలసియున్నది. సంక్షుభిత హృదయ జలధిలో భీకరతరంగ సంచలన సముద్ధతి యుగాంత వలసియున్నది. ప్రగాఢవేదనాంధకార సంలగ్న హృదయాంబ రమున ప్రవిమలమైన పండువెన్నెల గురియవలసియున్నది.

పరిభ్రమించుచున్నాడు వ్యాసుడు. పరుగులతో నురకలతో సతమతమగుచున్న వాయతిలోకచూడామణి భావనలు. దారియు తెన్నును గానక దారుణ వ్యధారూపక దవానల దహ్యమాన మానసుడైన వ్యాసమహర్షికి వెదుకబోయినతీవ కాలికిదగిలిన చందమున - మహారణ్య మధ్యభాగమున దప్పికతో తపించు పాంథునకు మధురజల పూర్ణకుంభము దృగ్గోచరమైన లీల - స్పృహాదప్పియున్న వానిపై మలయమారుతము ప్రసారమైన చందమున - గాఢాంధకార బంధుగ గహ్వార ప్రవేశమునకుద్యమించు వానికి కాంతిధారా పరిపూర్ణకరదీపిక లభ్యమైన మాడ్కి ఆలోచనలు స్తంభించిపోయి ఆవేదనజెందుచున్న మందునకు ప్రతిభావంతుడు - మంత్రాంగదక్షుడు -నిష్కల్మష హృదయుడునయిన ఆప్తబంధువు దాపునకువచ్చి దర్శనమిచ్చిన తెఱగున - నిరంతర శ్రీకాంతాచరణ సరోజ స్మరణ వరాయణుడు - పరోపకార ప్రవణుడు - దివ్యభావ సంపన్నుడు మహర్షి కులతిలకుడు - భగవదనుగ్రహ బలప్రాభవుడు - జ్ఞాన నీరదుడునగు దేవర్షి నారదుడు సాక్షాత్కరించినాడు.

శ్రీమద్భాగవత రచనా కార్యక్రమమునకు సుముహూర్తమును నిర్ణయింపబోవు శుభవేళయది. శ్రీమద్భాగవత రచనారూపక నాటకమునకు నాంది ప్రస్తావన జరుపబడనున్న శుభతరుణమది. వ్యాసుని కన్నులింతలంతలయినవి. మోమున ముసుకొన్న విషాదరేఖలమధ్య దరహాసము మొలకెత్తినది.

పరస్పర కుశలప్రశ్నములయినవి. సందర్భానుసారముగ విషయ
మామూలాగ్రమవగాహన మొనర్చుకొన్న నారదమహర్షి
ధీరగంభీర స్వరమున వ్యాసమునీంద్రు నిట్లనినాడు.

"మహర్షీ ! విజ్ఞానచంద్రికలు వెలయింపజాలిన ధర్మ
ప్రవక్త మొగమునసే విషాద తిమిరములలముకొనుట వింతలలో
వింత. నీవేమేమో వ్రాసితినని భావించుచుంటివేమో ! సర్వ
సాధారణాంశముల సమగ్రచిత్రణ మొనర్చినంత మాత్రమున
శాశ్వత శాంతి నీ కెట్లు లభింపగలదు. మధుర రససంభరితమై
హృదయార్ద్రత నెల్లరిలో సముజ్జ్వలింపజేయుగల ధోరణిలో
ఆపాద చూడముగ భగవత్తత్త్వమునే సర్వవిధ సమగ్రతా సంక
లితముగ నెలకొల్పు మహాగ్రంథము నొకదానిని నీవు దీక్షతో
జరిగింపవలసియున్నది. తన్మూలమున భగవానుని యనంత
కళ్యాణగుణ పరంపరల సంపూర్ణమహిమలకు లోకము నతమస్త
కము గావలయును. దైవానుగ్రహ సంపదనంది మానవతకు
మాన్యతను, ధన్యతను గడించు నిమిత్త మా గ్రంథము మహా
త్తర సాధనముగ నెల్లకాలముల వారి కార్యాధ్యయము
గావలయును. భక్తితత్త్వము నవవిధముల విస్తరిల్లి యెట్లు
సర్వేశ్వరునికి జీవుని సన్నిహితుని గావించుటకు దోడ్పడునో !
అందు వ్యక్తీకరింపబడవలయును. "మోక్షసాధన సామగ్ర్యం
భక్తిరేవగరీయసీ" యనెడి సూక్తి యక్షరాక్షరసత్యముగ వర్ధి
ల్లుట కా గ్రంథము పట్టుగొమ్మ గావలయును. సర్వత్రా

ముఖముగ నా భవ్యగ్రంథము పరమభాగవత తత్త్వదీపికయై వెలుగులీనవలయును. నీ నామమునకు శాశ్వతత్వమును – నీ కృషికి ధన్యత్వమును సంధింపగల అట్టి గ్రంథము నొక్కదానిని సృష్టింపుము. నీ చింతలంతరించును. వ్యాకులత వై దొలగును. శాంతిసిద్ధించును. సముచితానందము ప్రాప్తించును. జగన్నాథుడనుగ్రహించును. శుభమగును.

నారదుని పలుకులు వ్యాసుని శ్రవణములందమృతధారలవర్షించినవి. నవచైతన్య సముత్తేజితుడై యాతడు నిర్మలమానసమున శ్రీకాంతుని దలంచి మ్రొక్కినాడు. జీవబ్రహ్మైక్య సంధాన ఫలప్రదాన సమర్థమైన – పరమ భాగవత పవిత్ర చరిత్రలకాకరమైన – పరంధాముని దివ్యవాత్సల్య భావజలధియైన – మహాభాగవత గ్రంథనిర్మాణమునకు శ్రీకారము జుట్టినాడు. నారదమహర్షి కృప – వ్యాసభట్టారకుని పుణ్యము–భక్తజనభాగ్యము సమపాళ్ళలో మిళితమై భాగవతముగ రూపుదాల్చినవి. ఆ మహాభాగవతమునే వ్యాసమహర్షి తనతనయుడైన శుకమహర్షి కుపదేశింపగా నాతడు పరీక్షిత్తునకు వినిపించెను. అద్దానినే నిఖిల కథాకథన నిపుణుడైన సూతుడు శౌనకాదులకునై మిశారణ్యమున బోధించగా అది నేడు సకలలోక ప్రచారము నందుకొని నిఖిల పౌరాణికలోక జిహ్వాగ్రముల నర్తించుచు లోకమంగళమును సంఘటించుచున్నది.

నిగమకల్పతరోర్గళితం ఫలం
శుకముఖా దమృత ద్రవసంయుతం

పిబతభాగవతం రస మాలయం
ముహు రహో ! రసికాః భువిభావుకాః.
భాగవతము తెలిసి పలుకుట చిత్రంబు
శూలికైనఁ దమ్మిచూలికైన
విబుధవరులవలన విన్నంత కన్నంత
తెలియవచ్చినంత తేటపడిఁతు.

భాగవత దివ్యగ్రంథాను వాదమునకు బూనుకొ నఁ తతి సహజ పాండిత్యుడు, సరళ సాధుజీవనుడు, సజ్జనలోకాగ్రేసరుడు, శ్రీరామానుగ్రహ పరిపూర్ణ పాత్రుడునగు బమ్మెరపోతన కవీంద్రుడీరీతిగ బల్కినాడు. తాదృశ ప్రసిద్ధ పుణ్యపురుషుడే యట్లనుచుండ భాగవతమును గుఱించి యెవ్వరేని యేమన గలరు ?

వ్యాసభట్టారకుల నోట గీర్వాణభాషలో సంగ్రథితమై శ్రీకృష్ణ దివ్యనామామృత పరిషిక్తమై – సకల భక్తలోక సంతరణమున కేకైక మార్గముగ నెల్లరచే మన్ననలగాంచున్న యీ గ్రంథరాజము మహిమాన్విత పురాణముగ బహుళ వ్యాప్తికి వచ్చినది. పురాణము పంచలక్షణ సమన్వితమైనట్టిది.

సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వంత రాణిచ
వంశాను చరితం చేతిపురాణం పంచలక్షణమ్.

ఈ లక్షణ పంచకము సర్వసాధారణముగ పురాణము లన్నింట గన్పట్టుచుండును. కాని, భాగవతము మహా పురాణము. కావున దక్కిన పురాణములన్నింటికన్న మిన్నగ

ప్రసిద్ధమై విలక్షణమై విలసిల్లుచున్నట్లు పండితాగ్రణులు సంభావించి తదంశమును ప్రత్యేకముగ నధ్యయన మొనర్పగడగుచున్నారు. ఎందరో మహాపండితులు శాస్త్రదృష్టితో పరిశీలించి-విమర్శనా పూర్వకముగ సంభావించి - యానందించుచున్నారు. భిన్నశాఖలకు జెందిన పండితోత్తములుగూడ భాగవత గ్రంథమును గూర్చి యేకముఖాభిప్రాయమునే భక్తిశ్రద్ధలతో వెల్లడించియున్నారు. కొందరి దృష్టిలో నిది భక్తిభావ ప్రబోధాత్మక వైష్ణవ పురాణము. మరికొందరి యూహాలో సంకుచిత శాఖాభేదములకు దావీయని శివకేశవ తారతమ్యమును తిరస్కరించు నుత్తమపురాణ రాజము. భాగవత మహాపురాణము దశలక్షణ సమన్వితము.

"అత్రసర్గో విసర్గశ్చస్థానం పోషణమూతయః
మన్వంతరేశానుకథాః నిరోధోముక్తిరాశ్రయః
దశమస్య విశ్రుత్యర్థం నవానామిహ లక్షణం
దశమే దశమం ప్రోక్తమ్."

దశలక్షణము లిట్లున్నవి.

భగవంతుడు సర్వాభిజ్ఞుడని భాగవతము సూచించును. భగవంతుని వీక్షణబలమునసే ప్రపంచ ముద్భవిల్లినది. జీవునకు చేతనశక్తియున్నను, జీవాత్మకు స్వయంప్రకాశనస్థితి లేదు. పరమాత్మున కొక్కనికే యట్టిశక్తిగలదు. జీవుడు పరమాత్మని ప్రకాశమువలన నే ప్రకాశించుచున్నాడనుట తథ్యము.

పరంధామముడైన భగవానుడు సర్వాధికార శక్తిసంపన్నుడు. స్వారాట్ అనెడిపేరు పరమాత్మునకొక్కనికే చెల్లును. స్వారాట్ శబ్దము స్వతస్సిద్ధ ప్రకాశశక్తి ప్రతిభకు సూచకము. స్వారాట్ ప్రథమమున బ్రహ్మను సృష్టించి వేదముల నాతనకు ఉపదేశించెను.

"యో బ్రహ్మాణం విదధాతి పూర్వం
యో వైవేదాంశ్చ ప్రహిణోతి తస్మై."

ద్వాదశ స్కంధములతో విరాజిల్లెడు నీ మహాభాగవతము ముముక్షులోక కల్పవృక్ష సదృశము.

గాయత్రీ మంత్రార్థ విశేషములు భాగవతముననే వివరింపబడియున్నవి.

"యత్రాధికృత్య గాయత్రీం వర్ణ్యతే ధర్మవిస్తరః
వృత్రాసురవధోపేతః తద్భాగవతమిష్యతే".
"ధర్మఃప్రోజ్ఝిత కైతవోఽత్ర పరమో
నిర్మత్సరాణాంసతాం వేద్యం వాస్తవ
మత్రవస్తు శివదం తాపత్రయోన్మూలనమ్."

ధర్మము నెల్లెడి యేకముఖమున నెఱుకపఱచుటయే పురాణ ప్రయోజనము. తాపత్రయ నిర్మూలనము, సత్యశోధనీకరణము, ఈశ్వరస్మృతి నభివృద్ధిపఱచు వైఖరి పురాణములలో విస్తారమైన ప్రాధాన్యము నందితీరవలయును. భాగవతమిట్టి యంశములు మూడింటిని సమగ్రముగ నభివర్ణించినది. ధర్మమనునది ఈశ్వరారాధన రూపమున నుండునని భాగవత నిర్ణయము.

భాగవత శ్రవణమాత్రమునకే ఈశ్వరునకు మన హృదయము నిలయముగ మారితీరును. జీవునకు సర్వేశ్వరుని కృప లభ్యమగును.

"ఆర్తోజిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీచభరతర్షభ"

అని గీతలో చెప్పబడినట్లు నాలుగు విధములుగ భక్తులుందురు. కాని! భాగవతము భక్తిని నవవిధములుగ విపులీకరించి సముచిత విశదీకరణ మొనర్చినది.

1) శ్రవణభక్తి 2) కీర్తనభక్తి 3) స్మరణభక్తి 4) పాదసేవాభక్తి 5) అర్చనభక్తి 6) వందనభక్తి 7) దాస్యభక్తి 8) సఖ్యభక్తి 9) ఆత్మనివేదనభక్తి. నవవిధ భక్తి మార్గముల యందెద్దాని నాశ్రయించినను నరుడు తరించుట కవశ్యము గలదని భాగవత ముద్ఘోషించుచున్నది.

భక్తిభావమును గురించి భాగవత నిర్వచనమిట్లున్నది.

"సాత్వస్మిన్ పరమా ప్రేమరూపా" భగవంతునియెడ విశిష్టమైన ప్రేమను ప్రదర్శించుటయే భక్తియని పిలువబడు చున్నట్లు నారద సూత్రములు వివరించుచుండుట గమనార్హము.

"సాపరానురక్తిరీశ్వరే". భగవంతునియెడ జూపబడెడి ప్రకృష్టప్రేమ భావమునే భక్తియనవచ్చునని శాండిల్యుని సూత్ర్యముగలదు,

"అనిర్వచనీయం ప్రేమస్వరూపమ్" ప్రేమస్వరూపను మాటలతో చెప్పనలవిగానిది. మధురపదార్థములను మూగ వాడు భక్షించునే కాని ! ప్రశంసింపజాలడు. భక్తిభావను గూడ అనుభవార్హమే. తన్మహిమ వక్తవ్యము గాజాలను. భక్తియున నిట్టిది.

ఇట్టివెన్నో యంశముల నుల్లేఖింపవచ్చును. భక్తిభావ మున నుపాసించినచో భగవానుడు మన హృదయకమలమునను వికసింపజేయునని భాగవతము గుర్తుచేయుచున్నది. మొత్తమున కీ భక్తిభావమే భాగవత సామ్రాజ్యము నేకచ్ఛత్రాధిపత్యముగ నేలి యింద్రియగ్రామమును లొంగదీసికొని వ్యవహరించుటలో మానవులను సఫలీకృత మనోరథుల గావించు ననవచ్చును. భక్తిభావనద్వారా పరమేశ్వరానుగ్రహమును జూరగొన నెంచినవారు ముఖ్యముగ సంయమన దృష్టిని అచంచలభావ మును సముపార్జించుకొనవలసి యుండునని భాగవత నిర్ణయము.

సత్త్వరజస్తమోగుణములు మూడును బలీయమైనని. వీని యందు ప్రథమగుణమునకు ప్రథమతాంబూలమునందీయగల వారే శుద్ధమైన యూహాతో అనన్యచింతనతో శ్రీకృష్ణదేవుని భజించి తరించగలరు. ధర్మార్థకామమోక్షములు నాలుగను. వీనిలో ప్రథమచతుర్థములను ప్రాణతుల్యములనియెంచి ద్వితీయ తృతీయములకు తగినస్థాన మొసగి నిబ్బరముగ నిలువగలుగుట పరీక్షయే. నిలువజాలినవారు భక్తిభావనతో బ్రహ్మానందము

నందగల్గుదురు. కామక్రోధలోభమోహమదమాత్సర్యముల నెడి
యనభిలషణీయ గుణములారు. వీనిలో నేయొక్కటేని మానవుని
యధఃపతనమునకు ప్రబలకారణముకాగల్గు టాశ్చర్యకరాంశ
మేమియునుగాదు. కావున వీనినన్నింటిని చిత్తప్రవృత్తికి
సుదూరతీరములందుంచి మనస్సు నేకాగ్రతలో మగ్నమొనర్ప
వలయును. మనస్సువిషయము నిక్కడ దృఢముగజెప్పవలసి
యున్నది.

"మన ఏవ మనుష్యాణాం
కారణం బంధమోక్షయోః"

మానవునియొక్క సకలానందవిషాదములకు మనస్సే
ప్రధానకారణమై యున్నది.

ఎంతయో చిత్తస్వాస్థ్యము - మనోనిగ్రహముగల
మహనీయులుసైతము -

"మనమా ! వద్దికనాదుమాట
వినుమా ! మర్యాదగాపాడుమా"

అని మనస్సును బ్రతిమాలుకొనినారు. "నామనస్సు
కోతివంటిది. భక్తియనెడి త్రాళ్ళతోబంధించి - ఆదిభిక్షువైన
ఓ శివా ! దీనిని నీవెంట గొనిపోమ్ము"— సకలశాస్త్రవిశా
రదుడైన శంకరాచార్యులవారే మనస్సునుగూర్చి భయపడి
శంకరునిట్లభ్యర్థించిరి.

మరియిక సామాన్యమానవుల మాటకేమి ? కాఫ్కనే నిశ్చలభక్తిభావప్రాప్తికి మనోనిగ్రహమే ప్రబలసాధనమని పలుంరీతుల భాగవతము సోదాహరణముగ వివరించినది. ఇట్లు ప్రతిప్రధానవిషయమునను సముచితరీతిలో మానవుని నడిపించుటకు భాగవతముపసిడిబాటలుపఱచి పరమోపకారమొనర్చినది. భాగవతమున ధర్మము కపటమునకు తావీయుని తెఱుగున వర్ణింపబడియుండుట గమనార్హము.

''కేవల ఈశ్వరారాధనరూపో ధర్మః''

భాగవత మొనర్చిన ధర్మపద నిర్వచనమిది. నిర్మత్సరులయిన సాధువులు సమాదరించిన సత్యమే యిందు ప్రబోధిత మాయెను. సత్యభావన-ధర్మదృష్టి జాతికత్యంతావశ్యకములు. లోకక్షేమమిూద్వయముపైననే యూధారపడియుండెనను టకల్ల గానేరదు. సత్యధర్మముల పునరుద్దీపన దశనే ధ్యేయముగ నిడుకొని కైవల్య ప్రాప్తికి నరుని భావము లభిముఖములగు తెఱుగున భాగవత సృష్టిసాగినది. భాగవతము తాపత్రయహారకము. మంగళ ప్రసాద ప్రదానదక్షము. నిత్యజీవితమునం దెదురయ్యెడి సర్వసాధారణాంశములన్నియు నిందును గాన నగును. కాని, వీనియన్నింటివెనుక చేతనుల నవలీలగ నడింప గల భగవచ్ఛక్తి పనిజేయుచుండును. విషయము లన్నింటనంత ర్వాహినిగా భక్తిరస ప్రవాహ విజృంభణస్థితి ద్యోతనమగు చుండును. తుదకు భక్తిభావనయందే సర్వము విలీనమగుట

వ్యక్తమగుచుండును. భక్తితత్వమే గెలుపును నిలుపుకొనగలిగి, భక్తుడు బ్రహ్మానందరస సంభరితాంతఃకరణుడై 'ధన్యోఽస్మి' యనుకొనుట కవకాశమేర్పడును.

తదితర గ్రంథములకన్న మిన్నగ భాగవతమునకు గల ప్రాశస్త్యమిది. సహస్రకిరణ ప్రభాభాసమానుడైన చందుని దివ్యశీతలదీప్తులు లోకమునందంతట తేజమును వెల్లివిరియించి నట్లు శ్రీకృష్ణభగవానుని అపారకారుణ్య వారాశియందలి పవిత్ర వాత్సల్యాంబుకణములు దిగంతముల వెదజల్లబడుచు సర్వజనా హ్లాదమును సంఘటించుచునే యుండును. వేయేల! భగవంతుని సాకారుడైన శ్రీకృష్ణపరమాత్మగాగొల్చి భక్తులెట్లు తరించిరో యిందు సముచితముగ నభివర్ణితమైయున్నది.

భాగవతమంతయు భక్తిభావ ప్రబోధాత్మక భవ్య వేదాన్తమందిరమే అగుగాక! ఈ భావన సర్వాతిశాయిగా దశమస్కంధమున మనకు సాక్షాత్కరించి మనల ముగ్ధుల గావించును. భాగవతమున భక్తియే ప్రధాన రసము. మిగిలిన రసములన్నియు భక్తిరస ప్రవాహమున నంతర్లీనములై యుండునవియే.

భారతీయతత్త్వవేత్తలు భగవానుని సాకారుడనియు నిరాకారుడనియు ద్వివిధముగ బేర్కొనిరి. సత్త్వరజస్తమో గుణాత్మకమై ప్రతిఫలించెడి భగవత్తత్త్వమునే సాకారమని వేదాంతులను చున్నారు. సత్త్వగుణ మెక్కువపాలున్నచో

ఆద్వైతమును విష్ణువనియు - తమోగుణము పాలెక్కువయగుచో రుద్రుడనియు రజోగుణాతిశయమున్న బ్రహ్మయనియు పసనవారభివర్ణించుచున్నారు.

పైన బేర్కొనబడిన త్రివిధ శక్తులు లేక త్రిగుణములు పరస్పరము కలియుట- ఒకదానిపై మరొకటి తన శక్తిని ప్రకటింపజేయుట లేక దేనికదియే తీవ్రముగ విజృంభించుట జరుగుచునే యుండును. కాని, భాగవతమునందెట్టి శక్తులేవిధముగ విజృంభించి యెట్టి పరిస్థితుల నుప్పతిల్ల జేసినను కడకు భక్తిభావనకే మహత్తరవిజయము సిద్ధించుట మన మరయగల్గుదుము.

భాగవత హృదయమేయది. భాగవతము విశ్వమేదిగ్భ్రాంతి జెందునట్లు గళమెత్తి చాటిన సందేశమే యది.

భాగవతమునందలి ప్రధానాంశములను విజ్ఞులు ముత్తెఱగుల విభజించిరి.

1) ఉపాస్య = ఆరాధనకర్హమైనట్టిది
(ఆరాధనీయము = భగవంతుడు.)

2) ఉపాస్తి = ఆరాధనము - తద్విధాన విశేషము.

3) ఉపాసక = ఆరాధించువాడు.
(భగవదర్థార్థన మొనర్చు భక్తుడు)

వీనికన్నింటికి సారభూతమైనదే భక్తిరసము. భాగవతము నందీరసము పరవళ్ళ్రొక్కుచు పసువులెత్తినది. గంగ సజ్జన

దుర్జనుల నుభయులను తారతమ్యము జూపక తరింపజేసినపగిది భాగవతము పాపులను పుణ్యులనుగూడ తరింపజేయుటకు కొం డంత యండయైనది.

పరమపావన గంగాసదృశ భాగవత భావతరంగ భంగి మల సంస్పర్శతో భారతదేశము - యావద్విశ్వమే పునీతము కాగలిగినది.

"భిన్నప్రకృతిర్హి లోకః"

లోకమునగల వారి యూహాలన్నియు నొక్కతెఱగున నెప్పుడును బ్రిసరింపవు. దీనికి మనోవ్యాపారమే మూలకార ణము. మానవ మనస్తత్వ ధోరణి మిక్కిలి యాశ్చర్యజనకమై నట్టిది. ఆవేశగతములో, ఆనందభరితములో ! ఏవియైన నేమి ? వాని యన్నింటి పుట్టుకకు మనస్సే మూలస్థానము. మనోనిగ్ర హము నిక్కముగ మానవుడు సాధింపవలసిన ఘనవిజయము.

కాని, అనాదినుండియు మానవుడు సామాన్యమానవుడు మాత్రమే కాదు- శేముషీసంపన్నుడై మాన్యతంగన్న మాన వుడు సైతమీ విషయమున గెలుపును సాధించుకొనుటలో తగ్గిస ముగ్గిసలగుచునే యున్నాడు. తాదృశులకు దృఢచిత్తవై ఖరి భాగవత భావసౌధ ప్రవేశమున తప్పక లబ్ధముకాగలదు.

మనస్సునందుదయించెడి యాదేశమునుగాని. - .ఆనంద మునుగాని భగవానుని దెసకే మరల్పవలయును. భగవంతుని

సన్నిధిలో విషయములన్నియు పుటము పెట్టబడిన బంగారము వగిది పవిత్రీకృతములై విరాజిల్లగలవు.

"గోప్యః కామాత్ భయాత్ కంసః
ద్వేషాత్ చైద్యాదయో నృపాః
సంబంధాత్ వృష్ణయః స్నేహాత్
యూయంభక్త్యావయం విభో!"

గోపికలు కామభావముతో-కంసుడు భయభావముతో-శిశుపాలాదులు శత్రుభావముతో - వృష్ణివంశీయులు బంధు భావముతో - నారదాదులు భక్తిభావముతో శ్రీకృష్ణుని సేవించి ధన్యతం గనిరట.

భావ మెద్దియైననేమి ? ఎట్టిదైననేమి ? భావముల యుత్పత్తికి మనస్సు సాగించిన సక్రమాక్రమగమన వైఖరుల కనుగుణములుగా భావ వైషమ్యము లేర్పడినవి. వైరుధ్యము భావములయందే. తుదకు ఫలమెల్లరకును సమానముగనే నక్కు చున్నది. కావున దిద్దుకొనవలసినది మనస్సునేయని భాగవతము మనల ప్రబోధించుచున్నది.

మనస్సున కాలంబనము మంచిది దొరకిన భావములు సాధువులే కాగలవు. లతకు లభ్యపడెడి యాలంబనము ననుసరించియే కుసుమించెడి ప్రసూనముల సౌభాగ్యము పెంపొందుచుండును. వేఱునకు పట్టిన పురుగువలననే కాండము ధ్వంసమై పోయి వృక్షము కూలిపడుచున్నది. మూలమున వలసినంతనీరే

నిలువయుండి పెంపొందించెడి పాదుగలిగియున్న వృక్షము శాఖోపశాఖలతో దినదినాభ్యుదయమునందుట గమనించు చున్నాము. అట్లే మనస్సును సుశిక్షిత మొనర్చిన సర్వము శుభాంతము కాగలదని భాగవతము మానవులకొక మహోజ్జ్వల మైన ప్రబోధ మొనర్చుచున్నది.

"ఏనకేనాప్యు పాయేన మనః కృష్ణేనివేశయేత్"

ఏయుపాయముచే నయిననేమి ? మనస్సును శ్రీకృష్ణ పరమాత్మయందు నిల్పుము. ఆ స్వామి శ్రీ చరణయుగళము మనస్సునకు దివ్యాలంబనము. తత్పాదపద్మ దివ్యశక్తి ప్రభావ మున మనఃపవృత్తి పవిత్రతనంది పరమపదమును సాధింప గలదు. కావునదే యాలంబన విషయము నింతగ జెప్పుకొన వలసి వచ్చినది.

అత్మవినాశకర వ్యవహారలోలులైన మందభాగ్యులు తప్ప ఎల్లరును భగవానుని పవిత్రగాథలను వినిచ్చగించెడివారే! భగవంతుని పాదద్వంద్వ సేవాతత్పరతతో వ్యవహరించెడివారే!

భగవానుడు రెండు రూపములతో - ద్వివిధ దృక్పథ ములలో నుండునని విజ్ఞులనుచుందురు.

1) పురుషరూపము :- ముక్తిని జేకూర్చు శక్తి యీ రూపము నకే కలదు. మానవున కమృతత్వమునిది యందించును.

2) కాలరూపము :- సంసారబంధములనుండి మానవుని విము

క్తుని గావించునది కాలరూపము. మృత్యువునిది సంఘటించును.

శాపగ్రస్తుడై భయాందోళనలమధ్య గొట్టుమిట్టాడెడి పరీక్షిత్తుడు పృచ్ఛకుడుకాగా - పరమభక్తుడు మహాజ్ఞానియు నగు శుకమహర్షి వక్తయై భాగవతమంతయు వినిపించినాడు.

ప్రథమస్కంధమున శుకుడు పరీక్షత్తును మనస్సున కేకాగ్రత నార్జించుకొనుమని హెచ్చరించును. వారిమధ్య నాగిన సంభాషణలలో పరీక్షిత్తు వైచిన ప్రశ్నలన్నియు పరీక్షిత్తుకొర కేగాక భక్తలోకమున కంతటికి మేలును జేకూర్చునట్టివిధం.

అర్జునుడు శ్రీకృష్ణునడిగిన ప్రశ్నలన్నియు కేవల మర్జునునికొరకే యనరాదు. వానియందలి విషయములన్నియు నర లోకమున కంతటికి నుపయోగపడునట్టిపి. కావుననే భాగవతమువలెనే నాటి భగవద్గీతయు ప్రజలకు సన్నిహితమైనదై భక్తాళికి సర్వశేయముల గూర్చుచున్నది.

"వ్యవసాయాత్మికాబుద్ధిరేకేహ కురునందన!
బహుశాఖాహ్యనంతాశ్చబుద్ధయోఽ వ్యవసాయినామ్"

పరీక్షిత్తు సైతమీదృఢమైన యేగ్రతనే సాధన మొనర్చి శుకమహర్షి యనుగ్రహముచే భాగవతమును శ్రవణ మొనర్చి ధన్యతంగాంచినాడు.

గంగానది తన్ను దర్శించినవారిని, స్పృశించినవారిని, స్నానమాడినవారిని చరితార్థుల గావించునట్లు, భాగవతము

ప్రశ్నించినవారిని – సమాధానము చెప్పినవారిని– వినువారిని గూడ ధన్యాత్ములజేయగల్గుచున్నది.

కావున మనస్సున కిట్టి సుశిక్షణ మవసరమని భాగవత మెన్నియో తెఱగుల వివరించినది. నైష్ఠికమైన యిట్టి భక్తిని వాసుదేవచరణాంబుజములయందే యిడవలయునని భాగవత సిద్ధాన్తము.

వాసుదేవుడు సర్వవ్యాపకుడుగదా !

"వాసనాద్వాసుదేవస్య వాసితంతే జగత్త్రయం
సర్వభూత నివాసోఽసి వాసుదేవ ! నమోస్తుతే."

సర్వ విశ్వమునగల పరిత్యణువునందు నిండియున్న మహనీయుడే వాసుదేవుడు. వాసుదేవుని మనోనిగ్రహమున సేవించి వాసుదేవ కారుణ్యలహరిలో దేలియాడవచ్చును. బుద్ధికి నిశ్చలతను ఘటించి నైష్ఠికమైన రతిని గలుగజేయునది వాసుదేవకథా నిరతి యొక్కటే.

రాజు విశాలభావసంపన్నుడై యుండవలయును. ఋషి యమనియమాదులతోగూడిన యింద్రియ నిగ్రహపరతంత్రుడై యుండవలయును. రాజర్షి విశాలభావసంపదను – యమనియమాద్యుత్తమనిగ్రహశక్తినిగల్గి విరాజిల్లవలయును. పరీక్షిన్మహారాజు శుకయోగి మహోపదేశబలమున రాజర్షి కాగల్గినాడు. పూర్ణభగవద్విశ్వాసము బుద్ధియందేర్పడుటయే యిట్టి స్థితి సముదయించుటకు హేతువు.

బ్రహ్మవిశ్వాసమే సత్పదార్థము. బ్రహ్మవిశ్వాస శూన్యుడు బ్రతికియు జచ్చినవాడే.

'ఈశావాస్య మిదంసర్వం యత్కించ జగత్యాం జగత్'

సర్వవిశ్వమున - ప్రత్యణువున నిండియున్న దైవమే వాసుదేవుడు (ఈశ్వరుడు). వాసుదేవుని సేవించుటలవడుటన్న చేతనాచేతనాత్మకసృష్టినే ప్రేమించు టలవడుటని యర్థము.

సర్వభూతహితమునందనురక్తి యేర్పడిననాడు మానవత ఫలవంతమై మనోజ్ఞతలనువెల్లి విరియించును. నాడు సర్వమానవ సంఘ మధ్యమున ప్రేమ స్రవంతి యొడ్డులొరసి ప్రవహించును. మానవులందఱు మాధవులగుటకు మార్గములు గోచరించును. జీవులందరు శివులగుటకు రాచబాట యేర్పడును. భాగవతము తయు మానవప్రేమలో నుండవలసిన బుద్ధివిశాలతకు ప్రతిబింబము. వైరుధ్యములకు-వైషమ్యములకు దూరముగ, దైవచింత వికుదయకు సన్నిహితముగ నరులను నిలుపగల్గునదిభాగవతము. భవసఫలతకు వలసిన సర్వసాధనములిందు దర్పణమునందువలె ప్రతిఫలించుచుండును. కేవలము చూడగల్గెడి యొపికయుండిన జాలును. భాగవతదర్పణమున నరుడు తన్నుతానుగ దిద్దుకొన వచ్చును. తొలిసారిగ జూచువరకే కొంత సందిగ్ధత. పిమ్మట త్రిజగన్మోహన నీలకాంతి తనువుద్దీపించుచుండ ప్రాభాత సీరజ బంధుప్రభమైన బంగరుచేలముతో భాగవతదర్పణమున తన రూపమునకన్న ముందుగ శ్రీకృష్ణ ప్రభుని దివ్యలావణ్య

రూపము సాక్షాత్కరించును, కృష్ణరూప మదృశ్యమై తన రూపమునుండి కృష్ణరూపము సాక్షాత్కరించుచుండ సందిగ్ధ స్థితిలో బడిపోయి శ్రీకృష్ణ సందర్శనానందమునే గాంక్షించుచు తన విషయమునే సాంతముగ విస్మరించి, నరుడు బ్రహ్మానంద రస నిమగ్నుడు కాగల్గుచుండును.

జీవాత్మపరమాత్మలకు గల యభేదస్థితిని భాగవతము పస్ఫుటీకరించును. సర్వజీవులకు ధ్యేయమూర్తి పరమాత్మయే యనియు- సర్వ ప్రాణికోటియు విలీనతం గాంచునది భగవానునియందే యనియు భాగవతము మనకు సూచించుచున్నది. ఇంతకు గావలసినదేమన - ఒక్కమారు మనస్సు నావంకకు దిప్పగల్గుట. మనస్సు నావంకకు దిప్పుటకు సాయపడెడి యమ నియమములను సైతము భాగవతమే మనకు పలు తెఱగుల నిరూపించి నిర్వచించుచున్నది. దీనికి సకలభూత ప్రేమ నభ్యసింపవలయు ననెడి హితోక్తి యొక్కటే కొలికి పూసయై సాక్ష్యమిచ్చు చుండును.

మనము నివసించుభూమియే కర్మభూమి. సకలసత్కర్మల నాచరించుట కిచటనే మానవాళికి సదవకాశముగలదు. స్వర్గ మున తదితరలోకముల జీవులొనర్చిన కర్మల కనుగుణమైన ఫల మనుభవించుట కే యవకాశముండును. కాని కర్మాచరణమున కట వసతి లభింపదు. దేవతలయినను కర్మల ననుభవింపవలెనన్న భూలోకమున జన్మింపవలసినదే! కావున కర్మభూమిగా ఖ్యాతి

గాంచిన పుణ్యభూమిలో జన్మించినమనము ప్రతికర్మను నైవ ప్రీతికి పాత్రమగునట్లొనర్పవలయును. భగవానుడు మెచ్చని కర్మ దుష్కర్మయే.

కర్మయొనర్పక స్థాణువువలె నెవ్వడు నుండడు. కాని యోగ్యకర్మల నాచరించువారే కొదువయగుచున్నారు. స్వార్థ దృష్టిని దూరముగనెట్టి స్వచ్ఛందప్రవృత్తితో సర్వేశ్వరారాధనా పరతంత్రతతో వ్యవహరింపగల ధర్మకర్మయోగరతులతో లోకము నిండిపోవలయును. నాడు భువికి దివియే దిగివచ్చును. సర్వలోకములను స్వర్గసీమలుగా మార్చునిమిత్తమే - ప్రేమ భరితమైన భక్తిభావనను దైవపూజానిరతిని లోకమున నెల కొల్పునిమిత్తమే భాగవతము సాయపడుచు వచ్చినది.

అట్టి దివ్యతత్త్వమునకు హృదయముల నాలయములుగా మార్చెడి భాగవతము సర్వవేళల సర్వమానవాళికుపాస్యగ్రంథమైననాడు కాదగినది - కాంక్షింపవలసినది మరియొండేమిండుం దును?

గర్విష్ఠులయిన పెక్కుమంది రాజులీయిల నుద్భవించుటయు - దుష్టచరిత్రతో ధరిత్రినపవిత్ర మొనర్చుటయు జూచుచున్నాము. వినుచున్నాము. వారి పరిపాలనాకాలము పర్వగా నీకము పాలిటి కశనిపాతమే యనవలయును. లోకమునం గేర్పడెడి యిట్టి యుపప్లవముల దొలగించుకొని నరులు చిత్తశుద్ధితో ముందున కరుగుటకు దోడ్పడెడి మహోజ్జ్వల భావస్యందనమే

భాగవతము. పార్థసారథియై భారతరణరంగమున ధర్మదేవతకు విజయశ్రీల సమకూర్చి కపురంపుటారతులెత్తించిన శ్రీకృష్ణ పరమాత్మయే భాగవత స్యందనమున పవిత్రులైన యాత్రికులను సురక్షితముగ గమ్యమునకుజేర్చు కంకణమూనిన సారథి. శంకలకింకతావేడ? భయమునకింక నాస్కారమెక్కడ?

భారత కాలమున - చక్రవర్తులు యనుయాయులలో పలువురు రాక్షస ప్రవృత్తిగలవారై దౌష్ట్యమునకు బూని ఘోరము లాచరింప దొడంగిరి. భూదేవి హృదయము మిగా దారుణముల భరింపజాలక బ్రద్దలుగాసాగినది. రామాయణ కాలమున-తీవ్రమైన ద్వేషదృష్టితో దుర్మార్గములకు దొరకొనినవాడు రావణాసురు డొక్కడే. లోకమున నీరీతి నాసురిక ప్రవృత్తి ప్రవృద్ధమగుట క్షేమకరముగాదు, దౌర్జన్య ప్రవృత్తి-మారణ కాండ-దుర్మార్గాచరణము మొదలయినవి ప్రళయచిహ్నములు. ప్రళయంకర పరిస్థితుల రూపుమాపి ప్రశాంతస్థితిని లోకమున నుదయింపజేయవలసిన యవసరమును గుర్తించెనో! అనునట్లు భాగవత సరస్వతీ సాక్షాత్కారము భూలోకవాసుల యదృష్ట వశమున జరిగినది.

కులస్త్రీలకు ఘోరావమానములు ఘటిల్ల జేయుట - దురాశాసంతప్త హృదయమున దుశ్చర్యలకు గడంగుట-సంక్షోభములను క్షణమునకొక తీఱున సముదయింపజేయుట - సత్య న్యాయములకు సంఘమున నిలువనీడ లేకుండ నొనర్చుట - ధర్మ

దేవతను నలుఖురినడుమనుండి తరిమివేయుటజరిగిననాడు-ఏడుగు చున్ననాడు-కనులారతిలకించి-విలపించి-సహించలేక భూమాత బ్రహ్మను ప్రార్థించెనట. బ్రహ్మసానుభూతితో నాయమ్మ పిన్న వించినదెల్ల వినినాడు. తనసృష్టియందిట్టి యభాగ్యస్థితులానిర్భ వించెనేయని చింతించినాడు. కాని, ఆయన యొనర్పగల్గినదే మున్నది?

వరములను ప్రసాదింపగల దయామయుడాయన. చిద్వి లాసముల జిందిపోయు బ్రహ్మాండ సృష్టిసలుపగల చతురు డాయన. ప్రళయముల నాపజాలడు. బాధలను నివారింపలేడు. భూదేవతను వెంటనిడుకొని శీఘ్రముగ శివదేవుని సన్నిధికి జేరినాడు. పరిస్థితులను విస్తరముగ ప్రస్తావించినాడు. దయనీయ మైన దౌర్భాగ్యకర వాతావరణమునుండి ధరణిని సంరక్షణ సేయవలసిన యావశ్యకత నెలుగెత్తిచాటినాడు. భక్తపోషక రుడే కాని, శంకరుడేమొనర్పగలడు. లయకారకుడాయన. విప్లవముల నిరోధించి సౌభాగ్యము నందించుటాయనకు సంబం ధించని యంశము. కన్నులదెఱచి క్షణకాలమున సర్వమును భస్మమొనర్ప నెంచిన, ట్టి మహానీయుడట్లొనరించగలడు.

మువ్వురునుగలిసి పయనమునాగించిరి. శరవేగమున పరి వర్తమానమగుచు-పట్టుదలతో ధర్మదేవత కిక్కట్టులగల్పించుచు విశ్వవిలయమును సృష్టించుచున్న దుష్టశక్తుల సమూలనిర్మూ లనమున కింక క్షణమేని నాలసింపదగదు. సాత్వికభావవైభవ

ఁ జనులెల్లరు చల్లగ గుండెలపయి జేయినిడుకొని, ధర్మ వసౌధముల - న్యాయకల్పవృక్షచ్ఛాయల - సత్యప్రసూన పరిమళముల నాఘ్రాణించుచు పారవశ్యము నందవసినదే. పాశ వికశక్తులు పరాజయమునంది పలాయనము గావలసినదే! వారి మువ్వురిదీక్షయునదే. వారు క్షీరవారాశివంకకు నడచినారు. పరమాశ్రయుడు పరమపురుషుడు నగు శ్రీ మహావిష్ణువును దర్శించి యామువ్వురును ముక్తకంఠమున భూలోకమునందేర్పడిన మహోపద్రవమునుగూర్చి మనవి యొనర్చిరి.

ఆపత్కాలమున సకలప్రాణికోటుల యీతి బాధలను నివారింపగల సర్వశక్తిమంతు డాయన. విశ్వకళ్యాణమును ఘటింపగల నేర్పరితనమాయనకు గలదు. కరుణామయుడు సర్వ లోక సంరక్షణభార నిర్వహణధురంధరుడునగు శ్రీమన్నారాయ ణుని వారు పలుతెఱగుల ప్రార్థించిరి.

విశ్వకళ్యాణమెట్లు సిద్ధించును? వ్యక్తికళ్యాణమునీాదనే విశ్వకళ్యాణ మాధారపడియున్నది. భూలోకమునగల వ్యక్తుల నిత్యజీవిత విధానమునకే గొడ్డలిపెట్టువలె దుండగుల దుశ్చర్యలు మహోద్ధతితో ప్రారంభింపబడిన తరుణమున నిక విశ్వకళ్యాణ మున కవకాశమెక్కడ? సర్వలోక పోషణభారము వహించుట యనిన లోకమునగల సర్వశక్తుల పోషణభారమునుగూడ వహిం చినట్లే. కావునసే యీ బాధ్యతను శ్రీమన్నారాయణుడు తన పయిం బెట్టుకొనవలసి వచ్చినది.

క్షీరాబ్ధికడ - మానసి కానందమును పరిసాదింపబాలు వినిర్మల వాతావరణమున-బ్రహ్మ విష్ణువును మహోదాత్త స్తుతి రూపక మంత్రిజాలముతో పార్థించి యీ స్వామిని బ్రీసన్ను నొనర్చుకొనినాడు.

"యచ్చకించిత్ జగత్ సర్వం దృశ్యతే
శ్రూయతేఒపివా - అంతర్బహిశ్చ
తత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః"

ఈ ప్రపంచమున మనము గాంచెడి, వినెడి యే వస్తువు లండైన-నెటనైన-నేవిషయములండైన - వాని వాని బాహ్యాభ్యంతరము లండైనను నారాయణుడే వ్యాపించియుండెనని యీ మంత్రార్థము.

ఇట్టి పరిపూర్ణుడు - పురుషోత్తముడును గావునసే బ్రహ్మాదులా దేవదేవుని సన్నిధికి జేరిరి. వినతులు సల్పిరి.

రామాయణగాథలో దేవతలెల్లరు రావణుడు కలిగించిన యిక్కట్లను భరింపనేరక బ్రహ్మావద్దకు బరుగెత్తుకొనుచు వచ్చిరి. కాని! యేమియుఁ జెప్పజాలక మౌనమువహించి నిల్చిరట. ఏమి చెప్పవలయునో! ఎట్లు చెప్పవలయునో! తెలియక పోవుటయే యిందుకు ముఖ్యకారణము. కాని, అచటికే కొలది సేపటికి విష్ణువురాగా ఆయనను దర్శించిన వెంటనే "మమ్ము రక్షింపుము- మమ్ము రక్షింపుము" అని మౌనమువదలి పసనవి రొనర్చిరట. దీనియర్థమేమి? విష్ణుసందర్శనానన్తరమే వారిలో

నట్టి యుద్దీపన మేర్పడినది. భగవానుడును దుష్టశిక్షణ శిష్ట రక్షణ దక్షుడునైన శ్రీమహా విష్ణువే స్వయముగ వారి భావనల కట్టి పేరణనిచ్చియుండును. పార్థింపవలసినవారిని ప్రార్థింపగా లభ్యముగాదగిన పయోజనమే సిద్ధించినది. శ్రీ మహావిష్ణువు నోటినుండి "రక్షణభారమును వహింతు"ననెడి అభయ ప్రదా నము దేవతలకందినది.

ఇచట దశరథుని పుత్రికాంక్ష భూలోక వ్యవహారము లకు సంబంధించినంతవరకు వ్యక్తిగతమైనట్టిదే.

వంశోద్ధరణమే ఆయన ధ్యేయము. వంశానుగత కీర్తిని వర్ధిల్లజేయుటకొరకే దశరథునికాంక్ష పరిమితమైనట్లు దోచ వచ్చును. ప్రజలను పోషించి రక్షించు శక్తిసామర్థ్యములుగల చక్రవర్తి లక్షణలక్షితుడైన బిడ్డ నాయన కోరుచున్నాడు. సూక్ష్మపరిశీలన మొనర్చినచో దశరథుని పుత్రి జననరూపక మైన వ్యక్తిగత కాంక్ష యెంతటి విశాలాశయ సంపన్నమైనదో మన మెఱుగ గలము. పరిపూర్ణ సుశిక్షణయు, సంస్కారవంత మైన భావనయుగల వ్యక్తికాంక్ష విశ్వక్షేమాభిలాషవంక కెట్లు దారితీయునో ఎవ్వరెరుగుదురు? వ్యక్తివాంఛ విశ్వావాం ఛతో సమన్వయమును బడసి జీవిత నిర్వాహణము నందెట్టి సత్ప యోజనముల సంఘటించునో ఎట్లు నిర్ణయింపగలము? జీవిత ప్రయాణమున పెక్కు కష్టములకు మానవుడు గురియగుచుం డుట సహజమే. తన్నివారణార్థమాత డేమేమో యొనర్చును.

కాని, అవి యన్నియును లోకక్షేమమును ఘటింపగలవా? అసంభవము. స్వార్థముతో జగత్తునకు సంబంధించిన పరమార్థమును గూడ అనుసంధించుచు పలుకగల వారెవ్వరో యొక రిద్దరు దశరథునివంటి వారుందురు.

భూదేవి దుష్టుల దురాచారములవలన భరింపలేని బాధలనుభవించుచు బ్రహ్మకడకును-పరమశివుని చెంతకును పరుగెత్తినది. ఇది భూదేవికి సంబంధించిన వ్యక్తిగత కాంక్షవలెగన్పింప వచ్చును. కాని యిందు దురాచార నిర్మూలన మొనరింపబడుటకై దివ్యావతారావిర్భావము జరుగవలసియుండుటచే తన్మూల మున విశ్వమంతయును మంగళప్రదము కానుండుటచే - వ్యక్తి గతమైనదిగా గన్పించెడి భూదేవి కాంక్షతో - విశ్వకళ్యాణ కారకమైన ప్రపంచజన కాంక్షయు సంవిలీనమై భాసించినది.

బ్రహ్మాదులగలిసి శ్రీ మహావిష్ణుని చెంతకేగి భూదేవి యొనర్చిన యభ్యర్థన యట్టిదే. పాలకడలిచెంత శ్రీ మహా విష్ణుని సన్నిధిలో భూదేవిని శివుని వెంట నిడుకొనివెళ్ళిన బ్రహ్మ నతమస్తకుడై భూదేవికి గల్గిన మహాపదను దొలగింపవలసిన దిగా ప్రార్థించుచు సమాధ్యవస్థలో నొక దివ్యనాదమును వీను లార వినినాడు. ఆ వాణి శ్రీ మహావిష్ణునిదే. కాని, విభక్తి మేమన నాదము వినిపించినపుడు బ్రహ్మాదులకు విష్ణువుగనించ లేదు. బ్రహ్మ తన కర్ణములబడిన నాదమునువిని పులకితహృదయ

యుడై నాడు. బ్రహ్మకు వినబడిన ధ్వని తదితరుల కెవ్వరికిని శ్రవణ పుటముల సోకకుండు టత్యాశ్చర్యకర విషయము.

తదుపరి బ్రహ్మయే సమాధ్యవస్థను వీడి తత్రత్యులైన దేవతల నుద్దేశించి తాను వినిన విషయము నీరీతి వివరింపసాగి నాడు.

"దేవతలారా ! పురుషోత్తముడైన శ్రీమన్నారాయణుని వాక్కుల నాలించితిని. దాని నాచరణయందుంచుడు. సత్ఫలము మనకు సిద్ధింపగలదు. మీ మీ యంశలతో మీరెల్లరు భూలోకములో యదువంశమున జన్మింపుడు. సాక్షీభూతులై సర్వమును దిలకించుచుండుడు. భగవంతుడే తన 'కాలశక్తి' మహిమచే భూభారమును తప్పక నిర్మూలించితీరును. భూలోకమున తాను జన్మించి భూభారమును దొలగించి వైకుంఠమునకు వెడలునని స్వామివాక్కిచ్చి నాడు.

నకాలః శూలముద్యమ్య శిరః కృంతతి కస్యచిత్
కాలస్యబల మేతావాన్ విపరీతార్థ దర్శనమ్"

కాలమహిమ యసాధారణమైనట్టిది. కాలము శూలమునుగైకొని దుష్టుల దునుము ననుకొందు రేమో ! విపరీతములను, విడ్డూరము లను ప్రదర్శింపజేసి దుష్టులందొకరి నొకరు పొడుచుకొని చచ్చెడి ప్రళయమును కాలము సృష్టింపగలదు. కాలముయొక్క బలమిట్టిది.

ప్రజలు భగవంతుని విపరీతదృష్టితో దిలకించుచున్నారు. వారిలో వారొకరి నొకరు విపరీతదృష్టితో జూచుకొందురు.

విజృంభించిన యాగ్నిహోత్రవేశములతో నొకరిపై నొకరు దనుజుల సంహరించు కొందురు. కాలముయొక్కమహా త్తరశక్తి యిట్లొనర్చి యేని జేయించును.

భగవానుడు భూలోకమున తప్పక యుదయించును. సర్వ సామాన్య మానవులతో కలిసి మెలిసి సంచరించును. భూదేవి తాపమును నివారించి తీరును.

ప్రజలలో నేర్పడిన దుష్టభావముల యుష్ణోగ్రత భూదేవతను జ్వరపీడితను గావించెను. శ్రీమన్నారాయణుడేయిక యీ లోకతాపమును నివారింపగల దక్షతతో - ఉత్తమ భిషగ్వరేణ్యుడై యవతరింపవలసియున్నది.

దేవకీవసుదేవ దంపతులు పూర్వజన్మమున నసంఖ్యాక పుణ్యకార్యము లొనర్చిన ధన్యజీవనులు. వారి తపః ఫలముగ శ్రీ మహావిష్ణువు వారి కడుపున బంగారుపంటగ నుదయించుటకు సమ్మతించినాడు. ప్రకృతి ధర్మముల కతీతుడైన బాలుడై లోకవ్యవహారములన్నింటి నధిగమించుచు మహిమలజూపుచు దినదినాభివృద్ధినందెడి యీ బాలుడే శ్రీకృష్ణుడను పేర పిలువబడుచుండును. "భగవాన్" అనెడి పదమీ బాలునకే వ్యవహార నామ మగును. శ్రీకృష్ణుని ప్రేమానుభూతుల నందుటకొరకై దేవతా స్త్రీలందరు భూలోకమున గోపికలై జన్మింతురు. భగవంతుని యీ దేశానుసారమే - ఒక ప్రత్యేక విశిష్ట కార్య నిర్వహణార్థము శ్రీమన్నారాయణుని యంశయే మాయగ నవ

యించును. సర్వము శుభమగును. పోయిరండని బ్రహ్మాదేవతల నెల్లర వీడ్కొలిపి భూదేవి నోదార్చి పంపివైచెను. కాని యిచట మాయ యెవరో! విశిష్టకార్యనిర్వహణ మెద్దియో! శ్రీమన్నారాయణాంశలో మాయ సముత్పన్నమగుటకు హేతు వేమో! బ్రహ్మకావలయుననియే బహిరంగ మొనర్పక రహస్య ముగ నుంచినాడు. మన పవిత్ర గ్రంథము లన్నియు ముక్త కంఠమున నుద్ఘోషించుచున్న పరమసత్య మొకటియున్నది.

సకలలోకములు పరస్పర మొకదానిపై నొకటి యాధార పడి యుండుననునదియే యీ పరమ రహస్యము. పరస్పర సంబంధ బాంధవ్యములను లోకములన్నియును పొందియుండు ననుట ముమ్మాటికిని సత్యమనియే యిట్టి ఘట్టములు నిరూపించు చుండును.

సహయజ్ఞాః ప్రజాస్సృష్ట్వా
పురోవాచ ప్రజాపతిః
దేవాన్ భావయ తానేన
తేదేవా భావయంతువః ॥గీత॥

భగవంతుడు తనకును మానవులకును మధ్య నొక కొలికి పూసను గల్పించినాడు. 'యజ్ఞము' అనునది యీ కొలికిపూస.

"ప్రజలారా! మీరు దేవతలను సంభావింపుడు. వారు మీ క్షేమము నభిలషింతురు. పరస్పరాను భావముతో నొకరికి మరియొకరు శ్రేయమును ప్రేయమును జేకూర్చుకొందురు గాక."

ఇది భగవానుని పేమపూర్వ కాదేశము. ఈ యాదేశము నెల్లరు శిరోధార్యముగ నెంచి సంచరింప దొడగినారు.

మానవునకును భగవానునకును మధ్య కొలికిపూసగ నిల్చిన యజ్ఞము ద్వివిధము.

1) జ్ఞానయజ్ఞము 2) దివ్యయజ్ఞము. మానవులు జ్ఞాన యజ్ఞమున దేవతలను సంతృప్తుల గావించుదురు. దేవతలును తదనుగుణముగనే ప్రజల యోగక్షేమముల నాకాంక్షించుచు వ్యవహరించుచుందురు. భగవానుడు నిర్మించిన కొలికిపూసయైన యజ్ఞ మీ పగిది దివికిని భువికిని జుట్టరికము నేర్పఱచినది. ఈ బంధుత్వ మీనాటిది యనుటకు వీలులేదు. సృష్ట్యాదినుండియు గల యజ్ఞపద్ధతి దేవమానవ పరస్పరానురాగ భావప్రకటనకు ప్రతిబింబమగుచు పరివర్ధమానమగుచు వచ్చినది. దీనిని మాన వులు విస్మరించిననాడు - దేవతల నధిక్షేపించిన నాడు - భగ వానుడీ యంశమును మరల గుర్తునకు దేవలసి వచ్చినది.

దివ్యయజ్ఞ మనగా వ్యక్తి కాంక్షను సఫలమొనర్చు క్రియ. కాని, యిదియును స్వార్థపూరిత కర్మ కానేరదు. మానవులీ దివ్యయజ్ఞమును గూడ విశాలదృష్టితో త్యాగ భావముతో సమర్పణబుద్ధితో నిర్వహింపవలయును.

ప్రతి వ్యక్తియు భావించు భావము-సలుపుచర్యలు విశ్వక్షేమముతో ముడివెట్టుకొని పెనవైచుకొని సమన్వయము కావలయును. సమీకరణము నందవలయును. దానినే 'యజ్ఞ'

మందుము. తద్భిన్నములన్నియు యజ్ఞనామావశిష్ట వ్యర్థక్రియా కలాపము లే.

వ్యష్టి సూక్ష్మరూపమున సంభావించి ఆచరించు విష యమే విశాలతనంది విశ్వమున కుపయోగపడునదిగ విరాజిల్ల వలయును. వ్యష్టి సమష్టులందొకే విధముగ సమావిష్కరింపబడు చుండుట లోకకళ్యాణ కారకము కాగలదు.

భూదేవి బ్రహ్మ నభ్యర్థించుటయు - బ్రహ్మ శ్రీమన్నా రాయణుని వేడుటయు-విశ్వకళ్యాణ హేతుభూతమైన వాణిని వినుటయు - విష్ణువు భూలోకమునం దవతరించుట కంగీకరించె నను మాట విదితమగుటయు - దేవతలెల్లరు యాదవులుగా - గోపాంగనలుగా నుదయింప సమ్మతించుటయు మొదలయిన యంశము లింతవరకు జర్చింపబడిన యంశముల ననుసరించి యవ లంబింపబడుచున్నట్టివే యగునుగదా ! దేవ మానవలోక మైత్రిని పునరుద్దీప్త మొనర్చునట్టివే యగునుగదా ! వ్యష్టి క్షేమమున సమష్టి కళ్యాణమును గర్భిత మొనర్చి ప్రయోగదశయందుంచ బడినట్టివే యగును గదా !

ఇది యంతయు నొకానొక మహాద్భుతలీల- సర్వేశ్వరు నకు జీవకోటిపట్ల గల అపార ప్రేమను పలురీతుల ప్రదర్శించు సన్నివేశము.

వాత్సల్య జలధియైన వరదుడాయన. ద్వేష ప్రేమలను పరిగణింపక చేతనుల నెల్లర సముద్ధరింప సమయుముకొరకు వేచి

లయుండెడి జగన్నాథుడాయన. వేదములకే యీ మహోపనిషత్తాత్పర్యని యనంతశక్తిసంపద వర్ణింప నలవిగాకుండెనని సామాన్యులెంతటివారు? చిత్రవిచిత్ర వ్యవహారము లల్లిబిల్లిగ నల్లుకొనుచుండ - యుగధర్మానుగుణ వికృతావేశములకు లోకము రంగభూమి యగుచుండ-కాలస్వరూపుడై పరమాత్మ యీ యస్తవ్యస్తస్థితిని జక్కదిద్దుటకు - మహోపద్రవముల బారినుండి మహీతలమును సంరక్షించుటకు పూర్ణ బాధ్యతను స్వీకరించుచుండును. భారతకాలపరిస్థితులయందు సర్వేశ్వరుడు వ్యవహరించినతీరువేఱు. భాగవతకాలమునాటికి వ్యవహరింప వలసినతీరు మారినది. క్షణక్షణ పరిభ్రమణల కగ్నమగుచున్న భూలోకమున నిత్యశాంతి కఱవైనతఱి - సంక్షోభము హెచ్చిన సందర్భమున తద్రక్షణార్థము - తదుద్ధరణార్థము - భక్తిభావ ప్రాతినిధ్యమున లోకకళ్యాణమును ఘటింపవలసిన యవసర మేర్పడినది. భాగవతమా సందర్భమున సమాజమున నేర్పడిన చిక్కుముడులకు ప్రతీక. ప్రజలమధ్య తలయెత్తిన యహంకృతికి దర్పణము. నిశ్చలభక్తి సాధించిన మహావిజయమునకుచిహ్నము.

భాగవత విశేషములనిట్లు పలుతెఱగుల వివరించుకొనిన జాలునా! చాలదు. మిగిలిపోయిన యంశము లెన్నియో యుండును. మన యూహకందని యత్యుత్తమ విషయములెన్నియో యుండును. గుప్తముగనుండి యనుభూతికిరాని విషయము లింకెన్నియున్నవో!

కావుననే భాగవతముదెలిసి పలుకుట చిత్రమని పోతనా మాత్యులనుచున్నారు. మనయుద్దిష్టార్థసిద్ధికి భాగవతము నుపాస్యగ్రంథముగ భావించి యర్చించవలసియున్నది. తదర్థమై యత్నించి వీలయినంత సుందర స్వరూపమున భాగవతార్థము నాంధ్రమున సంతరింప పోతనామాత్యు లొనర్చిన బృహత్ప్రయత్నము జాతికి శ్రేయోదాయకమై సకలభక్తలోక సమాదరణ పాత్రముగ వర్ధిల్లుచున్నది.

భాగవతమును దశమస్కంధముతో పారంభించి పఠింపవలసి యుండునని పాజ్ఞు లనుచున్నారు. శ్రీకృష్ణజననముతో దశమస్కంధమారంభమగుటయే యిట్లనుటకు ముఖ్యకారణము. శ్రీకృష్ణదేవ జనన సన్నివేశ సౌభాగ్యమును - బాల్యలీలల విశేషమును గమనించుచు - శ్రీకృష్ణ దివ్యమోహన తేజోరేఖలయింపుసొంపుల నరయుచు - ముగ్ధుడగుచు పాఠకుడు, శ్రోతకమకమముగ భాగవత మహోభవన పవేశ మొనర్చి చిత్తశాంతిని - నిర్మలానందమును పొందగల్గుదురు. కావునదే దశమస్కంధమును పారాయణదశలోను పవచనదశలోను పథమస్థానము నందిపుకొనుట సంపదాయమైనది. ఈ సంపదాయమే నేటికిని శిరోధార్యముగ నెల్లవారిచే సమాదరింపబడుచున్నది. భూదేవత, యే మనశ్శాంతిని గోరి శ్రీమన్నారాయణుని చెంతకేగి యభ్యర్థించెనో! పజలెట్టి యవ్యయానందము నందుకొను నిమిత్తమై దేవదేవుని దివ్యసందర్శనాభిలాషను వ్యక్తమొనర్చిరో! దేవతలెల్లరే శ్రీమన్నారాయణుని దివ్యచరణ

పంకేరుహాముల నవతారదశయందు గూడ వీడక సేవించుటకై యిలపై జన్మించుటకు సంసిద్ధులయిరో ! భక్తజనహృదయకుముల వికసనమునకు హేతుభూతమైన శ్రీకృష్ణ బాలభాస్కర కిరణ నికరము లెట్లు వెల్లి విరిసినవో ! అనాథజన సంరక్షణదీక్షవహించి పరమాత్మడెట్లు ప్రబల సాక్ష్యములను ద్వాపరమున బ్రకటించెనో ! పరంధామని యనుగ్రహబలమున భక్తితత్వ మెట్లు విజయశోభాసము పేతముగ విస్తృత వ్యాప్తినందినదో! దుర్జనుల గుండెలు బ్రద్దలగుపగిది– సజ్జనులయార్తి సమూలముగ నిర్మూల మగు లీల భగవానుని కారుణ్యగంగ యెట్లు పొంగులువారినదో! అనంత తేజోవిశేష విరాజితమైన భగవచ్ఛక్తి వయోభేదముల పరిగణనతో పనిలేకయే విక్రమించి దురాగ్రహమున దుందుడుకు తనమున వ్యవహరించు దుష్టశక్తుల హతమార్చినదో ! నిరుపేదలను సైతము భక్తివిశ్వాసములను మాత్రమే పణముగ గొని పరమాత్మని కరుణ యేపగిది యపూర్వ ధనధాన్యగవ్యసృ ద్ధులతో తులదూగ జేసినదో ! వికలాంగులు సుందరమూర్తులు, భీరువులు – ధీరులు, స్త్రీలు – పురుషులు, బాలురు వృద్ధులు, చక్రవర్తులు – సర్వసంగ పరిత్యాగులు ననెడి తారతమ్యము నకు తావీయని తెఱగున దైవానుగ్రహమెట్లు నమ్మినవారినెల్ల సమ్మోదజలధి నోలలాడించినదో ! సర్వశరణ్యుడై – ఏకైకా రాధ్య దైవమై శ్రీయుత పతియెట్లు కృష్ణావతారమున భూభార మునణచి కాంతిని – శాంతిని లోకమున సంస్థాపించెనో ! ఎటుగ వలెనన్న దశమస్కంధమున మనస్సును బ్రవేశపెట్టవలసినదే.

అదియే శరత్కాల చంద్ర చంద్రికా రుచులబోలు జ్ఞానదీధితులతో పరమాత్మని దివ్యకారుణ్య భావసామ్రాజ్యము పగిది భాసించు భాగవత మహాగ్రంథము. చూడముచ్చటైన సన్నివేశములతో వినసొంపు నింపు కమ్మని గరుడ గమనుని కథలతో నొడలు పులకరింపజేయు దశమస్కంధ మదియే. ఉత్తమ శ్వేతాశ్వముల బూన్చిన రథముపై చిన్నారి చిట్టి దంపతులు వచ్చుచున్న బాటవంకకు పాఠకలోక భావనల మరలింపుడు- సర్వ మవగతమగును. సర్వేశ్వర ప్రభావ వైభవ సమభివర్ణనలతో మన యూహాలును బవిత్రీకృతములగుటకిది యదను కాగలదు.

మహీతలమునకే యిట్టి మహత్తరాపకాశమును బ్రసాదించిన భాగవత మహాసౌధమునందు రత్నకాంతులతో భగద్గగాయమానమగుచున్న దశమస్కంధమున "కృష్ణస్తు భగవాన్ స్వయ" మనినట్లు సాక్షాత్తుగ భగవానుడే కృష్ణుడుగ జన్మింపనున్న శుభసమయమున నారంభమగుచున్న కథ జనగణ మనోవ్యథను హరింపగలదై - దివ్యానందసుధను వర్షింపగలదు. మనమా వర్ష ధారలలో పునీతులమగుదుముగాక!

"యదా యదా హిధర్మస్యగ్లానిర్భవతి భారత!
అభ్యుత్థాన మధర్మస్య తదాఽత్మానం సృజామ్యహమ్"

ధర్మదేవతకు బాధ యేర్పడిన సమయమున- అధర్మము విక్రమించి విజృంభించు తరుణమున పరమాత్మ తనను తానే

లోకమునం దవతరింప జేసికొనునట. భూదేవత స్వయముగా తన వేదనను విధాతకడ విన్నవించుకొనెగదా! ఇక కరుణామయుడైన శ్రీమన్నారాయణుడే కాగల కార్యమును భుజస్కంధములపై నిడుకొని నడిపించవలసియున్నది.

అయిన నెట్లు నడిపించును? రంగభూమి యెక్కడ? సహచరు లెవ్వరు? నిమిత్తమాత్రములై కలిసివచ్చిన కారణము లెవ్వి? కథ సాగిన విధాన మెట్టిది? ప్రతిభాగమున పరమాత్మ్నని దివ్యాంశ యెట్లు ప్రతిఫలించుచు వచ్చినది? ధర్మోద్ధరణ మెట్లు ద్ధతితో కొనసాగింపబడినది? భగవానుని విచిత్రతమములైన లీల లెట్లభివర్ణితములైనవి? వర్ణనలలో వ్యక్తీకరింపబడుచు వచ్చిన మహిమల కన్నింటికిని ముగ్ధులై భక్తులెట్లభినందించిరి? సకలజన పఠనయోగ్యములు - సర్వకాల స్మరణీయములు నయిన యిట్టి యంశములను సమగ్ర సుందరముగ వివరించుటకే మహాభాగవత ముదయించినది. అందలి దశమస్కంధ మిగా యవతార సమావిష్కృతి నభివర్ణించు కథాభాగమునకు దావలమయ్యెడి మహాభాగ్యము నందుకొన్నది.

అంతయు పరమాత్మ్నని యనుగ్రహ విశేషము. దైవమే సందర్భమున నెచట నెట్టి యద్భుతముల వెలయించునో! యెవ్వ రెరుగుదురు? పరమాత్మ సంకల్పమునకు వికల్పము లేదు. భగ వానుని యభిమతానుసారము సర్వము సాగిపోవుచుండును.

దుష్టచర్యా కలుషితుడై యహంకార ప్రవృత్తితో పెద్దల మన్నింపక - క్రూరభావనలతో సంచరించెడి యధికార గర్వోన్మాది యున్నచోటనే సాధుజన బాధానివారకుడును సజ్జన క్షేమకారకుడును - మహర్షి గణమనో మందిరనివాసి యును - మధ్యాహ్న మార్తాండ ప్రభావిభాసియును నగు దేవ దేవు డవతరించుట సామాన్యదృష్టి కత్యాశ్చర్యకరాంశముగ దోపవచ్చును. కాని యందలి యంతరార్థము క్రమముగ గాని యెవ్వరికేని యవగతము గానేరదు.

'మధుర' నామమెంత మధురముగనున్నది. యాదవ ప్రభువులలోన శ్రేసరుడైన శూరసేనమహారాజు పాలించిన రాజ్యమది. ద్వాపరకాలమున నారాజ్య ముగ్రసేనుని పరిపాల నమునందున్నది. ఆరాజ్యమునందే యాదవంశమునకు చెందిన వసుదేవుడుగూడ నున్నాడు. కాని, యీ యిరు తెగలకు జెందిన వారిభావనలలో వలసినంత వైరుధ్యము కొట్టవచ్చినట్లు కన్పట్టు చుండును. దానిని కాలమహిమ యనవలయునేకాని మరియేమి యు ననజాలము. కాలమే పరిస్థితులకనుగుణముగ లోకవ్యవహా రముల జక్కదిద్దునిమిత్తమై వికృతవైఖరులసృష్టించి యొకరి నొకరు హతమార్చుకొనుట కవకాశమిచ్చునను మాటయున్నది గదా! కాలపురుషుని విలాసమది. అట్టిస్థితి ద్వాపరమున మధు రలో నెదురైనది. ఉగ్రసేనునకుఁ బూర్వమున్న వ్యవహారము లన్నియు దలకిందయినవి. ఉగ్రసేనుని కుమారుడగు కంసుఁడు

యీవరాజ్యపట్టాభిషిక్తుడై సిగయెగగట్టి మీసము మేలిపెట్టు నాటికి సామాజిక నిత్యజీవిత వ్యవహారము మిక్కిలి విషమించి పోయినది. ఇందుకు సంపూర్ణ బాధ్యత సర్వవిధ దౌర్భాగ్య లక్షణసమన్వితుడైన కంసునిదే. తన యిచ్చను వ్యతిరేకించినచో - తనకు అడ్డువచ్చినచో - తండ్రినయిన దండించునంత వరకు కంసుని దౌర్జన్యతత్వము పెరిగి కూర్చున్నది. పెరుగుట విరుగుటకొరకే యనెడి సామెతకలదుగదా! ఉగ్రసేనుని కుమార్తె దేవకి. వసుదేవుడామెను పెండ్లాడి మరలి వెళ్ళునప్పుడు బావమరదియైన కంసుడు రథసారథిగా వెంట బయలుదేరెను. పాపము బ్రద్దలయ్యెడి తరుణముదాపురించెనని కంసునికి పాపచ్చరిక యొసర్చుటవసరమాయెనేమో!

"కంసా! నీ త్రుళ్ళడగు సమయము సమీపించినది. నీ సోదరియైన దేవకికి అష్టమగర్భమున గలుగనున్న బిడ్డ నిన్ను హతమార్చును. తప్పదు." గగనవాణి గంభీరనాదము కర్ణములబడగనే కంసుడు దద్దరిల్లినాడు. క్రోధసంక్షుభితహృదయుడైనాడు. విచార మొకవంక వ్యధను గల్గించుచున్నను - ఘోరావేశమున - తన మనుగడకే ముప్పు ఘటింపనున్న ముప్పుల చెల్లెలిని మున్ముందుగనె హతమార్చిన యెడల నిక తనకు తిరుగా రమే యొదవెడి పరిస్థితి రాదుగదా! యను నిర్ణయమునకు వచ్చినాడు.

పసుపుపారాణి పాదాల తడియారని అనుగు సోదరిని - అనురూపుడైన భర్తతో అత్తగారింటికి జేర్చస్వయముగ సార

శ్యామునకీకొన్న యీమహత్తర ప్రేమయేమైనది? తన యీవం
దమున కడ్డుగానిల్చి వారెవ్వరైనను వారిని సహింపజాలకుం
డుట - పట్టుబట్టి మట్టువెట్టి నుంకించుట యిట్టి దుష్టులనైజము.
"తనచావు జగత్ప్రళయ" మని చెప్పినకవి వివేకహీనుడగునా!
మధురాసామ్రాజ్య సర్వస్వమున కేకైకాధినేతను గావలెనని
యుప్పొంగుచున్న కంసునకు - నామమాత్రముగ నడ్డువచ్చు
చున్న చెల్లెలిని సంహరించుట అల్పమైన యంశముగనే తోచి
యుండవచ్చును.

రక్త స్పర్శాభిమానము దృష్టికి రాలేదు. తల్లిదండ్రుల
గర్భశోకమునకు కారణభూతుడ నగుదునేమో! యనెడి తలంపు
గలుగలేదు. మంగళవాద్యములు ప్రేమోగినయింట వెనువెంట
భీకర శోకనాదములు ప్రతిధ్వనించునని తోచలేదు. జాలిలేని
గుండె వానిది.

తన సంతోషమె స్వర్గమని చెప్పిన కవి వాక్య మక్షరా
క్షర సత్యము. తనకు మాలిన ధర్మము మొదలు చెడినబేరమని
కంసుడు సంభావించి యుండును. వాని వైఖరి యట్టిది. అట్టి
కిరాతునివంటివారే భూదేవికి భారమును గలుగజేయుచుందురు.
అట్టి నీచులున్నచోటనే పరమాత్మ యావిర్భవించి సమూలక్షా
ళనోద్యమము నారంభింపవలసియున్నది. కంసుడు దేవకి కొప్పు
పట్టి యీమె గళమును ఖడ్గమున జెండివైచుటకు సన్నద్ధుడై
నాడు. అనుకొనని పెనుతుపాను కమ్మమూసి గాలిచుమంతలో

ముంచుకొనివచ్చినట్లు నూత్నదంపతులు నివ్వెరఁ బోయిరి. వసు
దేవుడు పురుషుడు కనుక చిత్తమునెట్లో చక్కబఱచుకొని
కంసునిట్లు ప్రార్థింప దొడగినాడు.

"చెలియల్ కన్నియముద్దరాలబలనీ సేమంబచింతించు ని
ర్మల, దీనిన్ బయలాడు మాటలకునై మర్యాదబోదట్టి - స
త్కులజాతుండవు, పుణ్యమూర్తి వకటా! కోపంబు పాపంబు నె
చ్చెలి నోహో! తెగ్రవేయ బాడియగునే చింతింపు భోజేశ్వరా!"

గుండెతడిలేని అన్నకు గలుగని జాలి అనురాగమయుడైన కట్టు
కొన్న వాని యెడదలో కలిగినదేమో! అన్నయేమి? చెల్లెలేమి? మగడేమి? సంస్కార చిత్తశూన్యులైన వారెవ్వరైనను నింతే! వారికి హృదయముండదు. మానవతయుండదు. నుంచి యుండదు. మమతయుండదు. తలవిరియబోసికొని తాండవించెడి స్వార్థ పిశాచమెట్లు నడపిన వారట్లు నడచుచుందురు.

కంసున కాసమయమున భావమాటలు చెవికెక్కునా? చెల్లెలి తల తెగ్రవేయ నుంకించిన మదాంధునకు చెల్లెలి నుగని మాటలు రుచించునా! తల్లి నే యష్టకష్టముల పాల్సేయు నధ ముడు పినతల్లికి పూలపూజ లొనర్చుననుకొనుట వెఱ్ఱితనము. కాని, అందర నరయుటకు దైవముండెను గదా!

వసుదేవున కాయాపద సమయమున నొక యుపాయ మనమున దళుక్కుమనినది.

''"లలనకు బుట్టిన కొమరుని
వలనం దెగెదనుచు గగనవాణివలికె నం
చలిగెదవేని మృగాక్షికి
గల కొడుకుల జంపనిత్తు్రగమున నీకున్."

ఈవాగ్దానము కంసునకు పూ ర్తి సంతృప్తి నిచ్చినదేమో! గండము గడచినది. దేవకీ వసుదేవులను వదలివై చి కంసుడు తన దారిని దా నేగినాడు.

"మానవేంద్ర! సత్యమతికి దుష్కరమెయ్య
దెబుక గలుగు వాని కిష్టమెయ్య
దీశభ క్తి రతున కీరాని దెయ్యది
యెబుకలేని వానికేదికీడు ?"

భాగవతసూ క్తి యేయిది. సత్యమతియగుటంజేసి వసుదేవుడు తొలిచూలు బిడ్డను కంసున కర్పించుటయు, వాడా బిడ్డను హతమార్చక నీ యష్టమపుత్రుని మాత్రమే సంహరింతును. కావున వీనిం గొనిపొమ్మనుటయు జరిగెను. కాలము గడచు చున్నది.

నారదుడొకమారు కంసుని సభకువచ్చి — నందుడు మొదలయినవారును వసుదేవాదులును యాదవులు గారనియు వారి యనుయాయులతో బాటుగ వారెల్లరును దేవత లేయనియు దేవకీ గర్భమున దేవదేవుడైన హరి తప్పక పూర్ణావతారుడై జన్మించుననియు – నీవు నిక్కమైన రక్కసుడవనియు – రాక్ష

సాధముల నెల్లర దేవకి పుత్రుడు నిర్దాక్షిణ్యముగ దునుమును ననియు జెప్పి సాగిపోయెను.

మహర్షులు లోకమంగళ తత్పరులు. దుష్టత్వ నిరోధకులు. వారిచర్యల్లో యుండును. దేవదూతగవచ్చి కంసుని గుండెలలో మానినట్లున్న గాయమును కెలికి యాందోళన గలిగించి వెళ్ళుటలో నారదు డొనర్చిన పనియట్టిదే!

ఇక సీతకు వల్కలాజినముల నొసగునపుడిల్లో గర్భంప బడినది. రావణుడు జానకీకేశగ్రహణ మొనర్ప సాహసించిన తఱి యిల్లో మందలింపబడినాడు. దుశ్శాసనుడు ద్రౌపదిని పరాభవింపబూని నప్పుడిల్లో హెచ్చరింపబడినాడు. వారెల్ల రేమయిరి? మృత్యువునకు కబళములయిరి. దేవకీ కేశగ్రహణ మొనర్చి – ఆమె బిడ్డలను బలిగొన సంకల్పించిన కంసునకు సైతము నారదు డట్టి సూచనయే యిచ్చినాడు.

కంసుని మనోవేదన యవధు లతిక్రమించినది. వరుసగా దేవకి యానాటికిగన్న యేడుగురు మగబిడ్డలను వధించివైచెను. దేవకీవసుదేవులు కారాగారమున గుములసాగిరి. దయాశూన్యుడైన కంసుడు మతిలేనివానిభంగి దేవకియొక్క యెనిమిదవ కాన్పుకొర కెదురుచూచుచుండెను. శ్రీమన్నారాయణుని యాజ్ఞగొని యోగమాయ యొనర్చిన విచిత్రచర్యవలన దేవకి తన యష్టమగర్భమున శ్రీహరిని ధరించి దివ్యతేజోవిలాసినియై వర్ధిల్లసాగినది. నెలలుగడచుకొలది దేవకివంక జూచుటకే

భయమగుచున్నది కంసునకు. దేవకి యెప్పుడు ప్రసవించునా! తనయభ్యుదయమునకు ధూమకేతువుగానున్న యీ యష్టమ గర్భము నెపుడు నిర్మూలింతునా! అనెడి యాలోచనలతో సత మతమగుచున్నాడుకంసుడు. చెల్లెలిపై ననురాగమెరుగని చెనటి యతడు. దుర్భావముతో బ్రతుకు నీడ్చుచున్న దుష్టుడతడు. హరి దేవకి యష్టమగర్భమున బిడ్డగజన్మించుననెడి స్మరణలో మునిగి పోయినాడు కంసుడు.

తిరుగుచు గుడుచుచు ద్రావుచు
నరుగుచు గూర్చుండి లేచు చనవరతంబున్
హరిదలచి తలచి జగమా
హరిమయమని చూచె గంసుడాఅని యలుకన్.

ద్వేషభావమున ఆత్మ పరమాత్మను జేరుటకు పడెడి యీరాటమన నిదియే కావచ్చును. శత్రుభావముననో! మిత్ర భావముననో! సర్వేశ్వరుని స్మరించి జన్మసఫలతం గనుటయన నిదియేకావచ్చును.

దేవకిగర్భమున నిత్యనూతన చైతన్యసంవిలసితమై శ్రీ మహావిష్ణుదేవాంశప్రవర్ధమానమగుచున్నది. కంసుని గుండె లలో అగ్నికొండలు పెరిల్లున పేరిలి బ్రద్దలగుచున్నవి. సకలదేవ శాలోకము దేవకీగర్భస్థుడైన పరమాత్మను దుష్టశిక్షణార్థము శిష్టరక్షణార్థ మవతరించుచున్న దేవదేవా! యని కీర్తించు చున్నది. కంసుని హృదయమునగల భావవాహినులన్నియు ద్వేషకలుషితములై సంక్షుభితములై శ్రీమన్నారాయణాం

శావతారపురుషుని ఘోర కెదురుచూచుచు దూషించుచున్నవి.
అహో! దైవవిలాసమెంత విచిత్రమైనది.

విశ్వమయుడైన విష్ణువు శుభలగ్నమున అనంతకోటి సూర్యప్రభలతో దేవకి గర్భమునుండి కఠిన కారాగారమందుదయించినాడు. నీచులుగలచోటనే శోచనీయమైన పరిస్థితులన్నచోటనే అరాచకమును గూపుమాపగల ఆదిదేవసమావిర్భవమైనది. దారుణారణ్య సీమలనుండియే భాగీరథి ప్రవహించి యూషరక్షేత్రములను సస్యశ్యామలముల గావించుట లోక ధర్మమే యగునుగదా!

దుష్టులు - గర్విష్టులు - కర్మభ్రష్టులుగలచోటనే దైవశక్తి విజృంభించి ధర్మమును సముద్ధరించవలయును. విషయమెట్లైననేమి? కన్నవారి యదృష్టము గణనీయమైనదనవలెను. దివ్యావతారునిగని. దేవకి యిట్లు భావించెనట.

"విలయకాలమందు విశ్వంబునీపెద్ద
కడుపులోనదాచు కడిమిమేటి
నటుడవీవు నేడు నాగర్భజుడవౌట
పరమపురుష ! వేడబంబుగాదె"

ఆ తల్లి యానందము నేమని వర్ణింపగలము ! జననీ జనకు లయిన దేవకీ వసుదేవుల పూర్వవృత్తాంతమును విని పించి తదీయ వాంఛానురూపమైన తన యవతారమును వివరించు చున్న పుత్రరూపుడైన పురుషోత్తముని గాంచి యా దంపతు

లెట్లానందించిరో! తన గాథలన్నియు వినిపించి, చెప్పవలసిన వానిని - చేయవలసినవానిని తల్లిదండ్రుల కెఱుకపఱచి-ఆ బిడ్డ సర్వ సామాన్యుడైన బుడుతనివలె కనులప్పళించుచు-కాలుసేతు లాడించుచు - నవ్వుచు దుర్భుచు నుండుట, ఎంత వింత? ఈ వింతలన్నిటిని గనులార దిలకించు మహాభాగ్యమునకు నోచు కొనిన తల్లిదండ్రులు ధన్యాత్ములు.

తనయుడు సూచించిన తెఱగున - మార్గమధ్యమునం దెట్టి యభ్యంతరములును గలుగకుండ - జల్లగ మెల్లగ పసి వానిని యమున దాటించి ప్రేపల్లెకు జేర్చి యశోద చెంతనుంచి ఆయమకడ గల యాడుబిడ్డను బుజముపై నిడుకొని మరలివచ్చి దేవకి యొడిం జేర్చి యేమియు నెఱుగనివాని పగిది వసుదేవుడు మిన్నకుండెను.

పిమ్మట దేవకికి పసిపాప కలిగినట్లు ధ్వని వెలువడినది. వెంటనే కంసుడు వచ్చుటయు - తీవ్ర క్రోధముతో దేవకీ వసు దేవుల బిలుచుటయు - వారేడ్చుచువచ్చి ఆడుబిడ్డ యగుటచే అపకారము జరుగదని అర్థించుచు, చంపవలదని వేడుటయు - వాడు మదోన్మాదుడై యా బిడ్డ నొడిసి లాగుకొని తెగ్రవేయు నిమిత్త మెగురవేయుటయు - నా పాప భయంకరాయుధ ధారిణియైన శక్తిగ మారి

"నా నరసన్ జనించి నిఁ జంపెడి వీరుఁ డొక్క
డెప పత్కృతి నొందెడివాడు దుర్మతీ!"

అని యంతర్ధానమగుటయు నత్యంతాశ్చర్యములై నయంశములు. వాస్తవముగ నివి యన్నియు దుష్టికాలమున వరుస వరుసగ నాలోచించుట కేని యవకాశము లభ్యపడని తెఱంగున జరిగి పోవుటచే కంసుడు బిత్తఱియోయినాడు. నిరుత్తరుడైనాడు. చెల్లెలిని బావగారిని జూచి తానాచరించిన క్రూర కృత్యములకు పలు తెఱగుల విచారమును బ్రకటించినాడు. మరి యీ పశ్చాత్తాపము హృదయగతమైనదో! అధరగతమైనదో! యెవ్వరెఱుగుదురు.

వానిప్రార్థనకు - పశ్చాత్తాపమునకు దేవకీవసుదేవులు మాత్రము కఱగిపోయినారు. వారి యభిమానము నందుకొనిన వాడై - కడుపులో నేమున్నదో! ఏమోకాని - ప్రసన్నుని వలె నటించుచునే కంసుడింటికరిగినాడు. మంత్రులందఱిబిలిచి మంత్రాంగముబన్నినాడు. యోగమాయ చెప్పిన వాడెక్కడ పెరుగుచుండెనో! గాలించి గుర్తించుట వారికిక ప్రథమకార్యమాయెను. అన్వేషణ మారంభమైనది. దేవకీ వసుదేవులన్నియు దెలిసినవారగుటచే ముదమున కాలమును గడుపుచున్నారు. శ్రీమన్నారాయణాంశతో దేవకిబిడ్డగా జన్మించిన దేవదేవుడు ప్రేపల్లెలో యశోదయొడిందజేరి నందరాజునకాసంద మును గలిగించు నందనుడై శ్రీకృష్ణ నామముతో రోహిణి బిడ్డగా తనకంటె పెద్దగాపెరుగుచున్న బలరామునితోగూడి దినదినాభ్యుదయమునందుచున్నాడు. సర్వవిధముల కంసునిగోడగిన వారే యతని యనుచరులు. వారనిరట—

"చంపుదుమే! నిలింపులను జంకెల అంకెలదావపావళిం
బంపుదుమే! కృతాంతకుని పాలికి ప్రేపులతోడగోవులం
ద్రుంపుదుమే! ధరామరుల దోలుదుమే! నిగమంబులన్ విదా
రింపుదుమే! వసుంధర హరింపుదుమే ! జననాథ! పంపుమా!"

గోవులు బ్రాహ్మణులు - దయాసత్య శౌచములు - శాస్త్రములు - యజ్ఞములుగలచోట శ్రీమహావిష్ణు వుండునని వారు వినియుందురు. మూర్ఖునకు వెట్టెత్తిన నేమగును? కంసుని యనుచరులపని యట్లయినది.

సత్పురుషులపై - ఆలమందలపై - విప్రవరేణ్యులపై దుర్జనులుసిగొల్పబడినట్లు దండయాత్రలు సాగించిరి. దర్పమును జూపిరి. దారుణము లాచరించిరి.

దైవాంశసంభవుడైన శ్రీకృష్ణుడు లోకమోహన రూపుడై నందునియింట ప్రవర్ధమానుడగుచున్నాడు. నందు డొకమారు కంసునకుఁ జెల్లింపవలసిన కప్పముల నర్పించుట కొరకై మధురకువచ్చి తనపని ముగించుకొని, దేవకీ వసుదే వుల జూడవచ్చి, వసుదేవునిచే ప్రశ్నింపబడినవాడై శ్రీకృష్ణ శ్లేమోదంతము నెరిగించి, మరలి వేపల్లెకుంజనియెను. కాలము లీలగ సాగిపోవుచున్నది. కంసుని యాందోళన శరవేగమున శత్రు దిదృక్షతో పరుగులు దీయుచున్నది. కంసభటుల యూగ డములతో పల్లెలు నగరములు గొల్లుమనుచున్నవి. ఎల్లరిగుండె లేసమయమున నెట్టి దుండగముల కెవరు తలపడుదురో! యని తల్లడపడుచున్నవి.

కామరూపిణియైన పూతన కంసుని పనుపునవచ్చి నంద మందిరమున బ్రవేశించినది. నారదుడు చెప్పినరీతి పరిసరములు గల పల్లెలలో పట్టణములలో గల పసితనమునన్న వుగబిడ్డ లపై కంసుడు తన విసపు జూపుల నిలిపి యేమియు దెలియనట్లు ఘోరకృత్యము లాచరింపజేయ దొరకొనినాడు. వాని పన్నుగడలో భాగముగనే పూతన ప్రేపల్లెకు వచ్చి నందునింటి నడుగు వెట్టినది. యశోదాదులు వలదని వారించుచున్నను వినక మాతృప్రేమ పొంగి పొరలుచున్న మగువవలె నటించుచు పవ్వళించి యుయ్యాలయందూగుచున్న పాపని చేతుల గదియుంచి మాటల మెత్తదనము - మనమున వాడియు వేడిసుగల పూతన-

"నా చనుబాలొక గ్రుక్కెం
డో చిన్నికుమార! త్రాపుమెయ్యనిదపఁ
నీ చెలువ మెఱుగవచ్చును
నా చెలువము సఫలమగును నళినదళాక్ష!"

అనుచు పాలీయ సాగినది. నందనందనుడా క్రూరనారి చెలువ మునే కాక జన్మమునే సఫల మొనర్చెను. ప్రాణావసాన సమ యమున కొండవలె నిజరూప ప్రదర్శన మొనర్చుచు పూతన నేలపయింబడెను. దుష్టశిక్షణము మొదలైనది. అవతారపురు షుని యాగ్రహమును తొలిసారిగ రుచిజూచిన పాతకజాతి పడతి పూతన విషయము గాలి లీల కంసునకుక్షణములమీద చేరి నది. ఇంకేమి? పూతనను జంపినవాడు సామాన్య బాలకుడెట్లు

కాగలడు? నారదుడు చెప్పిన యవతారాంశసంభూతుడతడే. సందియము లేదు. కర్తవ్యమేమి? గత్యంతరమెద్ది? కంసుని గుండెలు దడదడలాడ జొచ్చినవి. పట్టుదల హెచ్చినది. పాశవిక దృష్టి పెంపొందినది. పడరానిపాట్లు పడదొడగినాడు. చేయరాని ఘోరములు చేయనారంభించినాడు. కనిపించిన మార్గములనెల్ల కార్యసాధన కుపయోగించుకొన నుపక్రమించినాడు. తలపునకువచ్చిన తంత్రములనెల్ల ప్రయోగించుచున్నాడు. చెప్పిన వానినెల్ల వినుచున్నాడు. చేయుమనినవన్నియు జేయుచున్నాడు. పరిపరియత్నము పరాజయమునే ప్రసాదింపసాగినది. ప్రతితంత్రము బెడిసికొట్టుచున్నది.

శకటాసురుడు చచ్చినాడు. తృణావర్తుడు తృణముపగిది మన్నుగఅచినాడు. వత్సాసురబకాసురులు హతులైనారు. జరుగుచున్న చరిత్రగాంచి కంసుడు పయికి బింకములాడుచున్నను లోలోన గుండెలబాదుకొన జొచ్చినాడు. చెప్పుకొనుటకు వీలు పడనిస్థితి. చేసినదేమియు ఫలించనిపరిస్థితి. ఇక వానికేమిగతి? క్రమముగ మందగింపసాగినది కంసునిమతి.

శ్రీకృష్ణ బలరాముల సుందరగమనములు ప్రేపల్లెకేయందములగూర్చసాగినవి. ప్రేపల్లెయందు స్త్రీ పురుషాదులంద రికిని బలరామకృష్ణు లారవప్రాణమైనారు. వారిని జూడనిదినము గోపీగోపలోకమునకు దుర్దినము. తనవయసువారినందరినిజేర్చి జట్టుగట్టుకొని సంచరింపసాగినాడు కృష్ణుడు. వయసున బలరాముడే పెద్దయైనను జట్టునకు కృష్ణుడే నాయకుడు.కృష్ణుని తుంటరి

పనులన్నియు ప్రేపల్లెవారికి ముద్దుముచ్చటలు. భావింపసాధ్య
ముగాని యల్లరితో ప్రేపల్లెనంతయు నొకకొలికికి గొనితెచ్చు
చున్నను కృష్ణుని వారేవగించుకొనరు. దరహాసకాంతులుజిమ్మి
పోసెడి నందనందనుని సుందర ముఖారవిందమును గనుగొన్న
వెంటనే వారి కోపములకు లోపమేర్పడును. ఈ విధముగ బాల
కృష్ణరూపమునందున్న పురుషోత్తముని గోపకులు గోపికలు
కొలుచుచున్నారు. కొంచెపనులకు విసుగుకొనుచున్నారు.
యశోదకెరిగించుచున్నారు. కృష్ణ సందర్శనభాగ్యము కటాక్షైన
క్షణమును యుగముగనెంచి తపించుచున్నారు. వారియనుబంధ
బలమెట్టిదో! వారి యదృష్టమేమో!ఎవరు నిర్ణయింపగలరు? నిర్వ
చింపగలవారెవ్వరు? శ్రీకృష్ణుడు పరమాత్ముడు. యాదవులందరు
దేవతలు. భగవానునికొరకు భక్తులొనర్చు నొకానొక విధమైన
తపస్సుగ దీనినిభావింపవచ్చునా! కాకున్న గోపబాలురగుండి
సామాన్య డింభకునివలె చలిదిమూట బుజమునప్రేలాడ గోవ్రుల
గావనేగు కృష్ణదేవునిచర్యకర్థమేమి? బృందావనమున-యమునా
తీరమున - అలసిపోవువరకాటలాడి - చుట్టును గోపబాలురు
స్మితవిలోకన పంక్తులు తనపయింబరపుచు గూర్చుండ-

"జలజాంతస్థిత కర్ణికందిరిగిరా నుంఖుంబులై యున్న
జేకుల చందంబున" నుండి సరస సల్లాపము లాడుచు-చల్దిపూ
టలు విప్పి యొకరి కొకరు ముద్దలందించుకొనుచు - ప్రేళ్ళసందు
నందిరికించుకొన్న యూరుగాయల పసందును ప్రసంగించుకొనుచు
- మైమఱచు బాలకులనడుమ కృష్ణుని గాంచి యేమనుకొన

వలెను? బ్రహ్మాదులకు లభ్యపడని యీ సన్నిహితత్వమునకు బాత్రులయిన యాదవార్భకుల యదృష్టము నేమనవలెను?

అందరి యిండ్లలో నొకేసమయమునందుండి యల్లరి గావించుచుండెననియు-వెన్నలు భక్షించుచుండెననియు యశోదకు గోపికలు జెప్పవచ్చిన నాడే యొకరి మొగ మొకరు చూచుకొని యిది యెట్లు పొసగునని విస్తుపోయి మరలిపోయిరట. తమ్ముడు మన్నుదినె ననితల్లితో అన్నయ్య విన్నవింప - కాదని నోరుతెఱచి, నోట బ్రహ్మాండమును జూపుచున్న చిన్ని బిడ్డను జూచి యశోదయే దిగ్భ్రాంతురాలాయెనట!

అల్లరిమానకున్న ఓటగట్టివై తునని తల్లికోపించి యట్లొనర్ప నెన్నాళ్ళనుండియో యున్న రెండు మద్ది వ్రేళ్ళ మధ్యగా ఓటినిలాగి తెచ్చి వానిని గూల్చి యెల్లరిని విస్తు పోవునట్లొనర్చినాడు.

కావలెనని యిన్ని యొనర్చుచు తన కేమియు దెలియనట్లు తల్లి చాటున నక్కియుండు నల్లనయ్య మహాద్భుతలీలా విలాసములన్నియు కృష్ణలీలలను పేర వ్రేపల్లెయందా బాలగోపాలము నకు సుపరిచితములై పోయినవి. శ్రీకృష్ణు డేమొనర్చినను - అది వారి కొక వినోదమే. ఆయన యేమి పల్కినను-వారికది యొక వేదమే. వేయేల! వారి కాయన యొక దైవము. వ్రేపల్లెయందు శ్రీకృష్ణ వ్యవహార మాస్థాయికి వచ్చినది.

వానిని దైవమని యెంచుచున్నారు. తన్మయులగుచున్నారు. తమవాడనుకొని మురియుచున్నారు. చనవున మెలగుచున్నారు. తథ్య మిథ్యాభావమున దల్లడిల్లు తపస్సుల చందమైనది వారి పని. ఏది యేమైనను శ్రీకృష్ణుడు వారికాప్తుడు. బాలకృష్ణుని నీడ వారికి పరమశాంతి సుఖముల సమకూర్చగల ముఖ్యుల మేడ. ఇట్టి భావన దృఢముగ వారిలో పాదుకొని పోయినది. వారి నందరిని స్వజనులనుగనే సమాదరించుచు – కేవల దైవ భావమునే వారిలో నిలువనీయక తన కర్తవ్యంతాప్తుల నొనర్చుకొను చున్నాడు శ్రీకృష్ణుడు. శ్రీకృష్ణ దేవుని దివ్యశక్తులు క్రమ క్రమముగ లోకమున మలయమారుతము పగిది ప్రసరింప సాగినవి. ఎల్ల రాయనను పరమాత్ముడనియే భావింప దొడగిరి. కొందరు దివ్యపురుషుడగునా! యని, యశోదమ్మ ముద్దులబిడ్డ యింతటి వాడెట్లాయెనని శంకింపసాగిరి. కొలదిమంది మాత్రము శ్రీకృష్ణుని గారడి వానిగనో! మాంత్రికునిగనో! యెంచుచుండిరి.

కాని యొకమారొక వింతవిషయము జరుగుటతో (శ్రీ) కృష్ణుని బృహన్మహిమ పూర్ణముగనే యెల్లరి యనుభవమునకు వచ్చెను. సర్వమెరిగినవాడయ్యును సర్వమునకు కర్తయ్యును బ్రహ్మయేయొకమారహంకరించి శ్రీకృష్ణుని పరీక్షింప దలంచి గోవులను, లేగలను, గోపాలురను మటుమాయమొనర్చినాడు. బాలకృష్ణుడవలీలగ నీరహస్యమునుగుర్తించి బ్రహ్మకు జ్ఞానోదయము గావింపబూనుకొనినాడు. వెంటనే గోపబాలుర రూపమును, గోవులరూపమును, గోవత్సముల రూపమును

తానే వహించి సర్వమునందెట్టివిప్రతివత్తియురాని తెఱంగున ఎవరియూహులు వారియిండ్లకు లేగలగూడి యేగునట్లు బిడ్డలెల్లరు తమ తల్లులకడకేగి యెట్టివిచారములు వారి కొదవనీకుండునట్లు శ్రీకృష్ణు డేర్పాటుగావించి యెవ్వరిమనస్సులందెట్టి భేదమును పొడసూపకుండునట్లొనర్చెను. సర్వాత్మకుడైన హరియెనర్చిన యీప్రయత్న మొక్కవత్సరముపాటు ,మార్పులేని తెఱగున కొనసాగుటతో విరించి తలవంచి యపజయము నంగీకరించి యశోదానందనునికడ కరుదెంచి తన తప్పిదమును వివరించి - క్షమించి రక్షించుమని యభ్యర్థించవలసినవాడాయెను. శ్రీకృష్ణబాలలీలలట్లు బ్రహ్మ కనులదెఱపించినవి. బ్రహ్మ బాలుని పగిది యవివేకమున పరమాత్మ్నని పరీక్షించనుంకింప - బాలకృష్ణుడు బ్రహ్మమాడ్కి సర్వమునుసృష్టించి బ్రహ్మసృష్టిని బ్రహ్మను విస్మయమునముంచి తేల్చి వేత్తయై వినోదించెను. జరిగినదానికి - జరిపినదానికి బ్రహ్మ తాను దాచిన గోపాలసంఘమట్లేయుండ, ప్రతిరూపమునుదాల్చిన గోపాలసంఘముల తెఱగుగని లజ్జచెంది - శ్రీకృష్ణుని సమీపించి—

"తారా తుషార శీకర
భూరజములకైనలెక్క బుధులిడుదురు భూ
భారావతీర్ణకుడగు
నీరమ్యగుణాళి నెన్ననేరరగణ్యా ॥

"దేవా! నీ చరణ ప్రసాదకణ లబ్ధింగాక లేకున్న నొం
డే వెంటంజను నీ మహామహిమ నూహింపంగ నెవ్వారికిన్

నివారైచను వారిలో నొకడనై నిన్ గొల్చు భాగ్యంబు నా
కివే యిప్పటి జన్మమందయిన నొండెంద్రైననో యీశ్వరా !"

అని పలు తెఱఁగుల ప్రార్థించినాడు.

గోప గోపికా జనముల గురు విశిష్ట
భాగ్యసంపద దలపోసి ప్రస్తుతింప
నలవిగా దెవ్వరికినైన నంబుజాక్ష !
భక్తవత్సల సర్వేశ ! పరమపురుష !"

అని పలు తెఱంగుల స్తుతించి, కడకు —

"ఏలా బ్రహ్మపదంబు ? వేదములకు న్వీక్షింపగారాని నీ
న్ని లోకంబుననే వనాంతరము నందీ మందలో కృష్ణ ! యం
చాలాపాది సమస్తభావములు నీయందే సమర్పించు నీ
వ్రేలం దొక్కని పాదరేణువులుపై వేష్టించినం జాలదే !"

అని చేతులెత్తి మ్రొక్కినాడు. శ్రీకృష్ణ మహిమ, ప్రాగ్జ్ఞ్యమున కీ సన్నివేశ మొక సాక్ష్యము.

కృతముగ కాలము గడచుకొలది శ్రీకృష్ణు డొనరించు మానవాతీత శక్తి ప్రదర్శకములయిన చర్యలగాంచుచు ప్రజ లెల్ల రాయనను పరమాత్మ స్వరూపునిగ విశ్వసింపసాగిరి. ఆయన యొనర్చుచున్న యసాధారణాద్భుత ప్రయత్నములను కథలుగా, గాథలుగా జెప్పుకొని వినుతిసేయసాగిరి. ప్రతి మును జునినోట నందనందనుని యపూర్వ ప్రతిభా సమన్విత చర్యల ప్రశంసలే వినిపింపసాగినవి. శ్రీకృష్ణుడు తనపై వారికేర్పడు

దైవభావము నిలువకుండునట్లు మధ్య మధ్య మచ్చుజల్లుచునే యుండెను.

మరియొకమారు మరియొకవిచిత్రసంఘటన జరిగినది. అది యెల్లరిని భయాశ్చర్య సంభ్రమముల పాలొనర్చునట్టిది. ఈ సంఘటన యెంత కాదనుకొనువారినైన - శ్రీకృష్ణుని దేవతామూర్తిగనే నమ్మింప జాలినట్టిది.

కాళిందీనదియందలి కాళీయుడను సర్పరాజు మదమణంచి కాళిందీనదిని సర్వజనోపయోగానుకూలగ నొనర్చుటయే యీ సన్నివేశము. కాళీయుడు భార్యలతో పరివారముతో కాళిందీ నదిలో నివసించుటవలన - ఆప్రాంతమున కేగవలెనన్న పశు పక్ష్యాదులు, మానవులు భయభ్రాంతులగుచుండిరి. ఈ విషయమును చాలకాలమునుండి వినుచున్న శ్రీకృష్ణుడీయాపదను బాపి యాప్రాంతప్రజావళికి తుష్టిని ఘటింపనెంచినవాడై యొక నాడు బలరామునితోకలిసి యచటికి బయలుదేరెను.

కాళిందీనదిపైకి వ్యాపించియున్న సుదీర్ఘములయిన కొమ్మలు గల యొక చెట్టుపైకెక్కి-

"కటిచేలంబు బిగించి పించమున జక్కం గొప్పు బంధించి దో
స్తట సంస్ఫాలన నాచరించి చరణద్వంద్వంబు గీలించి- త
క్కుట శాఖాగ్రిము మీదినుండి యుతికెన్ గోపాలసింహంబు ది
క్తటముల్ ప్రోయ హ్రదంబులో గుభగుభధ్వానం బనూనంబుగన్"

శ్రీకృష్ణుడు కాళిందీతటమున కేగినాడని విని నంద యశో దాదులు - గోప గోపీ బృందము డెందములగుందుచు బరుగు లెత్తుచు వచ్చిరి.

ఘన యమునా నదీకల్లోల ఘోషంబు
నరస మృదంగ ఘోషంబుగాగ
సాధుబృందావన చరచంచరీక గా
నంబుగాయక సుగానంబుగాగ
కలహంస సారస కమనీయమంజు శ
బ్దంబులు తాళశబ్దములుగాగ
దివినుండి పీఱించు దివిజగంధర్వాది
జనులు సభాసిన జనులుగాగ
బద్మరాగాది రత్న ప్రభాసమాన
మహితకాళీయ ఫణి ఫణామండపమున
నళినలోచన విఖ్యాత నర్తకుండు
నిత్య నైపుణ్యమునబేర్చి నృత్యమాడె.

చూడవచ్చిన యాత్మీయులెల్లరు గుండెలవియునట్లు రోఁచుచుండ బాలకృష్ణుడు పరమానందమున కాళీయుని ఫణిఫణాగ్రములపై నాట్యమాడ దొడగెనట. ఇది సామాన్యవిషయమా! కాళీయుని ఫూత్కారములనుండి వెలువడెడి విషాగ్ని జ్వాలల ధాటికి యోజనములదూరమునందున్న ప్రాణికోటులే మాయల మాడిపోవుచుండ - గోపార్భకు డిట్లొనరింపగల్గెననుట మాటలా!

కాళీయుని పడగలపై నందకిశోరుడుండ కాళీయుభివాల మంతయు కృష్ణశరీరమును జుట్టివైచినది. కనులుమూయుచు

దెలిచుచున్న గోపాలబాలరత్నమునుగని యొడ్డునంగలవారె
ల్లరు విసమెక్కుచున్నదనియు - మనబిడ్డ మనకు దక్కడనియు
మాయదారి క్రూరసర్పముజోలికేగనేల యనియు - భయంకర
మైన యీ విపత్తునుండి బాలుని రక్షించువారెవ్వరనియు పలు
తెఱగుల విలపించుచున్నారు.

వారెల్లరు ప్రాకృతులు - దైవమాయా మోహితులు.
వారికెల్లర్థమగును? వారంతకన్న నొనర్పగలదేమున్నది? బాల
కృష్ణుని కాళీయమర్దన కార్యక్రమము పరాంకోటి నధిగమించు
చున్నది. శాపవశమున క్రూరవ్యాళమైయున్న కాళీయునకు
ముక్తిని ప్రసాదింపవలసిన తరుణమది.

"కుక్షిలోకములున్న గౌరవముతో గోపాకృతిన్నన్న యా
రక్షోహంతవడిన్ మహాఫణిఫణాభంగ ప్రదేశంబుపై
నక్షీణోద్ధతినాడు బాడు జెలగుచ హాసంబుతోడంబద
ప్రక్షేపంబులుసేయు కేళిగతులన్ ప్రాణైకశేషంబుగచ"

శ్రీకృష్ణునకది కేళిప్రాయముగనేయున్నది. శ్రీకృష్ణ
దేవ బలిష్ఠపాదాఘాత పరంపరలకు కఠోరకర్కశ కాళీయశిర
పరంపర చూర్ణమగుచున్నది. పొగరడగి నెవ్వగలగుఘులు పతిని
గని కాళీయునిభార్యలు శ్రీకృష్ణదైవమును ధ్యానింప సమకట్టి
అంజలిబద్ధలై యార్తలై -

"ఆకులమయ్యె భోగమిదె - యౌదలలన్నియు ప్రస్ఫోటాణముల్
రాకలబోకలంబొలిసె రాయిడిపెట్టకమా నిజేశుపై

నీకరుణాకటాక్షములు నిల్పగదే! తగనోసమస్తలో
క్తైక శరణ్యా! ఓ యభయకారణ! యో కమలా మనోహరా!"

అని బహువిధముల దీనాతిదీనముగ ప్రార్థింప సాగిరి. కాళీయుండును నలగిన తలల దడవిచూచుకొనుచు విధ్వస్తగర్వ సర్వస్వుడై శ్రీకృష్ణుని వినుతిసేయదొడగె.

"నా పుణ్యమేమి చెప్పుదు
నీపాదరజంబుగంటినే సనకాదుల్
నీ పాదరజముగోరుదు
రేపదమందున్న నైననిక మేలుహరీ!"

జ్ఞానోదయమయిన వెంటనే కృష్ణుని బాలునిగ గాక - సకల లోకాధీశుడైన స్వామిగా - సకలయజ్ఞ స్వరూపుడు, సర్వశక్తి సమన్వితుడునగు జగన్నాథునిగ గుర్తించినాడు కాళీయుడు.

''గోవర్ధముతో మనుజులు
ద్యావుదురీ మడుగునీరు దగదిందుండన్
నీవును నీ బాంధవులును
నీ పనితలు సుతులు జనుడు నేడంబుధికిన్."

అని కృష్ణు డాదేశించి నంతనే పత్నీలోక పుత్రవర్గ పరివారగణ పరివృతుండై కాళీయుండు పలుమారు పరమాత్ముడైన శ్రీకృష్ణుని సంస్తుతించుచు రత్నాకర ద్వీపంబున కరిగెను.

ఇంతవరకు వినుటకు గనుటకు వింతగనుండ - విభ్రాంతి యందెల్లరు మునిగియుండ మరింతగ నచటజేరినవారినెల్లర విస్మి

తుల గావించుటకోయనునట్లు కాళీయుండు నిర్గమించుచుండ శ్రీకృష్ణుడందఱు చూచుచుండ నిట్లనినాడు. సమయముగనుక నిటనొకమారు తన యవతారలక్ష్యమును మహిమను విశదీకరింప నెంచెనేమో!

"నిను నేశాసించినకథ
మనమున జింతించి జేపుమాపును గీర్తిం
చిన మనుజులు నీభయమును
వినుమెన్నడు బొందరెందు విషవిజయముతోఁ"

మరి యిట్లనవలెనని నెంతటి యధికారమున్నజెల్లును? సకల చరాచరసృష్టి స్థితిలయముల బాగోగులను కరగత మొనరించు కొని నడిపించు శక్తిమంతుడైన సర్వేశ్వరుని కొక్కనికే యిట్లనగల- అని చెల్లించుకొనగల స్థాయియుండును.

భయముకొలది-పరాజయము నందియుండుటకతన-కాళీయుడు బాలకృష్ణుని దైవాంశసంభూతునిగ నెంచియుండునని యనువారికిగూడ కృష్ణవచనములతో సంశయనివృత్తి కావలసినదే. ఇట్లడుగడుగున శ్రీకృష్ణస్వామి తన మహిమలను విశదీకరించుచు ప్రవర్ధమానుడగుచుండెను.

ఇన్నియుం గనుచు వినుచు - సంభ్రాంత చిత్తులైనిశ్చేష్టులైయున్న కృష్ణుని యాత్మీయులెల్లరు నందనందనుడు తీరమునకు జేరగనే యతిశయించిన ప్రేమభావముతో "అయ్యా! నాయనా!" యనువారు - "ఎంతపని జరిగెరా!" యనువారు-

"దైవము మాపాలనుండెరా" యనువారు- "దృష్టిదోషము దగులునేమో ! దిగదుడుపు"డనువారు నగుచు పలుతెఱగుల విచారమును వ్యక్తముజేయుచు ప్రాకృతులవలె వ్యవహరింప సాగిరి. వారి మదికి లోకాతీత సాహస చర్యలతో భయంకర విషజ్వాలామత్త సర్పమస్తమున దాండవించినవాడు దేవాది దేవుడను మాటనే మఱచినవారయిరి. మనల మరల మధ్య మధ్య వారికా విషయము స్పృహకు వచ్చుచున్నను మాయకా మోహభావనా పరతంత్రులై బాలకృష్ణునకు దామేదో క్షేమమును గలుగజేయవలయునన్నెడి సితిలో బడిపోవుచుండిరి. వీనిని కృష్ణమాయ యందురో ! కృష్ణలీలయందురో ! ఏమందుకో ! అందియు నందకయున్నట్లు - తెలిసియు దెలియకపోవుచున్నట్లు జ్ఞానదీధితులు వెల్లివిరియుచున్నట్లు - దట్టమైన యజ్ఞానపు తెఱ దిగుచున్నట్లు-వింత వింతగ-మత్తుగానున్న యిట్టిసితినుండివిస్పష్టమైన-నిస్సందేహాత్మకమైన - సత్యమైన - పరివర్తనరహితమైన-వెలుగువంకకు పయనింప జీవాత్మపడుచున్న యంతర్వేదనే భాగవతము నరునకువ్యక్తీకరించుచున్నది. పరమాత్మపన్నుచున్న మాయావ్యూహమునేవిశదీకరించుచున్నది. అన్నియునుగన్నులు వెట్టుకొని తిలకించి - అచంచలభావ పథమునబయనించి-అనంతమైన అనంతుని కృపాలహరి నోలలాడుట కర్హతను గడించుకొమ్మనిమానవాళిని భాగవతముసూటిగ హెచ్చరించుచున్నది. గోపగోపీకా బృందమును దవానలము మట్టడించినపుడు కరుణామయుడై కాపాడుట శ్రీకృష్ణుని దివ్యతత్వమున కొక ప్రబల

సాక్ష్యము. సందర్భము వచ్చినపుడెల్ల తన మహిమలను ప్రదర్శించుచు బాల్యమునుండి శ్రీకృష్ణస్వామి సకలభక్తలోకారాధ్యుడగుట మనము భాగవతమున గమనించుచుందుము. భక్తి భావనకు సర్వత్రవిజయమును సమకూర్చుటయే భాగవత మహాగ్రంథహృదయము.

బాలకృష్ణుడు పదముపెట్టినచోటంతయు పరమపావనతనందుకొనినది. ఆయన వేణునాదము వ్యాపించిన ప్రాంతమంతయు సంగీత సాగరమై పారవశ్యమున దేలినది. నందనందనుని చెంగటజేరి చెలిమిబలమున గలసిమెలసి తిరుగనేర్చినవారెల్లరును ధన్యతములయిరి. నిక్కముగ నదియొక మహాద్భుతలీల. నిశ్చయముగ నదియొక యపూర్వప్రతిభాజ్వాల.

ఆ పుణ్యమూర్తి లావణ్యవైభవసందర్శనార్థము పురుషులు స్త్రీలు బాలురు వృద్ధులు మాత్రమే యనలేల! పశువులును పారవశ్యమున బరుగులు దీయుట జరిగెనన్న నాయన దేవదేవుడనుట కించుకేమి సాక్ష్యము కావలయును?

ఒకచెలికాని పై నొకచేయిసాచి వే
ఱొక చేతలీలాబ్జమూను వాని
గొప్పన కందని కొన్ని కుంతలములు
సెక్కులనృత్యంబు సేయువాని
గుబురుచుంగులు వుచ్చికొమరారగట్టిన
పసిడివన్నియగలపటమువాని
నొదలదిగి రానలవడజుట్టిన
దట్టంపు బించెపు దండవాని

రాజితోత్పల కర్ణపూరములవాని
మహితపల్లవ పుష్పదామములవాని
భువనమోహన నటవేషభూతివాని
గనిరి కాంతలు కన్నుల కటువుదీఱి.

ప్రాకృతునివలె భూలోకవాసులమధ్య సంచరించు చున్నను అప్రాకృతమహిమల జూపుచు లోకమంగళకర కార్యనిర్వహణ మొనర్పసాగిన పుంసాంమోహనరూపుడగు కృష్ణకిశోరునిలో పురుషోత్తమ దివ్యసౌందర్యము ననుభూతికి దెచ్చుకొనిరేమో! అందువలననే జీవజాలమంతయు నావిధముగ పరుగులెత్తియుండ వచ్చును ఇందేమియు వింతలేదు. నందాదులంద రొకవారిం ద్రయాగము సలుపదలచినవారై కృష్ణునితో సంప్రదించిరట-

యజ్ఞపతియైన శ్రీకృష్ణ దేవునకు నందుని మాటలు నవ్వు దెప్పించునేమో! యజ్ఞమువలన నిందుగాదు సంతసించు టేమి? ఆయన దయయున్న వర్షము గురియుట - పంటలు పండుట - ధేనువులు రక్షింపబడుట వింతగనున్నదే! యని కృష్ణునకు నవ్వువచ్చెనేమో!

"కర్మమున బుట్టు జంతువు
కర్మమునవృద్ధిబొందు కర్మమున జెడుఁ
కర్మమె జనులకు దేవత
కర్మమె సుఖదుఃఖములకు కారణమయ్యెన్."

ఇది బాలకృష్ణుడు తండ్రికి జెప్పినమాట. కర్మస్వరూపుడైన పరమాత్ముడే సర్వాధికారియనియు - యజ్ఞాధిపతియనియు సాక్ష-

ర్మాచరణమే సర్వేశ్వర ప్రీతికర విధానమనియు-కర్మలను సవ్య
ముగ నాచరించుటే దైవమును పూజించుటనియు - శ్రీకృష్ణుడు
నందాదుల కంతరార్థ సమన్వితమైన యాలోచనఁజెప్పి యింద్ర
యాగమును మాన్పించి సత్కర్మల నెన్నింటినో వారిచే నాచ
రింపఁ జేసెను.

యాదవులెల్ల రానందమున బిండివంటలతో నైవేద్యములు
తయారుచేసి-వివిధ పత్ర ఫలపుష్పాదులతో శ్రీకృష్ణుడు సూచిం
చిన తెఱగున నొక కొండను పూజించి ప్రదక్షిణ మాచరించి
పాటలతో నాటలతో వినోదముల మునిగితేలి తిరిగి మందకు
జనిరట.

విషయమంతయు నెరిగినవాడై యింద్రుడు దైవమాయచే
నహంకరించినవాడై శ్రీకృష్ణుని బ్రహ్మవలెనే ప్రాకృతబాలువిగ
భావించి, శిలావర్షమును గురియించి, యాదవుల నెల్లర నల
యింప బూనుకొనెను.

యాదవులు నిర్విణ్ణులైరి. ఘోరశిలా వర్ష పాతమునకు
ప్రాణికోటులన్నియు గడబట్టి పోవుచుండెను.

అక్కట వానదోగి ప్రజమాకులమయ్యె గదయ్య! కృష్ణ! నీ
వెక్కడనుంటి వింత తడవేల సహించితి నీ పదాబ్జముల్
దిక్కుగనున్న గోపకులు దీనతనొంద భయాపహారివై
గ్రక్కున గావకిట్లునికి కారుణికోత్తమ! నీకుబాడియే.

అని యాదవులెల్ల రొక్కపెట్టున ఘోషిల్లుచు శ్రీకృష్ణునికడ జేరి, ఇందుని యవివేకచర్య యిదియని గుర్తించిన శ్రీకృష్ణుడు వెంటనే చిటికెన వ్రేలిని కొడగ నొనర్చి గోవర్ధన పర్వతము నవలీలగ నెత్తి గొడుగుగపట్టి యెల్లరి బాధలనవలీలగ బోద్రో లెను. విశాలమైన గోవర్ధనగిరి క్రింద స్వగృహములయందువలెనే గోవులతో గోపత్సములతో బాటుగ యాదవులెల్లరు సంరక్షిత ముగ కాలము గడపసాగిరి. శ్రీకృష్ణుని యపూర్వ దైవిక శక్తి ప్రదర్శనమున కిదియొక యద్భుత సాక్ష్యము. యాదవులందరు కడగండ్లనుండి బయటపడితిమన్నయానందమున కృష్ణమాయలో మునిగి యిట్టి యసాధారణ సాహసకృత్యము నేరీతి బాలకృష్ణుడు నిర్వహించెనా ! యను మాటనే విస్మరించిరి.

కొలదిమంది జ్ఞానులు మాత్రమే పరమాత్మని యంశతో నుదయించిన యవతారమూర్తియే బాలకృష్ణుడని కీర్తించినారు. మా తండ్రి మాకెంత మేలుచేసెనని యాత్మీయులెల్లరు మురి యుటతో సరిపోయినది. ప్రతిఘట్టమునందును కృష్ణసహిమ స్పష్టాస్పష్టముగ ప్రతిఫలించుచు జ్ఞానుల కెఱుకపడునట్లు-పామ రుల కవగాహముగాని తెఱగున నున్నది.

బాలుం డీతడు కొండ దొడ్డది మహాభారంబు సైరింపగా
జాలండో ! యని దీనిక్రింద నిలువన్ శంకింపగాబోల దీ
శైలాంభో నిధి జంతు సంయుత ధరా చక్రంబుపైబడ్డ నా
కే లల్లాడదు బంధులార ! నిలుడీ క్రిందం బ్రమోదంబునన్.

ఈ పలుకులలో పరమాత్మ భావము కృష్ణుని నోట సుస్పష్టము గనే సూచితమైనది.

సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహంత్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః.

అన్న గీతావాక్యములు జ్ఞప్తికివచ్చి ఘట్టమిది. సర్వభారముల నుండి విముక్తులగావించి - సర్వ కష్టములనుండి సంరక్షించి - సర్వ సుఖములను ప్రసాదించు సర్వేశ్వరుడుగా వారి కప్పుడు కృష్ణుడు కనిపించి తీరవలయును.

ఏడేండ్ల బాలుడొక్కడ? ఈ గోవర్ధనగిరి నెత్తుకొక్కడ? ఇది యీ యర్భకుని వలననే జరిగినదా! యని శంకించువారు కొందరు. "ఇతడు కేవల మనుజుడే యెంచిచూడ" అనువారు కొందరు ఉన్నను - చూడజూడ నదియంతయు కృష్ణమాయయే యగునుగదా! ఇంద్రుడే స్వయముగవచ్చి తన తప్పిదము నొప్పు కొని చరణముల బడుటయు - చేజిక్కిన యధికారమును నహం కారము చెందక సద్వినియోగపఱచుకొమ్మని కృష్ణుడు హితోక్తు లాడి పంపుటయు - పూర్ణ దైవభావమునే శ్రీకృష్ణుని పట్ల మనలో సముద్భవింప జేయును.

కృష్ణ దివ్యతత్వ మొక మనోజ్ఞ మందార మాలాసదృ శము - పవిత్ర పారిజాత ప్రసూన తుల్యము - పావనగంగా తరంగ సమానము.

వెన్నెలజల్లువలె - అరవింద మరందము మూడ్కొ - రాయంచ నును తెక్కల స్వచ్ఛతవలె - ఆ తత్త్వ మెల్లరికి నారాధ్యమే!

ఆ తత్త్వము వేపల్లెలో సుందర రూపమున కనులముందర నాడుచుండ పాడుచుండ - అందరితోగలిసి తిరుగుచుండ - పలువురు పలు తెఱగుల దివ్యానుభూతుల బడసిరి. కొందరు మనస్సులందే మురిసిపోజాలిరి. మరికొందరు నోరార జెప్పుకొని తన్మయతనందిరి. వేరొక కొందరు గళమెత్తి యొడలు పులకించునట్లు - దెసలు ప్రతిధ్వనించునట్లు గాన మొనర్చిరి. ఇంక కొందఱు జరుగుచున్న మహత్తర చర్యలన్నింటిని గాంచుచు మనమిూ సమయమున జన్మించి యీ దివ్య బాలమూర్తి పద పరాగమును శిరమున గీలించు కొనెడి యదృష్టము గలవార మగుట యే తపః ఫలమో! యని మానమున భావింపదొడగిరి.

వేపల్లెలో గోపాంగన లందరు చిద్విలాస మయుడైన చిన్నారి కృష్ణుని ముద్దుల మోమును జూడకయే క్షణము గడపజాలని వారైరి.

బాలకృష్ణుడు వీధులలో ప్రత్యక్షమైనచో - వాని మంజుల మురళి పెదవులపై మోహన స్వరాలు వినిపించుచో సాగర గర్భము వంకకు నాగిపోవు సదీప్రవాహములవలె - ప్రన్నమ చంద్రునిగన్న మహాంబుధి తరంగముల భంగి గోపికల హృదయములు బాలకృష్ణ సందర్శనార్థము పరుగులు దీయుచుండెడివి.

బాంధవముననైన బగనైన వగనైన
ప్రీతినయిన ప్రాణభీతినయిన
భక్తినయిన హరికి బరతంత్రులైయుండు
జనులు మోక్షమునకు జనుదురధిప!

ఈ సత్యమునే భాగవతము ప్రతి పుటయందును మనకు గుర్తు చేయు చుండును. గోపికలెల్లరు ప్రీతితో శ్రీమన్నారాయణుని జేర నిట్లు తీవ్రానురక్తిని బ్రదర్శించి యుందురు.

పరబ్రహ్మమనెడి బుద్ధి కృష్ణుని యెడ వారి కెప్పుడు గలిగె నన - వారి తపస్సు పండినప్పుడే. తపస్సు పండుటకు కావలసిన సర్వార్పణబుద్ధి - ఏకాగ్రతతో గూడిన నిర్మలదృష్టి-కాంక్ష లకతీతమైన సాధన ఎట్లు పట్టుబడునో! భాగవతము మన కెఱుక పఱచు చున్నది.

ఘన మధుర గీతనినదము
వినివచ్చిన గోపికలను వీక్షించి నయం
బున మేటి సుగుణి నేర్పరి
తన వాగ్వైభవము మెఱయదగ నిట్లనియెన్.

అనినదేమో! పినుడు.

ఇది యమునానదీ జలసమేధిత పాదప పల్లవప్రసూ
న దళ విరాజితంబగు వనంబు; మనంబుల మేరదప్పెనో
పొదడటు నేడ్చు బిడ్డలకు బోయుడు పాలు-విడుండు లేగలన్
మొదవులకున్-నిజేశ్వరుల ముద్ది యులార! భజింపుడొప్పగన్,

మనఃబులు స్వస్థతను గోల్పోవరాదు. కర్తవ్యములను పదలి వేయరాదు. పతులను సేవింపుడు. పొండు.

ధ్యానాకర్ణన దర్శన
గానంబుల నాతలంపు గల్గిన జాలుఁ
బూనెదరు కృతార్థత్వము
మానవతుల్ చనుడు మరలి మందిరములకున్.

లౌకిక ధర్మానుసారముగ భర్తలసేవించుచు - సంసారమున వర్తించుచు - సర్వేశ్వర సంస్మరణ సంస్తుతులతో ఆనందించుచు- సకల సుఖములను పొందవచ్చునని దివ్యోపదేశ మిట మనకు వినిపించుచుండును. సకామ కర్మానుష్ఠాన పరతంత్రమై యున్న జీవజాలమును నిష్కామకర్మానుష్ఠానరత మొనర్చుటకు సాగించెడి పవిత్ర కృషి యిందు మనకు వ్యక్తమగును.

గోపిక లిట్లనిరి.

తరు మృగ ఖగ గోగణములు
కరమొప్పెడు నిన్ను గన్న - గానము విన్నన్
గరగి పులకించు నబలలు
గరగరె ! నినుగన్న నీదు నామము విన్నన్.

శతమయూఖుని కిరణ స్పర్శతో చంద్రకాంత శిల కరగును. ఇనుము నయస్కాంత మాకర్షించును. పద్మములు బాలభాస్కరుని పసిడికాంతులు పయిబడగనే పకపకలాడును. పరిపంచమున గల యాత్మలన్నియు నించుక జ్ఞానముదయించిన జాలు - పరమాత్మునికొర కేకముఖముగ పరితపించును. స్త్రీ పురుష వివ

క్షత కట నవకాశము లేదు. కావున నే గోపికలట్లనిరి. గోపకులు గూడ నట్లే యని యుందురు.

శారద చంద్రి చందికలజాలు నేలపై కొంగొత్త యందములు దిద్దుచుండ – ప్రశాంత ప్రసన్న వాతావరణమున ప్రాణికోటి హాయి ననుభవించు శుభవేళ – యమున యొడ్డున పున్నాగ వృక్షములనుండి సన్నాయి స్వరములవలె చిన్నికృష్ణుని మురళినాదము వినిపించగనే సర్వమును మరచి– అత్తమామల నడుగకయే – భర్తల యాజ్ఞల గొనకయే – పసివారి మాట దలచకయే గోపాంగనలు పరువులెత్తిరనిన నంతరార్థమేమి?

గోపికల యూహలో గోపాలకృష్ణమూర్తి కేవలము యశోద ముద్దుల పట్టి కాదు. లోకముల కన్నింటికి భన సఫల తను ప్రసాదింపగల పరమాత్మ స్వరూపుడు. వారి చర్మచక్షు వులకు గన్పించునది గజ్జెల మొలతాడు జారుచుండ – నెమలి యీకల పోవ్రు మొగమున సొగసు లీనుచుండ – కరతలముల వేణువుబట్టి వ్యత్యస్త పాదారవిందుడై కులుకు నీల బాలకృష్ణ రూపమే కావచ్చును. వారి భావనయనముల కా బాలుడు సాక్షాత్తు బ్రహ్మాండ భాండముల నన్నింటి కనుగలిగి కాపాడుచు, యోగ్యత నార్జించుకొనిన వారికి తన సాన్నిధ్యమును ప్రసాదించెడి పరంధాముడు.

"నీవు యశోద బిడ్డడవె! నీరజనేత్ర! సమస్త జంతుచే
తో విదితాత్మ వీశుడవు తొల్లి విరించి దలంచి లోకర

ఈ విధమాచరింపుమని సన్నుతిసేయగ సత్కులంబునన్
భూవలయంబు గావనిటు పుట్టితిగాదె మనోహరాకృతిన్."

శ్రీకృష్ణుని నిజతత్వము నట్టర్థము జేసికొనగలిగిన జ్ఞానసంపన్నులు గోపికాంగనలు.

చరణ సేవకులకు సంసార భయమును
బాపి శ్రీకరంబు పట్టు గలిగి
కామదాయియైన కర సరోజంబు మా
మస్తకముల నునిచి మనుపు మీశ !

సంసార తాపత్రయమునుండి విముక్తి వడయునట్లనుగ్రహింపుమని గోపికలు శ్రీకృష్ణు నభ్యర్థించిరి. కాని సంసార విలాసాలాలస మానసులను గావింపుమని వారు యాచింపలేదు. నిజముగ నిరికట్టి కోరిక యును లేదు. వారి చర్యలకుగాని, పల్కులకుగాని యట్టి యర్థములను జెప్పరాదు.

వారెల్లరు జీవన్ముక్తులై తపించువారు, జీవేశ్వరుడైన శ్రీకృష్ణునికి పలు తెఱగుల సన్నిహితులుగా సంచరించి సర్వత్ర శ్రీకృష్ణునిగను టులవరచుకొని – సర్వమున కృష్ణునిగని ధన్యత నందినవారు. వారి దృష్టిలో దోషముగాని వారి యూహలలో తుచ్ఛ కామ గంధముగాని లేదు. కృష్ణుడు కారణజన్ముడని చెప్పిన భాగవతమే గోపికలు గోపాలురును కారణజన్ములని వివరించుచున్నది. భగవానుడు కృష్ణుడైనాడు. పర్మమాత్మునిని నిత్య సేవావిధుల ననురక్తితో భక్తితో భజించి యానందించు దేవతలు గోపగోపీ బృందముగ నయి, దైవవాణి చెవులబడ

గనే పున్నమిడేల వెన్నెల బాటలో - అత్తల, నాడుబిడ్డల, పతుల, సఖ్యాల, సంసారముల మఱచి, భయమువిడిచి పరుగెత్తి రనుటలో పరమార్థమేమి? జ్ఞానియైన జీవుడు నిమిత్తమాత్రముగ తనవారనబడెడి సతీసుత సోదర బంధువర్గములపట్ల మమత వదలి దేవుని సన్నిధిని గోరుకొనవలెననియు - అట్టిపావన కామమునే కలిగియుండవలెననియు ధ్వనించుచున్నది. కామమనగా లౌకికమైన కామభావన యర్థముగా జెప్పుకొనుట కేవల మవివేకమే కాగలదు.

కృష్ణుని వేణునాదమువిని హృదయము పారవశ్యము చెంద పరుగు పరుగున యమునానదీతీర సైకత భూములజేరి పరిసరములన్నిటిని పరిశోధించి విసిగివేసారి శ్రీకృష్ణునిగానక యొక గోపిక యిట్లనుచున్నది.

"అక్కట బంధులున్ మగలు వన్నలు దమ్ములు బుత్రకాదులున్
నెక్కొని రాత్రిఁ బోకుడన నీ మృదుగీతరవంబు వీనులన్
వెక్కసమైన వచ్చితిమి వేగమె మోహమునొంది, నాథ! నీ
వెక్కడబోయితో! యెఱుగ, మిక్రియ నిర్దయుడెందుగల్గునో."

ఈ యీ వేదన యెంత రమణీయముగ నున్నది. ఎంత అర్థవంత మైనది. లౌకిక బంధములు బలీయములైనవి. నన్ను బంధించి నిలుప యత్నించినవి. మనసు గట్టిజేసికొని సోరకై పరువెత్తి వచ్చుసరికి నీదర్శనము లభ్యము గాదాయెనేయని పరమాత్మునిచెంత విలపించెడి భక్తహృదయమే యిట మనకు గన్పట్టును.

"ఎంత దయలేని హాడవని"— చనువుతో భగవంతుని నిష్ఠు రములాడెడి జీవుని వేదనయే గోచరించును. ఇట్టి సందర్భము లలో పొందుపరుపబడిన "మోహ" మనెడి పదము సర్వాగాధా రణమైన శారీరక మోహమును సూచింపదు. పరమపావనమై యలభ్యమై యలరారెడి పరమేశ్వర సాన్నిధ్య ప్రాప్తికి సంబం ధించిన మోహము నెఱుకపఱచును. ఇచటగల "నాథ"యనెడి పదము తాళిగట్టిన మగనిని సంబోధించుట వంటిదికాదు. సకల జగములనేలెడి లోకనాథుని స్తుతిని వ్యక్తీకరించునట్టిది. ఇసలీ రాసక్రీడలు జరుపునాటి - గోపాంగనల నాకర్షించు నాటి - కృష్ణుని వయస్సెంత యనియును విచారింప గోపికలకు కృష్ణునకు మధ్యరకరకముల శృంగారగాథల జెప్పికొని మురియు టేమి విజ్ఞత? అట్టి యూహకు కృష్ణలీలలలో తావేలేదు. గోపికలది పరమపావనమగు దివ్యప్రేమ, అమరభక్తి. ఈ దృష్టితో డ్రోచించిన నిందలి పవిత్రత మనకు గోచరించును.

ఇది స్వామి చరణముల చెంత సర్వార్పణ మొనరింప తహతహ జెందెడి జీవులయొక్క సకామ తృష్ణయను భ్రాంతి గల్గించెడి నిష్కామకర్మ పరాయణత. లోకనాథుని కొరకు జీవుడు పొందెడి తపనయే శరదాగమవేళ యిల్లువదలివచ్చి పలు తెఱగుల ప్రార్థనలుసల్పు గోపకాంతలలో మన మరయ గల్గు దుము. పరమాత్మునిలో విలీనమై పారవశ్యము ననుభవించ వలెనని వ్యధజెందెడి యంతరాత్మల యూందోళనయే రాసక్రీడా లోలయై ప్రతి గోపకాంతయు తన ముందున్న రూపమును

కృష్ణరూపముగనే భావించి బ్రహ్మానందము నందుటలోగల పరమార్థము.

"నారీ నారీ నడుమ మురారీ"
అంగనామంగ నామంతరే మాధవః
మాధవే మాధవే మధ్యగా అంగనా
ఇత్థమాకల్పి తేమండలే జల్పితే
సంజగౌ వేణు నాదేవకీ నందనః.

అని కీర్తించినవారి యూహలలో గల పరమలక్ష్యమదియే. సర్వత్ర కృష్ణస్వరూపమును దర్శించి పరవశించిన గోపికలు యదృష్టము నేమనవలయును? సర్వము విష్ణుమయమనెడి యొకానొక మహోజ్జ్వల స్థాయికి జీవుని జేర్చుటకు భాగవతము చూపిన దివ్యపథమిది.

అట్టి ప్రీతి పాత్రుడైన బాలకృష్ణుడు కనుమరుగుపడగనే యున్మాదస్థితిలో బడిపోయినవారై గోపికలు చెట్టులను పుట్టలను సంపార్థింప సాగిరట. సర్వ ప్రపంచమున సర్వేశ్వరుడు సర్వాంతర్యామియై యుండెడినని యు - జగత్పతిని ఏ రూపమున నెచటనేని అన్వేషించి పార్థింపవచ్చునని యు చెప్పబడెడి సిద్ధాన్తమున కనుగుణముగనే గోపికల యన్వేషణమున్నదనుట కాదన గలమా!

ప్రతి సన్నివేశమునందిట్టి మహోన్నత భావ పరంపరల వ్యక్తీకరించుచు సాగిన దివ్యచరిత్రమే భాగవతము. జీవులకుగల

దేహమోహాభిమాన పరిత్యాగానంతరమే దేవదేవుని కరుణాప
మాన కృప సిద్ధించునను వేదాంత విషయమును విచిత్ర రీతితో
వినూతన పద్ధతిలో రసభరితముగ గోపికా వస్త్రాపహారణమున
జెప్పబడినది. వృషభాసుర సంహారమునగాని - కేశివ్యోమా సు
రుల వధయందుగాని కృష్ణుని యతిలోకశక్తియే వ్యక్తమగు
చుండ - విచిత్రములెన్నియో యీ విధముగ నందనందనుని
కథా సందర్భమునకు మహోదాత్తతను సమకూర్పగలిగినది.

మొత్తముమీద శంకించి బలరామ కృష్ణుల కొరకు
పలువురు రక్కసులను ప్రేపల్లెకు బంపుట - వారచట మడి
యుట - కంసునకర్థముగాని సమస్యయైపోయినది. నారదుడొక
మారు పనిగట్టుకొనివచ్చి, బలరామకృష్ణుల యునికిని గూర్చి
స్పష్టమైన సూచన యిచ్చినాడు. దానితో నాగ్రహోద్రగు
డైన కంసుడు తన్ను మోసపుచ్చెనని వసుదేవుని జంపబోవు
టయు - నారదుడు వారించి వెడలిపోవుటయు జరిగినవి. కసి
దీరక కంసుడు దేవకీవసుదేవుల లోహపాశబద్ధుల నొనర్చిన
వాడై యెడలుదెలియని కోపమున బలరామకృష్ణుల సంహార్మాల
నార్థము మార్గాంతరములు వెదకుచు మంత్రులతో మంతనాం
గము లొనర్పసాగెను. ధనుర్యాగంబును ప్రకటించి - తనకు
విజయము సిద్ధించు నిమిత్తమై - పరమేశ్వర ప్రీత్యర్థముగ పశు
బలులు మొదలైనవి యొనర్పుడని మంత్రుల కాజ్ఞయిడిగాడు.

మల్లయుద్ధ విద్యా ప్రవీణులయిన చాణూరముష్టికుల
ప్రశంసించి మీరెట్లైనని బలరామకృష్ణుల గడతేర్చి నా కానంద

మును ఘటింపుడని యభ్యర్థించినాడు. వారందులకు సంసిద్ధులైనారు. మనసునకు వచ్చినపనియెల్ల, క్షణములబోద, నములునకు దెచ్చుచున్నాడు. వెట్టికిగానివాని పగిది విశృంఖల ప్రవృత్తితో విహరింప సాగినాడు. కనులుమూసినను దెఱచినను బలరామకృష్ణులే వానికి గన్పట్టుచున్నారు. నిద్రయందును వారి విషయమే - కంసుని స్థితి యయోమయముగ నున్నది.

యదువంశము వారిలో శ్రేష్ఠుడును వయస్సున వృద్ధుడునగు వానిని - అక్రూరుని బిలిపించి - ఆప్యాయత నొలికించుచు బుజముపై చేయివైచి - 'అక్రూరా! నీవు సార్థనామముడవు. నందుని మందలోగల బలరామకృష్ణులు నన్నాజిలో గెలిచి యీ రాజ్యమేలవలెనని యెంచుచున్నారట. వారు శ్రీమన్నారాయణాంశతో భూలోకమున గోపకులమునం దవతరించిన ట్లింకొక గాథ వినుచున్నాము. కావచ్చునుగాక! మనకేమి? వారి నిక్కడకు గొనిరావలసినపని నీ కప్పగించుచున్నాను. ధనుర్యాగమును మన మొనర్ప నెంచియుంటిమి. దానికి వారి నాహ్వానింపుము. మనవంక చాణూరముష్టికులాదిగాగల జెట్టులయిన మల్లులున్నారు. కావలసినన్ని మార్గములున్నవి. వచ్చినజాలును. చచ్చినవారే కాగలరు. వృష్ణిభోజ దశార్హా వీరుల పని తరువాత. వార్ధక్యము వచ్చినను రాజ్యకాంక్ష చావని మా యయ్య నుగ్రసేనుని - చిన్నయ్యదేవకుని క్షణములమీద మడియించి, జరాసంధ నరక బాణశంబరాది సఖులెల్లరు సంబరపడ మధురా మహాసామ్రాజ్య సర్వ సర్వంసహాధికార పదవీ

విభాజితుడ నయ్యెదను. మాఱుమాటాడక పోయిరమ్మ్మా" అని గుక్కదిప్పకొనక యొక్కపెట్టున దన యక్కస్సు నంతయు గంసుడు వెళ్ళగక్కెను.

తండ్రిని – పినతండ్రినిగూడ మడియింప సమకట్టిన తనయు డా కంసుడు. కార్యసాధనకు బయలుదేరినాడు దానిబడి పోవు దయ్యమును తగుదునమ్మా ! యని తానుగాపిలిచి, తల మీదికెక్కించు కొనదలచినాడు. దైవము లేడనియు, ధర్మము నెగ్గదనియు వాని దురూహ. ఇట్టివారి కొరకే దైవమిలలో నవత రింపవలసి వచ్చినది.

కాదనుటకు వీలుగాని స్థితి యందున్న వాడకూర్చుడు. దైవేచ్ఛ దప్పింప సాధ్యముగానిదని యతడెరుగును. హితము రుచించు దశలో క్రోధనులుండరని యతనికి తెలియని విషయము గాదు. చెప్పకదాచుట యతని మతమున కే విరుద్ధము. సజ్జనునకు గల్గిన సందిగ్ధ పరిస్థితియది. కడకిట్లనినాడు.

పంపిన బోనివాడనె ! నృపాలక మానవులెన్నడమ్మ్మా నూ
హింపరు - దైవయోగముల నించుకగానరు తోచినట్లు ని
ష్కంప గతింజరింతు్రది కాదనవచ్చునె ! యీశ్వరేచ్ఛ ద
ప్పింపగరాదు - నీ పగతుబిడ్డల దెచ్చెద బోయివచ్చెదన్.

చాలు వినదలచిన వానికో పలుకులు. వాడీ యక్రూరుని దంత రార్థములగ జెవిబెట్టడి యోపిక గలవాడా ! చెనటికి జెప్పిన ఫలమేమి ? కాలము దాపురించిన గర్వాంధునకు హితోపదేశ మొనర్చు వారి పలుకులలో వెల్లివిరిసెడి పండువెన్నెల గ్రస్సు లకు గన్పట్టదు.

ఎట్టి తపంబు సేయబడె నెట్టి చరిత్రము లబ్ధమయ్యెనో!
యెట్టి ధనంబులర్థులకు నీబడెనో! తొలిజామునందు నా
యట్టి వివేకహీనునకు నాదిమునీంద్రులు యోగదృష్టులం
బట్టగలేని యీశ్వరుని బ్రహ్మమయున్ హరిజూడగల్గెడిన్.

అనుకొనుచు దనకిది మంచియదనని మదినెంచుచు ప్రేపల్లె కరిగి బలరామకృష్ణుల దైవభావమున దర్శించినాడ క్రూరుడు. మధురలో జరిగినదంతయు మున్ని నారదుని వలన నెఱిగియున్న వారగుటచే తల్లిదండ్రుల యనుమతింగొని ధను ర్యాగ నెపంబున మధురకేగ బలరామకృష్ణులు నిశ్చయించు కొనిరి.

ఈ వార్త ప్రేపల్లెలో క్షణములమీద ప్రాకినది. కృష్ణుని వీడి యుండజాలని వారై పలుతెఱంగుల జింతించుచు యాదవు లెల్లరు గొల్లుమనిరి. అక్రూరుడు కాదు వీడెవడో! క్రూరు డనిరి. హా దైవమా! మమ్ము వదలి వెళ్ళెదవా! యని తపించిరి. పరమభక్తులు భగవంతుని కొరకు పడెడి వేదనయది. కృష్ణుడు వారినెల్లర నెట్లోదార్చవలెనో! ఎవ్వరినెట్లు లాలించవలెనో! అట్లోదార్చి యట్లులాలించి తల్లిదండ్రులకడ సెలవు గైకొని ధీరగంభీర వదన భాగంబుల తేజంబులు వెల్లి విరియించుచు గంధగజంబులున్న వనంబునకు రయంబున సంబరంబున నేగు సింహకిశోరంబులభాతి - అక్రూరుడు గొనివచ్చిన రథంబు నధి రోహించి ముదంబున బయలుదేరిరి.

మార్గమధ్యమున స్నానసంధ్యాదులొనర్చుకొన నేగిన యక్రూరునకు యమునలో బలరామకృష్ణులు గనిపించగా, తిరిగి వచ్చి రథంబున గలవారిని గాంచుటచే వారిపట్ల దైవభావము పరిపూర్ణముగ గుదురుకొనినది.

వారినటకు గొనిపోవుటలో దానేమియు దోసమాచరించుట లేదనియు-దుష్టశిక్షణ విషయమున దాను రవంత నిమిత్త మాత్రుడుగ నుండుట కతన తానొనర్చు చున్నది సర్వవిధముల ధర్మకార్యమే యనియు - వారు పసివాడు గారనియు - పసుప్రవృత్తి గల వారిని గసిమసంగ వచ్చినవారనియు - సంతృప్తి నందుచు చరితార్థుడనైతినని యానందించుచు బలరామకృష్ణులతో మధురాపుర పరిసరములజేరెను.

"నంద తపఃఫలంబు సుగుణంబుల పుంజము గోపకామినీ
బృందము నోముపంట సిరివిందు దయాంబుధి యోగిబృందముల్
డెందము లందుగోరెడు కడింది నిధానము సేరవచ్చెనో
సుందరులార! రండు చనిచూతము కన్నులకోర్కిదీరగన్"

శత్రునగరమనుకొనెడి మధురలో స్త్రీలందరిట్లు బలరామకృష్ణులయెడ నత్యంత ప్రేమాభిమానముల బ్రదర్శించుచుండిరనిన నది దైవమాయయే. దుష్ట పరిపాలనపట్ల తీవ్ర వ్యతిరేక భావముతో మూల్గుచున్న హృదయముల ఘోష యది. పురంధ్రీమణుల సౌహార్ద స్వాగతములు బలరామకృష్ణులకు లభ్యపడుట విశేషము. దైవత్వసంవిలసితమైన మహా

వ్యక్తిత్వము కొరకు - నిర్భయముగ నాటాటమును వ్యక్తీకరించుచున్న ప్రజల గుండెల సవ్వడియది.

స్త్రీశక్తి యభిమానించని రాజ్యమిక నిలువదు. పడతుల ప్రశంసలకు పాత్రమైన పరిపాలన కెన్నడైనను శ్రీరామ రక్షయే. పౌరకాంతల ప్రమోదములమధ్య ప్రసూనవర్షములో తడియుచు బలరామకృష్ణులు పురప్రవేశ మొనర్చుట మహాభ్యుదయ సూచకము. దైవశక్తి నెగ్గుననుటకు సాక్ష్యము.

మా యింటికి దయచేయుడని యభ్యర్థించిన యక్రూరునితో సమయము వచ్చినపుడు - మా కర్తవ్యము నిర్వర్తింప బడగనే మీ యింటికి తప్పక వత్తుమని చెప్పి బలరామకృష్ణులు వానిని బంప - అక్రూరుడు బలరామ కృష్ణులు నగరమున ప్రవేశించిరనియు - వచ్చుచున్నారనియు - రథము వలదని రనియు కంసునకు నివేదించి తన గృహంబునకు జనియెను.

మధురలో దైవశక్తి ప్రవేశించినది. కంసుని యను యాయులగు వారినెల్ల వరుసగ హతమార్చుచు తమశక్తి తమ కన్న ముందుగనే కంసుని కడకు జేరునట్లొనర్చుచు బలరామ కృష్ణులు మధురానగర వీధులలో మందహాస సుందర వదనార విందులై నడువసాగిరి.

కంసునకు నిత్యము వస్త్రములుదికియిచ్చు రజకుని తొలుత సంహరించి యా బట్టలనన్నింటిని వశపరచుకొని - మాలాకారుడైన సుదామునికడకరిగి వాడందించిన కుసుమ

మాలికల నలంకరించుకొని వచ్చుచుండ బలరామ కృష్ణులకు దారిలో కుబ్జ కన్పించినది. కుబ్జ కంసుని దాసి. గంధానులేపనముల గొనిపోయి యొసగుటామె నిత్యకృత్యము. తాను చాదిన గంధమును బలరామకృష్ణుల మేనులకలది - తలవంచి సిగ్గున కృష్ణు నెదుట నిలిచెను. వికృతమైన గూనితోనున్న యామె శరీరమును స్పర్శామృత సౌభాగ్యముచే సరిదిద్ది సుందరస్వరూపిణిగా కృష్ణుడొనర్చెను. కుబ్జయైన నేమి? దేహము దురదృష్టవశమున వికృతమైన నగుగాక! ఆమె భావనకు వికృతిలేదు. దైవభావమున యశోదపట్టినామె యారాధించినది. సఖ్యభావయుగల సార్వభౌముల నలరించెడి హృదయముతో సమదృష్టితో కృష్ణుడామెను మమతతో లాలించినాడు. నా యింటికి వేంచేయుమని యామె యభ్యర్థింప - వచ్చినపని నెరవేరిన యనంతరము తప్పక నీ ముచ్చట దీర్తునని పురవీధుల బయలు దేరినాడు.

రాజవీధులలో కృష్ణుని బలరాముని పౌరులు సత్కరించినతీరు మధురకు ప్రభువు కంసుడా? కృష్ణుడా? అనెడి శంక నుదయింప జేయుచుండెను. నేరుగా వారు ధనుశ్శాల కరిగిరి. పండెము కొరకై తెచ్చిపెట్టిన కోదండమును వామహస్తమున నెత్తి ఫెళ్ళ్యమని విరిచి యా నాదముతో కంసుని బింకమును కృష్ణుడు సడలించివైచెను.

చూచుచుండగనే శత్రువు తన రాజ్యమునందు ప్రవేశించి వరుస వరుసగ నల్ల కల్లోలములను గల్గించుచు యాగమండపమున

జేరి యవలీలగ ధనుస్సును భగ్న మొనర్చుటగాంచి కంసుడు నిర్విణ్ణుడైనాడు. దైవశక్తిముందు దౌర్జన్యపరుల దర్పమెంత?

అన్ని యెడల పరమాత్ముని లీల లెట్లప్రతిహత విజయమును గడించుచు ముందునకు జనునో వివరించుచున్న ఘట్టములవి. దారుణమైన దురాశతో కన్నుమిన్నెఱుగక గర్వోన్మాదియై సంచరించు ఖలుడెట్టి ఘోర పరాజయమునకు గురియగుచుండునో వ్యక్తీకరించు సన్నివేశములవి. ఇట్టి ఘట్టములకు సన్నివేశములకు పరిపూర్ణ రూపకల్పనయే భాగవత గ్రంథము. మహత్తరములయిన - భగవచ్ఛక్తికాకరము లయిన యిట్టి దివ్యాంశములను వెలయించి పరమాత్మని యపూర్వ మహిమలను నిరూపించుటకే భాగవత కల్పతరువు భక్తలోకమున కందింపబడినది.

ఒకరి సూచనలతో నిమిత్తములేకయే - తానొనర్చవలసిన విధులనన్నింటిని వరుస వరుసగ నిర్వర్తించుకొనుచు బోవుచున్నారు బలరామకృష్ణులు. నిరోధించిన వారిని నిర్మూలించుచు ముందున కరుగుచున్నారు. సముద్ధతితో సాగుచున్న దైవశక్తి నడ్డువెట్టగల సాహస మెవ్వరికున్నది? ఉన్నంత మాత్రమున సాగునా?

ఇంతలో కువలయాపీడమను మదగజమును బలరామకృష్ణుల మీదికి కంసాదులు వదలిరి. లీలావిలాసముగ వారా మత్తకరిని దుత్తునియ లొనర్చిరి. సాము గరిడీల ఆటు డేలిన

సాహసులుగా బేర్చన్న గండర గండలు మల్లయుద్ధ విద్యాప్రవీ
ణులునగు చాణూరముష్టికులు బలరామకృష్ణులం గనుసిరి.
చిచ్చఱ పిడుగులై విజృంభించి యా బాలు రిరువురు - కఠిన
కర్కశకాయులయిన చాణూరముష్టికుల నవలీలగ సంహరించిరి.

దురహంకార మెన్నడు నెక్కువాదు. దైవబలము లేని
వాడెన్ని బలములున్నవాడైనను దుర్బలుడే. దుష్టుల కనుయా
యులుగనున్నవారును దుష్టులుగనే పరిగణింపబడి భగవానుని
దృష్టిలో క్షమార్హులుగానివారే యగుదురు. వారికి దైవశక్తి
వలన పరాజయము తప్పదు. న్యాయ శూన్య భావనుడైన
ప్రభువు పతనావస్థ ననుభవింపవలసినదే. కంసునకాస్థితి గనిపిం
పించినది. దైవశక్తి క్రిమి క్రిమముగ కంసుని యనుచరుల
నందరిని మట్టుపెట్టుచువచ్చి, కడకు కంసుని ముందునిలిచి గర్జిం
చినది.

గరుత్మంతుడు సర్పరాజును - గావు పట్టుపట్టి కబళించు
చందంబున- అధర్మపీఠము నధిష్ఠించి-అక్రమాహంకారమతో
ఆత్మీయతా భావమునుగూడ విస్మరించి - అఖండమహాధికార
లాలసతతో వ్యవహరించుచు-సంఖ్యాతీతము లయిన దారుణ
కృత్యముల గావించుచున్న - అధర్మశక్తికి ప్రతిబింబమగుచగు
కంస మత్త మాతంగముపైకి గోపాలకృష్ణ సింహ కిశోరము
దూకినది. క్రమము పైకివచ్చినది - అక్రమము నేలగూలినది.
న్యాయము మిన్నునంటినది - అన్యాయము మన్నుగలిసినది.

ధర్మము తలయెత్తినది-అధర్మము శిరమువంచినది. దుర్జనుల కలలు కరిగిపోయినవి- సజ్జనుల చిరకాల వాంఛలు ఫలించినవి. దురావేశము పరాభూతమయినది- ధర్మాభిరతి పురోగమించి నది. యోగ్యత నెగ్గినది - అయోగ్యత వ్రమ్గినది. సాధువుల బాధ లంతరించినవి - మూర్ఖుల దుష్కార్యములకు స్వస్తి వాచ నము పలుకబడినది. దైవశక్తి విక్రమించి జయించినది - దానవశక్తి తిరోగమించి నశించినది. తనకేమియని విజ్రువీగిన కంసరాజు ప్రభుత్వము ధ్వంసమైపోయినది. ఆ పన్నుల నాదు కొని యార్తుల నాదరించి - అపార కృపాజలధిగా-ఆనంద రస స్వరూపముగా - అభినుతుల నందుకొన్న కృష్ణస్వామి యాజ్ఞ యాదలవహింపబడినది. అది ధర్మ విజయము. దైవ విజయమును. తాదృశ దైవశక్తుల పురోగతిని లోకకళ్యాణ రీతిని విపులముగ వివరించుటవలననే భాగవతవాణి భగవంతుని వాణియైనది. ప్రజల అంతర్వాణిగా నిల్చిపోయినది.

భాగవతమంతయు నిట్టి దివ్య సన్ని వేశములనే చిత్రిం చుచు వచ్చినది. సర్వత్ర భగవచ్ఛక్తిని భగవత్ప్రతిభను వ్యక్తీక రించు నీ దివ్యగ్రంథమున నే యంశమును గైకొనినను - అది సకలలోకముల కాదర్శపాత్రముగ నుండదగిన యేదో యొక మహత్తర సందేశమునే ప్రతిధ్వనించుచుండును.

దారుణ క్రూరచర్యల యుద్ధతిని సహింపక దైవమెట్లు వెంటబడి యా దుష్టశక్తిని కూలద్రోయునో! అట్లే నమ్మకొని

సర్వము నీవేయని యచంచల భావమున భగవంతు నభ్యర్థించు భక్తులను సంరక్షించుటకుగూడ్డై వమువగట్టి పూనికవహించును. భాగవతము భక్తిరసమునకు ప్రాధాన్య మిచ్చిన గ్రంథరాజ మనుకొంటిమి- భక్తి తత్త్వమునకు పట్టముగట్టిన పరమభావన భావసంపుటి యనుకొంటిమి.

అవతారమూర్తియై సర్వలోకాకర్షణశక్తితో సంకర్షణ మహిమలను బ్రదర్శించుచు బాల్యమునుండియు భగవానుడుగా సమాదరింపబడిన శ్రీకృష్ణ దేవుని భక్తజనానురక్తి యెంత మహత్తరమైనదో! వివరించుట కెన్నియో సాక్ష్యములుగలవు. ఆ కృష్ణ ప్రభువునకు దుష్టశిక్షణానురక్తి యెంత ముఖ్యమైనా! శిష్టరక్షణానురక్తియు నంతటి ముఖ్యమైనదే. ఆ ప్రబల విశ్వాస మును సాధకలోకమునకు కలుగజేయువలసిన యవసరము బ్రహ్మాపరమునందెంతగనో యుండెను. కావుననే పూజ్యుడైన నారద మహర్షి యా కాలమున కనుగుణముగ నట్టి దివ్యాదేశము నందించి ధన్యుడవుగమ్మని వ్యాసమహర్షి నాదేశించి పుణ్యము గట్టుకొనినాడు.

భగవానునికి నిరుపేదయనియు-శ్రీమంతుడనియు తారతమ్యములేదు. నిశ్చల విశ్వాసము - నిర్మల భక్తి భావన మాత్రమే పరమాత్మని దృష్టిలో పరిగణనకువచ్చు ముఖ్యాంశములు. హృదయపావిత్ర్యమునకుగల ప్రశస్తినే యెలుగెత్తి చాటుచు - దైవమహిమలను విశదీకరించు కుబేరులగాథలు

గాక కుచేలుల కథలున్నైత మిందుండుట విశేషము. భగవానుని దృష్టిలో భక్తికే ప్రాధాన్యముగాని, వ్యక్తికిగాదు. సకలసంప దలను తులయందొక్కవైపుననిడి - మరొకవైపున భక్తినుంచిన పరమాత్మని దృష్టి బలముండుటచే తూగును భక్తిగల వంకకే నిస్సందేహముగ క్రొగ్గును. సిరియుండవచ్చును. పరాక్రమ ముండవచ్చును. బంధువర్గము మెండుగ నుండవచ్చును. పరి వారము గొప్పదియే కావచ్చును. భోగములకు గొదువయుం డక పోవచ్చును. సర్వేశ్వరుని దృష్టిలోనివి యన్నియును సర్వ సామాన్యములే.

నయ శీలసంపత్తియొక్క- పెంపు-మనస్సుకుగల నిగ్రహ పాటవము - వర్తనకు మేలిమెఱుగులు దిద్దు యోగ్యత-అచం చలమైన నిష్ఠ - సర్వము భగవంతునిక్కపయే యని నమ్మి భజించు నిర్మల భక్తిభావన నరుని యున్నతికి మూలకారణ ములుగా పరిగణింపబడును. భక్తి లేని పూజలన్నియు పతిత్రే టనియే భావింపవలయును. పరమాత్ముడు భక్తికి మాత్రమే పరవశించును భక్తుని మాత్రమే దరికి జేర్చుకొని తాదాత్మ్య మున మురియును. నమ్మకొల్చెడి వారికన్న నారాయణునకు సన్నిహితులెవ్వరును లేరు. నిరుపేదయును నీరజనాభుని కారుణ్య మును జూరగొనుటకు వలసిన యోగ్యతలున్న నర్హుడే కాగ లడు. సిరిపొరలు వాడే యగుగాక-నిరుపమయోగ్య గుణసంపద కొలివడిన వాడు భగవానునికి దూరుడే కాగలడు.

భాగవతమునందీ విషయము ఘంటాపథముగ వివరింప బడినది. ఆ రూపమున మానవాళిలో భక్తితత్వము సర్వతో ముఖముగ వృద్ధినందుటకు సర్వవిధావకాశములను భాగవతము సంఘటించెనని యనవచ్చును.

కుచేలోపాఖ్యానము

మహోత్తమ మైత్రికి పరమపవిత్ర భక్తికి ప్రతిబింబముగ చరిత్రలో నిలిచిపోయిన కుచేలునిగాథ యీ విషయమున మనకు స్మరణీయమైనట్టిది. భగవానుడైన బాలకృష్ణునితో చిన్ననాటి నుండియు గలిసి-మెలిసి యాయన యనురాగ రసధారల దనిసి - అసాధారణ స్నేహమాధుర్యాను భూతులు చవి జూడ జాలిన మహాదృష్టశాలి కుచేలుడు.

బాల్యమిత్రుడగు శ్రీకృష్ణుడు ప్రఖ్యాతిగన్న ప్రభువుగ మాత్రమే కాక పరమాత్మగా పరిజలచే మన్ననలందుచున్నను- తనవాడని యెడలు పొంగునట్లు చెప్పుకొనక, చాటించుకొనక, దూరముననుండియే దేవదేవు డనెడి దృష్టిని పెంపొందించు కొనుచు, వార్ధక్యము సందెప్పుడో యొక్కమారు మాత్రమే భగవద్దర్శనార్థము వెళ్ళిన ట్లా చిరకాల సఖునికడ కరిగి - తన హృదయ వైఖరికి మురిసిన భగవానుని యత్యద్భుత దివ్యాను గ్రహము నార్జించుకొనగల్గిన అఖండ భక్తి భావసంపన్నుడగు ధన్యజీవి కుచేలుడు.

కాలమెవరితో నెవరి నెప్పుడేల కలిపి నడపునో! మాన వుల మేధస్సున కందని మహోరహస్యమది. వారి వారి పురా కృత సుకృత దుష్కృతములపై నాధారపడియున్న - యంతు బట్టని సమస్యయది. దైవ మను సంధింపబూనిన సంఘటనలకు గల పరమార్థమును పరిశీలించి వివరింప చతుర్ముఖుడగు నలున కే సాధ్యముగాదే! నరులకెట్లు వీలుపడును. వాస్తవ మరయు నెం చిన వచింపదగిన మాట యదియే.

చక్రవర్తి తనయుడైన కృష్ణునకు - బక్కచిక్కిన వేద బాపని కొమరుడైన కుచేలునకు మైత్రిగుదురు చేమి? సాందీ పని విద్యామందిరమున నా యిరువురు నిమిత్తమాత్రము శిష్యు లుగ నిల్చు చేమి?

దశలన్నిటిలో విద్యార్థిదశ యుత్తమమైనది. ఉజ్జ్వల మైనది. చీకులకు చింతలకు జిక్కక నిర్మల హృదయముతో జ్ఞానసంపాదనమునందే మనస్సునిలిసి ప్రశాంత పరిస్థితులలో పర మానందము నందుచు గడపెడి జీవిత దశయది. ఆసమయమున యోగ్యతముడు - సర్వవిజ్ఞాననిధి - దయాస్వరూపుడునగు గురు దేవుడు లభించుట విద్యార్థియొక్క పూర్వజన్మ పుణ్యఫలమే. అట్టి జ్ఞానాభివృద్ధి గావించుకొనుటయందు సహకరించుచు - తనువులు రెండును మనస్సొక్కటిగా భావించి జతగూడుహితుడు దొరకుట విద్యార్థి దశయందు వ్యక్తికి కలిసివచ్చిన మహాదృష్ట మవవలయును.

కుచేలునకు తాదృశులైన గురువు మిత్రుడు విద్యా భ్యాస కాలమున లభించిరి. నాడు సాందీపనికడ జదివిన వారెం దరో యుందురు. కాని! కృష్ణకుచేలుల హృదయములు పెన వైచుకొని యంతగాఢముగ నన్యుల హృదయములు గలిసియుండ లేదనవచ్చును. కావుననే వారిమైత్రి యవిచ్ఛిన్నమై కాలభేద మును గణన సేయక యేకరీతిగ నిత్యనూతనముగ వర్ధిల్లినది.

లోకముల కన్నింటికి గురువై - నమ్మికొల్చెడి వారి భారముల నన్నింటిని చిన్నతనమునుండి శిరమున కెత్తుకొన నేర్చిన శ్రీకృష్ణుడు సాందీపనిని గురువుగ త్రికరణశుద్ధిగ నెంచి విద్య నభ్యసించినాడు. కుచేలుని ఆప్తసఖునిగ నెంచి యానంద మున దేలినాడు. వర్ణాశ్రమాచార ధర్మములను స్థాపించిన వాడు తానేయయ్యును లోకగతి క్రమమును మన్నించుటకై సాందీపనివద్ద నెల్ల శాస్త్రధర్మముల నెఱుగుటకై శ్రమించినాడు.

సాందీపని కృష్ణ కుచేలుల వినయ విధేయతలకు శ్రద్ధా భక్తులకు మురియుచు వారిపట్ల నపరిమిత వాత్సల్యమును జూపుచుండెడివాడు. గురువులను శిష్యులెట్లు శ్రద్ధాభక్తులతో గొల్చి విద్యల నార్జింపవలయునో లోకమున వ్యక్తముచేయు టకే కృష్ణుడిట్లు వ్యవహరించెనేమో! కాసిచో! సర్వజ్ఞ సమ న్వితుడైన దివ్యమూర్తికి గురువేల? అధ్యయనాభ్యసనము లేల? కటికి పేదతనమున నలమటించు కుటుంబమునుండివచ్చిన కుచే లునితో సకలసంపదల కాశ్రయుడైన ప్రభువు చేయిగలిపి మెలిమి

సేయుటన నేమి? మంచి హృదయమును మన్నించి యాదరింప వలయునని యెఱిగించుటకే. మైత్రికి ధన ధాన్యముల యాడంబరాదు లడ్డురావని నిర్మలమైన మనస్సున్న జాలునని వివరించుటకే. కాకున్న కృష్ణుడెక్కడ? కుచేలుడెక్కడ? స్నేహమమరు మెక్కడ?

సాందీపని భార్య శిష్యులను బిడ్డల పగిది జూచుకొనెడి యిల్లాలు. గురుపత్నిని తల్లిగ దలంచుచు, సేవాతత్పరులై జ్ఞాన ధనము నార్జించుట గురుకులముల గల సదాచారము, సత్సంప్రదాయము కృష్ణుడు సంప్రదాయమునకుగూడ, తలయొగ్గి విశిష్ట గుణపాఠమును విద్యార్థిలోకమున వెలయించు టాదర్శప్రాయమగు దివ్యచర్యయే.

సాందీపని యిల్లాలొకమారు పటజేయు నిమిత్తము కట్టెల గొట్టి తెమ్మని కృష్ణ కుచేలుల నడవికంపినది. చక్రవర్తి బిడ్డయైనను గురుకార్యమును శిరసావహించి నిర్వహించవలసినదే. అద్దానిని పరమార్థముగ భావించవలసినదే! అట్టి అవకాశము లభ్యపడుట మహాదృష్టముగ నెంచుచు గురుదేవు డెప్పుడు తమ కొక పని నప్పగించునా! సభక్తికముగ నద్దానిని సకర్మముగ నెప్పుడు నిర్వర్తింతునా! యని నిరీక్షించవలసినదే!

అధ్యాపకులనోట నొక మాట వెలువడకముందే వినయ విధేయతా భావమున విద్యార్థి జనముల శిరములు నమ్రములు గావలసినదే? అట్టి బంగారు కాలమును - పవిత్రాచారమును

గుర్తునకుదెచ్చి సర్వకాల విద్యార్థి జన హృదయములను సంస్కరింపగల యొకానొక మహత్తర ప్రబోధమును భాగవతము గర్భిత మొనర్చుకొని ప్రకాశించుచున్నది. పురుషోత్తముడైన కృష్ణదేవుడే యిట్టి సన్నివేశము లందనుసరణీయుడైన కథానాయకుడగుట కడుంగడు ప్రశంసనీయ విషయము.

పరస్పరానురాగబలమున వర్ధిల్లుచున్న పరమాత్మునితో బాటు చిన్నతనమునుండియే సత్కార్యములన్నింట ముండడుగు వైచి చరితార్థుడైనాడు కుచేలుడు. కావుననే భాగవతమున దేవ దేవుడైన కృష్ణుని కథకువలెనే – సుగుణగణ పరిపూర్ణుడైన కుచేలుని కథకుగూడ ప్రత్యేకతయు ప్రఖ్యాతియు వచ్చినవి.

విద్యా వివేకములతోపాటు కష్ట సహానశీలమును – సులువులతో గలసిమెలసి యుత్తమభావనతో వర్తించు యోగ్యతను నాడు గురుకులములు విద్యార్థులకు నేర్పెడివి. గురుదేవుల కృపదేశబలముతో బుద్ధిపాటవము పెంపొందుచుండ – గురుశుశ్రూషా విశేషములతో కాయశక్తి ఘనతనుగాంచుచుండెడిదేమో! ఈ రెంటిమధ్య సాగించు శ్రమ – క్రమశిక్షణకు విద్యార్థి హృదయముల నాలవాలముగ మార్చివైచెడిదేమో! అట్టి యుజ్జ్వల క్రమశిక్షణయేగదా! నీతిమంతమైన సమాజమును సృష్టింప గల్గునది. తాదృశమైన స్వచ్ఛభావసమ్మిళిత సంఘ సముదయమునకే భాగవత ముద్దిష్టమైనది. అట్టి మనోనిగమ

మును - సరలసాధు వర్తనమును తరువాత తరముల వారిలో పెంపొందించుటయే భాగవత మహాప్రబంధ ప్రధానలక్ష్యము. తద్భిన్నములైన వికార సంస్కారములపై, దుర్లక్షణములపై, దురాచారములపై భాగవతమెక్కుబెట్టిన పాశుపతము.

కృష్ణకుచేలులు గురుపత్ని యనుజ్ఞపై నరణ్యమున కేగిన మొలది కాలమునకే భయంకరమైన గాలివాన చెలరేగినది. భూమ్యాకాశము లేకమగుచున్నట్లు కుంభవృష్టి గురియ సాగినది. మానవులు వెలుపలి కేగుటకు సాధ్యముగాని భయంకరస్థితి యేర్పడెను. పశుపక్ష్యాదులుసైతము నిలువ నీడలేని ప్రళయమున విలవిల లాడజొచ్చినవి.

సాందీపని దంపతులు గుండెలు బాదుకొనసాగిరి. విపరీత శీతబాధకు దట్టుకొనలేక ఘోరారణ్యమున పసినిసుగులెట్లు వాపోవుచున్నారో! యన్న విషయమును దలచుకొని తీరని వ్యథ నందసాగిరి. వారికేమియు దోచకుండెను. కృష్ణకుచేలు లారాత్రియంతయు నానట్టడవినట్లే బాధలనందుచు చిమ్మచీకటులు గ్రమ్మినచే దారిగానక తల్లడిల్లుచు - వర్షమున దడిసి తెలవారిన తరువాత గురుకులమునకు జేరగలిగిరి.

వారిని జూడగనే సాందీపని దంపతులకు పోయిన ప్రాణములు మరలివచ్చినట్లయినది. వారినిరువుర నక్కునజేర్చుకొని "అయ్యలారా! మా కొరకెంతగాసిజెందితిరి. మీ కెట్టి యిక్కట్లు వాటిల్లెను? భయంకరములయిన వర్ష వాయుపీడనలకు మీరె

ట్లోప గల్గితిరి? కన్నుపొడుచుకొన్నను గప్పట్టి గాఢాంధకార మున దిక్కుదోచక మీరెట్లలమటిలి తిరో!" అని పలంతెఱ గుల విలపింపసాగిరి.

ఆ శిష్యవాత్సల్యమున కర్థవివరణ జేయగలశక్తి యెవరి కున్నది? ఆగురుభక్తికి భాష్యము జెప్పగల ప్రతిభ యెవరికుం డును? వీనికన్నింటికివెనుక - వేయికన్నులతోగాచి రక్షించు చున్న భగవత్తత్త్వమునకెవరు ప్రతిపదార్థము ప్రణాయగలరు? భాగవతమట్టి యుత్తమస్థాయిని జీవితమునందన్ని రంగములనుద యింపజేయుటకే యెల్ల వేళల యత్నించుచున్నది.

"నాయనలారా! మీరు మాకొఱకై పడిన బాధలను దలంచుకొని కుములుచున్నాను. స్వార్థత్యాగులై పరువ్ము కొరకు మీరుగావించిన సాహసము మిమ్మెల్ల వేళల సంరక్షించు గాక? మీ శాస్త్రవిజ్ఞానము పరిపూర్ణతను బడయుగాక! మీ యభిమతములు ఫలించి మీ సంకల్పములు జయించుగాక! మీరు స్వచ్ఛంద దివ్యతేజముతో సదా బుద్ధిబల విరాజితులై యశోధనులై ప్రకాశించుదురుగాక!"

అమోఘవచనములతో శిష్యుల నాగురుదేవుడట్లాశీర్వ దించినాడు. సాందీపని దీవన వారియభ్యుదయమునకు కొండంత యండయైనది. విద్యార్థిదశయందు రాత్రివేళ ప్రహ్లాదకరపరిస్థి తులలో, వారుచూపిన ధైర్యము వారిలో సహనశీలమును శాశ్వతముగ నెలకొల్పగల్గినది. గురువులకు మహానందమును

ఘటించిన సన్నివేశమది తరువాత కొంతకాలమునకు వారిరు వురును స్నాతకులై గురువులదీవనల బడసి స్వగృహములకేగిరి. ఆసందర్భమున వారియుపురనుజేర్చి దృఢముగ బంధించిన స్నేహ సూత్రము కాలముగడచిన కొలది పురిబోసికొనుచునే యుండ సాగెను. కృష్ణ కుచేలుల హృదయములుసహజ వినిర్మల శోభా సమన్వితములు. పవిత్రభావ పరిపూర్ణములు. తుచ్ఛములైన తాత్కాలిక ప్రయోజనములకు, పరిమిత ఫలసాధనలకు వారి హృదయములందు కావులేదు. కావుననే వారి హృదయము లందు ముద్రితములైన పావన స్నేహముద్రల చిహ్నములు కాలమెంత గడచినను చెరగవు. మధ్యకాలమున నొకరినొకరు చూచుకొనకున్నను సన్నిహితత్వము నురుగున బడలేదు. మరపు నకురాలేదు.

మైత్రియనిననట్లుండవలెగదా! భాగవత మీ మైత్రికిగల మహామహిమనే భక్తిభావముతో పొదిపి దైవమహిమతో జతజేసి కుచేలోపాఖ్యానమున కృష్ణదేవుని యనిర్వచనీయ దీన జనోద్ధరణదృష్టికి - అపూర్వస్నేహభావ వైఖరికి ప్రబల సాక్ష్య ముగా నిరూపించుచున్నది. పౌరజీవితమున ప్రవేశించిన కృష్ణ కుచేలు లిరువురు కలిమిలేములకు కావలసిన చుట్టములైనారు. కలిమితల్లి కృష్ణుని - లేమి పెద్దమ్మ కుచేలుని గాఢముగ ప్రేమించి మిక్కిలి దగ్గరకు జేర్చుకొనినారు.

శత్రువులకేని వలవదగిన ఘోరదారిద్ర్యము కుచేలునిపీడిం పసాగినది. పరమసాధ్వియైన భార్యతో బాటుగ దానెంత సహన

మును గలిగియున్నను కన్నబిడ్డలగోడు కుచేలుని గుండెలవ్రణింప
జేయుచుండెను. లేమి క్రుంగుటలేదు. సంతు పొంగుచున్నది.
కుచేలసంతానమన్నానుడికాయన కుటుంబపరిస్థితిమూలమైనది.
ఒకనాడు ధైర్యమువహించి భార్య భర్తను కృష్ణునిచెంతకుబంప
బలవంతము జేసినది. భార్య పలుమారు గుర్తుచేయుచున్నను
చెవిబెట్టని కుచేలుడీసారి తప్పక యామె యాలోచనపై బుద్ధి
నిలుపవలసిన వాడాయెను.

"పరమ దారిద్ర్యము కల్పించుచున్న బాధలలో మీతో
బాటు సంతోషముగ భాగముపంచుకొనుచునే యున్నాను.
ఉంఛవృత్తితో మీరార్జించిన నూకలు బిడ్డల కడుపులనింపలేక
పోవుచున్నవి. తాము పసివారి కొరకయిన బయలు దేరకతప్పదు.
వారి తనువులు శుష్కించినవి. కనులలో ప్రాణములు నిల్పుకొని
కన్నబిడ్డలు కటకట పడుచున్నారు. ముఖములు కళావిహీనము
లయినవి. అస్థిచర్మముల యాధార మొక్కటే మిగిలియున్నది.
మీ బాల్యమిత్రుడు లక్ష్మీపతియైన కృష్ణుడు, దీనులవాలిటి
కాయన కల్పవృక్షము. మీకు ప్రాణసమానుడైన చిన్ననాటి
చెలికాడు.

కలలోనఁ దనుఁ మున్నెఱుంగని మహాకష్టాత్ముడైనట్టి దు
ర్బలుడా పత్సమయంబునఁ నిజపదాబ్జాతంబులుల్లంబులో
దలపన్ తోడనె మెచ్చి యార్తిహరుడై తన్నైననిచ్చున్ సుని
శ్చల భక్తిన్ భజియించువారికిడడే సంపద్విశేషోన్నతుల్

సాక్షాత్పరమాత్ముడైన కృష్ణదేవుని నమ్ముకొని యున్న మన యాశలనాయన వమ్ముచేయునా !

వరుడు సాధుభక్తజన వత్సలుడార్తశరణ్యుడిందిరా
వరుడు దయాపయోధి భగవంతుడు కృష్ణుడు దాకుశస్థలీ
పురమున యాదన ప్రకరముల్ భజియింపగనున్నవాడు నీ
వరిగిన నిన్నుజూచి విభుడప్పుడ యిచ్చుననూ నసంపదల్

నాథా ! మీరిక నాప్రార్థన మన్నింపకతప్పదు. అని పలు తెఱగుల ప్రార్థించినది. ప్రోత్సహించినది. తనతోబాటు గంజి యైనప్రాగి పడియుండిన పడతిగుండెలలో బిడ్డల నిమిత్తమై చెల రేగిన వేదనను కుచేలుడర్థముజేసికొనినాడు.

క్రూరవికటాట్టహాస మొనర్చుచు గ్రుడ్లురుముచు పయిం బడు దారిద్ర్య పిశాచి నిశిత దంష్ట్రలనడుమబడి నలిగిపోయెడి కుచేలుని దీనావస్థ యెవ్వరికిని రాగూడదు. సహనశీలుడైన యా పుణ్యాత్ముడు మాత్రమే యీదారుణవ్యథల నెట్లో యోర్చి భవించుచు కాలమును నెట్టుకొనిరాగలిగినాడు. సర్వవిధముల ననుకూలవతియైన సతియుండుటాయనయదృష్టము. జరుగుచున్నంతవరకే సంతృప్తిపడ నేర్చుకొనినారాదంపతులు. పరులెవ్వరేని నిట్లొనర్పలేరనుటనిక్కము. నాడు కుచేలునకు సతిమాటలు హితములనియే తోచినది. తాను పలుమాఱనుకొనుచున్న విషయమేయిది. భగవానుడైన శ్రీకృష్ణుని దర్శించిరావలసిదే! శేషోభిలాషియైన చిన్ననాటిస్నేహితుని గలిసికోవలసినదే!

కుచేలుడొకనిర్ణయమునకువచ్చి సమ్మతించినాడు. భార్యయెట్లో కష్టపడి మిగిల్చిన యటుకులుదెచ్చి చినుగులువడిన పెనిమిటి యంగవస్త్రముకొంగున గట్టి శ్రీకృష్ణునకు కానుకగా నందింపు డని యెచ్చరించి పరమానందమున పతిదేవుని ప్రయాణోన్ముఖుని గావించినది.

భగవద్దర్శనార్థమేగుచున్న యాత్రికునివలె కుచేలుడు బయలుదేరినాడు. శ్రీకృష్ణ సందర్శనోత్సాహము మనస్సును తొందరబెట్టుచున్నది. చిన్ననాటిచెలిమి కనులముందునిలిచి తీయని యూహాలను రేకెత్తించుచున్నది.

డొక్కలు లోతుగబోయి-కనులెండి-పెదవులు తడుపు కొనుచు-సంస్కారరహితములైన జుంజురు వెండ్రుకలతో నిట్చి యున్న బిడ్డలు మధ్యలో గుర్తునకు వచ్చుచున్నారు. కనులలో నీరు నిలుచుచున్నది. భార్య యెట్టయెదుట నిలిచి ప్రోత్సహించినట్లగుచున్నది.

భగవంతునిజేర పరితపించెడిప్రాణి-అడ్డుగానిల్చెడి యపనే కానేకాభ్యంతరములు నిష్క్రియుండునుగాబోలు. తాను ద్వారకాపట్టణము నందంతఃపురమునంగల శ్రీకృష్ణునింగాంచుకొట్లా యనెడిది మరొకవేదన. నా భాగ్యమెట్లున్న నట్లగునని మనస్సు నోదార్చుకొని ద్వారకకు జేరినాడు. రాజమార్గమున నంతఃప్ర మునకు పయనమైనాడు. కక్ష్యాంతరంబులెన్నియో దాటుచున్నను గమనమునడ్డువారు లేకుండుటాయన యదృష్టమేమో!

సమయ సందర్భములు కలిసివచ్చునప్పుడన్నింటినిక్లే భగవంతు డనుకూల పరచునేమో !

మృదుహంసతూలికా తల్పమునగల మన్మధ మన్మధుడు పీతాంబరధరుడు మకరకుండల సదూ్భషుడు యదుకులాంభోధి చంద్రుడు దివ్యతేజోమయుడు సాక్షాన్మహావిష్ణువునగు కృష్ణుని గాంచి యెడలుమరచి పారవశ్యము నమునిగిపోయినాడు కుచే లుడు. వెంటనే శ్రీకృష్ణుడు తాయెనున్నతతల్పమునుండిదిగి కెము రుగనేగి ఎన్నాళ్ళకెన్నాళ్ళకనుచు చేతులుసాచి ప్రియమార గాఢ ముగ కుచేలుని గౌగలించుకొనినాడు. ఏమియీమైత్రిమహిమ! ఎంతటి వినిర్మలమైనదా స్నేహబంధము! అధికారానధికార నిమిత్తమాత్రస్థితులకతీతమైన మైత్రియది. నిమ్నోన్నతస్థితులు-హెచ్చులొచ్చుల తారతమ్యములు-విజ్ఞ తాజ్ఞతలు-ధనికనిర్ధనిక భేదములు-కులములగొడవలు-సామాన్య అసామాన్యవైఖరులు పరిగణనకురాని పరమపవిత్రమైన మైత్రిమహిమయది. సర్వసా మాన్యుడును, చక్రవర్తియుగూడ హృదయములు గలిసినచో స్నేహసూత్ర బంధితులై యేకరీతి సమభావమున మెలగవలసి నదే. కాలపుతెరలడ్డురావు. పరిపాలనా ప్రాభవము ప్రక్కకు తొలగును. సుఖభోగములమాట విస్మరింపబడును. బంధుత్వము లెక్కింపబడదు. తనగొప్ప జ్ఞప్తికేరాదు. స్నేహమహిమముం దన్నియు తలవంచి చెలిమిని పీఠమెక్కించును. యోగ్యతముల స్నేహధోరణియేయట్టిది. కావుననే యెప్పుడో బాల్యమున

ముద్రితమై తన హృదయమున చెరగక నిలిచిన కుచేలుని ప్రతి రూపము కంటబడగనే పరవశుడై యెదురేగి బ్రహ్మానందమున కౌగిలించుకొని కుశలప్రశ్న లడుగుచు లోనికిగొని తెచ్చినాడు కృష్ణుడు. తాను పవ్వళించెడి మృదుహంసతూలికా తల్పమునఁ గూర్చుండజేసినాడు. తన యంగవస్త్రమును నిరుపేదతనమును జెప్పకయే చెప్పెడి తనరూపమునుజూచుకొని యీ తల్పమున గూర్చుండుటకు శంకించుచున్న కుచేలుని శ్రీకృష్ణుడానందమున నుక్కిరిబిక్కిరియొనర్చుచు గూర్చుండబెట్టియుండును. పరమేశ్వరుడు యోగీశ్వరేశ్వరుడు లక్ష్మీహృదయేశ్వరుడు చెంతనిలిచి యుండ గోచిపాతరాయడైన పెద్దమ్మ ముద్దులబిడ్డ ఘనమర్యాద లందు మెంతవింత! అహో! స్నేహశక్తీ! నీవెంతయేనియు జేయ గలవు. నీ ప్రతిభముందు చిత్రవిచిత్రములెన్నయేని జరుగగలవు గదా! సోదరుడైన బలరామునకైన నిట్టి యత్యద్భుతాహ్వాన మెన్నడేని యీయంబడెనా! రుక్మిణీ కరస్థకలశజలముతో స్వయ ముగ కృష్ణుడా పేదబాపని పాదముల గడిగినాడు. ఆమెయే శుభ్రవస్త్రమున పాదములతడి యొత్తినది. పరిచారికలు పింజా మరములు వీవసాగిరి. ద్వారకాచక్రవర్తియు సకలయోగిజన హృదయవర్తియునగు శ్రీకృష్ణపరమాత్మ రుక్మిణీసమేతుడై యొనర్చుచున్న సేవల గొనుచు కుచేలుడేదో లోకమున దానున్నట్లునాడు. బాల్యజీవిత విశేషములను గుర్తునకుఁ దెచ్చు చు బుజమున చేయినిడి యదువంశరత్నము ప్రశ్నించుచుండ కుచేలుడానందమున ప్రత్యుత్తరములిడుచునాడు. ఈ యసా

ధారణమైన-అపూర్వమైన - మన్ననలను మర్యాదలను - తమ పరిభువునుండి యందుకొనుచున్న యీ వేదబ్రాహ్మణునిగని యంతఃపురస్త్రీ లందరు విస్తుపోవసాగిరి.

"ఏమి తపంబు సేసెనొకొ! యీధరణీదివిజోత్తముండుతొల్
భామున యోగిని స్ఫురదుపాస్యకుడై తనరారు నీజగ
త్స్వామి రమాధినాథు నిజతల్పమునన్ వసియించియున్న వా
డీమహనీయమూర్తికెనయే మునిపుంగవులెంతవారలున్."

"మిత్రమా! వివాహమైనదా? బిడ్డలెందరు? సుఖముగ కాలము గడచుచున్నదా?"

కృష్ణుడడుగుచున్న ప్రశ్నలకు ముసిముసి నగవులతో పెండ్లియైనదనియు బహుకుటుంబీకుడనై తిననియు జెప్పి మిన్న కున్నాడు. సమయముగదా! తనదారిద్ర్యమును కుచేలుడపుడు వెళ్ళబోసుకొనవచ్చునే! లేదు. బాధలను పన్నుదాటి రానియ్యా లేదు. దుర్భర వ్యధల నదుపులో బెట్టి వేదరికమును బ్రకటించు టిచ్చగించక బ్రహ్మానంద సంధాయకమైన కృష్ణ బాంధవ్యబల సమ న్వితస్నేహవాతావరణమున నూగిపోవుచున్నాడు. కల్పవృక్షము కడనిల్చి తన్మహామహిమను మనసార నభినందించుచు-కాలము గడుపక, కొంతసమయమును తనకదికావలె, నిదికావలెనని చెప్పుచు వ్యయపరచుట కాతడిచ్చగింపలేదేమో!

కాంచనలోలుడు గాడతడు. స్వర్ణ భ్రాంతియతనికి రవం తేనియులేదు. భౌతికభోగతృష్ణ యతనిని లొంగదీయలేకపోయి

నది. సర్వసామాన్య సాధుజీవితానురక్తి గలవాడతడు. సంతృప్తమానసుడాయన. ఉన్నంతతోనానందించెడి యల్పసంతోషియాతడు.

కృష్ణునకిదియెంతయు వింతగదోచెనా! సర్వహృదయవిహారియగు సర్వేశ్వరుడాయన. ఆయునకు తెలియనిదేమున్నది. "నా పుణ్యమెట్టిదో! పుణ్యనిధియు, బ్రాహ్మణులకందనిదియు నగు పరమాత్మ స్వరూపమును గనులారదిలకింపగంటిని. నా బాల్యమిత్రుడనెడి మమతతో పురుషోత్తముడైన లక్ష్మీపతిని గౌగలించుకొంటిని. నాకేమి! నేనెంతటి యదృష్టవంతుడ" నని మురియుచున్నాడు కుచేలుడు.

కృష్ణుడు కుచేలుని బుజమున వ్రేలాడుచున్న యటుకుల మూట విప్పి యివి యేమి? యనుచుండ - 'అయ్యో! వీనినైన ముందుగ నేనందీయకపోయితినే యనుకొనుచు - "నీ కొరకేనయ్యా!" యనినాడు. కుచేలునిమాటలు పూర్తిగాక ముందే "ఇవి, సకలలోకముల సంతృప్తిపరుపజాలినట్టివి సువ్వా!" యనుచు పిడికెడటుకుల గొని, పుచ్చుకొని మరియొక గుప్పిబట్ట కృష్ణుడు సన్నద్ధుడాయెను.

వెంటనే రుక్మిణి యడ్డుపడి - "చాలు చాలు, సకలసంపత్సమృద్ధుడైన సఖుడు సర్వసుఖములందుకొనుటకా గుప్పెడటుకులు చాలునన్నట్లు వారించినది.

ఆ రాత్రి కుచేలుండటనే కృష్ణునితో బాటుగ మధురము లైన వివిధ పదార్థములతో రాజభోజనము గావించుటకు ప్రారం భోత్సవ మొనర్చినాడు. జీవితమంతయు నామిత్రుడిట్లే సుఖసం పదల దేలవలయునని భగవాను డాకాంక్షించె నేమో!

కడుపునిండుగ దిని-కంటినిండుగ నొడలెరుగనిపగిది నిద్రించి ప్రభాతమున లేచి కాలకృత్యంబులు నిర్వర్తించి కృష్ణదేవునివద్ద సెలవుగైకొని - ఆయన కొంతదూరము తనతో బాటుగవచ్చి సాగనంప - ముదంబున తన యూరిదారిబట్టి బయలుదేరినాడు.

అయిన నిట నొక విచిత్రమున్నది. కుచేలుడేలవచ్చినట్లు? వచ్చినపని యేమైనది? అసలడుగకయే మరలినాడా? కాదు. వచ్చిన విషయము నడుగకయే కావలెనని వెనుకకు మరలినాడు. మరలుటకు గూడ నొక కారణమున్నది. ఆ కారణమునే మరలి వచ్చుచు కుచేలుడు మనమునందనుకొనినాడు.

"దరిద్రుడు సంపదంధుడై కానక తన్ను జేరడని" శ్రీకృష్ణు డనుకొనియే నా కేమియు నీయక పంపియుండును. కాకున్న శ్రీతార్తిహరుండు - సత్కృపాంభోనిధి సర్వవస్తు పరిపూర్ణునిగా నను జేయకుండునే"

అహో! ఎట్టి దివ్యభావన. ఈ భావన లోకమున నెల్లరి కున్న జగమెంత బాగుపడును! విశ్వమానవాళి కీయుత్తమ భావన చిత్తమున మాత్తుకొనజేయుటకే భాగవత మీ కుచేలుని దివ్యగాథ నిందు పొందుపరచెనేమో! కుచేలునియూహ యెంత

పావనమైనది. శ్రీకృష్ణ సందర్శనానుర క్తి సర్వదా మనస్సు నందున్న జాలునట! అది యుండుట కభ్యన్తర కరములుగా నిల్చెడి "సర్వవస్తు పరిపూర్ణత" యీయన కవసరములేదట! ఈ భావనయే, ఈదృఢ పవిత్రనిర్ణయమే, ఈ పావన భగవ ద్విశ్వాసమే కుచేలునికేమి యేని యీయగలదు. కుచేలు నెంత వానిగ నేని సలుపగలదు.

లోకమునగలవారి కెవ్వరికేని యిట్టి కఠోర దృఢ నిష్ప క్తియు - భగవద్భ క్తియును జాలును.

కుచేలు డట్లనుకొనుచు నిజమందిరమున కేగినాడు. తన కనులనే తాను నమ్మలేని పరిస్థితులట నెదురైనవి. జీర్ణ శీర్ణ పర్ణ శాలకు బదులుగా వైభవోన్నత లక్ష్మీనివాస మొకటి సాక్షాత్కరించినది. దేవతాకాంతలబోలు పరిచారికలందు సేవ లొనర్చుచున్నారు. తన యిల్లా! యిది యని శంకించుటకు వీలు గాని లీల తన గృహిణియు బృహత్సంతానమును మధ్యనిడు కొని సకల సౌభాగ్య సమన్వితయైన మహాలక్ష్మివలె కళకళ లాడుచు పన్నీటికలశముగొని తన కెదురుగా నేగుదెంచుచున్నది. విస్తుపోయినాడు కుచేలుడు. సంతోష బాష్పములొందు చెందు జారుచుండగ నే రాజాధిరాజుల బిడ్డలు ధరించెడి వస్త్రాభరణా ద్యలంకృతులతో మెఱయుచున్న బిడ్డలువచ్చి తనను జుట్టు కొనినారు.

బాల్యమిత్రమా ! పరమాత్మా ! నన్నెప్పటికిప్పుడు నీ పట్ల మనస్సు నిల్పుకొను చెలికానిగ కాలము గడుపుకొననిమ్ము తండ్రీ ! అని దేవదేవుని దలంచి మొక్కుకొనినాడు కుచేలుడు.

నమ్మిన మిత్రుని — నిర్మల హృదయుడైన భక్తుని కడ గండ్లనుండి కాపాడి—కనక వర్షము పయి గురియించెడి కరుణా మయుడైన పరమాత్ముని కృపను భాగవత మిట్లభివర్ణించినది.

మిత్రభావమున పరమాత్ముని సమారాధించి — దైవ తత్త్వమును నిర్మల హృదయముతో నుపాసించి — ఎట్టి యభి మతములను బహిర్గత మొనర్పకయే సకల సుఖములను నిఖిల సంపదలను గొనజాలిన కుచేలుని జీవితవైభవమునకు గల కీలక మును భాగవత మెంతయో యుదాత్తముగ నిట్లునిరూపించినది.

కావలసినది మానసిక పవిత్రత - ప్రసన్న ప్రశాంత భావన-భక్తి యుక్త ప్రవృత్తి - నిష్కామ ధోరణి - దురా శల నెదిరించి నిల్వగల్గిన విశాల వరమార్థ పరమాశయము.

చాలు నివియున్న సర్వమునున్నయట్లే. మిగిలిన విషయ ముల నన్నింటిని భగవానుడే చూచుకొనును. జరుగవలసిన వన్నియును జరుగుటకు వసతు లేర్పరుపబడును. ప్రసాదింపబడ దగిన ప్రయోజనములన్నియు వరుసవరుసగ ప్రసాదితములగును. పరంధామని యనుగ్రహబలమది. తత్ప్రాప్తికి సలుపదగిన యత్నమును భాగవతము సముచిత ధోరణిలో ప్రకటించుచు ప్రబోధించుచున్నది.

భగవచ్ఛక్తిపట్ల శంకగలవారికి ఫలితముగూడ సంకేహాస్పదమే. అట్టి సందేహమును దొలగించుకొని సర్వము జగన్నాథునియందే సమర్పణమొనర్చి శరణాగతినంది యెట్లు దేవుని కృపకు పాత్రులుగావచ్చునో! గ్రహించుటకు భాగవతమే మనకు ప్రధానసాధనమనుట నిర్వివాదము.

గర్వము పరిత్యాజ్యమనియు - దురహంకార దృష్టి సేగిసేయుననియు-స్వాభిమానరతులై పెద్దలయెడ నిర్లక్ష్యభావముం జూపువారు మహర్షుల క్రోధాగ్నికి గురియగుచుందురనియు - వారికిక సర్వశరణ్యుడైన జగన్నాథుడే దిక్కనియు - వానిను సర్వవిధముల హృదయమును జక్కదిద్దుకొనినవారై జగత్పతిని శరణుగోరినపుడే విముక్తులు గాగల్గుదురనియు భాగవత మొక మహాపరిబోధమునందించుచు - తాదృశపరివృత్తికి దూరముగ పరిజలనుంచుటకు దగిన సాయమొనర్చుచున్నది. ఈ యంత రార్థమును బ్రతిఫలించునదియే గజేంద్రగాథ.

గజేంద్రమోక్షము

కారణరహితముగ - సంయమి చంద్రుల నవహేళన జేసిన పాపమూరక యెన్నడును బోవదు. ఉదాత్తభావసంపన్నులు, సహనశక్తి సమన్వితులునగు మహర్షుల పెచ్చుగొట్టి వారిపట్లన మర్యాదగ ప్రవర్తించిన యొకచక్రవర్తి గజేంద్రుడు కాగా, అట్టి దుర్లక్షణములనే గలిగియుండి కన్నుమిన్నుగాక యహంకరించిన మరియొక గంధర్వుడు మొసలియైనాడు.

వారి రూపములు మారినను భావములు మారలేదు. గతులు మారినను స్థితులు మారలేదు. నా కన్న మిన్న యెవ్వరన్న దుందుడుకు తనముతో దశలక్షకోటి కరిణీనాథుండ ననెడి మదోద్ధతితో - మరాళచక్ర బకసంచారముగల కాసారమునందొక గజేంద్రు డల్లకల్లోల మొనర్చుచు కొలను చెలువమును కలుషిత మొనర్చుచు తొండము నిండ నీరెక్కించి గగనమార్గమున కెగజిమ్మచు విశృంఖలముగ విహరింప దొడంగెను.

మత్త చిత్త ప్రవృత్తికది చిహ్నము. పరులయున్నతిని గుర్తించని - సహించని యహంకృతి కది ప్రతీక. కాసారమునగల మకరి స్వభావము గూడ నట్టిదే. ఈ రెంటి యందొక దానికేని యోగ్యతయనునదియే లేదు. "నాస్థానమిది. స్థానబలముగల నన్నెదిరించి - ధిక్కరించి - తప్పించుకొనిపోవజాలిన యెరు డొకడున్నాడా!"

మకరికిగల గరుపమిట్టిది. గజేంద్రుని కండకావరము దిగలేదు. మకరి మనస్సు మారలేదు. గజేంద్రము విజృంభించినది. మకరి విక్రమించి పట్టినది. జీవజాలమునధ్య పరస్పర వైరుధ్య ప్రభావమున బొడసూపిన దారుణ కలహమిది. దేవాది దేవుడీ యవివేక చర్యల నరయుచు నవ్వుకొనుచు నూరకుండెనేమో! సర్వము తనవలననే జరుగునన్నెడి గర్వముతో - భగవంతుని యునికినే ప్రశ్నించి సవాలుచేయుచు భగవానితో నెలగీచి కలహము నకు దిగెడి యహంకారులను భగవాను డేమనగలడు? జరుగవలసిన సంఘర్షణలన్నియు గ్రిమము తప్పక జరుగవలెను.

కట్టవలసిన బొప్పలన్నియు గట్టవలెను. తల సక్రమముగ తిరిగి స్వస్థానమునకు రావలయును. కనులప్పుడు తెరిపిడిబడును. కర్తవ్యమప్పుడు జ్ఞప్తికి వచ్చును. కాని! ప్రయోజనమేమి? చేతులు కాలిన పిమ్మట ఆకులబట్టుకొనిన చందమది. లోకమున నప్పు డెవ్వరేమియు జేయజాలరు. అప్పుడైన "నీవే తప్ప నితఃపరం బెఱుగ" అనెడి స్థితికి మానవుడు చిత్తశుద్ధితో వచ్చి యెలుగెత్తి యాక్రందించుచో! దైవ మెంతయేనియు జేయును. దయజూపును. ధర్మపథమున నడపును. దురితకృత్యము లాచరించి శరణాగతుడైన వానిని గూడ తనవానిగనే భావించి సంరక్షించును.

గోపికల విశుద్ధ ప్రేమను-కుచేలుని నిర్మల సఖ్యమును భగవానునిపట్ల ప్రకటింపలేనిచో గజేంద్రునివలె సర్వార్పణ మొనర్చి శరణాగతి నయిన బొందుటకు మానవులు ప్రయత్నించ వలయునని యీ రూపమున భాగవతము హెచ్చరించుచున్నది.

"మకరితోడబోరు మాతంగవిభుని నొ
క్కరుని విడిచిపోవ గాళ్ళురాక
కోరి చూచుచుండె కుంజరీయూథంబు"

పాపమాడ యేనుగులేమిచేయగలవు? నిశ్చేష్టములై యూరుచున్నవి. మగవానరించు దుడుకుతనమువలన ప్రాప్తమయ్యెడి పాపమునకు భార్యాపుత్రులే మొనర్తురు? చూచుచుందురు.

ప్రయాసపడుచున్నాడు భద్రకరీంద్రుడు. పంతమునడల లేదు; పట్టుడల నెగ్గవలెనని పెనగులాడుచున్నాడు. ప్రతిపు

మాత్రము తక్కువగునా ! ఎవరిబలము వారికున్నది. ఎవరి పట్టుదలయు శిథిలముగా లేదు.

"అలయక సొలయక వేసట
నొలయక కరిమకరితోడ నుద్దండత రా
త్రులు సంధ్యలు దివములు
సలిపెంబోరొక్కవేయి సంవత్సరముల్.

జంతువుల మూర్ఖత సడలుటకే యింత కాలవ్యవధి యుండ మూర్ఖమానవుని నిర్హేతుక ప్రతిజ్ఞల నమలుపరచుట కెంతటి సుదీర్ఘ కాలమవసరమో! ఏమో -

ఏమయిననేమి? స్థానబలమునకే కొంత పట్టుజిక్కినది. గజేంద్ర మొక్కయడుగు వెనుకకువైచి వేడి నిట్టూర్పువిడిచి "అబ్బా! అయ్యో! దైవమా!" అనుకొనినది. దైవమప్పుడు తలంపునకు వచ్చెనుగాబోలు. తానొనర్పనెంచిన తప్పుడుపను లన్నియు దర్పముతో చేయుదలచుకొన్నరీతి సమగ్రముగచేసి ఒకింత యెదురుదెబ్బ తగులగనే "ఓ దైవమా!" అనెడి మానవప్రవృత్తిని గని భగవానుడేమనుకొనునో! సాగెనా- ఇక నెవ్వరును జ్ఞప్తికిరారు. స్వప్రయోజనమునకే చక్రమం తయు దిరుగుచున్నట్లు సంభావించెడి తత్త్వముగని దైవము నవ్వుకొనునేమో!

వక్రతవచ్చినది గనుకనే గజేంద్రుడు దైవమునూట దలచినాడు. తొలుత నేమైనదో పాపమీబుద్ధి? కాసారమం తయు నిర్హేతుకముగ గలుషితమగుచుండెనే! అన్యసంచార

యోగ్యముగానితెఱగున షష్ఠమంతయు భయాందోళన కాల వాలమగుచున్నదే! యని యేమైన యాలోచింపనాడాగజేం ద్రుడు? తనవరకువచ్చినపుడే భగవంతుడు కావలయునుగాబోలు! లోకప్రవృత్తి యెంతవిచిత్రతమమైనట్టిది. ఇట్టి భిన్నవిభిన్న మానవతత్వ జలధులను మథించి సారాంశమునందించి భావి తరములు బాగుపడవలయునన్నెడి పవిత్రసంకల్పముతో బంగారు బాటలను పఱచినది భాగవతము.

ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై
యెవ్వని యందుడిందు పరమేశ్వరుడెవ్వడు మూలకారణం
బెవ్వడనాది మధ్యలయుడెవ్వడు సర్వము దానయైన వా
డెవ్వడు వానినాత్మభవు నీశ్వరు నే శరణంబువేడెదన్.

గొప్పభక్తిభావనయే. కాని కొత్తదనము కొట్టవచ్చినట్లు గన్పించుచున్నది. ఇంతమాత్రమునకే యీ యువసారార్థమెనర్చు గావుకేకలను పరమాత్ముడు విశ్వసించునా! దీనియందు స్వచ్ఛతయేది? సమగ్రవిశ్వాసరేఖయేది? శరణాగతిభావనయేది? స్వార్థపువాసన యొక్కటే వచ్చుచున్నది. సత్ప్రవృత్తిగల కరతమునుండి వచ్చిన యాక్రందనగాదిది.

సర్వేశ్వరుడు వీనినన్నింటి నాలోచించునా! యని మూనవుని వెట్టియూహ. తప్పక పర్యవసానము నాలోచించియే ఫలితప్రదానమును భగవానుడొనర్చునన్నెడి నగ్నసత్యమును భాగవతమిట్టి ఘట్టములద్వారా మనకెఱుకపఱచుచున్నది.

నర్తకుని భంగి బెక్కగు
మూర్ఖులతో నెవ్వడాడు మునులు దివిజులుం
గీర్తింపనేర రెవ్వని
వర్తనమొరులెరుగ రట్టి వాని నుతింతుఁ.

ఆపదయొక్క పరిమాణము పెరుగుకొలది ఆలోచనలతీక్ష్ణ మించును. భావన బలపడినకొలది వేదాంతము ముదురుపాక మున బడును. గజేంద్రునిస్థితి యట్లున్నది. సర్వేశ్వరుని దయామయదృష్టిని తనవంకకు ద్రిప్పుకొనుటకు సమర్థమైనదా యీ యభ్యర్థన? కానేరదనియే యనవలెను.

యోగాగ్ని దగ్ధకర్ములు
యోగీశ్వరు లే మహాత్మునొండెరుగక స
ద్యోగ విభావితమనముల
బాగుగ వీక్షింతురట్టి పరము భజింతుఁ.

భజింపుము, కాని మ్మనుకొనినేమో భగవానుడు.

నాకడ్డపడరాడె నలి నసాధువులచే
బడిన సాధుల కడ్డపడెడివాడు
చూడడే నాపాటు జూపులజూడక
చూచువారల కృపజూచువాడు.

తానెవ్వరితో సంప్రదింపకయే – ఏ ధర్మమును విచారింపకయే తన బుద్ధి యహంకరించి ప్రకోపించి నడిపించిన తెఱగున నడుచుట. ఫలిత మనుకూలపడక పథకము తలక్రిందైనపుడు సిద్ధముగనుండి భగవంతు డాదుకోవలెనట – అడ్డపడవలెనట– కృపజూడవలెనట–

ఏమి స్వార్థపూరిత మానవ మహాభక్తి ప్రవాహవేగో ద్ధతి! పరమాత్మ డేమనుకొనునో! యనెడి యూహాయేమియు రాదుగాబోలు. మానవ పరివృత్తి నచ్చముగ నద్దముపట్టినట్లు చూపుచున్నది భాగవతము.

కలడందురు దీనుల యెడ
కలడందురు పరమయోగి గణముల పాలన్
కలడందు రన్ని దెసలను
కలడు కలండనెడివాడు కలడో! లేడో!

అయినది. ఈ మాటలతో నింతవరకు నటించిన భక్తి భావపు పట్టు గూడ సడలిపోయినది. యోగిగణములపాల గలవాడు గలడా! దీనులయెడ గలవాడు నాపాలరాడా! అనునే! నేను యోగినా! నిజమైన నిర్మల హృదయముగల దీనుడనా! అని పరిశ్నించుకొనడే; ఎంత వింత?

దైవము తన పాలగలవాడై యుండలేదు. కావున నిజముగ నసలుండెనో! లేదో! యనెడి సందిగ్ధ స్థితిలో బడిపోవుటయా! లోక సాధారణమైన యచంచలమనఃపరివృత్తిని ఆపన్నుడైన గజేందుని నోట భాగవతమెంత సత్యసమ్మతముగ వ్యక్తీకరించినది. "సంశయముగలవానితో తనకేమిపని? స్థిరచిత్తుని విషయముగదా తానాలోచించవలసినది." భగవంతు డట్లనుకొనెనేమో!

"సంశయాత్మా వినశ్యతి" అని యున్నది కదా! సర్వ సంశయ విచ్ఛేదమయిన పిమ్మటనే భగవానుడు భక్తుని నెఱిఁ

నాలకించుననుట లోకవిదితమే. క్రొత్త భక్తున కదియేమి తెలియును ?

గజేంద్రుడట్లే వ్యధనందుచున్నాడు. భక్తి భావమును హృదయమున బెంపొందించుకొనుచున్నాడు. మకరి యొక్క నిశిత కఠోర దంష్ట్రల మధ్యబడి చూర్ణమగుచున్న కాలిని దలచుకొని కుములుచున్నాడు. తన పని యిక పూర్తియైనట్లే యని కుందుచున్నాడు.

నిండుమనస్సుతో నిశ్చల దృష్టితో జగత్పతిని యెద యందు నిల్పుకొని సర్వభారము నాయనపై వదలివైచి శరణా గతుడై మొక్కు స్థాయికి చేరుకొనుచున్నాడు.

లావొక్కింతయులేదు ధైర్యము విలోలంబయ్యె ప్రాణంబులుక్
రావుల్ దప్పెను మూర్ఛవచ్చె తనువుక డస్సెన్ శ్రమంబయ్యెడిక
నీవే తప్పనితఃపరంబెఱుగ మన్నింపక దగుక దీనునిక
రావే! యీశ్వర! కావవే! వరద! సంరక్షింపు భద్రాత్మకా!

అసలయిన యార్తనాదమది. గర్వము సర్వము దిగి పోయి - ప్రాణభీతితో పరమాత్మని కొరకు జీవుడు పెట్టిన గావు కేకయది.

ఓ కమలాప్త! యోవరద! యోప్రపతిపక్షవిపక్షదూర! కు
యోగికవియోగివంద్య! నుగుణోత్తమ! యోశరణాగతామరా
నోకహ! యోమునీశ్వర మనోహర! యోవిమలప్రభావ! రా
వే! కరుణింపవే! తలపవే! శరణార్థిని నన్నుగావవే

నిజమైన ప్రార్థనయిది. నిశ్చలమైన హృదయము గానించిన విజ్ఞప్తియది. పరిపూర్ణ భక్తితో భక్తుడు గావించిన శరణాగతి యిది. శరణాగతి యొనర్చి యెవ్వానును సర్వేశ్వరుడిక్కడ సంరక్షణ ఫలమందనివారు కాలేదు. ప్రసన్న భావముదయించినదో! ఇక పరమాత్మ డనుగ్రహించినట్లే. ఫలితము సిద్ధించినట్లే. అది శరణాగతి ప్రభావము. శరణాగతి యొనర్పగలస్థితికి సన్నిహితుడైన వ్యక్తియొక్క యదృష్ట విశేషము.

శరణాగతి యన సర్వభార ఫలమును పరమాత్మ్నని యందు సమర్పించుట యనుకొంటిమిగదా!

"సర్వధర్మాన్ పరిత్యజ్యమామేకం శరణంవ్రజ
అహంత్వాసర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః"

అని భగవానుని సుదృఢ ప్రతిజ్ఞయే యున్నదికదా!

"నీవేతప్పనితఃపరంబెరుగ మన్నింపన్ దగున్ దీనునిన్"

అనుటతో సర్వభార సమర్పణ మొనర్చినాడు గజేంద్రుడు

"క్షమస్వ పురుషోత్తమ!" అని నట్లయినది. ఇక తడవేల యుండును. తాదృశమైన యోగనిరూఢస్థితి నందుకొనజాలిన వారికి పరమాత్ముడు ముంగొంగుబంగారమే యగుననని భాగవతము మనకు గుర్తుచేయుచున్నది. అల వైకుంఠపురంబులో నగరిలో నామూలసౌధంబుదాపలమందారవనాంతరామృతసరసి ప్రాంతేందుకాంతోపలోత్పల పర్యంకమున పవ్వళించి శ్రీమహాలక్ష్మితో ముచ్చటలాడు దేవదేవుని చెవ్వులంబడినవి గజేంద్రుని దీనాలాపములు.

విశ్వమయతలేమి వినియు నూరకయుండి
రంబు జాసనాదు లడ్డపడక-
విశ్వమయుడు విభుడు విష్ణుండు జిష్ణుండు
భక్తియుతున కడ్డుపడ దలంచె.

"మోక్షసాధన సామగ్యిం భక్తికేవగరీయసీ." అట్టి భక్తి - అచ్చపుభక్తి యెప్పుడు కల్గెనో! అప్పుడే శ్రీ మహావిష్ణువునకు ప్రీతిపాత్రుడైనాడు గజేంద్రుడు. నావాడని భావించెనో! లేదో! క్షణములమీద బయలు దేరినాడు భగవానుడు.

సిరికి చెప్పలేదు. శంఖచక్రములను కరముల గీలించలేదు. పరివారమున కెఱుకపఱచలేదు. గరుడుని బిలువలేదు. చెవి కిందికి జారి చెక్కిలి పయింబడుచున్న విలాస కుసుమమును సరి దిద్దుకొనలేదు. మాటల సందర్భమున తన చేతుల జిక్కి లక్ష్మీదేవి భుజముమీదుగా జాఱిపడుచున్న పైటచెంగు నయిన వదలలేదు. తడబడుచు గజేంద్ర రక్షణార్థము జగన్నాథుడు పయనమైనాడు.

లక్ష్మి యడుగవలెననుకొనియు, స్థితిని గుర్తించి యడిగి నను - నుడువడని వెనుక కడుగువైచుచు - పయిటచెంగునల్లే చేతబుచ్చుకొని పరమాత్మని వెంట పరుగెత్త సాగినది. ముందు శ్రీమన్నారాయణమూర్తి - వెనుక లక్ష్మి - ఆ తరువాత దాస దాసీ బృందము - వారి వెంట గరుత్మంతుడు-వానితోపాటుగ దివ్యాయుధములు-నారదుడు, విష్వక్సేనుడు - వారు వీరేమిటి? వైకుంఠమునగలవా రా బాలగోపాలమును బయలు దేరినారు.

పరంధాముని యుజ్జ్వలకారుణ్య మహోజ్జ్వల మహిమా విశేష మెట్టి మహోదాత్త మైనట్టిది! ఎంతటి భక్తవాత్సల్యము! భగవానుడు భక్తరక్షణ భావలోలుడై యున్నాడని యుద్ఘోషించు సన్నివేశములివి.

కొంతదూర మట్లరిగె నేమో! మరల నేమి యూహ వచ్చినదో! ఏమి యాత్రిత మునరుకొనినదో! ఏ భావ ముదయించినదో! ఏమి కానున్నదో! ఏమో!

వెంటనే భగవానుడు - బ్రహ్మాండ భాండచ్ఛటాంతర నిర్వాకమ్ము, పాలితాఖిల సుధాంధశ్చక్రమునగు చక్రమును శీఘ్రముగ ప్రయోగించినాడు. దెసలన్నింట భయోత్పాతములు చెలరేగ నిప్పులకణముల నుమియుచు సంకల్పమాత్రముననే స్వామి యనుజ్ఞ గైకొని వెడలిన చక్రము- జయశ్రీ మోహమున బోరాడు గాఢతమమును భయంకరముగ తరిమి కరిని గాపాడి కర్తవ్యమును నిర్వర్తించినది.

మొరసెన్ నిర్జర దుందుభుల్ జలరుహా మోదంబులై వాయువుల్
దిరిగెన్ బువ్వులవానజల్లు గురిసెన్ దేవాంగనాలాస్యముల్
పరగెన్ దిక్కులయందు జీవజయ శబ్దధ్వానముల్ నిండె సా
గర ముప్పొంగె తరంగ చుంబితనభో గంగా ముఖాంభోధమై.

భక్తజన సంరక్షణను జరిపిన పరమాత్మ్నుని ప్రశంసించుచు ప్రకృతి గావించిన యానందోత్సాహ కోలాహల మట్లుండెను.

శాపవిముక్తుడైన గంధర్వుడు తన దారిని దానేగినాడు. ప్రేమతో కరములచే సముపలాలన మొనర్పబడినవాడై గజేంద్రుడు శ్రవణ పేయమైన ఘీంకారము నొనర్చినాడు.

శ్రీహరి కర సంస్పర్శను
దేహము దాహంబుమాని ధృతిఁగరిణీ సం
దోహంబు దాను గజపతి
మోహన ఘీంకార శబ్దములతో స్తోపెన్.

ముని నవమానించి యొనర్చిన యపచార ఫలమునే కరిరాజిట్లనుభవించినాడు గర్వము కన్నుల కెగదట్ట దుర్మదాంధ ప్రవృత్తితో సంచరించువారి కెవ్వరికేని నిట్టి యాపదలు తప్ప వని భాగవతము మన యూహల కొక బలీయమైన సాక్ష్యము నందించినది.

''చెడుగరులు హరులు ధనములు
చెడుదురు నిజసతులు సుతులు చెడుచెనటులకున్
చెడకమనునట్టి గుణులకు
జెడని పదార్థములు విష్ణుసేవానిరతుల్''

అనెడి సత్యము నెల్లెడ చాటుచున్న దివ్యకథా భాగమిది.

భగవానుని నిర్మల మన స్తత్వముతో శరణాగతి దృష్టితో సముపాసించి నపుడే సత్ఫలితములు సమకూరునన్నెడి యొక దివ్య భావన భాగవత పఠనమునలన ప్రతివానికి కలిగి తీరును.

తాదృశమైన - అచంచల భక్తి భావయుత నైష్ఠిక ప్రవృత్తి లోకమున సర్వత్ర వ్యాపించినచో శాంతి డెసలన్నింట

వర్ధిల్లును; సర్వత్ర విస్తరిల్లును. పరమాత్మ్నని దివ్యను గ్రహము నరనారీ గణయోగ క్షేమముల నరయుచు నిత్య సత్యమైన ప్రసన్నతను లోకమున పండింప గల్గుట కదియే గాచ బాట.

చిక్కడు వ్రతముల గ్రతువుల
జిక్కడు దానముల శౌచశీల తపములం
జిక్కడు యుక్తిని - భక్తిన్
జిక్కిన క్రియ నచ్యుతుండు సిద్ధము సుండీ !

భక్తి యొక్కటే భగవంతుని వశమొనర్చు కొనగల ప్రధాన సాధనము. తపములు దానములు వ్రతములు క్రతువులు భగవంతుని భక్తివలె మెప్పింప సమర్థములుగావు. వాస్తవ మంతియే. ఈ సత్యమును భాగవతమునందలి ప్రతి భాగము మనకెటుక పరచుచునే యుండును.

— ప్రహ్లాదోపాఖ్యానము —

పరమాత్మ్నని పనిగట్టుకొని ద్వేషించు కుటుంబమును నందయినను . భక్తుడు జన్మింప వచ్చును. వింతయేమియును గాదు. విడ్డూర మేమియును లేదు. భక్తిభానము బడిపెట్టి పాఠములుగా బోధించినచో వచ్చునను కొనుటకల్ల. అది వివేకమయిన యూహ. జన్మతః నరనరముల నల్లుకొని యుండవలసి నట్టిది భక్తి భావవైఖరి. పిమ్మట పరిసరముల. ప్రభావమునను గురుదేవుల హితోపదేశము వలనను - సద్గ్రంథ పఠనమువలనను - సత్సాంగత్య శక్తివలనను భక్తిభావన క్రమ క్రమ

వికాస దశకువచ్చి భగవదనుగ్రహమునకు పాత్రమగుచుండును. పద్ధతియిది. మాతృగర్భమునందుండగనే శిశువునకు యోగ్యలక్షణము లేర్పడుటకు వీలుగలదు. శ్రద్ధగైకొని యత్నించినజాలును. భావికాల వ్యక్తిత్వమునకు మంచి మెఱుగులు దిద్దినట్లే.

మాతృగర్భమునం దున్నపుడే శిశువునకు విద్యారంభ మగునని మనమహర్షుల నిర్ణయము. గర్భవతులగు సతుల మనోభావముల కనుగుణముగనే గర్భస్థ శిశువుయొక్క పెంపు జరుగును. యోగ్యతా యోగ్యత లప్పటినుండి బిడ్డయందు గుదురుకొనుట కవకాశము లారంభమగును. వానిని సద్వినియోగపఱచి యుత్తమ సంతానము నందుకొనుటకు మాతృమూర్తి ద్వారా గృహస్థు చక్కని కృషిని కొనసాగింప వలసియున్నది.

ప్రశాంత వాతావరణమున జరింపజేయుట - తీవ్రపరిశ్రమను జేయింపకుండుట - పరిసన్నధోరణిలో భగవద్గాథలను మధురాతి మధురముగ వినిపించుట - నియమనిగ్రహ సంయుతమైన తత్త్వముల నలవఱచుట - భయభ్రాంతులకు దూరముగ నుంచుట - శీలవర్ధనములయిన పరిబోధములయందు మనస్సు లగ్నమగు నట్లొనర్చుట - దేవదేవుని లీలలు దెలిపెడి మధురగీతములబాడి శ్రవణానందము గూర్చుట - విష్ణుపురాణాదులద్వారా యెన్నియో పవిత్రాంశములను నిత్యము గుర్తునకు దెచ్చుట - మున్నగు విషయముల మూలమున గర్భిణీస్త్రీల యెడ సముచిత శ్రద్ధను గైకొనినచో వారు పావన భావను

లగు బిడ్డలగని వంశమునకు హితమును జాతికి ప్రతిష్ఠను గలుగ జేయుదురనుట నిస్సంశయము.

తీయని ఫలములతో, కమ్మని భక్ష్యములతో అంతర్వత్నికి సారెలొసగుటతో బాటుగ పైన బేర్కొనబడిన యుత్తమ విధానములనూడ నమలుపఅచుట-ఆర్యసంప్రదాయమైయున్నది.

గర్భవతియైన నాటినుండియే మాతృదేవి గురుత్వమును వహించి బిడ్డయొక్క విజ్ఞతను తీర్చిదిద్దుటకు బాధ్యతవహించుచున్నదని మన మెఱుగవలయును. బాల్యమునుండియే బిడ్డల నిట్లు సుక్షితుల గావించుచు లౌకికకార్యాత్మక రంగమునందు జీవితమును సఫలమొనర్చుకొను శక్తి సామర్థ్యములుగల భావి పౌరులను తల్లి తయారుచేయవలెను. హిందుపుల యుత్తమ బోధనాపద్ధతికిది ప్రతిరూపము. తిరుగులేని యీ నిక్షేపసంప్రదాయ సముద్ధరణమువలన నే మణులు, మాణిక్యములు, జాతికి దక్కుచుండును.

వారు పుట్టిన దెక్కడ? అనెడి ప్రశ్నతో నిమిత్తము లేదు. దుష్టభావనులు దుర్మార్గులు ద్వేషదూషకులు దంభధర్మ శూన్యులు గల కోవయందే సజ్జనులు, నిరంతర భగవన్నామ పారాయణ పరాయణులు త్యాగభావనులు ధర్మచింతనులు యోగ్యతములు జగతిచే సంస్తుతింపబడ నర్హులునగు వారు

జన్మించుచుందురు. పరమాత్మని కరుణ నవలీల నార్జింవగల్గు చుందురు. గణనీయు ఘనచరిత్రను సృష్టించుచుంటురు.

లోకభయంకరుడై విష్ణుద్వేషియై దార్జన్య భావకలు షితుడై నిరంకుశుడై వ్యవహరించిన రాక్షస చక్రవర్తి హిరణ్యకశ్యపుడు. వాని యిల్లాలు పతిని దైవముగ నెంచి సేవించు పడతి లీలావతి.

హిరణ్యకశ్యపుం డొకసారి తపంబొనర్పనేగిన సమయం బున - ఇందు్రడు లీలావతిం జెరగొని పోవుచుండ, నారదుండు వానిని మందలించి యా ప్రధ్వని తన యాశ్రమమునందే యుంచుకొని హిరణ్యకశ్యపుండు మరలివచ్చువరకు సంరక్షించి పంపెనట.

లీలావతి నారదుని యాశ్రమంబునకుచ్చునాటికే గర్భ వతియైయున్నది. నారదు డాయమ్మకు కలసిన సర్వసౌకర్యము లొనర్చి కాపాడసాగెను. నిత్యము నారదుడొనర్చు నారాయణ నామసంకీర్తన మాధుర్యము లీలావతి శ్రవణములం బడు చున్నది. గర్భస్థ శిశుహృదయమున హత్తుకొనుచున్నది. సము చితములైన సత్ప్రసంగములతో లీలావతికి పొద్దుపోవు నిమి త్తము నారదుడెన్నియో వసతుల నేర్పరచినాడు. జాగ్రదవస్థ యందున్న ప్రతి నిమిషము లీలావతికి భగవద్విషయములే చెవులబడుచున్నవి. ఆశ్రమ వాతావరణము ప్రశాన్తత నామె హృదయమున గుదురుకొన జేయుచున్నది. స్వేచ్ఛగ

గగన వీథుల బరుగులెత్తు పక్షి సంతతులు – విలాసముగ విహరించుచు పరస్పర ప్రేమ భావమున జరించెడి ముద్దుగూర్చు లేళ్ళు, గోవులు, – గల గల ధ్వనులు సలుపుచు కన్నులపండువుగ సాగిపోవు సెలయేళ్లు–లీలావతి హృదయమున భగవంతుని చిద్విలాసములపట్ల – అనన్య మహిమలపట్ల – అనుకొనకయే మహత్తర భక్తిభావ ముదయించుటకు హేతుభూతములయినవి. గర్భస్థ శిశువున కా సమయమందున నారదుడెన్నియో తెఱగుల ధర్మత్వమును ప్రబోధించుచు వచ్చెను. నిర్మలజ్ఞానమును నెలకొల్పుచు వచ్చెను.

కాలాంతరమున – ఆ లీలావతి కన్న బంగరుకానుపే ప్రహ్లాదుడు. జన్మసిద్ధముగ లబ్ధమయిన సంస్కారబలమెంతయున్నదో గుర్తించినచో! ప్రహ్లాదునకు భక్తలోకమున ప్రథమస్థాన మెట్లు దక్కినదో మన కవగత మగును.

"తనయందు నఖిల భూతములందు నొక భంగి సమహితత్వంబును జరుపువాడుగా – పెద్దలబొడగన్న భృత్యసికై వడి జేరి నమస్కృతుల్ సేయువాడుగా – సఖులయెడ సోదరస్థితి, దైవతములంచు గురుపుల దలచుట కలవాడుగా – లీలలందును బొంకులు లేనివాడుగా" – ప్రహ్లాదుడగుటకు బాల్యమునుండి యలవరచబడిన క్రియాశిక్షణయే కారణము. కాకున్న కఠిన చిత్తుడు, గర్వోన్మత్తుడునగు హిరణ్యకశ్యపుని తనయుడిట్లగు టేమిటి? ఇట్టి సాధుభావనగల సంయమన శక్తిసంపన్నుడై చక్రిని భజింప బాల్పడు టేమిటి?

హరిపదాంభోజ యుగచింత నామృతమున నంతరంగంబు నిండి నట్లగునట యతనికి.

"పానీయంబులు ద్రావుచు గుడుచుచున్-భాషించుచు - హాసలీ
లానిద్రాదులు సేయుచు-దిరుగుచు - లక్షించుచు-సంతత
శ్రీ నారాయణ పాదపద్మ యుగళీచింతామృతాస్వాద సంధానుండై"

ప్రహ్లాదుడు లోకమునే మఱచిపోవునట.

తనయునివై ఖరి తండ్రికి వింతగదోచినది. శత్రువైన చక్రిని నిరంతరము సంస్తుతించుటాయునకు గర్ణకఠోరమాయె నేమో! కాని! పసివాని నేమనగలడు? చండామార్కులను రాక్షసగురువులను బిలిపించి - బిడ్డను చక్కదిద్దుడని శాసించినాడు. చదువులలో సారము చక్రిపదసేవనమే యని నమ్మిన ప్రహ్లాదునికి రాక్షసగురువుల బోధలు వీనులకెక్కలేదు. వినక గాదు. బోధపడకగాదు. నచ్చకయే. తాను మెచ్చిన యంశమును దోడిబాలురకందరకు నిచ్చకొలది బోధింప దొరకొనుటతో రాక్షసరాజ్యమునందల్లకల్లోల మారంభమైనది. హిరణ్యకశ్యపుడుగ్రుడైనాడు. పరిస్థితియా! విషమించుచున్నది. పగ్రబల విరోధియైన విష్ణువు తనరాజ్యమున తనవారిచే ప్రశంసింపబడుచున్నాడు. జట్టుగట్టి తనయుడే తనకెదురగుచున్నాడు. చేయు వలసిన దేమి?

మమత వదలుటలేదు. కన్నబిడ్డ నదలించలేడు. జరుగుచున్న దానిని సహించలేడు. కాని యతనిలో నొక మంట

యేర్పడినది. తన యున్నతి గని సహింపలేని వారెవరో తన బిడ్డకిట్లు దురోభ్ధజేసి తనపయికి దిగ్విప్పినారని యతని యావేశము. ద్వేషమావంకకు దిరిగినది.

భగవత్తత్వము నందనుర క్తి యేర్పడుట జీవులకు సహజ మని యాతడంగీకరింపడు. తనకన్న భగవంతుడు వేరొకడెవ డున్నాడని వాని ప్రశ్నము. లోకమునందొక ధర్మమున్నది. "నాబిడ్డ మంచివాడే! పరులెవరో వీనిని బాడుచేయుచున్నారు" ప్రతి తండ్రియు ప్రతితల్లియు సర్వసామాన్యముగ గాంచెడి యాలోచనయిది. పచ్చని జోడు బెట్టుకొనిన వారికి లోకమం తయు బచ్చగనే కన్పించునట. హిరణ్యకశ్యపునిపని యట్లయినది.

"ఎట్టాడిన నట్టాడుదు
రిట్టిట్టని పలుక నెఱుగ రితరుల శిశువుల్
దట్టించి యెవ్వరేమని
పట్టించిరొ ! బాలకునకు పరపక్షంబుల్."

వాని భావనయిది. ఎవరి పిల్లలో మా పిల్లవానిని జెడగొట్టు చున్నారని తలచుట లోకమునగల యెల్లవారికిని గల సహజ రుగ్మత యనుకొంటిమిగదా! బిడ్డను దగ్గరకు బిలిపించుకొని "నాయనా! నారాయణుడు మన జాతికే విరోధిరా! నీకెవ్వరీ దుర్బుద్ధు లలవరచిరి? దేవతల బాధింపుము. సిద్ధులను బంధిం పుము - మునులను వేధింపుము - గంధర్వుల నాశమొనరిం పుము - హరిగిరియని ప్రేలకుము. మనకు వైకుంఠవాసుడైన

విష్ణువు పరిబల శత్రువు నుమా! నా కుమారుడవై నందులకు దగినరీతి చరింపుము. నా కానందమును గల్గింపుము." అనెను.

చెవులు మూసికొనినాడు ప్రహ్లాదుడు. విష్ణుగతమగు భక్తి భావనకు ప్రహ్లాదుడు మూర్తి. అతని హృదయమున శ్రీమన్నారాయణ సేవానురక్తి ఘనీభవించినది. అది మారదు. చలింపదు.

"ఇను మయసాంత సన్నిధి నెట్లు బ్రాంతమగు హృషీకేశు సన్నిధి నా విధమున గరగుచున్నది" వాని మనస్సు.

చదువులు చెప్పిన గురువులపై విరుచుకొని పడినాడు తండ్రి. మూర్ఖులంతకన్న నే మొనర్తురు? రోగ మొక చోటనుండ జికిత్స వేరొక చోట నొనర్చినట్లయినది వానిపని. మందాగమకరందమా ధుర్యమున జేలు మధుపంబు మదనములకడ కరుగని లీల, లలిత రసాలపల్లవాదియై చొక్కు కోయిలకుటజముల చెంతకు జేరనిపగిది, అంబుజోదర దివ్యపాదారవింద చింతనామృతపాన విశేషమత్తమైన తన చిత్తమెట్టిపరిస్థితులయందేని నితరంబును జేరనేరదని ప్రహ్లాదుడు నిష్కర్షగ-అచంచలభావనతో-సుస్థిరమనస్కుడై తేల్చి చెప్పినాడు.

రాక్షసరాజు గ్రుడ్లు తేలవైచినాడు. నిబ్బరించుకొని వితర్కింప సాగినాడు.

"పంచశరద్వయస్కుడవు బాలుడవించుకగానిలేవు భా
షించెదు తర్కశాస్త్రములు చెప్పినశాస్త్రములోని యర్థ మొ

క్కించుకయైన జెప్పవసురేంద్రుని ముందట మాకు నౌదలఁ
వంచుకొనంగ జేసితివి వైరివిభూషణ వంశదూషణా!"

అని ప్రహ్లాదునింగని బెదరించినారు రాజపురోహితులు. చివరకు "తనయుడుగాడు శాత్రవుడు దానవభర్తకు వీడు దైత్యచందన వనమందు కంటకయుతక్షితజాతము భంగిబుట్టినాడని" నిర్ణయించినారు.

వారందరెన్నియో విధముల బ్రయత్నించి మరల నొకనాడు సభకు గొనితెచ్చి ప్రహ్లాదుని తండ్రి ముందునిలిపి-

"శిక్షించితి మన్యములగు పక్షంబులు మానినీతి పారంగుడవయ్యెఁ
రక్షోవంశాధీశ్వర! వీక్షింపుము నీకుమారు విద్యాబలమున్"

అని ప్రభువునకు మనవిజేసినారు.

మార్పులేని - మార్పురాని మనస్సులో విశ్వాధవుని రూపప్రతిష్ఠ యొనర్చుకొని కూర్చున్న ప్రహ్లాదుని కినియేవియును బట్టినట్లులేదు.

"భవద్విజ్ఞాత శాస్త్రంబులో పద్యంబొక్కటి చెప్పి సార్థముగ తాత్పర్యంబు భాషింపుమా" అనిన తండ్రితో నిట్లన దొడగినాడు.

చదివించిరి నను గురువులు
చదివితి ధర్మార్థ ముఖ్యశాస్త్రంబులు నే
జదివినవిగలవు పెక్కులు
చదువులలో మర్మమెల్ల జదివితిఁ దండ్రీ!

తనుహృద్భాషల సఖ్యముఁ శ్రీవణముఁ దాసత్వముఁ వందనా
ర్చనముల్ సేవయునాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్ చింతనం
బను నీ తొమ్మిది భక్తిమార్గముల సద్భాత్ముఁ హరిన్ నమ్మి స
జ్జనుడై యుండుట భద్రిమంచు దలతుఁ సత్యంబు దైత్యోత్తమా!

అంధేందూదయముల్ మహాబధిర శంఖారావముల్ మూక స
ద్గ్రింధాఖ్యాపనముల్ నపుంసక వధూకాంక్షల్ కృతఘ్నావలీ
బంధుత్వంబులు భస్మహావ్యములు లుబ్ధద్రివ్యముల్ క్రోడ స
ద్గంధంబుల్ హరిభక్తి వర్జితుల రిక్త వ్యర్థ సంసారముల్.

శోధింపంబడె సర్వశాస్త్రములు రక్షోనాథ! వేయేటికిఁ
గాథల్ మాధవ శేముషీతరణి సాంగత్యంబునంగాక దు
ర్మోధన్ దాటగవచ్చునే సుతవధూ మీనోగ్రవాంఛా మద
క్రోధోల్లోల విశాల సంస్కృతి మహా ఘోరామితాంభోనిధిన్.

లోకములన్నియున్ గడియలోన జయించినవాడ వింద్రియా
నికము జిత్తమున్ గెలువనేరవు నిన్ను నిబద్ధుజేయు నీ
భీకరశత్రులారు ద్వర బభిన్నులజేసిన బ్రాణికోటిలో
నీకు విరోధి లేడొకడు నేర్పునజూడుము దానవేశ్వరా!

సర్వశాస్త్రముల సారము చక్కి సంస్మరణయే. హరిభక్తిలేని వాని జీవితము వ్యర్థమే. జీవిత సముద్రమును సుఖముగ దాట వలెననిన పరమాత్మకు సంబంధించిన విజ్ఞానమనెడి నావకన్న మార్గాంతరము సున్న. నీవునాకు తండ్రివి రాక్షస రాజ్యమునకు చక్రివర్తివి. నీకు, నాకు, సకల లోకములకు, నిఖిల భూతజాల ములకు తండ్రివంటివాడు శ్రీమన్నారాయణుడు. శ్రీహరి

నామస్మరణము మన కవశ్య కర్తవ్యముగదా! తండ్రీ! ఆయనతో పగయేల? తగనిపని. భజించి సేవించిన - ఆయన కరుణించి యనుగ్రహించును. జీవితలక్ష్యము ఫలించును"

వరుసవరుసగ జెప్పుకొని పోవుచున్న ప్రహ్లాదుని వాగ్వైన్యాసము హిరణ్యకశ్యపునకు శుష్కప్రలాపముగా దోచినది. నభంబు ప్రతిధ్వనించులీల గర్జించినాడు.

"అంగవ్రాతములో జికిత్సకుడు దుష్టాంగంబు ఖండించి శేషాంగశ్రేణికి రక్ష సేయు క్రియ-నీయజ్ఞాంగులదోహి దుస్సం గుంగేశవ పక్షపాతి"ని దారుణముగ శిక్షించవలసినచే యని యొడలు దెలియని తెఱగున మాట్లాడదొడగినాడు. ద్వైనస్తుతి యెంతబలీయమైనదో! ద్వైవద్వేషముగూడ నంతబలీయమైన దేమో! విష్ణువును మిత్రునిగభావించి తనయుడు - శత్రువుగ నూహించి జనకుడు-మైమరచిపోయినారు. తమ సంకల్పముల నే యొకరును విరమింపదలచలేదు. పితృభక్తి మఱుగునబడి విష్ణుభక్తియే తనయుని మరియింప-పుత్రవాత్సల్యము నెనుకకు జరిగి-శత్రువిద్వేషమే ముందునకువచ్చి హిరణ్యకశ్యపుని వెఱ్ఱి వాని గావించినది.

దయ లేదు. దాక్షిణ్యము లేదు, కరుణ లేదు, కన్నబిడ్డయను భావము లేదు. వంశాంకురమనెడి యోచన లేదు. నాత్మకుమార్తి రోదించునేమో యనెడి చింత లేదు. తన - మన యను తత్త్వమే లేదు. దారుణమైనపగ-ప్రళయంకరమైన ప్రతీకారదృష్టి-

హద్దులతిక్రమించిన యావేశము-మరపునకురాని మత్సరము-కరుడుగట్టినకచ్చె-బలిష్ఠమైనస్వాధికార రక్షణానురక్తి-పొగలుగ్రక్కుచున్న వైరివర్గసమూలనిర్మూలనాత్మక దారుణమారణ కార్యక్రమ తత్పరత-దానవసార్వభౌముని తలలో తాండవించుచున్నవి. గిలిగింతలు పెట్టుచున్నవి.

హంతవ్యుడు రక్షింపఁ
మంతవ్యుడుగాడు యమునిమందిరమునకుఁ
గంతవ్యుడు వధమున కుప
రంతవ్యుండనక చంపిరండీనీచుఁ.

తండ్రిహృదయము బిడ్డనుగురించి మాట్లాడినవిధమిది. కన్నవానిని కన్నవాడే శాసించినతీరిది. అహంకారము-స్వార్థము కవలలై యుండవచ్చును. ద్వేషమునకు రోషమునకు మిత్రత్వము గలదేమో! పగకు పరమార్థమునకు పరస్పరము గిట్టనిమాట నిజమే. అన్నియునుగలిసి హిరణ్యకశ్యపు నట్లాడించినవి. ఏది యేమైననేమి? త్రికరణశుద్ధిగ దైవమును నమ్మియున్నవాడు తనయుడు. త్రికాలముల దైవద్వేషముతో గుములుచున్నవాడు తండ్రి. బాధలెవరివంతు? పరమానందమెవరిపాలు? క్షేమమెవరికి? సేగియెవరికి? శిక్షితులెవరు? శిక్షకులెవరు? పరాజయమెవరిది? విజయలక్ష్మియెవరినివరించును? ముఖ్యముగ భగవానుడాగ్రహించునది యెవరిపై? అనుగ్రహించినదెవరిని?

ఈ ద్వంద్వముల సంకులసంఘర్షణ భాగవతమున జిత్రితమైనది. పరమార్థమును బోధించి పరమాదరణపాత్రమైన విధా

నమును సూచించి, భగవత్తత్త్వ విజయకేతనమును భాగవత మెగురవైచినది. ప్రహ్లాదకథ యీ విజయకేతనమునకు సంబంధించిన రెపరెపలకు మారురూపము, తళతళలకు దర్పణము, నిక్కముగ నొక్కమాటలో వివరింపవలెనన్న భగవత్తత్త్వ రూపకమైన విజయకేతనమే ప్రహ్లాదకథ.

వాడి కోఱలుగల రక్కసులు పెక్కురు శూలములతో కత్తులతో చుట్టును జేరినారు, ప్రహ్లాదుని గొనిపోయినారు, పొడిచినారు, నరికినారు, కఠిన శిలలతో కాయమును గాయపరచినారు, గిరిశిఖరములనుండి దొరలించినారు, పలుకులతో డెలువ వలనుపడని భయంకర కృత్యములతో బాధించినారు, కన్నులతో జూచి సహింపజాలని యెన్నో దారుణవ్యథల గల్గించినారు, కాని! ఓలకడే! అయ్యో యనడే! అమ్మా యనడే! రక్షింపుడనడే! మీ యిచ్చకొలది వర్తింతు ననడే!

ఆపన్న శరణ్యా! యనును, హరీ! గోవిందా! యనును, నిఖిలపావనా! యనును, నీరజనాభా! యనును, శ్రీమన్నారాయణా! యనును, కన్నుల నీరుగార్చడు, బంధువులవంకఁ జూచి ప్రార్థింపడు, పరుగెత్తుకొనివెళ్ళి వారి వెనుక దాగడు, పారిపోవ యత్నింపడు, పాపమాచరించుచున్నారని యేరిని దూఱడు, తల్లియున్న గృహంబునకేగ యత్నింపడు, రక్షింపుడయ్యా! యనడు, బాధలకు తాళలేకుంటినని తపనజెందడు.

హిరణ్యకశ్యపునకు గుండెలవిసిపోవుచున్నవి. మనస్సు స్వస్థతగోల్పోవుచున్నది. ఏమి వీని శక్తి! ఎవ్వడేని యిట్టి శిక్షలకు గురియై జీవింపజాలునా! కనుగందకున్నదే వీని కాయము! కళదప్పకున్నదే వీని మోము! సడలకున్నదే వీనిశక్తి! జారకున్నదే వీని పట్టు!

సముద్రములో ముంచి తేల్పించితిని. గదలచే మొత్తించితిని. ఏనుగులచే ద్రొక్కించితిని. మంటలలో దోయించితిని. ఎంత చిత్రము! ఏమి మహత్తర శక్తి!

వాడారాధించుచున్న శ్రీహరియే మొనగాడా! నేను సర్వసామాన్యుడనా! నాశక్తులన్నియు వీనివయి బనిచేయకుండుటకు వాడు కొల్చుకొను గోవిందుడే కారణభూతుడా! ఏమో! యింతటి యద్భుతమహిమా సమన్వితుడైన వీనికి భయము లేదు. బాధలేదు. చావులేదు. వీనితోడ వైరము నాకేమైన గూర్పవచ్చును. కానిమ్మని యన్నియును విరమించిన వాడాయెను. ప్రహ్లాదుడు యథేచ్ఛగ మరల హరినామ ప్రభావ ప్రచారమునకు గడంగెను.

''విషయ సక్తులైన విబుధాహితులతోడి
మనికి పలదు, ముక్తిమార్గవాంఛ
నాదిదేవు విష్ణు నాశ్రయింపుడు ముక్త
సంగ జనుల గూడి శైశవమున.''

ప్రహ్లాద ప్రబోధ మాతీరున మరల జోరుగ సాగజొచ్చినది. వాని ప్రచారము తండ్రికి తలనొప్పిని గలిగించుచున్నది. హరి

మహిమలగూర్చి రాజ్యమున బ్రహ్మాండ ప్రచార మొనర్చి పలు వురు బాల బాలికల జెడగొట్టుచున్నాడని ప్రహ్లాదునిపై నిందా రోపణలు సాగినవి.

ప్రహ్లాదుని బిలిపించి హిరణ్యకశ్యపుడిక తేల్చుకొనఁబలచె నేమో! దాగుడు మూతల వ్యవహారమిక కుదురదనుకొనె నేమో! దైవశక్తిముందు దానవశక్తి నిర్వీర్యమని శంకించె నేమో! ఆరాధనకన్న అహంకారము గొప్పగాదని అనుకొనె నేమో!

"ఏమిరా! ఏమినీ పొగరు! నీ వెవరి యండజూచుకొని నిర్భయముగ నిట్లు చకిరియని గికిరియని నాశత్రువును నోరార బొగడుచున్నావు? నీ యహంభావమున కర్థమేమి?" అని హుంక రించినాడు రాక్షస చక్రవర్తి.

"బలయుతులకు దుర్బలులకు
బలమెవ్వడు నీకు నాకు బ్రహ్మాదులకున్
బలమెవ్వడు ప్రాణులకును
బలమెవ్వండట్టి విభుడె బల మసురేంద్రా!"

ఉన్న బలమేదో! అది నా యొక్కనికిమాత్రమే సంబంధించి నదికాదు. నీకు నాకు సర్వలోకములకు నిఖిలప్రాణులకు బలమైన బలమేదో ఆబలమే నాబలము. పరమాత్ముడైన హరిబలమున కన్న మిన్నయైన బలమున్నదా? తండ్రీ! సవినయముగ వినవి యొనర్చినాడు భక్తిభరిత హృదయుడైన ప్రహ్లాదుడు.

కొండలు పగులుచున్నను - మిన్నువిరిగి మీదబడు చున్నను-దారుణాగ్నిజ్వాలలు దరిజేరుచున్నను - పాతాళమున బడుచున్నను-పరమాత్ముని మధువని-భగవానుని సంకీర్తన మానసనియా నిశ్చల నిర్మలధీర గంభీర సాహస శక్తిసంపన్నుని భక్తిభావ ధురంధరత నేమనవలెను? ధన్యుడవు ప్రహ్లాదకు మారా! ధన్యుడవు! నీయచంచల నైష్ఠికదృష్టి భాగవతవీధుల సర్వకాలముల సర్వమానవుల జకితమొనర్చు దృఢచిత్తుల గావించును. నీకథ మాగుండెలలో కొంగ్రొత్త చైతన్యస్రుధను వర్షించును. నీవు భక్తలోకమునందమరుడవై అఖండాధ్యాత్మిక జ్యోతిస్స్వరూపుడవై -అగ్రపీఠమునసిల్చి మమ్మానందింపజేయు చుందువు. నీమాట సాధకులకు ముత్యాలమూట. నీబాట సజ్జనులకు రాచబాట.

"వైరులెవ్వరు చిత్తంబు వైరిగాక
చిత్తమును నీకు వశముగా జేయవయ్య
మదయుతాసుర భావంబు మానవయ్య
అయ్య నిర్మోల మేలాదరయ్య జనులు"

ప్రహ్లాదుడు తండ్రికి కీలకమును దెల్పినాడు. కాని వాని కది నచ్చునా ?

"మద్రాక్షితంజంపిన మున్న నే వెదకితిం బల్మారు, నారాయణుండే తద్విశ్వములోనలేడు, మరివాడెందుండురా దుర్మతీ!"

"ఎక్కడ గలడే కృష్ణయనే
చక్కటి వర్తించు నెట్టి జాడన"

నీదైవమైన హరిజాడ వివరింపుమా! యని గర్జించినాడు రాక్షసరాజు.

ప్రహ్లాదునకు భయము గలుగ లేదు. తండ్రి యీ నిష యము నెప్పుడు ప్రశ్నించునా! యని యెదురుచూచుచున్న వానివలె - వెంటనే యానందమున వికసించిన ముఖారవిందము గలవాడై - హరినామ స్మరణ మొనర్చుచు, పారవశ్యమున నృత్య మొనర్చుచు, వినయ భావమున తండ్రివంక దిరిగి చల్లగ మెల్లగా-

'కలడంభోధి గలండు గాలిగలడాకాశంబునం గుంభినిం
గలడగ్నిన్ దిశలన్ బగళ్ళ నిశలన్ ద్యోతచంద్రాత్మలన్
గలడోంకారమునం ద్రిమూర్తుల ద్రిలింగవ్యక్తులందంతటన్
గలడీశుండు గలండుతండ్రి! వెదుకంగానేల నీయాయెడన్॥

"ఇందుగలడందులేడని
సందేహమువలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకిచూచిన
నందందేకలడు దానవాగ్రణి! వింటే"

"విష్ణుస్సర్వేషా మధిపతిః" అనెడి సూక్తిని దృష్టియందిడు కొనినేమో! విష్ణుపదమునకుగల సర్వవ్యాపకత్వము నీలీల నిర్భ యముగతండ్రి యెదుట వివరింప నాతని యొడలు మండినది. ఆవేశము హద్దులుదాటిపోయినది. హరివిషయమును హిరణ్య కశ్యపుడు పరీక్షింపనెంచినాడు. వాడెచ్చట తన్నుజూపుమనునో! తనవానిమాటను వమ్ముగానీయరాదే! యని ప్రహ్లాదుని పలు

కులయందు నిగ్గునిరూపించుటకు పరమాత్మ నిశ్చయించు కొనినాడు.

దైవత్వ దానవత్వముల మహత్వము తేల్చిచూపబడు సమయమది. "ఈ స్తంభమునగలడా? నీహరి–" కన్ను లెట్టి బడ–కాయము కంపింప–కంఠస్వరమును బెంచి ప్రశ్నించినాడు తండ్రి.

"తప్పక గలడు తండ్రీ! – సర్వభూతాత్మకుడైన నా స్వామి స్తంభమున లేకుండు టేమి?" చిఱునగవులు చిందించుచు ప్రశాంతవదనమున ప్రసన్నత ప్రతిఫలింప బల్కినాడు ప్రహ్లాదుడు.

"స్తంభమున జూపవేనిం
గుంభిని నీ శిరము ద్రుంచి కూల్పగ రక్ష
రంభమునవచ్చి హరి వి
ప్రంభంబున నడ్డుపడగ శక్తుండగునే!"

అని తండ్రి గ్రుడ్లుఱుముచు – పండ్లు పటపట గొఱుకుచు–శత్రుత్వము మత్తుగొలుపుచుండ – చిత్తము స్వాస్థ్యము దప్పుచుండ గదకేలం గొని స్తంభమును బ్రద్దలొనర్చినాడు.

వాని పాపము బ్రద్దలయినది. దేవతల కష్టములు బ్రద్దలయినవి. లోకమున దైవనింద యెసర్చుచు కన్నుమిన్నెఱుగక సంచరించు నహంకారతత్వము బ్రద్దలయినది. కాని! సభయందలి స్తంభము బ్రద్దలయినట్లు మాత్రమే కన్పించినది.

"నరమూర్తిగాదు - కేవల
హరిమూర్తియుగాదు - మానవాకారము గే
సరి యాకారమునున్న"

యొక మహోమూర్తి యందుండి భయంకరార్భటులతో నావి
ర్భవించి - రక్కసుని పయింబడి భయంకరలీల నతనిజీల్చి చెం
డాడి ప్రహ్లాదునిపై వాత్సల్యామృతమును వర్షించి చనుచటికి
చేరిన వారినెల్లర ననుగ్రహించెను.

దైవశక్తి జయించినది. దానవశక్తి యంతరించినది.
"సురచారణ విద్యాధర గరుడోరగ యక్షసిద్ధగణములు"
నృసింహదేవుని భజించి శాంతింపజేసిరి. భక్తజన వాత్సల్యపరిపా
లనార్థము స్తంభమునందుద్భవించి-దీనశరణ్యుడైన తా
ప్రహ్లాదునిగాపాడినఘట్టము సర్వము భగవన్మయమని విశ్వసిం
చిన భక్తలోకమునకు మహోత్సాహదాయకముగ భాగవత
మున సాక్షాత్కరించినది.

బాల్యమునసే తల్లిశిక్షణలో దివ్యతత్త్వము నలవరచు
కొని జీవిత పరమార్థమైన భగవదనుగ్రహము నార్జించుటలో
వర్ణనాతీతములయిన కడగండ్లు ననుభవించి చెక్కుచెదరని
మొక్కవోవని స్థిరసంకల్పముతో శ్రీహరి కరుణకు పాత్రుడైన
ప్రహ్లాదుడు భక్తబృందమున శిరోమాణిక్యమువంటివాడు. నీవా!
నేనా! యనునట్లు సౌజన్య దౌర్జన్యతత్త్వములు ఢీకొని పోరిన
యీ సన్ని వేశమున పరమాత్ముడు భక్తజనపక్షమవలంబించి
యఖండవిజయమును ప్రసాదించి సౌజన్యమును నెగ్గించినాడు.

సత్త్వగుణ ప్రశస్తిని కన్నులగట్టినట్లు వర్ణించి మహాభాగవత మీ సంఘటనకు ప్రాణముబోసి దీనిని చిరంజీవ మొనర్చినది.

ప్రహ్లాదుని ప్రగాఢభక్తికి పరమాత్ముడు మెచ్చినాడు. నరసింహామూర్తి దుష్టరాక్షస సంహార మొనర్చి యవతార మహిమలను వెలయించి - భగవద్విశ్వాస సంపన్నులై నవారి కెన్నడును పరాజయము కలుగదనియు, భయము ప్రాప్తించ దనియు నిరూపించెను. ప్రహ్లాదుని యకుంఠితమైన భక్తితత్వ మును వ్యక్తపరచుటవలన భాగవత ప్రబంధ విశేషము లశేష భక్త లోకమున కాదరణ పాత్రములయినవి. ప్రహ్లాదగాథ యందు ప్రతిఫలించెడి భక్తి మహోజ్జ్వలమైనది. అచంచల మైనట్టిది. సకలభూత వ్రాతమున పరమాత్ముని రూపము నరసి యానందించెడి విశాలతను గలిగియున్నట్టిదా భక్తితత్వ మైఖరి.

ఇక మరియొక విధమైన భక్తిభావనయున్నది. అందలి పవిత్ర రామణీయక మసాధారణమైనట్టిది - నాన్యతో దర్శ నీయమైనట్టిది. జగన్నాథుడైన పరంధాముని నిజనాథునిగ భావించి, దృఢమైన యనురాగ బలమున నారాధించి, యభి మతమును ఫలింపజేసికొనుటో! అసాధ్యమైనప్పు డాత్మార్ప ణకేని సిద్ధపడుటో! యున్న స్థాయికిజేరు కొన్న భక్తి యది. దానిని వినిర్మల ప్రణయభావ పరిపూర్ణ పవిత్ర మధురశృంగార భక్తి యనవచ్చును. మధుర శృంగారభక్తి యందు కేవల మానవ సాధారణమైన డైహికవాంఛాదృష్టియుండుననుకొనుట

పొరపాటు. పవిత్రసేవా భావనతో తీయని యూహాలతో పురు షోత్తముడైన దేవదేవునికి తన్ను తానర్పించుకొని ధన్యత గాంచుటయే యిందు పరిధానాంశము. స్వామి రూపలావణ్యా దుల యందును, పరాక్రమ విశేషముల యందును, సుగుణ సంపద యందును మక్కువయున్న నుండవచ్చుగాక! భగవచ్చ రణ సేవాభాగ్యము తనకు లభింపవలయునన్నెడి తహతాట మొక్కటే యిందు పరిముఖముగ గన్పించును.

శ్రీ రంగనాథు నిట్టి మధుర శృంగార భక్తి తత్త్వ ధారలతో నభిషేకించి ఆండాళ్ తన మనుగడను సఫలమొనర్చు కొన జాలినది. నిస్తులమైన యామె భక్తి విశేషమునలననే ఆళ్వార్లయందు స్థానమునందుకొనగల్గినది.

జగన్నాథుడైన శ్రీరంగనాథుని నిజముగనే, నిజనాథుని గావించుకొనిన యీ సాధ్వి సుకృతము నేమనవచ్చును! తాదృశ సుదృఢ మనస్తత్త్వముతో పరమాత్మ్నని ప్రహ్లాదులాను గ్రహమునకు పాత్రులైన యిల్లాండ్రు కొందరున్నారు సకల లోకాదర్శనీయులైన యీట్టి సతీమతల్లుల దివ్యశృంగారభక్తి రసాత్మకములయిన గాథలనుగూడ భాగవతమున మనము గలము. వారు పురుషులయిననేమి? స్త్రీలయిననేమి? స్వచ్ఛం దమైన నిశ్చలభక్తి యుండవలయును. సర్వేశ్వరుని యనుగ్ర హము తప్పక సిద్ధించితీరును.

సనాతనకాలమునుండియు మనమొక సంస్కృతికి గట్టు వడి యుంటిమి. అది కేవలము పురాతనమైనదని వాత్సల్యమే

మనము మురియుటలేదు. ప్రత్యేకించి యది యార్షమైనదగుట మన కానందదాయకమైనది, మహర్షి నిర్దిష్టమై మానవాళికి శుభములను ప్రసాదించు నొకానొక విశాల సంస్కృతికి వారసులమగుట మన యదృష్టవిశేషము.

రుక్మిణీకల్యాణము

భారతీయ స్త్రీలు వివాహ విషయమున మనసునందొక పురుషుని సంకల్పించుకొనిరో! ఇక నదియట్లు జరిగిపోవలసినదే. తొలుత మనస్సున నిల్పుకొన్న వ్యక్తినే భగవత్సమానునిగ భావించి - వరించి - సేవించి-జీవిత మాతని కర్పించి - తరించు నుత్తమాచారము మనకు గలదు. పలుమారులు పలురీతుల భావములను సందర్భానుసారముగ సవరించుకొనెడి యలవాటు మన దేశమున లేదు. ప్రథమసంకల్పమున కిట్టి ప్రాధాన్య మిచ్చుట పరమధర్మమని తలంపు. అంతియే! కాని, కామ దృష్టితో నిండిన కాంక్షల బలమున జేసికొనిన నిర్ణయములని వానిని దలచరాదు. మనస్సున దొలిసారి పతిగ నెంచబడిన వ్యక్తి నిక్కముగ భగవత్స్వరూపుడే! ఆతని నారాధించుటకన్న ఆతని యనురాగము నార్జించుటకన్న గావలసినదేమి? యని స్త్రీలు భావించెడివారు. జీవాత్మ పరమాత్మల యనిర్వచనీయ ప్రేమబంధమున కిది చిహ్నముగా నోపు.

భగవంతుని భర్తగా బడయ వలయునని భావించిన కన్యలెంద రుందురు? సామాన్యమైన వాంఛయూ యది?

సంస్కారవంతమైన - సుకృత సంప్రాప్తమైన యే పవిత్ర భావ జలధి నుండియో వచ్చిన యూహాయది. అట్టి యూహా యెంత నిబ్బరము గలవారికి వచ్చును? కలిగిన యూహమును సఫల మొనర్చుకొనుటకు వలసినంత యాత్మస్థైర్యమున్నవారే యిట్టి యత్నములకు బూనుదురు. పూనుటేమిటి? సాధ్యమగునటో! శరీరత్యాగ మొనర్చుటో! రెండేవారికి లక్ష్యములు. మరి! అది మాత్ర మొక మహత్తరాద్భుత దీక్షయే యగునుగదా! అందు మాత్రము సర్వేశ్వరార్చనాత్మక మధుర భక్తి కలదు గదా! దేవదేవుని కారుణ్యమున వారివాంఛలేల సఫలములు గాకుండును? దృఢపరిపత్తియు - దివ్యదీక్షయు -- అసాధారణ పరిణయతత్త్వ ధారయు - పావనశృంగార భావ భాసురలీలయు గల మధురభక్తికి విజయము తప్పక సిద్ధించునని రుక్మిణీ కళ్యాణ గాథ సాక్ష్యమిచ్చుచున్నది.

"భూషణములు సెవులకు బుధ
తోషణము లనేకజన్మ దురితౌఘ విని
శ్శోషణములు మంగళకర
ఘోషణములు గరుడ గమను గుణభూషణముల్"

గరుడగమనుని యంశలో పూర్ణావతారుడుగ జన్మించిన శ్రీకృష్ణ దేవుని గుణగణముల శ్రవణము వీనుల కలంకారము- జన్మమెత్తిన వారొనర్చుకొన్న పాపములకు ప్రక్షాళనము - మంగళకరమునయినట్టిదని భాగవతము ప్రవచించుచున్నది.

విదర్భ ప్రభువయిన భీష్మకుని కుమార్తె రుక్మిణి చిన్న నాటినుండి శ్రీకృష్ణ దివ్య గుణగణ శ్రవణమున పారవశ్యము నందసాగినది. ఏడుగురు బిడ్డలలో కడసారి సంతాన మా రుక్మిణి భీష్మకునియింట నల్లారుముద్దుగ బెరుగుచు దేవదేవుడని లోక ములచే వినుతింపబడుచున్న దేవకీనందనుని నాథునిగా బడయ వలయునని గాఢముగ సంకల్పించుకొన్నది. అట్టి యాలోచన వచ్చుటయే యామె పురాకృత సుకృత విశేషము. ఆమె భావన బలిష్ఠమైనది; పావనమైనది.

"తన తండ్రి గేహమునకుం
జనుదెంచుచునున్న యతిథి జనులవలన గృ
ష్ణుని రూపబల గుణాదులు
విని కృష్ణుడు దనకు దగిన విభుడని తలచెఁ."

ఆ వయస్సునందా కన్య-తమ యింటికి జనుదెంచినవారిని జాగ్రత్తగ గమనించుచు – అందు కృష్ణుని విషయము దెలిసిన వారిని – తెలిసి చక్కగ సత్కథనము శ్రవణానందముగ సలుప గల వారిని పరిశీలించి, గుఱుతించి, యొక నిశ్చయమునకు వచ్చినదన్న – నామె శ్రద్ధ యెంత భక్తి నిబద్ధమో! మన మూహయవచ్చును. బాల్యమునుండి యామె హృదయకమల మిట్లు శ్రీ కృష్ణ గత ప్రేమ పరిపూర్ణానంద రసభరితమై వికసింపసాగినది. అది యామె యదృష్టము కావచ్చును. కాని కృష్ణునకుగూడ రుక్మిణియెడ నట్టి వినిర్మల ప్రేమ ముద్భవించుట మరియు విశేషము.

యోగ్యతగలవారి కన్నియు నట్లు చక్కగ సుచిత ముగ సమకూరును గాబోలు.

బంధువులెల్లరు శ్రీకృష్ణునకు రుక్మిణికి నీడుజోడని మురిసిరి. వారిరువురి వివాహము నాప్తులెల్ల రాకాంక్షించిరి. కాని యిది యిట్లు జరుగరాదని భీష్మించుకొనినవ్యక్తి యొకే యొక డున్నాడు. వాడు రుక్మి; భీష్మకమహారాజు పెద్దబిడ్డ. అతనికేమి తలనొప్పిదో! కృష్ణునతడు మెచ్చలేదు. శిశుపాలుడతనికి నచ్చెను. తనచెల్లి నాతనికిచ్చి పెండ్లి సేయవలెనట. బాగుగనే యున్నది! వివాహమాడవలసినది యు – కాపురము చేయవలసిన దియు నతడుగాదుకదా! కాని! నిర్ణయాధికారము ననవసర ముగ నతడు తన నెత్తిపై వేసికొనినాడు. హద్దులు నతిక్రమించి బాధ్యతలను మోయ బాల్పడుట తగదని యతడెంచలేదు. పరిస్థితిని గమనించి విషయమును స్వయముగ దానే సరిదిద్ద సంకల్పించుకొన్నది రుక్మిణి.

ఒకవిధముగ పెండ్లికానిబాలిక యిట్టి సాహసమునకు బూనుట విప్లవచర్యగ దోచవచ్చును. కావచ్చునుగాక! వాస్తవముగ నిది యేకమనస్కతతో చేసిన సంకల్పముసకు వికల్పము రాని తెఱగున వివాహవ్యవహారమును నిర్వహించుట మాత్రమే కాగలదు.

యోగ్యతగల కన్య భర్తయనెడి భావన నొక్కనిముండే యొక్కమారే నిల్పును. కలిగిన యాలోచనకిక సవరణలతో

బనిలేదు. వివాహకాండ జరుగుటన నేమో మానసిక సంకల్ప మనిన గూడ నంతియే. ఇందొకటి ముఖ్యము; మరియొకటి యముఖ్యమనియు లేదు. మరియును దైవస్వరూపుడని యెంచ బడుచున్న శ్రీకృష్ణుని విషయమున నిక భావాంతరమునకు దావెక్కడ? కావుననే రుక్మిణి దృఢచిత్తమున వజ్రసంకల్ప మొనర్చి వినిర్మల భక్తితో శ్రీకృష్ణునకే దన్నర్పించుకొన నుం కించినది. అన్న యొక్క యనుకూలతాననుకూలతల నామె లెక్కింపదలచలేదు సోదరునే కాదు. సందర్భము వ్యతిరేకమై, తల్లిదండ్రులనే యెదిరింపవలసివచ్చినప్పటికిని వెనుకాడెడి దశలో లేదు రుక్మిణి. నిండుమనస్సుతో నిర్మలభక్తితో నిరుపమాన ప్రేమతో నీరజనాభు నాహ్వానించుకొని తన యభిమతమును ఫలింపజేసికొనుటకే యీమె సంసిద్ధురాలైనది.

అగ్నిద్యోతనుడను విప్రవర్యుని రావించి – విషయ మంతయు వివరించి – అన్న గావించుచున్న ప్రయత్నమును వమ్మొనర్చుటకై బయలుదేరివచ్చి తన మనోభీష్టమ్మును సఫల మ్మొనర్పవలసినదిగా శ్రీకృష్ణునకు విన్నవింపుమని వేడి పంప నమ్మజేసి పంపినది.

విప్రుడు ద్వారకకు జేరినాడు. శ్రీకృష్ణుని దర్శించినాడు. "పెండ్లికొడుకవుకమ్మని" దీవించినాడు. ప్రత్యక్షరముగ దన పట్లగల యనిర్వ్యాజ భక్తిభరిత ప్రేమభావమును వ్యక్తీక రించుచున్న విప్రుని ధోరణికి ముగ్ధుడై శ్రీకృష్ణుడు మనసిమునసి

వగవుల సొగసులొలుకవోయు మోముతో లేచి యెదురేగి తోడితెచ్చినాడు. తగినరీతి నుపచారవు లొనర్చి, యాతిథ్యము జరిపించి, మిక్కిలిప్రేమతో నవ్వి, పిమ్మటనిదరిజేరి కుశలప్రశ్నము గావించి, వచ్చినకార్యంబు - తెచ్చినప్రస్తావంబు వినిపింపగోరి నాడా మాయామానుషలీలా విగ్రహుడు.

విప్రుడు సావధానముగ వినుమని శ్రీకృష్ణునభ్యర్థించి "స్వామీ విదర్భపురాధీశుండైన భీష్మకుండు నీకెఱుకయే గదా! అన్నరేంద్రనందన-అందాలదీవి యనందగు రుక్మిణి నీయందు పరమభక్తిపరిపత్తిభావముగల కన్య. ఆమె నీకుం గైంకర్యంబు సలుపగోరియున్నది. వివాహమంగళభావ ప్రకటనాత్మకంబయిన-వినయ నిబ్రమ భావభరితంబయిన - భక్తి ప్రేమ రసగర్భంబయిన యొక సందేశంబును మన్ముఖంబున నందజేయ వలంచి భవత్సన్నిధికి నన్నంపినది. సావధానచిత్తంబున వినవలయును. వినిపించువాడ ననుచు రుక్మిణి మాటలతోనే యాసందేశము వినిపింపదొడగినాడు.

"ఏ నీగుణములు కర్ణేంద్రియములు సోక
దేహతాపంబులు దీరిపోవు
నే నీ శుభాకార మీక్షింప గన్నుల
కఖిలార్థ లాభంబు గల్గుచుండు
నే నీ చరణ సేవ లేపొగ్గిదుజేసిన
భువనోన్నతత్వంబు బొందగలుగు
నే నీలనన్నామమే ప్రొద్దు భక్తితో
దడవిన బంధ సంతతులు వాయు

నట్టి నీయందు నాచిత్త మనవరతము
నచ్చియున్నది నీ యాన నానలేదు
కరుణజూడుము కంసారి! ఖలవిదారి!
శ్రీయుతాకార! మానినీ చిత్తచోర!.

గుణములనెన్నిక జేసిది. శుభాకారము విషయమున మనసునకు వ్యక్తికరించినది. చరణసేవపట్ల భక్తిని బ్రికటించినది. నామ స్మరణ పట్ల ననురక్తిని దెలియజేసినది. నీపై నా హృదయము నిల్చి యుండునన్నది. నీపయి నొట్టనినది. ఇట్లు విప్పిచెప్పుటకు సిగ్గుపడుట లేదనినది.

మానినీ మానసచోరుడవు - శ్రీయుతాకారుడవు - ఖలవిదారుడవు - స్వామీ! కరుణించి నన్నేలుకొమ్మనినది.

శ్రీకృష్ణునకా బాలామణి హృదయగత ప్రేమలోగల లాలిత్యము - భక్తియం దంతర్గర్భితమైయున్న సర్వార్పణ రూపక సాహసాత్మకమైన యభిమానము - మోహమును మోదమును గలుగజేసినవి. ఉత్సుకతతో వినుచున్నాడు కృష్ణుడు. మహోల్లాసమున వినిపించుచున్నాడు మహీసురుడు.

ధన్యꣳ లోకమనోభిరామగుల విద్యారూపతారుణ్య సౌ
జన్య శ్రీ బలదానశౌర్యకరుణా సంశోభితుꣳ నిన్ను నే కన్యల్ గోరరు!

నా మొగముననే ప్రొద్దు పొడువలేదే! నీవంటి సర్వ విధ సల్లక్షణసంపన్ను నేకన్యలయిన గోరుదురుగదా! అని తన్ను దాను సమర్థించుకొన్నది.

స్వామీ! యీ పగిది నిన్నే వరించి నీ కొరకే నిరీక్షించు చున్న నన్ను - నీ చరణదాసినిగా నపేక్షించుచున్న నన్ను - సింహము పాలిసొమ్మును గోమాయు వపహరింప నెంచు చంద మున మదాంధుడైన శిశుపాలుడు తానపహరించుకొని పోవ యత్నించు చున్నాడు. వాడు నీ ప్రతాపప్రశస్తి నేమి యెరుగును?

నే నేమేనిసత్కార్యములు పూజలు గత జన్మమున శ్రీ హరినిగూర్చి యొనర్చియున్న-నామనోరథము ఫలించి-యీ జన్మమున శ్రీకృష్ణదేవా! నీవే నామనోనాథుడవగుదుగాక! నీతో సంగరముచేసి చేదిభూపతులు పరాజితులగుదురుగాక!

నీవిక జాగుసేయదగదు స్వామీ! రేపే వివాహముహూర్తము. చతురంగబల సమేతుడవై తరలివచ్చి శిశుపాలభూపాలాదుల మదమణంచి - అసమాన స్వకీయ పరాక్రమఘనము పణముగావించి నన్నుగొనిపొమ్ము. నీవెంట రానుంటిని. దయ చేసిరమ్ము.

అంతఃపురము నందుందుననియు - కావలివారి లడ్డు దురనియు - బంధువుల జంపవలసి వచ్చుననియు - గాకున్న నన్ను గొనిపోవ నసాధ్యమనియు ననుకొందువేమో! ఆక్షేపించ వలదు. వివాహమునకు ముందు పెండ్లికూతు నలంకృతంగావించి యూరివెలుపలగల భవానీ దేవాలయమున పూజలొనర్చి నిమిత్తము మా పెద్దలు నన్ను బంపుదురు. నేను గౌరికి ప్రియురాల్ను

లందించు సమయమున నీ వచటికివచ్చి సులభముగ నన్ను గొని పోవచ్చును.

సర్వలోకముల వారు దేవాదిదేవుడవైన యే నీ పాదాం బుజముల కెఱగి తరింప యత్నింతురో! ఆ నీ ప్రేమ నాకు సిద్ధిం పనిచో నిక నా మనుగడ కర్థమేమున్నది? నూఱు జన్మములే యగుగాక! ఇట్లే వ్రతము లాచరించుచు ప్రతి జన్మమున నీకొర కెదురు చూచుచు ప్రాణత్యాగ మొనర్చుచుందును సుమా!

నీ పలుకులే వినవలెను. నీ భోగమునకే సౌందర్యము నర్పింపవలెను. నిన్ను గాంచుటకే కన్నుల నుపయోగింపవలెను. నీ యధరామృతాస్వాదనమునకే జిహ్వకు సఫలతగలుగవలెను. నీవు ధరించిన వనమాలికల పరిమళములనే నాసిక ఘ్రాణించి, నీకు దాస్యమొనర్చుటకే బ్రతుకుపయోగపడవలెను. కానినా డన్నియును వ్యర్థములే కాగలవు. సమకూరిన, బ్రతుకంతయు సార్థకము కాగలదు స్వామీ!

రుక్మిణి హృదయవేదన యిది ప్రభూ! ఆమె నీకొరకే జీవితమును ముడుపుగట్టుకొని కూర్చున్నది. నీ యనుగ్రహము లబ్ధముగానిచో నిక యామె జీవించుట కల్ల. ఆమె భక్తియట్టిది. ఆమె ప్రేమయట్టిది. ఆమెదీక్షయట్టిది. తపదయ-ఆమె ప్రాప్తము-మా భాగ్యము అనిపలికి యొక్కింతసేపాగినాడు విప్రుడు. మరల నందుకొని మాట్లాడనారంభించినాడు.

దేవదేవా! ఆమెభక్తివలె నిర్మలమైనదియీమెరూపము. రూపమువలె నందమైనది యీమెభక్తి. లోకోత్తరలావణ్యసం పూర్ణమైన యీమె నీకేయర్థాంగికావలెను. పురుషోత్తముడవైన నీవే యీమెకు భర్తవు కావలెను. నానిశ్చయమిది.

అని విప్రుడు తన మనవిని-రుక్మిణిసందేశమును కలిపి వినిపించినాడు. దృఢచిత్తముతో కృష్ణుడవ్విప్రున కీవిధముగ వాగ్దాన మొనర్చినాడు.

వచ్చెద విదర్భ భూమికి
జొచ్చెద భీష్మకుని పురము సురుచిరలీలన్
దెచ్చెద బాలఁ బ్రేమ్మిడి
ప్రచ్చెద నడ్డంబురిపులు వచ్చినఁ బోరన్.

"నీవిక వెళ్ళవచ్చును. నా మాటగా రుక్మిణి కీ విషయము దెలియజెప్పి నిర్భయముగ నుండుమనుము" అని హెచ్చరించి బ్రాహ్మణోత్తముని పయనము జేసినాడు శ్రీకృష్ణుడు.

నిశ్చలమైన సంకల్ప మొనర్చి - ఎట్టియభ్యుత్తరము కీర్పడి నప్పటికి నెదిర్చి నిల్వనెంచిన ప్రణయ స్వరూపిణి-శృంగారభక్తి బలసంపన్న - కృష్ణదేవునికి కానున్న పట్టపురాణి-నిక్కువముగ నదృష్టవంతురాలు రుక్మిణి. భాగవత మీ సందర్భమున శృంగార భక్తి గడించిన విజయమును మధురాతిమధురముగ రమణీయ ముగ వర్ణించినది. అనుకొన్న రోజున అనుకొన్న రీతిగ కుమార్తె నలంకరించి పార్వతీ దేవాలయమునకు భీష్మకుండు

పంపవలసి యున్నది. నాడు పితృదేవతల నర్చించుకొని - విప్రులకు మృష్టాన్నములతో విందులొనర్చి - రుక్మిణి కభిషేకంబు చేయించి - నూతనవస్త్రముల గట్టబెట్టించినాడు.

చేదిదేశ ప్రభువు తన్నెదిరించువా రెవ్వరనడి గర్వోన్మాదముతో బయలుదేరినాడు. సకలబంధుసమేతుడై శిశుపాలునకు తోడుగా జరాసంధ దంతవక్త్రాదులు వచ్చుచున్నారు. నగర మంతయును నమితోత్సాహకోలాహలములమధ్య కళకళలాడుచున్నది. పట్టణమునగల ప్రత్యణువు పకపకమనుచున్నది. ఈ యట్టహాసములతో నాడంబరములతో సంబంధము లేని తెఱగున సంభరములచే గప్పబడినదైన్యదేవతవలె నంతర్వేదన జెందుచున్న ప్రాణియొక్క తెయే-ఆమెరుక్మిణి. ఆమె చూపిచ్చటలేదు.

యోగనిరూఢి కుదిరినపిమ్మట తపస్వి లౌకిక సుఖభోగ పరంపరలమధ్యమందున్నను-దృష్టి పరమాత్మునివంకకే పరుగు లిడుచుండునందురు. రుక్మిణీస్థితియట్లున్నది.

శిశుపాలుడు మున్నుగాగల రాజులందరు నగరమునకు చేరినారు. వారివారి కనుగుణములయిన విడుదులమర్పబడినవి.

కృష్ణుడు వచ్చినట్లిసుమంతయేనియు బొడకట్టుట లేదు. వచ్చి యెటనేని గుప్తముగ నుండెనా! అట్లుండుట కా పురుషసింహమొప్పదే! అయిననేమయినట్లు? పోయిన బ్రాహ్మణుడేని మరల రాకుండెనే! రుక్మిణి డెందమున శంకలపై శంకలుదయించుచున్నవి.

"నా యత్నంబు సిద్ధించునో! భగ్నంబై చనునో! విరించికృతమెబ్భంగిన్ ప్రవర్తించునో!" పరిపక్వదశ సమీపించుచున్న తఱి ఘోరయాతనలకు మానసికముగ, శారీరకముగ సంసిద్ధపడెడి మునీంద్రుని యంతరంగంబువలె రుక్మిణి హృదయ ఘోష సాగినది. జీవుడు దేవునికొరకు పడెడి యారాటముపం టిదే రుక్మిణీ హృదయగతమై వేధించుచున్న సందిగ్ధదశయందలి తపన.

"ఘనుడా భూసురుడేగెనో! నడుమ మార్గభ్రాంతుడై చిక్కెనో
విని కృష్ణుండిది తప్పుగాదలచెనో! విచ్చేసెనో! యీశ్వరుం
డనుకూలింప దలంచునో! తలపడో! యార్యామహాదేవియు
ననురక్షింప నెఱుంగునో! యెఱుగదో! నాభాగ్యమెట్లున్నదో?"

రుక్మిణిలో ఆందోళన యతిశయించినది. కర్తవ్య మామెకు గోచరించుటలేదు.

"చెప్పదు తల్లికిం దలపుజిక్కు-నిద్ర గైకొనదు-
కృష్ణమార్గగతవీక్షణపంక్తుల ద్రిప్పదెప్పుడున్."
"తుడువదు కన్నులఁ వెఱలుతోయ కణంబులు-కొప్పు జక్కగా
ముడువదు-అన్నమేమియుంగుడువదు-డాయదన్యులఁ."

అగ్నిద్యోతను డాకసమునుండి యూడిపడిన తెఱంగున వచ్చిపడినాడు.

"మెచ్చె భవద్గుణోన్నతి కమేయధనావళులిచ్చెనాకు
దా వచ్చె సుదర్శనాయుధుడువాడె"

బ్రాహ్మణుడు వినిపించిన యీ పలుకులతో రుక్మిణికి బోయిన ప్రాణములన్నియు తిరిగి వచ్చినట్లాయెను. బలరామ

కృష్ణులువచ్చినవార్త చెవింబడగనే భీష్మకుండెదురేగి సగౌరవ మర్యాదల సంతోషముగ గొనితెచ్చి విడుదులమర్చి యాదరించినాడు. రామకృష్ణులగని యెల్లరును మురిసిపోదొడగిరి.

"తగునీచక్రివిదర్భరాజసుతకుం - దథ్యంబు - వైదర్భియుందగునీ చక్రికి"

ప్రజల వాక్యము పరిసరమైనది. ఇక పదుగురాడు మాట పాడియై ధరజెల్లకుండునా!

రుక్మిణి యత్యుత్సాహ సముపేతయై యద్భుతాలంకార ములంగయిసేసికొని సపరివారముగ పార్వతీ దేవాలయమునకు జేరుకొనినది. దీపమాలికలు వెలిగించి - పూలమాలికలర్పించి దేవిని భజించినది. విప్రదంపతుల యాశీస్సులందినది. భవాని చెంత నతమస్తకయై

"నమ్మితి నామనమ్మున సనాతనులైన యుమామహేశులన్ మిమ్ము బురాణ దంపతుల మేలు భజింతుగదమ్మ! మేటి పె ద్దమ్మ! దయాంబురాశివిగదమ్మ! హరిం బతిఁజేయుమమ్మ! నీ నమ్మినవారికెన్నటికి నాశము లేదుగదమ్మ! ఈశ్వరీ!

అని నిండు మనస్సున మ్రొక్కుకొన్నది.

"నమ్మితి...నన్ను నీవానిగ సల్పుకొమ్ము...దయాంబు రాశివీ"వని ప్రాకృతులెల్లరు జ్ఞానోదయమైన పిమ్మట పరమా త్మ్నని ప్రార్థించు తీరే యిందుధ్వనించుచున్నది. మౌనము వహించి-గౌర్యాలయమునుండి వెడలివచ్చు వీరమోహిని రుక్మి ణినిజూచి భ్రాంతి జెందినారందరు. ఆమె నరయుచున్న రాజ

లోకమునగల వారిమేనులు వళము దప్పిపోవసాగినవి. ఆయుధములు కరములనుండి జారదొడగినవి. కనులు మిటుకిట్లువడ నారంభించినవి.

వారిగతియట్లుండ - సుదీర్ఘ వేణిపై సుమాంగతతులు సింగారములు పొంగించుచుండ - పసుపుపారాణితో, చెక్కిలి చుక్కతో, కళ్యాణతిలకముతో, కమనీయ కరకంకణాంకులతో - అతిలోకలావణ్య తేజోరాశియో అనునట్లు - మొగముపై గాలికి దూలిపడు వినీలకోమలములగు నిద్దంపు వుంగురుల ముద్దుముద్దుగ నెగద్రోసికొనుచు - కరాంబుజంబులతో భుజ దండంబులనుండి జాఱెడి యుత్తరీయంబును విశాసముగ జక్కనొత్తుకొనుచు వచ్చి, యావైదర్భి నవాంభోజ దళాక్షుడు-చారుచరవక్షుడు - పరిపంధి గజేంద్రబృంద హార్యక్షుడు నగు శ్రీకృష్ణుని సన్నిధి కేతెంచెను. అంత నెల్లవారు నివ్వెరపడి చూచుచుండ - ఎట్టివారినేని నెట్టి స్థితినేని లెక్కసేయని శ్రీకృష్ణుడాయింతిని కరంబవలంబనంబిడి రథం బెక్కించుకొని ద్వారకానగరమార్గంబున నిరర్గళగమనంబున మరలి పయనింప సాగెను.

జరుగుచున్న దేమో! తెలియని యయోమయస్థితిలోపడి పోయి, వారు పదినిముసములపాటు నిశ్చేష్టులై నిలిచి, క్రమముగ నొడలుదెలిసి, తమయసమర్థతను గప్పిపుచ్చుకొనుటకో యన, నేమో చేయువలెనన్నెడి వెట్టియూహాపోహములతో శ్రీకృష్ణుని

వెంటబడిరి. శరవర్షము గురియింపసాగిరి. అంత యాదవసేనలు వారియుద్ధతి నడ్డుకొని తమపరాక్రమ ప్రతాపంబులు వెలయింపశాత్రవుల నెదిర్చినిల్చెను.

"అరిబలభట సాయకముల
హరిబలములు గప్పబడిన నదరెదు భీతిన్
హరిమధ్య సిగ్గుతోడన్
హరివదనము జూచెఁ జకితహరిణేక్షణయై"

అదెంతరమణీయ వీరశృంగారరసమిశ్రితవీక్షణవిలాసమో! శిశుపాల జరాసంధాదులు కూడివచ్చి పడిరి. యాదవసేనానీక ప్రహారపరంపరల కెల్లరును గొల్లుమనుచు ద్రుళ్ళడంగి వెచ్చని నిట్టూర్పులవిడువసాగినారు.

వివాహ మీ రీతి విలయవిలాసముగ మారెనే! పెండ్లి జరుగకపోయెనే! యని విలపించుచున్న శిశుపాలుని జరాసంధుడు పలు తెఱగుల నూరడించెను.

"బ్రతుకవచ్చు నొడల బ్రాణంబులుండిన
బ్రతుకు గలిగెనేని భార్యగలదు
బ్రతికితివు భార్యపట్టు దయ్యమెఱుంగు
వగవవలదు చైద్య! వలదు వలదు!"

నేను పదియేడుమారులు మధురమీద దండయాత్ర గావించి పరాజితుండనై సమయమనుకూలింపకుండుటచే మిన్న కుండలేదా! కావున విచారింపక స్వనగరంబున కేగుమని తన దారిని దానేగినాడు.

దైవానుగ్రహములేనివారెల్లరాతెఱగున అల్లల్లోల ములఁబడి చెల్లాచెదరై యెవరి త్రోవను వారరిగిరి. కాని; రుక్మిణి యన్న రుక్మికి మాత్రమింకను పొగరు దిగలేదు. జరుగఁబోలసిన దంతయు జరిగినది. అయినప్పటికి నహంకృతి యతనిని వదఁ లేదు. శ్రీకృష్ణుని స్యందనంబు నడ్డగించి

"మాసరివాడవా! మాపాపగొనిపోవ
నేపాటిగలవాడ వేదివంశ
మెందు జన్మించితి వెక్కడ బెరిగితి
వెయ్యది నడవడి యెవ్వడెరుగు
మానహీనుడవీవు మర్యాదలునులేవు"

అని పెద్దమాటలు నోటిదురుసుతనంబున బేలసాగినాడు. వాని యవివేకమునకు కృష్ణుండు నవ్వుకొని యొక్కబాణంబున వాని కోదండంబుఖండించి-నిరస్త్రీగావించి-విరథునొనర్చి-పరిభవింప, వాడంతఁబోక ఖడ్గధరుడై కృష్ణునేమో యొనర్పఁబోవునని పయికి దుమికెను. తత్క్షణమే కృష్ణుడు వానింబట్టి గళంబు దునుమనెంచి ఖడ్గంబు జళిపించునంత-రుక్మిణి దీనయై కృష్ణపాద పద్మంబులకెఱిగి

"నిన్ను నీశ్వర! దేవదేవుని నిర్ణయింపగలేకయో
సన్నుతామరకీర్తిశోభిత! సర్వలోక శరణ్య! మా
యన్న యీతడు నేడుచేసె మహాపరాధము నీయెడన్
నన్ను మన్ననజేసి కావు మనాథనాథ! దయానిధీ!"

అని పల్కుచు మా తల్లి దండ్రులకు పుత్రిశోకంబుఁ గల్గింపకుమని వేడ నా దీనదయాళుండు వానిని వదలిపైచి రుక్మిణిం గొని యానందమున ద్వారక కరిగెను.

"ధ్రువకీర్తిన్ హరి పెండ్లియాడె నిజచేతోహారిణిన్మాన వై
భవగాంభీర్య విహారిణిన్ నిఖిల సంపత్కారిణిఁ సాధుభాం
ధవసత్కారిణిఁ బుణ్యచారిణి మహాదారిద్ర్య సంహారిణిఁ
సువిభూషాంబర ధారిణిఁ గుణవతీ చూడామణిఁ రుక్మిణిఁ."

రుక్మిణీకళ్యాణమిట్లు ప్రమోదావహముగ - భక్తజనా
నంద సంధాయకముగ జరిగినది.

ఇది వజ్రసంకల్పసంయుక్తమైన ఆత్మయొక్క అభిమత
మును నిరుపమానవాత్సల్య ధనియైన పరమాత్మ సఫలమొన
ర్చిన విధానము. జీవుడు దేవుని జేరుటలో నడుమ నేర్పడెడి
యడ్డంకులవంటివే తుచ్ఛులయిన శిశుపాలాదుల యత్నములు.
దివ్యమైన-ఏకాంతికమైన భక్తియున్నపుడు భగవదనుగ్రహము
నిస్సంశయముగ లబ్ధమగుననుటకు ప్రబలసాక్ష్యమే శ్రీకృష్ణదేవు
డొనర్చిన రుక్మిణీకరగ్రహణము.

లౌకిక జంజాటములకు - భౌతికలాలసలకు తావులేని
వినిర్మల పవిత్రప్రేమయు నిట భక్తియుం దంతర్వాహిని యగు
టచే అనితరసాధ్యపద్ధతిలో జగన్నాథుని రుక్మిణీదేవి నిజనాథుని
గావించుకొని చరితార్థత కనగల్గినది.

ఈయేకాంతిక దీక్షనే - ఈవజ్రసంకల్పమునే - ఈసర్వ
సాధారణలౌకికవ్యవహారాతీత దివ్యప్రేమభావమునే లోకము
నందంతట చిత్రవిచిత్రగతుల వెలయింపజేయుటకో యనునట్లు

భాగవతమిట్టి యత్యుజ్జ్వల సన్నివేశముల దనలో పిలీన మొనర్చుకొని యెల్లరి మన్ననలకు పాత్రమగుచున్నది.

ఇట్టి యతిలోక మహత్తర ప్రభావ సమన్వితములైన పావన సంఘటన లెన్నింటి నుదాహరింపగలము? భువనముల నావరించియున్న తిమిరముల బోద్రోలి వెలుగు వెల్లువలు పారలింపజాలిన భానుకిరణపంక్తుల సంఖ్యను పరిగణింపగలమా? చవులూరింపజేసి సర్వజనాస్వాదన యోగ్యములై యుండురాదు క్షీరవారాశియందలి పయఃకణముల నెవరేని లెక్కింపగలరా? ఆఘ్రాణించిన మాత్రమున ననంతాహ్లాదము నుదయింపజేయు సుందరనందన వనాంతరతరులతాగుల్మసిత ప్రసూనపరంపరలింతయని యెవ్వరైన దెలుపగలరా?

గగనమార్గమునఁ జరించెడి తారలెన్ని? జలధిదిగంతమున్ముద్దుగల సైకతరేణువులెన్ని? శరత్కాలమున శ్వేతాభ్రమార్గమానమొనరించు గుంపులంగల చాతకములెన్ని? మహావినోట మధురసన్ని వేశమునం దాశువుగ వచ్చెడి పద్యపరంపరలంగల సువర్ణవర్ణములెన్ని?

భాగవతమునం దీదృష్టితోదిలకించినపుడు మానవకళ్యాణమును సంఘటింపజేయ సమర్థములై యలరారెడి సన్నివేశములెన్నియో! ఎట్లు చెప్పగలము? కావున నే స్థాలీపులాకన్యాయమున నిది కొన్నింటిని మాత్రమే యుదాహరించి యీ ప్రస్తుత

చూపున సర్వము నొకమారు సమవలోకన మొనర్చెడి యాలో చనను రేకెత్తించుట మాత్రమే కాగలదు.

మహాద్భుతముల నెన్నింటినో గుప్తముగ నిడుకొనిన యొకానొక మహత్తర సన్నివేశము ప్రధానకారణముగా వ్యాసభట్టారకులచే నారదప్రేరణమున భాగవతరచన సమారబ్ధమైనది. ప్రారంభింపబడిన తీరునుండియే మన మెంతయో గ్రహింపవలసియున్న స్థితిని వ్యక్తీకరించుకొనుట కిది యొక చిన్న కృషి.

భాగవతాంతర్యశుద్ధి నెవరెన్ని తెఱగుల వ్యాఖ్యానించి నను వ్యాఖ్యాతలకు తనివిదీరదేమో! వారొనర్చిన వ్యాఖ్య సమగ్రత నెప్పటికినందదేమో! అది వ్యాసునకే యసాధ్యమై యుండునా! పోతన మాత్రమది సాధ్యముగానియంశమని నిష్కర్షగనే చెప్పినాడు.

కావున మనము ప్రయత్నించు వారము మాత్రమే. భాగవత పారావారము నీది యవ్వలియొడ్డునకు జేరగలవా రెవ్వరేనియున్నారా? అందరికి నవ్వలితీరము చూపులకందినట్లు తోచుచుండును. వారివారి మనోబలములబట్టి యందలి యంద చందములు వారి కన్నులకు గట్టినట్లు కన్పట్టుచుండును.

కాని! నిజమరయుచో నట్టి పనియేరి నను కిష్టతరమే. పోతన కవీంద్రుని హృదయశక్తికన్న మిన్నయైన శక్తిగలవా రుందురా! ఉన్న నెందరుందురు?

అయిన నేమి ? భాగవత ప్రతిభాపరంపరలను నవద్రష్టితో నవగాహ మొనర్చుకొనుట కెన్నియో జతనములు జరుగుచునే యున్నవి. జరుగుచుండవలసినదే.

పరిపూర్ణ భక్తిభావజలధిగా భాగవత మిట్లలరారి భాగవతలోక మనోమందిరముల నిత్యనివాసమేర్పరచుకొన గల్గినది.

నవవిధభక్తివైఖరుల మేలినీడలలో పరమాత్ముని నవరూప లావణ్యదీప్తుల దిలకింపగల్గిన మహోద్భట మొక్క-భక్తునకుమాత్రమే దక్కు-నొంతటి యద్భుతవిషయము. బహిరంగ సత్యమనదగిన-ప్రాకృతుల హృదయవికాసమునకు దోహదప్రాయమైన-యీ దివ్యతత్వము నుద్ఘోషించు భాగవతము మనజాతికి ప్రాణము.

సర్వవేళల-సర్వకాలముల పరమాత్ముని పాదపంకేరుహ ములకడ రేగెడి దుమ్ములో దుమ్ముగా-ధూళిలో ధూళిగా కలిసి పోవుటకన్న కాంక్షింపదగినదేమున్నది? అని దివ్యప్రేమభావ మగ్న మానసమున జీవాత్మ పరమాత్మలవైఖరికి మచ్చుతునకలుగా, మాధవస్మరణతో-మాధవస్తుతితో-మాధవునితో పెన వైచుకొనిన మనస్సుతో-మనుగడలు కొనసాగించిన గోపాంగనల పవిత్ర ప్రేమభావనల కద్దముబట్టిన భాగవతము మనజాతికి హృదయము.

నిరుపేద నాదరించిన నీరజనాభుని-కుచేలుని గౌరవించిన కుబేరుని-సఖ్యభావమునకు ప్రాధాన్యమిచ్చిన శౌరిని - నిర్మల

మైత్రితో ధర్మస్వరూపుడైన దైవమునకు దగ్గరచుట్టము కావ చ్చునని-మనకనులముందునిలిపి మాటలతో వచించి వివరించు టకు-విశదీకరించుటకు వలనువడని మధురస్నేహ తత్త్వమును ప్రతిఫలింపజేయు భాగవతము మనజాతికి జీవనమార్గము.

మొక్కవోవని భక్తిగలిగినపుడే దేవదేవుడు దిక్కు కాగ లడనియు - మూర్ఖాహంకారపు వృత్తియున్నంతవరకు పరమా త్మునకు నీవైపు తేరిపారజూడవలసిన యవసరము లేదనియు- గుండె దిటవు కుదిరినతఱి-మనస్సున కేకాగ్రత యలవడిన వెం టనే-మాధవ దివ్యానుగ్రహము ప్రాప్తించి మాగళము సిద్ధిం చుననియు-మనుగడ ధన్యమగుననియు-నెల్లెత్తిచాటెడి భాగవ తలీల మనజాతికి శిరస్సు. అట్టి యచంచలదృష్టియున్న నెట్టి దుష్టశక్తులేనియు భక్తుని ముట్టజాలవనియు - బాధలబెట్టజాల వనియు సర్వత్రనిండియుండి సాక్షాత్కరించి సర్వేశ్వరుడాదు కొనగలడనియు సిద్ధాన్తీకరించు భాగవతపథము మనజాతి మనో రథము. ఇదిమనజాతి మనోరథముమాత్రమేకాదు. యావద్విశ్వ మనోరథము. ఇది మనజాతికి శుభములనందించును. సుఖములను జేకూర్చును.

సర్వార్పణభావముతో బాల్యమునుండి పవిత్రమలమైన- దివ్యమైన-లోకాతీతమైన-సర్వసామాన్యకాముక వాంఛల కతీత మైన-పేరుయోగమున జగన్నాథుని నాథునిగ బడయువచ్చు ననియు-జన్మను తరింపజేసికొనవచ్చుననియు-మొండికెత్తియొది

రించి జయించదలచిన శక్తులన్నియు దైవబలము లేకుంటచే దుర్బలములై నిర్జింపబడగలవనియు-నిరుపమభక్తి సంయుక్త ప్రేమతత్వమునకే విజయము సిద్ధించుననియు విశదీకరించు భాగవత విధానము విశాలదృక్పథమున జరించుచున్న మన జాతికి శిరోధార్యమైన జీవిత మహోన్నతము. అహహా! ఎన్ని విధములు! ఎన్ని వెలుగులు! ఎన్ని జిలుగులు! భాగవతమొక మహోజ్వల మహత్తర మహామహిమాన్విత దివ్యశక్తియుక్త తేజఃపుంజము.

చాలునా! యిట్లు సంస్తుతించినచో సంతృప్తిపడునా! మనస్సు సంబరపడునా! హృదయము ఏమో?


పరమాత్మని యనుగ్రహ విశేష విలాస సమన్వితమై- అవిచ్ఛిన్న కారుణ్యధారా పరిప్లావితమై - మధుర భక్తి ప్రేమ రస ప్రవంతులకంతర్వాహినిగానిల్చి, జగత్పతియొక్క మహా ప్రభావ జలధిజేరుటకై యత్నించుచు - జీవకోటులనెడి పిల్ల కాలువలతోగలసి ప్రవహించుచు - సాగుచున్న దివ్యభావ జలధినుండి యుత్పన్నమైన భాగవతసుధయిది.

సకల భక్తలోకహృదయాంతర్గతమై - సకల మానవానంద సంధాయకమై - సర్వధర్మ పరిపుష్టమై - సర్వసుగుణ సంపన్నమై - సాహిత్య జగత్తులో కొంగ్రొత్త కాంతులను గురియించుచు, పాఠకభావాంబరముల మురియించుచు - ప్రప

న్నాత్ముల హృదయకమలముల విరియించుచు, నిత్య నూతన తేజముతో అలరారెడి పావన భావసుధయిది.

ఇది సాధక కోటి గళమున తళతళలు ప్రతిఫలింపజేయు చారుతర తారహారము. శారదాపాదపంకేరుహసన్నిధిని సంస్తవనీయ సౌరభపరంపరలు త్రవ్విపోయు చంపక ప్రసూనము. సర్వేశ్వరుడైన గోవిందుని నయనద్వంద్వము వ్యక్తీకరించు కారుణ్యదీక్ష. సకల ప్రపంచమున కిది శ్రీరామరక్ష.

—: ఉపోద్ఘాత :—



"లలితస్కంధము కృష్ణమూలము శుకా
లాపాభిరామంబు మం
జులతాశోభితమున్ సువర్ణసుమన
స్సజ్జేయము సుందరో
జ్జ్వలవృత్తంబు మహాఫలంబు విమల
వ్యాసాలవాలంబునై
వెలయు భాగవతాఖ్యకల్పతరు వు
ర్వీన్ సద్ద్విజశ్రేయమై



జూపిటర్ ప్రింటింగ్ ప్రెస్, గుంటూరు-2. ఫోన్ : 21907


STUDENTS
LIBRARY
ASSOCIATION